
'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+20 వెల: ₹5.00

సంపుటి: 10 సంచిక: 323

మంగళవారం 13-2-2018

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

నవకల్పనా శక్తి...

స్త్రీ ఇంటిని, పిల్లల్ని చక్కదిద్దుతుంది... బంధాలు నిలబెడుతుంది... గృహిణిగా బాధ్యతల్ని నిర్వర్తిస్తుంది.. వీటన్నింటితో పాటు కార్యక్షేత్రంలో నిరంతరం ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొని ఏ పనినైనా విజయవంతంగా పూర్తిచేయగలదని నిరూపించిన మహిళా వ్యాపారవేత్తలు ఎందరో... వీరిలో కొందరికి వ్యాపారం వారసత్వంగా లభిస్తే... మరికొందరు తమకున్న అవకాశాల్ని సద్వినియోగం చేసుకుని యువ వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు ప్రయత్నిస్తున్నారు. అవకాశాల్ని అందిపుచ్చుకుని రాణిస్తున్న మహిళలెందరో..!

నేను శక్తి

చదవండి... నేను శక్తి ప్రత్యేక కథనాలెన్నో www.sakshi.comలో

వైఎస్సార్‌సీపీ సమరభేరి



ప్రత్యేక హోదా మన హక్కు.. ప్యాకేజీతో మోసపోవద్దు!

హోదా కోసం రాజీలేని పోరాటం : ప్రతిపక్ష నేత వైఎస్ జగన్



సోమవారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలోని పెద్దకొండూరు వద్ద పాదయాత్ర శిబిరంలో పార్టీ ముఖ్యనేతలు, ఎంపీలు, ప్రాంతీయ సమన్వయకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

మార్చి 1న కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా

మార్చి 5న జంతర్ మంతర్ వద్ద ధర్నా

ప్రత్యేక హోదాకు ప్రత్యామ్నాయం లేదు

ప్యాకేజీ పేరుతో చంద్రబాబు మోసం చేశారు

హోదా సాధించేంతవరకూ విశ్రమించబోం: భూమన

రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న చంద్రబాబు: వరప్రసాద్

ప్రజాసంకల్పం నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంజీవని అయిన ప్రత్యేక హోదా సాధన కోసం రాజీ లేని పోరు చేయాలని ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. అందుకు అను గుణంగా 'ప్రత్యేక హోదా మన హక్కు– ప్యాకేజీతో మోసపోవద్దు' అనే నినాదంతో మార్చి 1వ తేదీన రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా కార్య క్రమాలు చేపట్టాలని, అదే విధంగా పార్లమెం టు సమావేశాలు ప్రారంభమయ్యే రోజైన మార్చి 5వ తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 'ప్రత్యేక హోదా మనహక్కు– ప్యాకేజీ మనకొద్దు' అనే నినాదంతో ధర్నాను నిర్వహిం చాలని పార్టీ నేతల సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ప్రజాసంకల్పం 85వ రోజు పాదయాత్రలో ఉన్న వైఎస్ జగన్ అధ్యక్షతన నెల్లూరుజిల్లా పెద్దకొండూరు రాత్రిబస శిబిరంలో సోమవారం పాదయాత్ర ముగిశాక పార్టీ ముఖ్య నేతల, ఎంపీల, ప్రాంతీయ

మిగతా 2వ పేజీలో ▶

హోదాయే అజెండా

- ఉద్యమాన్ని తీవ్రతరం చేసేందుకు వైఎస్సార్‌సీపీ నిర్ణయం
- నాటకాలతో ట్రాక్ తప్పిస్తున్న పార్టీలకు ఊహించని షాక్

2లో

స్టెంట్ల ధరల్లో మార్పులు - 5లో

ప్రజా ఉద్యమాలకు ఇదే అదును.. కదలండి!

దిశానిర్దేశం చేసిన కారత్, రాఘవులు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా మధు ఎన్నిక

15 మందితో కార్యవర్గం

కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన వీఎస్

- వివరాలు 2లో

టెట్ పరీక్ష కేంద్రాల కేటాయింపులో

గందరగోళం



- చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ కేంద్రాల కేటాయింపుతో అభ్యర్థుల గగ్గోలు
- విద్యాశాఖ తీరుపై విమర్శలు

2లో

సోమవారం మస్కట్‌లోని 125 ఏళ్ల పురాతన శివాలయంలో ప్రధాని మోదీ పూజలు



వారిని ఏకాకి చేద్దాం

ఉగ్ర మద్దతుదారులపై భారత్-ఒమన్ దేశాధినేతలు

మతం పేరు దుర్వినియోగాన్ని అరికట్టాలని నిర్ణయం

ప్రధాని మోదీ, ఒమన్ సుల్తాన్ ఖబూస్ మధ్య చర్చలు

5లో

ఇంట్లో నక్కిన ఉగ్రవాదులు

శ్రీనగర్‌లో కొనసాగుతున్న ఎన్‌కౌంటర్

- సంజువాన్ ఉగ్రదాడి ఘటన మరువక ముందే.. శ్రీనగర్‌లో సీఆర్‌పీఎఫ్ శిబిరంపై ఉగ్రవాదులు దాడికి యత్నించారు. సోమవారం తెల్లవారుజామున శిబిరం వైపు చొచ్చుకొచ్చిన ఉగ్రవాదుల్ని భద్రతా బలగాలు తిప్పికొట్టాయి. అనంతరం సమీపంలోని ఇంట్లో నక్కిన ఉగ్రవాదుల్ని మట్టుబెట్టేందుకు జరిగిన కాల్పుల్లో ఒక జవాను మృతి చెందారు.



5లో

సిటీ సివిల్ కోర్టులో తాత్కాలిక హైకోర్టు!

రాష్ట్ర ప్రభుత్వం తాజా ప్రతిపాదన

అమరావతిలో 8 నెలల్లో నిర్మాణానికి ప్రణాళిక

నాలుగు ఎకరాల్లో తాత్కాలిక హైకోర్టు యోచనకు స్వస్తి


నేషనల్ హైవే అథారిటీకి ఔటర్ రింగు రోడ్డు బాధ్యత

ఇన్నర్ రింగ్ రోడ్డు పనులకు త్వరలో టెండర్లు

సీఆర్‌డీఏ అధికారులతో సీఎం సమీక్షలో నిర్ణయాలు

16లో

దేశంలోనే ధనిక సీఎం చంద్రబాబు



నివేదిక విడుదల చేసిన ఏడీఆర్

- దేశంలోని మొత్తం 31 మంది ముఖ్యమంత్రుల్లో ఏపీ సీఎం చంద్రబాబు రూ.177 కోట్లకు పైగా ఆస్తులతో దేశంలోనే అత్యంత ధనిక సీఎంగా నిలిచారు. ఎన్నికల సంస్కరణల కోసం కృషి చేస్తున్న అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) ఈ మేరకు ఓ నివేదిక విడుదల చేసింది.

- 5లో

నచ్చినోళ్లకు నేరుగా పోస్టులు!

జలవనరుల శాఖలో ఏఈఈ పోస్టుల భర్తీలో అక్రమాలు

- ఎలాంటి అనుమతులు లేకుండా డైరెక్ట్ పోస్టింగ్‌లు
- గుట్టుగా మూడేళ్లుగా కొనసాగుతున్న వ్యవహారం
- న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు సిద్ధమైన నిరుద్యోగులు



ప్రభుత్వ ఉద్యోగమంటే ఎంత చిన్నదైనా సరే నిరుద్యోగులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తుంటారు. నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి పరుగు పందేన్ని తలపించేలా సిద్ధమవుతారు. అలాంటిది ఇంజనీరింగ్ పట్టభద్రుల ఆశలపై నీళ్లు చల్లుతూ వంద పోస్టులను గుట్టుగా భర్తీ చేస్తే దాన్ని ఏమనుకోవాలి? ఎలాంటి అనుమతులు లేకుండా జలవనరుల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టుల భర్తీలో సాగిన అక్రమాల వ్యవహారం తాజాగా వెలుగులోకి వచ్చింది.

- వివరాలు 3లో

మహా శివరాత్రి శుభాకాంక్షలు



గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్

సాక్షి, హైదరాబాద్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ప్రజలకు గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ శుభాకాంక్షలు తెలిపారు. మహాశివరాత్రి ముఖ్యమైన పండుగ అని, అత్యంత భక్తి, నిష్టలతో ఈ పర్వదినాన్ని జరుపుకుంటారన్నారు. ఈ పండుగ శుభ సందర్భంగా ప్రజల మధ్య ప్రేమ, అనురాగాలు, సోదరభావం వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు.

24 నుంచి టెన్త్ ప్రీఫైనల్ పరీక్షలు

సాక్షి, అమరావతి: పదో తరగతి ప్రీఫైనల్ పరీక్షల షెడ్యూల్‌లో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ స్వల్ప మార్పులు చేసింది. పరీక్షలను ఈ నెల 24వ తేదీ నుంచే ప్రారంభించేలా సోమవారం కొత్త షెడ్యూల్‌ను జారీ చేసింది. ఇంతకు ముందు ఈ నెల 26వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. అయితే మార్పుల అనంతరం ప్రీఫైనల్ పరీక్షలు ఈ నెల 24 నుంచి మార్చి 10వ తేదీ వరకు జరుగుతాయని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరక్టర్ వీఎస్ భార్గవ అన్ని జిల్లాల విద్యాధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అయితే ప్రీఫైనల్ పరీక్షలకు, పబ్లిక్ పరీక్షలకు మధ్య వ్యవధి నాలుగు రోజులు మాత్రమే ఉందని, కనీసం వారం, పది రోజులైనా ఉండేలా చూడాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, కె.వెంకటేశ్వరరావులు కోరారు. రాష్ట్రేతర ఆస్పత్రుల్లో ఉద్యోగ, ఉపాధ్యాయుల వైద్య ఖర్చులను తిరిగి చెల్లించేలా నిబంధనలు సడలించి ఉత్తర్వులు ఇవ్వాలని ఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుధీర్‌బాబు, నాగేశ్వరరావులు సోమవారం ఓ ప్రకటనలో కోరారు. రాయలసీమ ఉద్యోగ, ఉపాధ్యాయులు చెన్నై, బెంగళూరు, వేలూరు, హైదరాబాద్ నగరాల్లో కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య చికిత్సలు పొందుతున్నారని, దానికయ్యే ఖర్చులు తిరిగి చెల్లించడంలో ప్రభుత్వం అనేక ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు.

'నీట్' తెలుగులోనూ ఉండాలి

- ఏపీ విద్యార్థుల డిమాండ్
- నేషనల్ మెడికల్ కమిషన్ బిల్లుపై నేడు ఢిల్లీలో కీలక భేటీ
- రాష్ట్రాల నుంచి అభ్యంతరాలు, సలహాల స్వీకరణ



సాక్షి, అమరావతి: జాతీయ స్థాయిలో జరిగే నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్టు) తెలుగులోనూ ఉండేలా విధిగా చట్టంలో పొందుపరచాలని ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. భారతీయ వైద్యమండలి (ఎంసీఐ) స్థానంలో అమల్లోకి తీసుకురాబోతున్న నేషనల్ మెడికల్ కమిషన్‌పై రాష్ట్రాల నుంచి అభ్యంతరాలు, సలహాలను తెలుసుకునేందుకు మంగళవారం ఢిల్లీలో కీలక సమావేశం జరగనుంది. ఈ నేపథ్యంలో మెడికల్ కమిషన్ బిల్లుపై ఆంధ్రప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాలు కొన్ని అంశాలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఏదైనా మెడికల్ కళాశాల లేదా ఇన్‌స్టిట్యూట్‌లకు సంబంధించి రేటింగ్ ఇచ్చేందుకు థర్డ్ పార్టీకి చెందిన వారితో పరిశీలన చేయించేలా బిల్లులో పొందుపరిచారు. దీన్ని పలువురు వ్యతిరేకిస్తున్నారు. మెడికల్ ప్రొఫెసర్లతోనే ఇలాంటి పరిశీలన జరగాలని, ఇతర వ్యక్తులు దీంట్లో జోక్యం చేసుకోకూడదని అంటున్నారు. ఎవరైనా ఎంబీబీఎస్ లేదా పీజీ కోర్సు పూర్తి చేశాక వైద్యం చేయాలంటే ఎన్ఎల్ఈ (నేషనల్ లైసెన్షియేట్ ఎగ్జామినేషన్)పాసవ్వాలని బిల్లులో పొందుపరగా, దీన్ని అభ్యర్థులు వ్యతిరేకిస్తున్నారు. జాతీయ స్థాయిలో జరిగే నీట్ రాసి కోర్సు పూర్తి చేస్తున్న తమకు మళ్లీ పరీక్ష నిర్వహించడమేంటని ప్రశ్నిస్తున్నారు. కాగా, నేషనల్ మెడికల్ కమిషన్ బిల్లు ఇప్పటికే పార్లమెంటులో ఆమోదం పొందింది. అయితే ఇప్పటివరకు స్వతంత్ర ప్రతిపత్తి హోదాతో ఉన్న ఎంసీఐ స్థానంలో వస్తున్న నేషనల్ మెడికల్ కమిషన్ బిల్లులో రాజకీయ, ప్రభుత్వ జోక్యం ఉండటంతో రాజకీయ పార్టీలు, వైద్య నిపుణులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వివిధ రాష్ట్రాల అధికారులు, ఆరోగ్యశాఖకు చెందిన సీనియర్ అధికారులతో మంగళవారం ఢిల్లీలో కీలక సమావేశం జరగనుంది. ఇప్పటికే బిల్లుకు సంబంధించిన పూర్తి సమాచారం ఆయా రాష్ట్రాలకు అధికారులు పంపించారు. అభ్యంతరాలు, సూచనలను రాతపూర్వకంగా ఇవ్వాల్సిందిగా ఆయా రాష్ట్రాలను కోరినట్లు ఢిల్లీకి చెందిన ఓ ఉన్నతాధికారి చెప్పారు.

హోదా మన హక్కు.. ప్యాకేజీతో మోసపోవద్దు!



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి భూమన కరుణాకర్‌రెడ్డి. చిత్రంలో ఎంపీలు వరప్రసాదరావు, మేకపాటి, విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, పార్టీ సీనియర్ నేతలు

▶ మొదటి పేజీ తరువాయి

సమన్వయకర్తల సమావేశం నిర్వహించారు. ఇందులో ప్రత్యేక హోదా సాధన విషయం ప్రధానంగా చర్చకు వచ్చింది. నేతల అభిప్రాయాల మేరకు పై విధంగా ఆందోళన చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

వైఎస్సార్‌సీపీ విశ్రమించబోదు: కరుణాకర్‌రెడ్డి

రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించేంతవరకూ వైఎస్సార్‌సీపీ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ విశ్రమించబోదని, తమ నాయకుడు జగన్, తాము ఇందుకోసం తుదికంటా పోరాడుతామని పార్టీ ప్రధాన కార్యదర్శి భూమన కరుణాకర్‌రెడ్డి తెలిపారు. సమావేశానంతరం ఆయన మీడియాకు వివరాలను వెల్లడించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద మార్చి 1న జరిగే ధర్నాలో జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, ఇతర నేతలు పాల్గొంటారని తెలిపారు. ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద మార్చి ఐదున జరిగే ధర్నాలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు పాల్గొంటారని చెప్పారు. అందుకోసం మార్చి 3వ తేదీన ఢిల్లీ వెళ్లే నేతలందరికీ ప్రజాసంకల్ప యాత్ర నుంచే జగన్ జెండా ఊపి అభినందనలు తెలియజేస్తారన్నారు. ప్రత్యేక హోదా సాధన కోసం గత మూడున్నరేళ్లుగా తమ నేత, పార్టీ ఎన్నో పోరాటాలు చేసిందని చెప్పారు. జంతర్–మంతర్ దగ్గరే పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలందరితో కలిసి ధర్నా చేసి అరెస్టయ్యారని గుర్తుచేశారు. అలాగే ప్యాకేజీ వద్దనే వద్దు, హోదాయే కావాలంటూ తమ పార్టీ సమరశీల పోరాటం చేస్తోందన్నారు. ప్రత్యేక హోదా ముద్దు అని ఒక రోజు, వద్దని మరో రోజు, సంజీవని అవునని, కాదని కల్లబొల్లి మాటలు చెబుతూ ప్రజలను కొందరు మోసం చేస్తున్నారని విమర్శించారు. వెంకటేశ్వరస్వామి పాదాల సాక్షిగా ఇచ్చిన హామీకి తూట్లు పొడిచినపుడు తిరగబడటం ప్రజాస్వామ్యంలో సహజమని, తాము అదే విధంగా వ్యవహరిస్తున్నామని భూమన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ప్రత్యేక హోదాపై ఫలితాలు రాని పరిస్థితుల్లో పదవులకు రాజీనామాలు చేస్తామనే మాటపై తమ నాయకుడుగాని, తమ ఎంపీలు గానీ మరో అభిప్రాయంతో లేరని మరో ప్రశ్నకు బదులిచ్చారు.

ప్రత్యేక హోదా మన హక్కు: జగన్

రాష్ట్రాన్ని విభజించేటపుడు పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన ప్రధాన హామీ అయిన ప్రత్యేక హోదా ముమ్మాటికీ ఆంధ్రప్రదేశ్ ప్రజల హక్కు అని వైఎస్ జగన్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఆ హోదా సాధన కోసం వైఎస్సార్‌సీపీ శ్రేణులు అన్ని దశల్లోనూ రాజీలేని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలంటే చట్ట సవరణ కూడా తీసుకురావాల్సిన అవసరం ఎంత మాత్రం లేదని, ప్రధానమంత్రి నిర్ణయం తీసుకుంటే చాలని, అందుకే గట్టిగా పోరాడాలని చెప్పారు. ప్రత్యేక హోదా విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. హోదా కన్నా ప్యాకేజీయే మెరుగైందని చంద్రబాబు చెప్పడం పూర్తిగా తప్పని, హోదాకు ప్రత్యామ్నాయం మరేదీ లేదని తెలిపారు. ప్రత్యేక హోదా వస్తే రాష్ట్రానికి ఎన్నో ప్రయోజనాలుంటాయని, మన రాష్ట్రంలో పరిశ్రమలు రావాలన్నా, తద్వారా మన పిల్లలకు ఉద్యోగాలు రావాలన్నా అదొక్కటే మార్గమని చెప్పారు. ''ఇప్పుడు ఆ రెండు పార్టీల మధ్య విభేదాలు వచ్చాయని రగడ చేస్తున్నాయి. వాటి గురించి మనం పట్టించుకోవాల్సిన అవసరంలేదు. మనం మొదట్నుంచీ ప్రత్యేకహోదా కావాలని డిమాండ్ చేస్తున్నాం. మన వైఖరిలో మార్పేమీ లేదు. హోదాకోసం పోరాటం మొదలు పెట్టింది మనమే, తుదికంటా పోరాడి సాధించేదీ మనమే'' అని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు.

పోరాడుతున్నది మేమే: వరప్రసాద్

వైఎస్సార్‌సీపీ ఎంపీలు కూడా లోక్‌సభలో లేకపోతే ఇక ప్రత్యేక హోదా కోసం అడిగే వారే ఉండరని ఎంపీ వరప్రసాద్ చెప్పారు. హోదా కావాలని పార్లమెంటులో గట్టిగా పోరాడుతున్నది తామేనని తెలిపారు. చంద్రబాబు కేంద్రం వద్ద లొంగిపోయి తన హోదాను దిగజార్చుకోవడమే కాక ప్రజలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. హోదా కోసం ధర్నాలు, బంద్‌లు నిర్వహించడమే కాక జగన్ అమరణ నిరాహారదీక్ష చేశారని, రాష్ట్రవ్యాప్తంగా యువభేరీలను నిర్వహించి హోదా వల్ల ప్రయోజనాలను తెలియజెప్పారని తెలిపారు. ప్రత్యేక హోదాకు సమాధులు కట్టాలని మళ్లీ ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో తాము ఇంకా పోరాటం గట్టిగా చేయాలని నిర్ణయించామన్నారు. సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత మేకపాటి రాజమోహన్‌రెడ్డి, బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, వెలగపల్లి వరప్రసాద్, వి.విజయసాయిరెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పీవీ మిథున్‌రెడ్డి, మోపిదేవి వెంకటరమణారావు, సజ్జల రామకృష్ణారెడ్డి, మేకపాటి గౌతమ్‌రెడ్డి పాల్గొన్నారు.

హోదాయే అజెండా

- ఉద్యమాన్ని తీవ్రతరం చేసేందుకు వైఎస్సార్‌సీపీ నిర్ణయం
- నాటకాలతో ట్రాక్ తప్పిస్తున్న పార్టీలకు ఊహించని షాక్

సాక్షి, అమరావతి: ప్రత్యేక హోదా ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తూ ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీసుకున్న నిర్ణయానికి అన్నివర్గాల నుంచి హర్షామోదాలు వ్యక్తమౌతున్నాయి. ఇప్పటికే ప్రత్యేకహోదా కోసం అనేక ఉద్యమాలు సాగించిన వైఎస్సార్‌సీపీ మార్చి 1 నుంచి మరో మహోద్యమానికి సరైన సమయంలో పిలుపునిచ్చిందని విశ్లేషకులంటున్నారు. ప్రత్యేక హోదా వద్దు.. ప్రత్యేక ప్యాకేజీయే ముద్దు అని చెబుతూ వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇపుడు నిధులు రావడం లేదంటూ సన్నాయి నొక్కులునొక్కుతుండగా ఎన్ని నిధులు వచ్చాయో, అవి ఏమయ్యాయో లెక్కలు చూద్దాం అంటూ పవన్ కల్యాణ్ వంటి వారు సమస్యను సైడ్‌ట్రాక్ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శకులంటున్నారు. ప్రత్యేక హోదా మన హక్కు.. హోదాయే మన అజెండా.. హోదాయే అన్ని సమస్యలకు పరిష్కారం.. ప్యాకేజీ ఎంతమాత్రమూ కాదు.. అంటూ వైఎస్సార్‌సీపీ ఇచ్చిన పిలుపుతో చంద్రబాబు నాటకాలకు చెక్ పెట్టినట్లయిందని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

హోదాను సజీవంగా ఉంచిన పోరాటాలు..

ప్రత్యేక హోదా ఒక్కటే రాష్ట్రానికి సంజీవని వంటిదని, సకల సమస్యలకు హోదాయే పరిష్కారమని మొదటి నుంచీ వైఎస్సార్‌సీపీ చెబుతోంది. హోదా కోసం వైఎస్సార్‌సీపీ, ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ నిరంతరాయంగా పోరాడుతూ వస్తున్నారు. హోదా కోసం ధర్నాలు, దీక్షలు, నిరసనలు, ఆమరణ నిరాహారదీక్షలు సహా జగన్ అనేక పోరాటాలు సాగించారు. పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త బంద్‌లు జరిగాయి. కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాలు, రాస్తారోకోలు జరిగాయి. ముఖ్యమైన పట్టణాలన్నిటిలో జగన్ యువభేరి సదస్సులు నిర్వహించి యువతలోనూ, రాష్ట్రప్రజలలోనూ చైతన్యాన్ని రగిల్చే ప్రయత్నం చేశారు. వైఎస్సార్‌సీపీ చేస్తున్న పోరాటాల వల్లే ప్రత్యేక హోదా అన్న భావన నాలుగేళ్ల తర్వాత కూడా సజీవంగా ఉన్నదని పరిశీలకులంటున్నారు. నాలుగేళ్లుగా సాగిస్తున్న పోరాటాల్లో భాగంగానే మార్చి 1 నుంచి వైఎస్సార్‌సీపీ ఆందోళనలకు పిలుపునివ్వడంతో రాష్ట్రంలో ప్రత్యేక హోదా ఆకాంక్ష మరింత రగిలే అవకాశముందని వారు పేర్కొంటున్నారు.

కొత్త డ్రామాకు తెరతీసినా..

విభజన చట్టం హామీలతో పాటు ప్రత్యేక హోదా అన్నది పార్లమెంటు సాక్షిగా నాటి ప్రధానమంత్రి ఆంధ్రప్రదేశ్‌కి ఇచ్చిన హామీ అన్నది అందరికీ తెల్సిన విషయమే. అయితే ప్రత్యేక హోదా కన్నా మెరుగైన, బ్రహ్మాండమైన ప్రత్యేక ప్యాకేజీ వచ్చేస్తున్నదని చెబుతూ ప్రజలను మభ్యపెట్టి చంద్రబాబు తప్పుదోవ పట్టించారు. ప్రత్యేక ప్యాకేజీ అనకపోయినా, విభజన చట్టంలోని అంశాలనే వల్లెవేసినా.. అరుణ్‌జైట్లీ ప్రకటనను స్వాగతించేశారు. సన్మానాలు చేసుకున్నారు. చివరకు ప్రధానమంత్రికి ధన్యవాదాలు చెబుతూ అసెంబ్లీలో ఏకంగా తీర్మానం కూడా చేశారు. ఆ తీర్మానాన్ని స్వయంగా చంద్రబాబే ప్రవేశపెట్టారు. ప్రత్యేక ప్యాకేజీతో కోట్ల కొలదీ నిధులు వచ్చేశాయని చెప్పారు. హోదా కన్నా మెరుగైన ప్యాకేజీ ఇస్తుంటే వద్దంటామా అంటూ కోడలు మగపిల్లాడిని కంటానంటే అత్త వద్దంటుందా అని ఎద్దేవా చేశారు. హోదాతో వచ్చేదేంటి? ప్యాకేజీలో లేనిదేంటి అని ప్రశ్నించారు. తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టారని, నాలుగేళ్ల గడచిన తర్వాత ప్రజల్లో వ్యతిరేకత కనిపిస్తుండడంతో నెపాన్ని కేంద్రంపై నెట్టేసేందుకు చంద్రబాబు మరో కొత్త డ్రామాకు తెరతీశారని విశ్లేషకులంటున్నారు. ప్రత్యేక హోదా కోసం ప్రశ్నించాల్సిన పవన్ కల్యాణ్ ఆ విషయాన్ని వదిలేసి బీజేపీ, టీడీపీ మధ్య జరుగుతున్న వాద సంవాదాలలో తలదూర్చి నిజమెవరిది? అబద్ధమెవరిదో తేలుద్దామంటూ సమస్యను పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. వీళ్లందరూ కలసి అత్యంత ప్రధానమైన ప్రత్యేక హోదా అంశాన్ని వదిలేసిన తరుణంలో వైఎస్సార్సీపీ పోరాటాలను ఉధృతం చేయడం ద్వారా సమస్యను తిరిగి పట్టాలపైకి తీసుకొచ్చినట్లయిందని విశ్లేషకులంటున్నారు.



కేంద్రం నుంచి ఎక్కువ నిధులు వచ్చేశాయని సీఎం చంద్రబాబు చేసిన ప్రకటన



ప్యాకేజీపై కేంద్రానికి ధన్యవాదాలు చెబుతూ అసెంబ్లీలో చంద్రబాబు తీర్మానం

టెట్ పరీక్ష కేంద్రాల కేటాయింపులో గందరగోళం

- చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ కేంద్రాల కేటాయింపుతో అభ్యర్థుల గగ్గోలు
- పాఠశాల విద్యాశాఖ తీరుపై విమర్శల వెల్లువ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు హాజరయ్యే అభ్యర్థులకు పరీక్ష కేంద్రాల కేటాయింపు గందరగోళంగా మారింది. అనేక మందికి చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌ల్లో పరీక్ష కేంద్రాలను కేటాయించడంతో వారంతా గగ్గోలు పెడుతున్నారు. గుంటూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లోని కొందరికి చెన్నైలో పరీక్ష కేంద్రం ఇవ్వగా, అనంతపురం, వైఎస్సార్, తదితర జిల్లాల వారికి బెంగళూరులో పరీక్ష కేంద్రం కేటాయించారు. అలాగే కర్నూలు, మరికొన్ని జిల్లాల వారికి హైదరాబాద్‌లో పరీక్ష కేంద్రం ఇచ్చారు. వీరిలో ఎక్కువమంది మహిళలే ఉండడంతో పాఠశాల విద్యాశాఖ తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వందల కి.మీ. దూరంలోని పరీక్ష కేంద్రాలు కేటాయిస్తే తాము ఎలా వెళ్లగలుగుతామని, రెండు రోజులు ముందుగా వెళ్లి అక్కడ ఉండి పరీక్ష రాయాలంటే తమకు ఎలా సాధ్యమవుతుందని వారు ప్రశ్నిస్తున్నారు.

ఆ కేంద్రాలకు ఆప్షన్ ఇవ్వకపోయినా కేటాయింపు

ఆన్‌లైన్ దరఖాస్తులో ఆప్షన్లలో ఆయా జిల్లాల పరీక్ష కేంద్రాలనే చూపించారు. మధ్యలో చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లను చేర్చారు. ప్రతి అభ్యర్థి ప్రాధాన్య క్రమంలో ఐదు ఆప్షన్లు ఇస్తే వాటిలో ఏదో ఒకటి కేటాయిస్తారు. ఇలా హైదరాబాద్‌కు 8 వేల మంది, చెన్నై, బెంగళూరుకు 2 వేల చొప్పున ఆప్షన్లు ఇచ్చారు. వీరంతా మొదటిగా తమ సొంత జిల్లాలు, పక్క జిల్లాలు ఇచ్చి చివరి ఆప్షన్‌గా మాత్రమే ఈ కేంద్రాలకు ఆప్షన్ ఇచ్చారు. అయితే వీరిచ్చిన మొదటి ఆప్షన్లు కాకుండా చివరి కేంద్రాలను వీరికి కేటాయించారు. దీంతో వీరంతా ఆందోళన చెందుతున్నారు.

అంత దూరం ఎలా వెళ్లాలి?

కడపకు చెందిన ఎస్‌కే సిరాజ్‌కు బెంగళూరు, అనంతపురానికి చెందిన తస్లీమ్‌తాజ్‌కు గుంటూరు, అనంతపురానికి చెందిన కడ్డిపూడి తన్వీరుల్లా, జైద్‌లకు తెలంగాణలోని నల్గొండ జిల్లా పోచంపల్లిని పరీక్ష కేంద్రాలుగా కేటాయించారు. ఎక్కడో దూరంగా, అడ్రస్ కూడా తెలియని పరీక్ష కేంద్రాలకు వ్యయప్రయాసల కోర్చి ఎలా వెళ్లాలని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. ఈ పరీక్ష కేంద్రాల కేటాయింపు అస్తవ్యస్తంగా ఉన్నందున వెంటనే వీటిని మార్పు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ జోసెఫ్ సుధీర్‌బాబు, గాజుల నాగేశ్వరరావులు కోరారు. పరీక్ష కేంద్రాల కేటాయింపుపై పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సంధ్యారాణితో ప్రస్తావించగా ఆన్‌లైన్ పరీక్ష కావడంతో రాష్ట్రంలోని పరీక్ష కేంద్రాల్లో తగినన్ని సిస్టమ్‌లు లేనందున ఇతర రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు ఇవ్వాల్సి వచ్చిందని తెలిపారు. ఆప్షన్లు ఇవ్వనివారికి కేటాయించారని అడగ్గా అలాంటి వారివి మార్పు చేస్తున్నామన్నారు.

పరీక్షకు చెన్నై పోవాలంట...



టెట్ పేపర్–2కు దరఖాస్తు చేసుకున్నా. అందులో కడప, అనంతపురం, చిత్తూరు, కర్నూలు, నెల్లూరు కేంద్రాలను ఎంచుకున్నా. అయితే చెన్నైలో పరీక్ష కేంద్రం ఇచ్చారు. చెన్నైలో పరీక్ష కేంద్రం ఎక్కడుందో కూడా తెలియదు. పరీక్ష సెంటర్‌ను అధికారులు మార్చాలి.

–షాషావలి, ఫిజిక్స్ అభ్యర్థి, జమ్మలమడుగు

ఇదం జగత్



టాటా బైబై!

ప్రజా ఉద్యమాలకు ఇదే అదును.. కదలండి!

- దిశానిర్దేశం చేసిన కారత్, రాఘవులు
- రాష్ట్ర కార్యదర్శిగా మధు ఎన్నిక
- 15 మందితో కార్యవర్గం
- కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన వీఎస్

(భీమవరం నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి): ''రాష్ట్ర ప్రజల్లో అసహనం పెరుగుతోంది. నాయకత్వం అందిపుచ్చుకోవాలి. లేకుంటే ప్రజలు ఛిన్నాభిన్నం అయిపోతారు. ఉద్యమాలకు ఇదే సరైన సమయం, నాయకత్వం మరింత రాటుదేలాలి'' అని సీపీఎం జాతీయ నాయకత్వం రాష్ట్ర పార్టీకి దిశానిర్దేశం చేసింది. పాలకుల తప్పుడు విధానాలతో ప్రజలు ప్రత్యేకించి బడుగు, బలహీనవర్గాలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని, దీంతో ఆయా వర్గాల్లో రోజురోజుకూ పెరుగుతున్న అసంతృప్తి, అసహనాన్ని పార్టీ నాయకత్వం వినియోగించుకుని బలమైన ప్రజా ఉద్యమాలు నిర్మించేందుకు నడుం కట్టాలని సూచించింది. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో మూడు రోజులుగా జరుగుతున్న సీపీఎం రాష్ట్ర 25వ మహాసభలు నూతన కార్యవర్గం ఎన్నికతో సోమవారం ముగిశాయి. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా పి.మధు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అభినందించిన అనంతరం పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కారత్, పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు ప్రసంగించారు.



సీపీఎం రాష్ట్ర నూతన కార్యవర్గం

మూడు రోజులు.. 36 తీర్మానాలు..

మూడు రోజుల మహాసభల్లో వామపక్ష, ప్రజాతంత్ర ప్రత్యామ్నాయమే తమ రాజకీయ విధానమన్న తీర్మానం సహా మొత్తం 36 తీర్మానాలు చేసింది. సామాజిక ఉద్యమాలను తీవ్రతరం చేయాలని నిర్ణయించింది. భూమి లేని నిరుపేద కుటుంబాలకు రెండు ఎకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేసింది. రాష్ట్రంలోని 50 లక్షల మంది కార్మికులకు, వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేసింది. వివిధ ప్రభుత్వ పథకాల్లో పని చేస్తున్న స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.18వేలు, రూ.3 వేలు పెన్షన్ ఇవ్వాలని కోరింది.

కార్యదర్శి వర్గం ఇదే: సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా ఎంఏ గఫూర్, వి.శ్రీనివాసరావు, వై.వెంకటేశ్వరరావు, వి.కృష్ణయ్య, సీహెచ్ నరసింగరావు, మిడియం బాబూరావు, ఎంవీఎస్ శర్మ, దడాల సుబ్బారావు, ఎం.కృష్ణమూర్తి, సీహెచ్ బాబూరావు, వి.ఉమామహేశ్వరరావు, డి.రమాదేవి, మంతెన సీతారాం, కె.ప్రభాకర్‌రెడ్డి ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీకి పది మంది ఆహ్వానితులుగా, ఐదుగురు ప్రత్యేక ఆహ్వానితులుగా ఉన్నారు. కంట్రోల్ కమిషన్ ఛైర్మన్‌గా బీఆర్ తులసీరావు ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో జరిగే జాతీయ మహాసభలకు 23 మందిని ఎంపిక చేశారు.

రాష్ట్ర కమిటీ సభ్యులు వీరే...

రాష్ట్ర కమిటీ సభ్యులు బి.తులసీదాస్, వై.సిద్దయ్య, వి.వెంకటేశ్వర్లు, పి.జమలయ్య, మిరియం వెంకటేశ్వర్లు, జె.జయరాం, ఏవీ నాగేశ్వరరావు, కె.స్వరూపరాణి, కె.ధన లక్ష్మీ, వి.సుబ్రమణ్యం, ఆంధ్ర మాల్యాద్రి, పి.మురళీ కృష్ణ, జి.ఓబులు, కె.సుబ్బరావమ్మ, ఎం.సూర్యారావు, ఎం.రామ కృష్ణ, బాబు, కె.గడ్డెన్న, ఎం.బాలకాశీ, పి.పెద్దిరెడ్డి, బి.ప్రభావతి, వై.అచ్యుతరావు, బి.కృష్ణమూర్తి (శ్రీకాకుళం), రెడ్డి శ్రీరామమూర్తి (పార్వతీపురం), బి.గంగారావు (విశాఖ అర్బన్), కె.లోకనాథం, కిల్లో సురేంద్ర (విశాఖ రూరల్), టి.అరుణ్ (రాజమండ్రి), బి.బలరాం, జేఎన్‌వీ గోపాలన్ (పశ్చిమ గోదావరి డెల్టా), చింతకాయల బాబూరావు (పశ్చిమ గోదావరి అప్‌లాండ్), డీవీ కృష్ణ, కే శ్రీదేవీ (కృష్ణా పశ్చిమ), ఆర్.రఘు (కృష్ణా తూర్పు), పి.రామారావు (గుంటూరు తూర్పు), గద్దె చలమయ్య (గుంటూరు పశ్చిమ), పూనాటి ఆంజనేయులు (ప్రకాశం తూర్పు), సయ్యద్ హనీఫ్ (ప్రకాశం పశ్చిమ), సీహెచ్ రాజగోపాల్, ఎన్.యాదగిరి (నెల్లూరు), వి.రాంభూపాల్ (అనంతపురం ఉత్తరం), కె.ఆంజనేయులు (వైఎస్సార్), పి.నిర్మల (కర్నూలు), టి.రమేష్ కుమార్ (నంద్యాల), తిరుపతి నుంచి మరో సభ్యుణ్ణి కో ఆప్ట్ చేసుకుంటారు.

మధుకే మళ్లీ పగ్గాలు...

సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా పి.మధు మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 15 మంది కార్యదర్శి వర్గం, 60 మందితో రాష్ట్ర కమిటీ ఏర్పాటయింది. ఈ కార్యవర్గం మూడేళ్లు కొనసాగుతుంది. పార్టీ కేంద్ర కమిటీ సభ్యునిగా ఉన్న వి.శ్రీనివాసరావును ఈసారి అనూహ్యంగా రాష్ట్ర కేంద్రానికి తీసుకువచ్చారు. బహిరంగ సభకు పార్టీ కార్యకర్తలు అధికంగా తరలివచ్చారు. గరగపర్రు, తుందుర్రు ఆక్వాపార్క్ తదితర పోరాటాలు జరిగిన ఈ ప్రాంతంలోనే సభలు నిర్వహించడం తమకు గర్వకారణమని నిర్వాహకులు బి.బలరాం ప్రకటించారు. మూడు రోజుల మహాసభ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి 600 మంది ప్రతినిధులు, వంద మందికి పైగా పరిశీలకులు హాజరయ్యారు. మహాసభ ముగిసిన అనంతరం పార్టీ నూతన కార్యదర్శి మధు విలేఖరులతో మాట్లాడుతూ విశాల ప్రాతిపదికన ఉద్యమాలను నిర్మిస్తామన్నారు.

నచ్చినోళ్లకు నేరుగా పోస్టులు!



సాక్షి, అమరావతి: జలవనరులశాఖలో ఏఈఈ (అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు) పోస్టుల భర్తీ నిబంధనలకు విరుద్ధంగా జరిగినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మూడేళ్ల వ్యవధిలో గుట్టుచప్పుడు కాకుండా 100 మంది అసిస్టెంట్ ఇంజినీర్లను నేరుగా నియమించడం పట్ల శాఖలోని సీనియర్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా నచ్చిన వారితో పోస్టుల భర్తీ వ్యవహారం జలవనరుల శాఖలో కలకలం రేపుతోంది. చిన్న బదిలీ కావాలంటే పలు అనుమతులు కావాలని పట్టుబట్టే ఉన్నతాధికారులు ఈ పోస్టులు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీకి నిర్ణయం తీసుకోవడం వెనుక భారీగా ముడుపులు ముట్టాయనే ఆరోపణలు వినపడుతున్నాయి. సెక్రటేరియట్‌లోని ఓ ఉన్నతాధికారి, ఈఎన్‌సీ కార్యాలయంలోని మరో అధికారి ఇందులో చక్రం తిప్పారని ఉద్యోగ సంఘాలు ఆరోపిస్తున్నాయి. మరోవైపు ఈ నియామకాలకు వ్యతిరేకంగా న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని నిరుద్యోగ ఇంజనీర్లు ప్రకటిస్తున్నారు.

ఎలాంటి అనుమతి లేదు...

రాష్ట్రవ్యాప్తంగా పలు ఇంజనీరింగ్ డివిజన్‌ల్లో దాదాపు 250 ఏఈఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఒక్కో ఏఈఈ అదనంగా రెండేసి సెక్షన్ల చొప్పున బాధ్యతలు పర్యవేక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో సిబ్బంది కొరత పేరుతో పారదర్శకత లేకుండా పోస్టుల భర్తీ జరిపినట్లు సమాచారం. సాధారణంగా పోస్టుల భర్తీకి ఆర్థిక, సాధారణ పరిపాలన శాఖల నుంచి ముందుగా అనుమతి పొందాలి. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా పోస్టులను భర్తీ చేయాలా? ఉద్యోగుల సీనియార్టీకి అనుగుణంగా పదోన్నతులు ఇవ్వాలా? అనే విషయాలపై తరువాత నిర్ణయం తీసుకుంటారు. జలవనరులశాఖలో మాత్రం ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోకుండా తమకు అనుకూలమైన వ్యక్తులను నేరుగా ఏఈఈ పోస్టుల్లో నియమించారు. 2015 మే 19, 2017 అక్టోబరు, నవంబరు నెలల్లో దాదాపు 100 మంది ఏఈఈలను నియమించారు. దీంతో సీనియర్లకు పదోన్నతి లభించే అవకాశం లేకుండా పోయింది. మరోవైపు ఇంజనీరింగ్ పట్టభద్రులు కూడా ఉద్యోగ అవకాశాన్ని కోల్పోయారు.

డైరెక్ట్ కోటాలో కట్టబెట్టారు..

ఏఈఈ పోస్టులకు జలవనరుల శాఖలో విధులు నిర్వహిస్తున్న వర్క్ ఇన్స్‌పెక్టర్, ఐసీ అసిస్టెంట్స్, లాక్ సూపరింటెండెంట్. టెక్నికల్ అసిస్టెంట్స్, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్స్, అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్లు అర్హులు. పోస్టులు ఖాళీ అయిన సమయంలో అర్హులైన అభ్యర్థులు నియామకం కోసం సాధారణ పరిపాలనా శాఖ, ఆర్థిక శాఖ, జలవనరుల శాఖ మంత్రులు అనుమతి ఇవ్వాలి. అయితే ఈ మూడేళ్ల వ్యవధిలో జరిగిన నియామకాలకు ఎలాంటి అనుమతులు లేవు. ఏపీపీఎస్సీ అనుమతి లేకుండా డైరెక్ట్ కోటాలో పోస్టులు ఇచ్చారు. నిరుద్యోగులు వేల సంఖ్యలో ఉంటే డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ చేయాల్సిన అవసరం ఏముందని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఆ సర్టిఫికెట్లు చెల్లవు!

ఏఈఈలుగా నియామకాలు పొందిన వారిలో కొందరు డీమ్డ్ యూనివర్సిటీల్లో ఇంజినీరింగ్ చేశారని, అయితే ఆ సర్టిఫికెట్లు చెల్లవని గతంలో సుప్రీంకోర్టు, హైకోర్టులు తీర్పులు ఇచ్చాయని నిరుద్యోగులు చెబుతున్నారు. 20 ఏళ్ల నుంచి పదోన్నతి లేకుండా కొనసాగుతున్న టెక్నికల్ స్టాఫ్‌కు ఈ నియామకాల వల్ల అన్యాయం జరిగిందనే ఆవేదన వ్యక్తమవుతోంది.

> **రికార్డులు పరిశీలిస్తేగానీ చెప్పలేం...**
>
> పోస్టుల భర్తీలో అనేక విధానాలు ఉంటాయి. వీటికి ప్రభుత్వం, ఏపీపీఎస్సీ నుంచి అనుమతులు పొందాలి. అసలు అనుమతులు లేకుండా భర్తీ జరగదు. నేను ఇటీవలే ఈ బాధ్యతలు చేపట్టినందున వివరాలు చెప్పలేను. రికార్డులు పరిశీలించాలి.
>
> – సూర్యప్రకాశరావు (డిప్యూటీ ఈఎన్‌సీ)

నియామకాల ప్రక్రియ నిలిపేయండి

- వీసీల పదవీ విరమణ ముందు పోస్టులు భర్తీ చేయడం సరికాదు
- 3 యూనివర్సిటీలకు ఉన్నత విద్యామండలి లేఖ


సాక్షి, అమరావతి: పదవీ విరమణ చేసే ముందు బోధన పోస్టుల నియామకాలు చేపట్టడం సరికాదని, ఈ ప్రక్రియను వెంటనే నిలిపేయాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి సోమవారం 3 యూనివర్సిటీలకు లేఖ రాసింది. మంత్రి గంటా శ్రీనివాసరావు సూచనల మేరకు మండలి కార్యదర్శి ప్రొఫెసర్ ఎస్.వరదరాజన్.. జేఎన్‌టీయూ కాకినాడ, రాయలసీమ, విక్రమసింహపురి యూనివర్సిటీల రిజిస్ట్రార్లకు లేఖ రాశారు. ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులతోపాటు బ్యాక్‌లాగ్ పోస్టులను కూడా భర్తీ చేయరాదన్నారు. ఈ వర్సిటీల వీసీల పదవీకాలం ఏప్రిల్‌తో ముగుస్తుందని, ఇప్పుడు పోస్టులు భర్తీ చేయడం సరికాదన్నారు. కొత్త వీసీలు వచ్చేవరకు నియామకాల ప్రక్రియను నిలిపేయాలని ఆదేశించారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలకు ఆటంకం లేకుండా..
ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకాలను ఆపేయాలని లెటర్ నెంబర్ 1045 ద్వారా ఆదేశించిన ఉన్నత విద్యామండలి అందులో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను కూడా చేర్చడంతో ఆ ప్రక్రియ కూడా నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆ ఉత్తర్వులను మార్పు చేస్తూ సవరణ ఉత్తర్వులు ఇచ్చింది. ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులతోపాటు అసిస్టెంట్ ప్రొఫెసర్ (బ్యాక్‌లాగ్) పోస్టుల ఇంటర్వ్యూలను కొత్త వీసీలు నియమితులయ్యేవరకు ఆపాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఉత్తర్వులపై వివాదం: పోస్టుల భర్తీ నిలిపివేత ఉత్తర్వులు వివాదంగా మారుతున్నాయి. ఆయా వర్సిటీల వీసీలు పదవీ విరమణ ముందు చేస్తున్న ఈ నియామకాలపై అనేక ఆరోపణలు వస్తున్నాయని మంత్రి కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి. అక్రమాలు జరుగుతున్నట్లు మంత్రి గంటా దృష్టికి వచ్చినందునే నిలిపివేతకు నిర్ణయించారని పేర్కొంటున్నాయి. యూజీసీ నిబంధనల ప్రకారం రిటైర్మెంట్‌కు 3 నెలల ముందు వీసీలు.. ఎలాంటి నియామకాలు చేపట్టరాదని ఉందని, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 6 నెలల ముందు ఎలాంటి పోస్టులు భర్తీ చేయకూడదనే నిబంధనలున్నాయని అంటున్నాయి. అయినా కొన్ని వర్సిటీల వీసీలు ఇష్టానుసారం చేస్తున్నారని, రాయలసీమ, ఆదికవి నన్నయ వర్సిటీల పోస్టుల భర్తీ అస్తవ్యస్తంగా చేశారని గుర్తుచేస్తున్నారు. రాయలసీమ వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకాన్ని కోర్టు నిలిపేసిన సంగతి తెలిసిందే. కాగా, గతంలో అనేక వర్సిటీల వీసీల పదవీ కాలం చివర్లో కూడా నియామకాలు చేశారని, అప్పుడు లేనిది, ఇప్పుడు ఎందుకు అభ్యంతరపెడుతున్నారని పలువురు వీసీలు ప్రశ్నిస్తున్నారు. ఈ ఉత్తర్వులు వర్సిటీల స్వయంప్రతిపత్తికి విరుద్ధమని, దీనిపై ప్రభుత్వానికి లేఖ రాస్తామని చెబుతున్నారు.ట

అమలు చేయాల్సిన సీఎం హామీలు 1,400

- సీఎస్ దినేశ్ కుమార్ వెల్లడి
- ఇళ్ల కోసం 28.98 లక్షల దరఖాస్తులు



సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన సుమారు 1,400 వరకు హామీలు అమలు చేయాల్సి ఉందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్ కుమార్ తెలిపారు. వాటిని శాఖల వారీగా విభజించి.. ఎన్ని అమలు చేశారు? ఇంకా ఎన్ని అమలు చేయాల్సి ఉందో జాబితా రూపొందించాలని అధికారులకు సూచించారు. ఆర్థిక, ఆర్థికేతర ఫిర్యాదుల పరిష్కారంపై సీఎస్ సోమవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. జన్మభూమి, ఇతర సందర్భాల్లో ఇళ్ల కోసం 28.98 లక్షల దరఖాస్తులు వచ్చాయని, ఇందులో అర్హమైనవి 9.23 లక్షలేనని సీఎస్ చెప్పారు. ఆర్థికేతర ఫిర్యాదులన్నింటినీ త్వరగా పరిష్కరించాల, ఆర్థికపరమైన ఫిర్యాదులు, వినతులు ఎన్ని ఇంకా పరిష్కరించాల్సి ఉంది, వాటికి ఎంత మేర నిధులు అవసరం ఉందనే దానిపై ఆయా శాఖల వారీగా నివేదికను సిద్ధం చేయాలని, వాటిని కూడా త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఫైబర్ నెట్ ద్వారా నాణ్యమైన సేవలు
రాష్ట్రంలో ఫైబర్ నెట్ ద్వారా నాణ్యమైన సేవలు అందించడంపై చర్యలు తీసుకోవాలని సీఎస్ సూచించారు. ఫైబర్ నెట్ అమలుతో పాటు భారత నెట్ ఫేజ్–2 అమలుపై సీఎస్ సచివాలయంలో సోమవారం సమీక్షించారు. మూడు నాలుగు జిల్లాలకు ఒక ఏజెన్సీకి ఫైబర్‌నెట్ ప్రాజెక్టు పనులు అప్పగించి నిర్దేశిత గడువు ప్రకారం పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రూ.861 కోట్లతో చేపట్టిన భారత్ నెట్ ఫేజ్–2 ప్రాజెక్టును 2019 మార్చి నెలాఖరుకు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రియల్ టైమ్ గవర్నెన్స్ సీఈఓ బాబు ఈ సందర్భంగా వివరించారు. కాగా, అమరావతిలో రాష్ట్ర మానవ వనరుల అబివృద్ధి సంస్థకు అవసరమైన స్థలం కేటాయింపుపై సోమవారం సీఎస్ సమీక్షించారు. దీనిపై పరిశీలన తర్వాత అవసరమైన స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అమరావతిలో 25 ఎకరాలు స్థలం కేటాయించాలని మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ చక్రపాణి కోరారు.

నిట్ ర్యాగింగ్ ఘటనలో 15 మందిపై కఠిన చర్యలు

తాడేపల్లిగూడెం: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం సమీపంలోని నిట్‌లో ఈ నెల 2న జరిగిన ర్యాగింగ్ ఘటనలో బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్టు నిట్ రెసిడెంట్ కో–ఆర్డినేటర్ ఎస్.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ర్యాగింగ్‌కు ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న ఒక విద్యార్థి ప్రవేశాన్ని రద్దు చేసి నిట్ నుంచి శాశ్వతంగా బహిష్కరించారు. మరో ఐదుగురు విద్యార్థులను 4 సెమిస్టర్ల కాలానికి సస్పెండ్ చేశారు. వీరు ప్రస్తుత సెమిస్టర్‌తో కలుపుకొని 2018లో రెండు, 2019లో రెండు సెమిస్టర్లను కోల్పోతారు. 2019 తర్వాత సెమిస్టర్ల ప్రారంభం నాటికి తిరిగి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. 9 మంది విద్యార్థులను హాస్టల్ నుంచి బహిష్కరించారు. వీరు ఇళ్ల దగ్గర నుంచి తరగతులకు హాజరు కావాల్సి ఉంటుంది. కాగా, ఘటనలో మొత్తం 15 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు నిట్ డైరెక్టర్ ఎన్‌వీ రమణరావు పర్యవేక్షణలో దర్యాప్తు చేసిన బృందం తేల్చింది. ఈ నివేదికను ఢిల్లీలోని యాంటీ ర్యాగింగ్ సెల్‌కు, కేంద్ర మానవ వనరుల శాఖకు పంపినట్టు రెసిడెంట్ కో–ఆర్డినేటర్ చెప్పారు.

సాక్షి
మంగళవారం, ఫిబ్రవరి, 13

హక్కుల ఉద్యమ స్ఫూర్తి అస్మా


నియంతలు దేశాన్ని ఉక్కు పిడికిట్లో బంధించినప్పుడూ... గాలి సైతం భయాన్నే వీస్తున్నప్పుడూ... ఎవరూ నోరెత్తే సాహసం చేయనప్పుడూ ఒక ధిక్కార స్వరం వినిపించడానికి కేవలం గుండె ధైర్యం మాత్రమే సరిపోదు. ఆ గుండె నిండా అసహాయులపై అపారమైన ప్రేమాభిమానాలుండాలి. వారికోసం ప్రాణాలొడ్డేంత తెగింపు ఉండాలి. ఆ మాదిరి ధైర్యాన్ని, తెగువనూ కేవలం పద్దెనిమిదేళ్ల వయసులోనే సొంతం చేసుకుని, రాజీలేని పోరాటాలకు నిలువెత్తు సంతకంలా ఖ్యాతి గడించిన పాకిస్తాన్ మానవ హక్కుల నాయకురాలు అస్మా జహంగీర్ శనివారం కన్నుమూశారు. అస్మా అంటే ఉర్దూలో మహోన్నతమని అర్థం. న్యాయవాదిగా, క్రియాశీల కార్యకర్తగా, ప్రజాస్వామ్య పరిరక్షకురాలిగా, మహిళలు, పిల్లలు, మైనారిటీల హక్కుల కోసం అలుపెరగని పోరు చేసిన యోధురాలిగా అస్మా సార్థక నామధేయురాలయ్యారు. దేన్నయినా కుండబద్దలు కొట్టినట్టు చెప్పడం, పోరాడటానికి సిద్ధపడటం మొదటినుంచీ ఆమె నైజం. ఈ క్రమంలో పర్యవసానాల గురించి ఒక్క క్షణం కూడా ఆమె ఆలోచించలేదు. అది బలూచిస్తాన్ కావొచ్చు, ఆక్రమిత కశ్మీర్ కావొచ్చు. న్యాయబద్ధమైన ఉద్యమాలైనప్పుడు వాటికి అండగా నిలబడటానికి ఆమె వెనకాడలేదు. ఆ రెండుచోట్లా వేలమంది యువకుల్ని పాకిస్తాన్ సైన్యం కనుసన్నల్లో పనిచేసే గూఢచార సంస్థ ఐఎస్ఐ మాయం చేసినప్పుడు వారి ఆచూకీ తెలపాలంటూ సాగిన ఉద్యమానికి తోడ్పాటునందించడంతోపాటు అక్కడి సుప్రీంకోర్టులో ఆ యువకుల కుటుంబాల తరఫున పోరాడారు.

ఉదారవాదులకు చాన్నాళ్లక్రితమే దక్షిణాసియా దేశాల్లో సంకట స్థితి ఏర్పడింది. ఉద్యమిస్తున్నవారి తరఫున పోరాడేవారికి ముద్రలేయడం అన్ని దేశాల్లోనూ రివాజుగా మారింది. శ్రీలంకలో తమిళ టైగర్ల అణచివేతను ప్రశ్నించినవారిని అప్పటి రాజపక్సే ప్రభుత్వం ఉగ్రవాదులుగా ముద్రేసింది. ఇప్పుడు మయన్మార్‌లో రోహింగ్యాల ఊచకోతను నిలదీస్తున్నవారిపైనా అక్కడి ప్రభుత్వం అనేక కేసులు బనాయించి హింసిస్తోంది. మన దేశంలో కశ్మీర్‌లో హక్కుల ఉల్లంఘనల్ని ప్రశ్నిస్తే ఉగ్రవాద సమర్థకులుగా, పాకిస్తాన్ అనుకూలురుగా ఎలా ముద్రేస్తారో... పాకిస్తాన్‌లో అస్మా జహంగీర్‌పై కూడా అక్కడి పాలకులు అటువంటి నిందారోపణలే చేశారు. ఆమెను భారత గూఢచార సంస్థ 'రా' ఏజెంటుగా అభివర్ణించి ఇబ్బందులు పెట్టాలని చూశారు. అయినా అస్మా కొంచెం కూడా బెదరలేదు. ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడిన ప్రతి సందర్భంలో ఆమె ముందుండి పోరాడారు. మైనారిటీలను వేధించడం కోసం తీసుకొచ్చిన దైవ దూషణ చట్టాన్ని ఖండించడంతో వదిలిపెట్టలేదు. గరిష్టంగా మరణశిక్ష విధించడానికి ఆస్కారమున్న ఆ చట్టం కింద అరెస్టయిన వందలమంది తరఫున న్యాయస్థానాల్లో వాదించారు. రెండు మూడు కేసుల్లో కింది కోర్టులు విధించిన మరణశిక్షలు సుప్రీంకోర్టు రద్దు చేయడానికి ఆమె వాదనాపటిమే కారణం. ఆ తర్వాత ఆమెకు అనేక బెదిరింపులొచ్చాయి. కొందరు దుండగులు ఆమెపై హత్యాయత్నం కూడా చేశారు.

పాకిస్తాన్‌లో ప్రజాస్వామ్యం ఎప్పుడూ సురక్షితంగా లేదు. అక్కడ పౌర ప్రభుత్వాల పాలన కంటే సైనిక పాలనే అధికంగా సాగింది. మతాన్ని అడ్డం పెట్టుకుని, మతతత్వాన్ని పెంచి పోషించి తమ పాలనను సుస్థిరం చేసుకోవడానికి సైనిక నియంతలు ప్రయత్నించారు. ఆ క్రమంలో సమాజంలో ఛాందసవాదాన్ని పెంచి పోషించారు. జనరల్ అయూబ్‌ఖాన్ మొదలుకొని జనరల్ పర్వేజ్ ముషార్రఫ్ వరకూ ఇవే పోకడలు. అలాంటి నియంతలను ఎదుర్కొనడం సామాన్యం కాదు. నియంతల్ని ప్రశ్నిస్తే మతాన్ని ప్రశ్నించినట్టు... వారికి వ్యతిరేకంగా ఉద్యమిస్తే మత ద్రోహానికి పాల్పడినట్టూ చిత్రించే చోట న్యాయం కోసం నిలబడటం ఎంత ప్రాణాంతకమో అస్మా జీవితం చెబుతుంది. ప్రభుత్వాలు ఆమెపై దొంగ కేసులు బనాయిస్తే, ముల్లాలు ఆమెపై ఫత్వాలు జారీచేశారు. అన్నిటినీ ఆమె ధైర్యంగా ఎదుర్కొన్నారు. జనరల్ యాహ్యాఖాన్ పాలనలో తన తండ్రిని అరెస్టు చేయడాన్ని వ్యతిరేకిస్తూ న్యాయస్థానాల్లో పోరాడిన అస్మా జనరల్ జియా ఉల్ హక్ పాలనను ఖండిస్తూ, ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని కోరుతూ వీధుల్లో పోరాడారు. జైలుకెళ్లారు. జనరల్ ముషార్రఫ్ పాలనలో ఆమెను గృహ నిర్బంధంలో ఉంచారు.

సల్మా మర్యాదస్తురాలిగా మిగిలిపోవాలనుకోలేదు. మీడియా తనను ఆకాశానికెత్తేసినంత మాత్రాన పొంగిపోలేదు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇఫ్తెకర్ చౌధరిని ముషార్రఫ్ ప్రభుత్వం తొలగించినప్పుడు జరిగిన న్యాయవాదుల ఉద్యమంలో ఆమెదే ప్రధాన పాత్ర. ఆయనకు తిరిగి ఆ పదవి దక్కాక వెలువరించిన తీర్పులు ప్రజాస్వామ్యానికి ముప్పుగా పరిణమించినప్పుడు వాటిని ప్రశ్నించడానికి వెనకాడలేదు. తనను పాలకపక్షాల ఏజెంటుగా పలు సందర్భాల్లో నిందారోపణలు చేసిన ఎంక్యూఎం అధినేత అల్తాఫ్ హుస్సేన్‌పై లాహోర్ హైకోర్టు ఆంక్షలు విధించినప్పుడు ఆయన తరఫున సుప్రీంకోర్టులో పోరాడి ఆ ఆంక్షలు రద్దయ్యేందుకు కృషి చేశారు. అల్తాఫ్ కేసును ఎవరూ తీసుకోరాదన్న న్యాయవాదుల తీర్మానాన్ని ఆమె బేఖాతరు చేశారు.

అస్మా కార్యక్షేత్రం పాకిస్తాన్ గడ్డకు మాత్రమే పరిమితమై లేదు. భారత్, పాకిస్తాన్‌లు రెండూ మిత్ర దేశాలుగా మెలగాలని, ఉపఖండంలో శాంతియుత పరిస్థితులు ఏర్పడాలని ఆమె ఆశించారు. అందుకోసం ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడానికి అనేక కార్యక్రమాలు నిర్వహించారు. పలుమార్లు మన దేశం సందర్శించి ఇక్కడి సభల్లో మాట్లాడారు. తనను భారత్ ఏజెంట్‌గా అభివర్ణిస్తున్నా ఈ కృషిలో ఆమె వెనక్కి తగ్గలేదు. పెషావర్ పాఠశాలపై ఉగ్రవాదులు దాడిచేసి 148 మందిని పొట్టనబెట్టుకున్నప్పుడు ఈ దురంతంలో అసలు దోషులు ఉగ్రవాదులకు అండదండలిచ్చిన ప్రభుత్వాలేనని ఆమె నిర్మొహమాటంగా చెప్పారు. తన కోసం, తన కుటుంబం కోసం కాక చివరి వరకూ బలహీనుల పక్షాన పోరాడిన సల్మా జహంగీర్ పాక్‌లో మాత్రమే కాదు... వర్ధమాన దేశాల్లోని వారందరికీ స్ఫూర్తినిస్తూనే ఉంటారు.




> నియంతృత్వం, అవధుల్లేని అధికారం వాస్తవం అయినప్పుడు ప్రజలకు తిరుగుబాటు, ప్రతిఘటనలే హక్కుగా మారతాయి
>
> – విక్టర్ హ్యూగో
> సుప్రసిద్ధ ఫ్రెంచ్ రచయిత

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, తిథి బ.త్రయోదశి రా.10.33 వరకు, తదుపరి చతుర్దశి , నక్షత్రం ఉత్తరాషాఢ తె.5.07 వరకు (తెల్లవారితే బుధవారం), వర్జ్యం ప.11.24 నుంచి 1.10 వరకు, దుర్ముహూర్తం ఉ.8.46 నుంచి 9.33 వరకు, తిరిగి రా.10.57 నుంచి 11.47 వరకు, అమృతఘడియలు రా.10.01 నుంచి 11.34 వరకు, మహాశివరాత్రి.


సూర్యోదయం : 6.33
సూర్యాస్తమయం : 5.56
రాహుకాలం : ప 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు



నమాజ్ వేళలు

ఫజర్	5.30	మగ్రీబ్	6.17
జొహర్	12.30	ఇషా	7.30
అసర్	4.40		

పటేల్ చాటున పండిట్‌జీపై నింద



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

మోదీ తలపెట్టిన మరొక ప్రచారం– 'పదిహేను కాంగ్రెస్ కమిటీలలో పన్నెండు ప్రధాని అభ్యర్థిత్వానికి పటేల్‌కు ఓటు వేయడం'. ఆధారాలేమిటో చెప్పకుండానే ఆయన ఈ వాదనను ముందుకు తెచ్చారు. అంటే పటేల్‌కు మెజారిటీ ఉన్నా, ఆయన్ను పక్కన పెట్టారన్నది మోదీ ఆరోపణ. కానీ గాంధీజీని గాడ్సే పొట్టన పెట్టుకున్న తరువాత కూడా నెహ్రూ, పటేల్ పొరపొచ్చాలు లేకుండానే సాగారు. 565 స్వదేశీ సంస్థానాలను ఇండియన్ యూనియన్‌లో అంతర్భాగం చేసేదాకా ఆ ఇరువురు కూడా సంయుక్తంగా శ్రమించినవారే!


'స్వాతంత్ర్యం వచ్చాక ఆనాటికి ఉన్న పదిహేను కాంగ్రెస్ కమిటీలలో పన్నెండు సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌ను ప్రధానిని చేయాలంటూ ఓటు వేశాయి. కానీ పటేల్‌ను పక్కన పెట్టి పండిట్ నెహ్రూకు పగ్గాలు కట్టబెట్టిన విషయాన్ని మరువరాదు. పటేల్ ప్రధాని అయి ఉంటే కశ్మీర్ సమస్య ఉండేది కాదు. రాజకీయ స్వలాభం కోసమే కాంగ్రెస్ దేశాన్ని ముక్కలు చేసింది.'

– ప్రధాని నరేంద్ర మోదీ (5-2-2018 నాటి పార్లమెంట్ ప్రసంగం నుంచి)

'తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ రాటు తేలిన, అపార అనుభవం కలిగిన స్వాతంత్ర్య సమరయోధుడు. దేశ మహా నాయకులలో ఒకరు. దేశానికి పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్నీ, స్వతంత్ర న్యాయ వ్యవస్థనీ, సచేతనమైన పత్రికా వ్యవస్థనూ ప్రసాదించిన నేత నెహ్రూ.'

– మోదీ మంత్రిమండలిలో హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ (2015 నవంబర్‌లో సింగ్ చేసిన ఈ ప్రసంగం వీడియోను 9-2-18న రాహుల్ విడుదల చేశారు)

రెండో మాట



పార్లమెంట్ సహా, వివిధ వేదికల నుంచి నరేంద్ర మోదీ ఇటీవల పండిట్ నెహ్రూ మీద చేస్తున్న ఆరోపణలు, వ్యాఖ్యానాలు గుడ్డొచ్చి పిల్లను వెక్కిరించిన రీతిలోనే ఉన్నాయి. ఇంకా చెప్పాలంటే గుడ్డెద్దు చేలో పడిన చందంగా ఉంది. అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి 'దేశాభ్యుదయం' కంటే; కాంగ్రెస్‌నూ, ఆ పార్టీ పూర్వ నాయకులనూ, వారితో పాటు కొందరు స్వాతంత్ర్య యోధులనూ ఆడిపోసుకోవడం బీజేపీ–పరివార్ ప్రధానికి పరిపాటైంది.

అందరితో పాటు కాంగ్రెస్

భారత జాతీయ కాంగ్రెస్‌లో ఎన్ని తప్పులు కనిపించినా, అది దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ నాయకత్వంలో పనిచేసిన అగ్రగామి దళం. గాంధీ నాయకత్వంలో ఒక్కతాటిపైకి వచ్చి కడదాకా పనిచేసిన వారు నెహ్రూ, పటేల్. ఉద్యమ నిర్వహణ, ఉధృతి సమయాలలో నాయకులలో అభిప్రాయ భేదాలు సహజం. వీటిని మాత్రమే ఆసరా చేసుకుని, కాంగ్రెస్ దేశాన్ని ముక్కలు చేసిందనీ, అందుకే కాంగ్రెస్ నుంచి భారత్‌కు విముక్తి కల్పించాలనీ మోదీ అనడంలో ఔచిత్యం లేదు. పైగా గాంధీజీయే కోరుకున్నారనీ, ఆయన మాటనే తాను ఉటంకించాననీ, ఇది కొత్త మాటేమీ కాదనీ ఆయన సమర్థించుకోజూస్తున్నారు. జాతీయ కాంగ్రెస్ అగ్రదళంగా భారత్ స్వాతంత్ర్యం సాధించింది. కానీ విభిన్న సిద్ధాంతాలకు, పాయలకు చెందిన పక్షాలు కూడా తమవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాయి. అందుకే తొలినాటి స్వతంత్ర భారతదేశానికి ఆ శక్తులన్నింటితో కూడిన జాతీయ ప్రభుత్వం ఏర్పాటు కావాలని గాంధీజీ అభిలషించిన సంగతిని మోదీ విస్మరించడమూ సరికాదు. ఇలాంటి దృష్టితో పాటు, కాంగ్రెస్ నిర్వహించిన చరిత్రాత్మక పాత్రకు గుర్తింపుగా, ఆ సంస్థ నేతృత్వంలోనే ఒక ఉమ్మడి పాలనా వ్యవస్థ ఆవిర్భవించాలని గాంధీజీ ఆశించారు. అంతేగానీ, మోదీ వక్రీకరించినట్టు కాంగ్రెస్ నుంచి భారత్‌కు విముక్తి కలగాలన్న వ్యతిరేక భావన గాంధీ ఉద్దేశం కాదు.

గాంధీజీయే కాదు, ఆనాటి నేతలు, మేధావులు ఊహించని మరొక పరిణామం ఉంది. అలనాటి కాంగ్రెస్, కాంగ్రెస్–యూపీఏల హయాములలోనే గాంధీజీ ఆశయాలకు తూట్లు పడినాయి. గాంధీజీ హత్యానంతరం కొత్త వేషంతో, హిందూరాష్ట్ర బ్యానర్లతో దూసుకొచ్చి, కాలక్రమేణా ఢిల్లీ అధికార పగ్గాలు చేపట్టిన బీజేపీ–ఆరెస్సెస్–పరివార్ కూడా గాంధీ ఆశయాలకు భంగం వాటిల్ల చేసినదే. స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తికి భిన్నంగా, తరువాత రాసుకున్న రాజ్యాంగ లక్ష్యాలకు విరుద్ధంగా పాలనా వ్యవస్థను ఆ రెండు పార్టీలూ, వాటి కూటములూ కూడా మార్చేశాయి. 'బహుజన హితాయ' అన్న హితోక్తిని 'బడావర్గాల హితాయ'గా వికృతం చేశాయి. మోదీ తలపెట్టిన మరొక ప్రచారం– 'పదిహేను కాంగ్రెస్ కమిటీలలో పన్నెండు ప్రధాని అభ్యర్థిత్వానికి పటేల్‌కు ఓటు వేయడం'. ఆధారాలేమిటో చెప్పకుండానే ఆయన ఈ వాదనను ముందుకు తెచ్చారు. అంటే పటేల్‌కు మెజారిటీ ఉన్నా, ఆయన్ను పక్కన పెట్టారన్నది మోదీ ఆరోపణ. కానీ గాంధీజీని ఆరెస్సెస్–హిందూ మహాసభ కార్యకర్త గాడ్సే పొట్టన పెట్టుకున్న తరువాత కూడా నెహ్రూ, పటేల్ పొరపొచ్చాలు లేకుండానే సాగారు. 565 స్వదేశీ సంస్థానాలను రద్దు చేసి ఇండియన్ యూనియన్‌లో అంతర్భాగం చేసేదాకా ఆ ఇరువురు కూడా సంయుక్తంగా శ్రమించినవారే! మోదీ అర్ధంతరంగా వచ్చి ఈ చరిత్రను తుడిచివేద్దామనుకుంటే చెల్లదు. 'నెహ్రూ కోసం పటేల్‌ను కాదని పక్కన పెట్టా'రన్న మోదీ చెబుతున్న వ్యాఖ్య ఎవరో చేసింది కాదు. గాంధీ జయంతికి ఇండోర్‌లో జరిగిన బహిరంగ సభలో సర్దార్ పటేల్ స్వయంగా చెప్పిందే: 'మాకు నాయకుడు పండిట్ నెహ్రూ. గాంధీజీ నెహ్రూను తన వారసుడిగా ప్రకటించారు. బాపు సైనికదళంగా ఆయన ఆదేశాన్ని పాటించడం మా ధర్మం. ఆ భావంతో గాంధీజీ ఆదేశాన్ని ఎవరు మనఃపూర్వకంగా పాటించరో వారంతా దేవుడి ముందు పాపం చేసిన వారవుతారు. నేను బాపూ సైనికుణ్ణి' (ఇండోర్: 2.10.1950 : ప్యారెలాల్ 'మహాత్మా: ది లాస్ట్ ఫేజ్') అన్నారాయన.

కశ్మీర్ విభజనానంతర సమస్య

పటేల్‌నే ప్రధానమంత్రిగా ప్రకటించి ఉంటే కశ్మీర్ సమస్యే ఉత్పన్నమయ్యేది కాదని కూడా మోదీ భాష్యం చెప్పారు. తన విధానాలతో ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నప్పుడల్లా మోదీ వారి దృష్టి నుంచి మళ్లించేందుకు ఇలాంటి 'దారి మళ్లింపు' ప్రకటనలు చేస్తూంటారు. కశ్మీర్ సమస్య విభజనానంతర భారతంలో సంస్థానాల విలీనీకరణతో ముడిపడిన సమస్య. హిందువులు మెజారిటీగా సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేస్తున్నప్పుడు ముస్లింలు మెజారిటీగా ఉన్న సంస్థానాలను పాకిస్తాన్‌లో కలపాలా, లేదా భారత యూనియన్‌లోనే ఉంచాలా అన్న సమస్య ఉత్పన్నమయింది. ఆ సమయంలో హిందువులు మెజారిటీగా ఉన్న జునాఘడ్, హైదరాబాద్‌లను భారత యూనియన్‌లో విలీనం కావడానికి పాకిస్తాన్ ఒప్పుకుంటే, కశ్మీర్‌ను పాకిస్తాన్‌కు ఇచ్చేయడానికి హోంమంత్రి పటేల్ ఒప్పుదలయ్యారు డిస్ట్రక్షన్ ఆఫ్ హైదరాబాద్: ఏజీ నూరాని పే: 160 (2013). జునాఘడ్, హైదరాబాద్‌లు భారత యూనియన్‌లో విలీనమైనా ముస్లిం మెజారిటీతో ఉన్న కశ్మీర్ ఎటూ కాకుండానే ఉండిపోయింది. 70 ఏళ్లుగా ఇరు దేశాల మధ్య సమస్యగానే మిగిలి ఉంది. తన ఈ ప్రతిపాదనను పాకిస్తాన్ 'దురదృష్టవశాత్తు' ఆమోదించలేదనీ, ఫలితంగా జునాఘడ్, హైదరాబాద్, కశ్మీర్‌లనే గాక, తూర్పు పాకిస్తాన్‌ను కూడా కోల్పోయిందని పటేల్ అన్నారు.

మోదీ భావిస్తున్నట్టు పటేల్ ప్రధాని అయినా, కశ్మీర్ కాష్టం తొలిగేది కాదు. కశ్మీర్ ప్రజల బాధలు అనంతం. బ్రిటిష్ అధికారులు రకరకాల సంధుల ద్వారా (లాహోర్–అమృతసర్ సంధి 1846 మార్చి 9–11) బ్రిటిష్ సామంత ప్రాంతంగా ఏలుతూ ఉన్న గులాబ్‌సింగ్‌ను, సిక్కులను మోసగించి ఒకటిన్నర కోట్ల రూపాయలకు ఈస్టిండియా కంపెనీకి ధారాదత్తం చేశారు. అమృత్‌సర్ సంధి ద్వారానే బ్రిటిష్ వాళ్లు బియాస్, సింధు నదుల మధ్య కశ్మీర్, హజారా ప్రాంతాలనూ అమ్మేశారు. వారానికి రూ. 75 లక్షల పరిహారం చూపించి కులూ, మనాలీ ప్రాంతాలను కూడా కంపెనీ స్వాహా చేసింది. అలా బ్రిటిష్ కుట్రల ద్వారా ఏర్పడిందే జమ్మూ–కశ్మీర్. గాంధీజీ (1947 ఆగస్టు) శ్రీనగర్‌లో పర్యటించిన తర్వాత ఒక చారిత్రిక సత్యాన్ని ప్రకటించారు: ''నా పర్యటనానుభవంలో తేలింది– కశ్మీర్–జమ్మూలలో కశ్మీరీల మనోవాంఛ మాత్రమే అంతిమ శాసనంగా ఉండాలని చెప్పడానికి నేను సంకోచించడం లేదు. ఈ వాస్తవాన్ని ప్రస్తుత హిందూ మహారాజా, మహారాణీ కూడా గుర్తించి, అంగీకరించారు. అమృత్‌సర్ సంధి అనేది కశ్మీర్‌ను అమ్మేసిన విక్రయ దస్తావేజు...''. అలాగే, తాను హత్యకు గురి కావడానికి నెల ముందు ఢిల్లీలో ప్రార్థనా సమావేశంలో (1947 నవంబర్ 27న) గాంధీజీ మాట్లాడుతూ జమ్మూలోని హిందూ మైనారిటీ ప్రభుత్వ పాలనలో పెద్ద ఎత్తున అత్యాచారాలు జరగడానికి కారణం ఎవరో కాదు, మహారాజా హరిసింగ్‌ను బాధ్యుడిగా ప్రకటించారు (1947 డిసెంబర్ 25). అంతేగాదు, గాంధీజీ తన ఆరోపణను విశదీకరించే క్రమంలో ''మహారాజా హరిసింగ్ తానిక ఎంత మాత్రమూ కశ్మీర్ పాలకుడ్ని కాననీ, కశ్మీర్ నిజమైన పాలకులు కశ్మీర్ ముస్లిం ప్రజలేనని వారికి నచ్చిన పద్ధతిలో కశ్మీర్‌ను పరిపాలించుకోవచ్చుననీ తనకు తానై హరిసింగ్ ప్రకటించాలని'' 1947 డిసెంబర్ 25న గాంధీజీ అభిప్రాయపడ్డారని చరిత్రకారుడు, రాజ్యాంగ నిపుణుడు నూరానీ తన గ్రంథంలో నమోదు చేశారు.

నిజాం సంస్థానం విలీనంలోనూ...

హైదరాబాద్ సంస్థాన విమోచనకు పటేల్ 'ఆపరేషన్ పోలో' పేరిట ప్రారంభించిన సైనిక చర్య సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సంధానకర్తగా పనిచేసిన కె.ఎం. మున్షీ పటేల్ కనుసన్నల్లో ఉన్నవారే. నాటి హైదరాబాద్ స్టేట్‌లో పటేల్ పంపిన యూనియన్ సైన్యం ప్రారంభించిన సైనిక చర్యల్లో ఘటిల్లిన పరిణామాల గురించి, ఆ గందరగోళాన్ని అవకాశంగా తీసుకుని మున్షీ హైదరాబాద్‌లోని బొల్లారం కేంద్రంగా 'ఉండంతలు కొండంతలు'గా చిత్రించి నివేదికలు పంపడానికి కారణం, వాటిని పటేల్ నమ్మడానికి మూలం–మున్షీ, పటేల్ పూర్వరంగం ఆరెస్సెస్‌తో ఉన్న సంబంధాలేనని, పటేల్ మెతకతనానికి ఇదే కారణమని నూరానీ (అదే గ్రంథం: పే. 179) రాశాడు. గాంధీజీ హత్యకు ఆరెస్సెస్‌పైన నిషేధం విధించినా, క్రమంగా ఒత్తిళ్ల ఫలితంగా రద్దు చేసింది కూడా పటేల్ అని విస్మరించరాదు. పటేల్‌ను గాంధీ దేశ ప్రధానిని చేయకపోయినా, పటేల్ ఉప ప్రధానిగానే ఉన్నా హైదరాబాద్ విమోచన సందర్భంగా క్షేత్ర స్థాయిలో జరిగిన అనేక దుర్ఘనలపై విచారించిన కాంగ్రెస్ ప్రతినిధులు పద్మజానాయుడు (సరోజినీ నాయుడు కూతురు), ఖాజీ మహ్మద్ అబ్దుల్ గఫార్‌ఖాన్‌లు సమర్పించిన నివేదికలను పరిశీలించవలసిందిగా ప్రధాని నెహ్రూ కోరినా, పటేల్ తోసి పుచ్చడమూ ఆనాడొక సంచలనంగా మారింది. ప్రధానమంత్రి కాకపోయినా నెహ్రూ క్యాబినెట్‌లో పటేల్ 'ప్రధాని'గానే చెలామణి అవుతూ ప్రజల దృష్టికి రాని 'బేఖాతరు'తనాన్ని చెలాయించుకుంటూనే వచ్చారని గమనించాలి. పైగా, గాంధీజీ హత్యానంతరం దేశ వ్యాప్తంగా ఆరెస్సెస్ వారు ఆనందంతో స్వీట్లు పంచడంతో ప్రతిపక్షాలు మరింత రెచ్చిపోయిన సందర్భంగా ఆరెస్సెస్‌పైన నిషేధం విధించక తప్పలేదని కూడా ఆరెస్సెస్ నేత గోల్వాల్కర్‌కు రాసిన లేఖలో పటేల్ (11.9.1948) హెచ్చరించవలసి వచ్చింది. ఈ లేఖ ఉద్దేశం ఆరెస్సెస్‌లో పునరాలోచన కోసం, హృదయ పరివర్తన కోసమేనని పటేల్ రాయడం గమనార్హం. మోదీ ఎంత ప్రయత్నించినా చారిత్రక ఆధారాలను మూసివేయలేరు, నిజాల్ని దాచలేరు.

abkprasad2006@yahoo.co.in

బుకాయింపులూ.. దబాయింపులూ

విభజన చట్టంలో చెప్పిన సంస్థలను 93వ సెక్షన్ ప్రకారం పదేళ్లలో పూర్తి చేయాలని గడువు విధిస్తే, మూడేళ్లలో కేంద్రం ఏపీలో 85 శాతం ప్రాజెక్టులు మంజూరు చేసి ప్రారంభించింది. అయినా కేంద్రం ఏమీ అందించలేదనడం పచ్చి దగా.

విశ్లేషణ



పురిఘళ్ల రఘురాం



సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చే ఎన్నికల్లో ఎలా గెలవాలి అనే అంశంపైనే పూర్తిగా దృష్టి పెట్టినట్లు స్పష్టమవుతోంది. 1999 ఎన్నికల్లో వాజ్‌పేయి ప్రభావాన్ని, 2014లో మోదీ ప్రభంజనాన్ని ఉపయోగించుకుని అధికారంలోకి వచ్చిన బాబుకు తాను రెండు సార్లు సీఎంగా గెలిచింది బీజేపీ వల్లే అని భావించడంలో ఎలాంటి అనుమానాలూ లేవు. కానీ 2014 ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన కలిపి పోటీ చేయగా ఒంటరిగా బరిలోకి దిగిన వైఎస్సార్‌సీపీ కేవలం 1 శాతం ఓట్ల తేడాతో ఓటమి పాలై ప్రతిపక్షంలో కూర్చున్న విషయం తెలిసిందే. కానీ బీజేపీ మద్దతుతోనే స్వల్ప తేడాతో అధికారంలోకి వచ్చిన బాబు గత నాలుగేళ్లుగా రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం.. ఇలా సాధ్యం కాని వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చారు. వాటిలో ఏ ఒక్క వాగ్దానమూ నెరవేరకపోవడంతో ఇప్పుడు బీజేపీని బలిపశువును చేయడానికి పథక రచన చేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

వచ్చే ఎన్నికల్లో ఎలా గెలవాలి? ఇది ఇప్పుడు బాబు మనస్సులో మెదులుతున్న బేతాళ ప్రశ్న. రాష్ట్రంలో ప్రతిపక్షాన్ని నీరుగార్చి, భాజపాని దోషిగా నిలబెట్టి, రాజకీయ లబ్ధిపొంది, తిరిగి అధికారానికి రావాలన్నదే బాబు ఆలోచన. అందుకే మొదట్లో ప్రత్యేక హోదా లేకపోయినా ఫర్వాలేదు ప్రత్యేక ప్యాకేజీతో ఎంతో మేలు అని, కేంద్రం అన్ని రాష్ట్రాల కంటే మనకే ఎక్కువ చేస్తోందని పొగిడి, ప్రతిపక్షానిది అనవసర రాద్ధాంతమని తోసిపుచ్చారు బాబు. ఇప్పుడు పార్లమెంటు వేదికగా తన పార్టీ ఎంపీలను ఉసిగొల్పి, బీజేపీపై విరుచుకుపడుతున్నారు. కేంద్రాన్ని దోషిగా నిలబెట్టాలని చూస్తున్నారు. ప్రధాని మోదీని టార్గెట్ చేస్తూ, బ్లేమ్ గేమ్ మొదలెట్టి కేంద్రంపై బురద జల్లుతున్నారు. మంత్రులు, శాసనసభ్యులు, ఎంపీలతో కేంద్రంపై దాడికి దిగి రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. కేంద్రం ఏపీకి ఏమీ ఇవ్వలేదని, ఆంధ్రప్రజలను దగా చేసిందని ఇష్టమొచ్చినట్లు మాట్లాడిస్తున్నారు.

ఏపీ బీజేపీ అధ్యక్షులు హరిబాబు గత శనివారం ఢిల్లీలో మాట్లాడుతూ 27 పేజీల నివేదికను ప్రజల ముందుంచారు. విభజన చట్టంలో చెప్పిన సంస్థలను 93వ సెక్షన్ ప్రకారం పదేళ్లలో పూర్తి చేయాలని గడువు విధిస్తే, కేవలం మూడేళ్లలో కేంద్రం ఏపీలోని 85 శాతం ప్రాజెక్టులను మంజూరు చేసి ప్రారంభించింది. విభజన చట్టంలోని అన్ని అంశాలను అమలు చేయడానికి నూటికి నూరు శాతం సిద్ధంగా ఉన్నట్లు కేంద్రం ఇప్పటికే పలుసార్లు పార్లమెంటు వెలుపలా, బయటా ప్రకటించింది. ఇంకా కొన్ని విషయాల్లో స్పష్టత రావాల్సి ఉందని, వాటిని కూడా నెరవేర్చడానికి కేంద్రం సిద్ధంగా ఉందని ఆర్థికమంత్రి జైట్లీ పార్లమెంట్‌లో చెప్పారు.

త్వరలోనే ఏపీకి రైల్వే జోన్ ప్రకటించనున్నారు. పోలవరం ప్రాజెక్టుకు ఇప్పటికే రూ. 5 వేల కోట్లకు పైగా నిధులిచ్చారు. అక్కడ ఇప్పుడు వేగంగా పనులు జరుగుతున్నాయి. కడప స్టీల్ ప్లాంటుపై టాస్క్ ఫోర్స్ ఏర్పాటైంది. త్వరలో సాధ్యం అవుతుంది. దుగరాజపట్నం రేవు సాధ్యం కాదని కేంద్ర నిపుణులు చెప్పినా, ప్రత్యామ్నాయ ప్రాంతాన్ని ఏపీ ప్రభుత్వం ఇంతవరకూ చూపించలేదు. ఇక రెవెన్యూ విషయానికి వస్తే రాష్ట్రం ఇంతవరకూ కేంద్రానికి సరైన లెక్కలతో తన అధికారులను పంపించలేదు. అయినా ఇప్పటికే కేంద్రం రూ. 4,269 కోట్లు ఇచ్చింది. డీపీఆర్‌లు ఇవ్వకుండానే అమరావతికి రూ. 2,500 కోట్లు, స్మార్ట్ సిటీకి రూ., 1,882 కోట్లు అదనంగా కేటాయించారు. ఇది కాక అవుటర్ రింగ్ రోడ్డుకు రూ.20,000 కోట్లు కేటాయించిన సంగతిని కూడా రాష్ట్రం కప్పిపుచ్చుతోంది. కానీ బీజేపీ ఏపీ అధ్యక్షుడు హరిబాబు సమర్పించిన 27 పేజీల నివేదిక తప్పుల తడక అని, అంకెల గారడి అని ఆదివారం మీడియా ముందు టీడీపీ చెప్పడం విడ్డూరంగా ఉంది. ఇప్పటి వరకూ కేంద్రం ఏపీకి వివిధ శాఖల ద్వారా రూ. 3,55,464 కోట్ల కేటాయింపులు చేసింది.

ఇవి కాకుండా రాష్ట్రంలో అన్ని గ్రామ పంచాయతీలకు కేంద్రం నేరుగా 13వ, 14వ ఆర్థిక సంఘం ద్వారా నిధులు అందిస్తోంది. గ్రామాల్లో 24 గంటల విద్యుత్తు, సిమెంట్ రోడ్లు, మంచినీటి పథకాలు, డ్రైనేజీలు, వీధి దీపాలు, పెన్షన్లు, ఇన్సూరెన్సులు, మరుగుదొడ్లు, పంట బీమా, ప్రమాదబీమా, గ్రామ సడక్ యోజన, స్వచ్ఛభారత్, చౌకగా ఇంటర్నెట్, జన్‌ధన్ ఖాతాలు, ముద్రా యోజనలు, ఎల్పీజీ ఉచితం, గర్భిణీ స్త్రీలకు ఆర్థిక సహాయం ఇలాంటి పథకాల్లో కేంద్ర వాటాయే చాలా ఎక్కువ. వీటిలో రాష్ట్రాల వాటా చాలా తక్కువ.

అసలు విషయం ఏమంటే ఒక పక్క ప్రతిపక్ష నాయకుడి పాదయాత్ర, మరోపక్క ప్రత్యేక హోదాపై కాంగ్రెస్, కమ్యూనిస్టులు దండయాత్ర, ఇంకోవైపు బీజేపీ రాష్ట్రంలో బలపడుతుండటం బాబును కలవర పెడుతోంది. ప్రతిపక్షంతోపాటు మిత్రపక్షం కూడా ప్రభుత్వ అసమర్థతపై కన్నెర్ర జేయడం బాబుకు రుచించడం లేదు. వచ్చే ఎన్నికల్లో బీజేపీతో వెళ్లాలా, పవన్ కల్యాణ్ జనసేనతో వెళ్లాలా, ఒంటరిగా వెళ్లాలా అనే ప్రశ్నలతో, పథక రచనలో బాబు నిమగ్నమయ్యారు. మొత్తం మీద రాష్ట్రానికి ఎన్నికల వేడి తగిలింది.

వ్యాసకర్త బీజేపీ సమన్వయకర్త, ఢిల్లీ
ఈ–మెయిల్ : raghuram.delhi@gmail.com

కపటనాటక సూత్రధారులు !!

నేడు రాష్ట్రంలో ప్రత్యేక హోదా పోరు రాజకీయ వేడిని కల్పించింది. వైఎస్సార్‌సీపీ, వామపక్షాలు మరియు జనసేనలు కలిసి ప్రత్యేక హోదాకు వ్యతిరేకంగా నిన్న జరిపిన బంద్‌కు ప్రజలు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. వైఎస్ జగన్ చేస్తున్న పాదయాత్రకు విశేష స్పందన లభిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో విభజన హామీలను కేంద్రం నుండి రాబట్టుకోవడంలో సంపూర్ణంగా వైఫల్యం చెందిన చంద్రబాబు పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. మరోవైపు కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన తీవ్ర అన్యాయం ప్రజల్లో తీవ్ర అగ్రహం కలిగించినట్లు చూస్తున్నాం. ఈ నేపథ్యంలో పార్లమెంటులో టీడీపీ ఎంపీలు, చంద్రబాబు కపట నాటకాన్ని ప్రారంభించారు. ఓ వైపు ఆందోళన చేస్తున్నట్లు ప్రకటనలు మరో వైపు బీజేపీతో తగాదా పడటం మా ఇష్టం కాదని సంకేతాలతో తనదైన శైలిలో రాజకీయాలు చేస్తున్నారు.

ఉండవల్లి, జయప్రకాష్ నారాయణ్‌లను కలుపుకున్న పవన్ కల్యాణ్ నేడు ప్రత్యేకహోదా పేరుతో ఓ కొత్త తరహా నాటకానికి తెర లేపారు. బాబు ప్రత్యేకహోదాకు తిలోదకాలిచ్చి రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం చేశారు. కాని నేడు ప్రజలు విద్యార్థులు, యువకులు, నిరుద్యోగులు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ప్రత్యే కహోదా ప్రాముఖ్యాన్ని గుర్తించారు. అలాగే ప్రత్యేక హోదా సాధన కోసం మేధావుల వేదిక అధ్యక్షులు చలసాని శ్రీనివాస్, నాలుగేళ్లుగా ప్రశ్నించని పవన్ నేడు ప్రత్యేక హోదా గురించి ఆందోళన జరపడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. అలాగే ప్రత్యేకహోదా పట్ల రాష్ట్రంలో ఓ వర్గం మీడియా ఆడుతున్న కపట నాటకాన్ని, కుట్రను ఆయన ఎండగట్టారు. జగన్‌మోహన్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో సానుకూల వాతావరణం ఏర్పడుతున్న పరిస్థితిని గమనించి బాబు తన వర్గం వారితోనే ప్రత్యేకహోదా పోరాట నాటకాన్ని చేపట్టడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. బాబు విభజన సందర్భంలో రెండుకళ్ల సిద్ధాంతం–తెలంగాణలో ప్రత్యేక తెలంగాణను బలపరిచి, ఆంధ్రలో సమైక్య రాష్ట్రం కోసం ఆందోళన చేపట్టి వైఎస్సార్‌సీపీ చేపట్టిన సమైక్య రాష్ట్ర సమరశంఖాన్ని నిలువరించడానికి ప్రజల్లో గందరగోళం కల్పించడానికి కృషి చేశారు. ఒక వైపు మోదీ ప్రభుత్వంలో కొనసాగుతూనే మరోవైపు విభజన హామీలు అమలు కాలేదని మొసలి కన్నీరు కారుస్తున్నారు. ఇంకోవైపు జగన్, మోదీతో రాజకీయ కరచాలనం చేస్తున్నారని తన అనుకూల మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఈ తరుణంలో ఉండవల్లికి పవన్‌కి లంకె కుదరడం రాష్ట్రంలో ఉండవల్లి అభిమానులకే ఆశ్చర్యం కల్గిస్తుంది. 25 ఏళ్ల అత్యంత గౌరవప్రదమైన సాన్నిహిత్య సంబంధాలు కలిగిన నాకే (రచయిత) చాలా ఆశ్చర్యం కల్గిస్తోంది. కేవలం జగన్ వ్యతిరేక కార్యాచరణలో ఉండవల్లి, జయప్రకాశ్ నారాయణలు భాగస్వాములు కావడం ఎంతవరకు సమంజసమో వారు పునరాలోచన చేయాలి.

ఇమాం, కదలిక సంపాదకులు । 99899 04389


సవరణ : 11వ తేదీన ప్రచురించిన 'త్రికాలమ్' శీర్షికలో కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజు పేరు పొరపాటున ఆనంద గజపతి రాజు అని అచ్చయింది. గమనించగలరు.

మహా శివరాత్రి



ఆయన నామం నిరాడంబరం. 'శివ' అని రెండక్షరాలు ఉచ్చారణలో శ్రమ లేదు. అయితేనేమి, ఆ నామం సర్వోత్కృష్టం. ఆయన రూపం నిరాడంబరం. అసలు నామ రూప రాహిత్యానికే సంకేతమయిన లింగ రూపం. ఆయన వేష భాషలూ ఆహార విహారాలూ నిరాడంబరం. ఆయన ఆహారం కాలకూటం. ఆభరణాలు పాముల దండలు. వస్త్రం ఏనుగు తోలు, వాహనం వృద్ధ వృషభం.

ఆయనకు నచ్చే పూజా విధులూ నిరాడంబరమే. ఆకు దొప్పతో అన్ని నీళ్లూ, అందుబాటులో ఉంటే నాలుగు మారేడు దళాలూ ఆయనకు ప్రియమైన పూజా ద్రవ్యాలు. భక్తుడు గడుసుదేరి, 'స్వామీ! నేను మానస పూజ తప్ప భౌతికంగా ఏమీ చేయలేను. మానసికంగానే నీకు ఉత్తుత్తి రత్నాసనం, చందనం, పుష్పం, ధూపం, దీపం, ఉత్తుత్తి పంచ భక్ష్యాలూ, పాయసాలూ, తాంబూలాలూ, ఛత్ర చామరాలూ సమర్పిస్తున్నాను. అందుకో. నేను పూజలూ, పునస్కారాలూ చేయలేను కనుక నేను ఏది చేస్తే అదే నా పూజగా భావించవయ్యా. అన్నా సరే, 'దానికేముంది, అలాగే! భావన కదా ముఖ్యం!' అంటూ ప్రసన్నత కురిపించే భోళా శంకరుడు ఆయన. ఆయన భక్తులూ నిరాడంబరులే. ఏ వేదాలూ ఎరుగని సాలీడూ, ఏ శాస్త్రాలూ చూసి ఉండని కాళ సర్పం, ఏ విద్యలూ అభ్యసించి ఉండని ఏనుగూ, ఏ మంత్ర తంత్రాలూ ఎరుగని చెంచు కన్నప్పా– కారెవరూ శివ కటాక్షానికి అనర్హులు.




అయితే, భక్తులను అనుగ్రహించి కోరిన వరాలిచ్చే విషయంలో మాత్రం శంకరుడు చూపే ఆడంబరం, ఔదార్యం సాటి లేనివి. అలకాధిపతి కుబేరుడి అష్టైశ్వర్యాలన్నీ ఈ ఆది భిక్షువు పెట్టిన భిక్షే. తను హాలాహలం గొంతులో నింపుకొన్నాడు కానీ, అమరులకు అబ్బిన అమృతప్రాశన తన ఔదార్య ఫలమే.

అడిగీ అడగకుండానే అన్నీ ఇచ్చే ఆది దేవుడి అనుగ్రహం పొందేందుకు అనువైన రోజు మహా శివరాత్రి మళ్లీ వచ్చింది. ఉపవాసంతో, జాగరణతో, నిరంతర శివనామ జపంతో, నిష్ఠగా జరిపే ప్రహార పూజలతో శాస్త్రోక్త విధి ఆచరించగల శివదీక్షాపరులూ, శివరాత్రి వ్రతతత్పరులూ ఎలాగూ ధన్యులే. అభిషేకాలూ, అర్చనలూ, లింగోద్భవ సమయారాధనలూ, కల్యాణోత్సవాలూ చేతులారా చేసేవారూ, కళ్లారా చూసేవారూ భాగ్యశాలులే. శివరాత్రి నాడు శివలింగానికి చెంబుడు నీరు సమర్పించేవాళ్లూ, ఓ బిల్వ దళం సమర్పించేవాళ్లూ, చిత్త శుద్ధితో నమశ్శివాయ అని ముమ్మారు మనసారా స్మరించేవాళ్లు కూడా ఆ కరుణా సింధువు కటాక్షానికీ పాత్రులవుతారు.

ఆడంబరాలన్నింటినీ తృణీకరించే ఆ ఆర్త త్రాణ పరాయణుడిని, చిటికెడు చిత్తశుద్ధి ఆకట్టుకొంటుంది.

– ఎం. మారుతి శాస్త్రి



దేశంలోనే ధనిక సీఎం చంద్రబాబు

నివేదిక విడుదల చేసిన ఏడీఆర్

న్యూఢిల్లీ: దేశంలోని మొత్తం 31 మంది ముఖ్యమంత్రుల్లో 24 మంది (81 శాతం) కోటీశ్వరులేనని ఎన్నికల సంస్కరణల కోసం కృషి చేస్తున్న అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) ఓ నివేదిక విడుదల చేసింది. వీరిలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు రూ.177 కోట్లకు పైగా ఆస్తులతో దేశంలోనే అత్యంత ధనిక సీఎంగా నిలిచినట్లు ఏడీఆర్ తెలిపింది. అరుణాచల్‌ప్రదేశ్ సీఎం పెమా ఖండూ రూ.129 కోట్లకుపైగా ఆస్తులతో రెండో స్థానంలో, పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ రూ.48 కోట్లతో మూడో స్థానంలో నిలిచినట్లు వెల్లడించింది. దేశంలో ముఖ్యమంత్రుల సగటు ఆస్తి రూ.16.18 కోట్లుగా ఉందంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన సీఎంల అఫిడవిట్లను పరిశీలించిన ఏడీఆర్, నేషనల్ ఎలక్షన్ వాచ్(ఎన్‌ఎల్‌డబ్ల్యూ)లు ఈ నివేదికను రూపొందించాయి. దేశంలోని అతిపేద ముఖ్యమంత్రుల్లో త్రిపుర సీఎం మాణిక్ సర్కార్ రూ.27 లక్షల ఆస్తులతో తొలిస్థానంలో నిలవగా, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ(రూ.30 లక్షలుపైగా), జమ్మూకశ్మీర్ సీఎం మెహబూబా ముఫ్తీ(రూ.56 లక్షలు) తర్వాతి స్థానాల్లో నిలిచారు. మొత్తం 31 మంది ముఖ్యమంత్రుల్లో 11 మంది(35 శాతం)పై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ఏడీఆర్ నివేదికలో తెలిపింది. దాదాపు 26 శాతం సీఎంలపై హత్య, హత్యాయత్నం, మోసం, బెదిరింపులు వంటి తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నట్లు వెల్లడించింది. ఇక విద్యార్హతల విషయానికి వస్తే.. మొత్తం ముఖ్యమంత్రుల్లో 10 శాతం మంది పన్నెండో తరగతి ఉత్తీర్ణులు కాగా, 39 శాతం మంది డిగ్రీ, 32 శాతం మంది వృత్తివిద్యా డిగ్రీ, 16 శాతం మంది పీజీ, 3 శాతం మంది డాక్టరేట్ సాధించినట్లు పేర్కొంది.



పేగు బంధాన్ని, కుటుంబ భారాన్ని ఒకేసారి మోస్తున్న వలస కూలీ ఈమె. జార్ఖండ్ నుంచి వలస వచ్చి గ్రేటర్ నోయిడాలో నిర్మాణరంగంలో పనిచేస్తున్న ఈమె తన 18 నెలల కొడుకును ఒంటరిగా వదలలేని పరిస్థితి. దీంతో చిన్నారిని వెన్నుకు కట్టుకుని, బరువైన సిమెంటు శ్లాబులను మోస్తోంది.

థేమ్స్‌లో రెండో ప్రపంచ యుద్ధం నాటి బాంబు

లండన్: రెండో ప్రపంచ యుద్ధ కాలం నాటి బాంబు తాజాగా లండన్ దగ్గర్లోని థేమ్స్ నదిలో బయటపడింది. ఈ ప్రాంతం లండన్ సిటీ విమానాశ్రయానికి దగ్గరగా ఉండటంతో సోమవారం అక్కడి నుంచి రాకపోకలు సాగించాల్సిన అన్ని విమానాలనూ రద్దు చేశారు. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం రాత్రి ఈ బాంబు బయటపడటంతో అప్పుడే విమానాశ్రయాన్ని పోలీసులు మూసివేశారు. దీంతో 16 వేల మంది ప్రయాణికులపై ప్రభావం పడింది. చుట్టు పక్కల ఇళ్లలోని వారిని కూడా ఖాళీ చేయించిన అధికారులు.. పోలీసులతో కలసి బాంబును తీసివేసే పనిలో నిమగ్నమయ్యారు.

‘డిస్కవరీ జీత్’లో బాబా రామ్‌దేవ్ చరిత్ర



న్యూఢిల్లీ: యోగా గురువుగా ప్రఖ్యాతిగాంచిన బాబా రామ్‌దేవ్ జీవిత చరిత్రపై డిస్కవరీ జీత్ చానెల్ రూపొందించిన ‘ స్వామి రామ్‌దేవ్: ఏక్ సంఘర్ష్’ సిరీస్ ప్రసారాలు అదే చానెల్‌లో సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈనెల 10న ఢిల్లీలో జరిగిన డిస్కవరీ జీత్ ప్రారంభోత్సవ వేడుకకు బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్, అరుణ్ జైట్లీ, రవిశంకర్ ప్రసాద్, ఆచార్య బాలకృష్ణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామ్‌దేవ్‌పై రూపొందించిన 60 నిమిషాల ప్రత్యేక వీడియోను ఆవిష్కరించారు. నిరుపేద రైతు రాంనివాస్ యాదవ్ కొడుకైన రామ్‌కిషన్(బాబా రామ్‌దేవ్ అసలు పేరు) 1965లో సొంతూరులో పడిన బాధల గురించి ఈ వీడియోలో ప్రస్తావించారు. చిన్ననాటి కష్టాలతోపాటు ఆరోగ్య సమస్యతో ఆచార్య బల్‌దేవ్ దగ్గర యోగా నేర్చుకుని అంచెలంచెలుగా బాబా రామ్‌దేవ్‌గా ఎదిగిన క్రమాన్ని ‘స్వామి రామ్‌దేవ్: ఏక్ సంఘర్ష్’ సిరీస్‌లో చూపించనున్నారు.

ఆ ఆర్మీ అధికారులపై చర్యలు వద్దు: సుప్రీం

న్యూఢిల్లీ: షోపియాన్ జిల్లాలో అల్లరిమూకలపై కాల్పులు జరిపిన ఘటనలో ఆర్మీ మేజర్ అదిత్య కుమార్ సహా ఇతర అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని జమ్మూకశ్మీర్ పోలీసుల్ని సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. మేజర్ కుమార్ తండ్రి కల్నల్ కరమ్‌వీర్ సింగ్ దాఖలుచేసిన పిటిషన్‌ను విచారించిన సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఏఎం ఖన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌ల ధర్మాసనం.. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఈ పిటిషన్ వివరాలను అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ కార్యాలయంతో పాటు జమ్మూకశ్మీర్ ప్రభుత్వంతో పంచుకోవాలని అత్యున్నత న్యాయస్థానం కల్నల్ సింగ్‌కు సూచించింది. తాజా ఉత్తర్వుల ప్రకారం ఈ కేసులో సుప్రీంకోర్టు ముందస్తు అనుమతి లేకుండా పోలీసులు ఆర్మీ అధికారుల్ని అరెస్ట్ చేయడం కుదరదు.

9 కోట్ల డాలర్లు చెల్లించండి: బ్రిటన్ కోర్టు



లండన్/సింగపూర్: భారత్‌లో బ్యాంకులకు దాదాపు రూ.9 వేల కోట్లు ఎగ్గొట్టి ప్రస్తుతం బ్రిటన్‌లో ఉంటున్న వ్యాపారవేత్త విజయ్ మాల్యాకు మరో సమస్య ఎదురైంది. కింగ్‌ఫిషర్ కోసం విమానాలను అద్దెకు తీసుకున్నందుకుగానూ సింగపూర్‌కు చెందిన బీవోసీ ఏవియేషన్ సంస్థకు 9 కోట్ల అమెరికన్ డాలర్లు చెల్లించాల్సిందిగా యూకేలోని ఓ కోర్టు ఆదేశించింది. మరోవైపు మాల్యాను భారత్‌కు అప్పగించే కేసుకు సంబంధించి వెస్ట్‌మినిస్టర్ మేజిస్ట్రేట్ కోర్టులో తుది విచారణ వచ్చే నెల 16న ప్రారంభం కానుంది. మేలో తీర్పు వెలువడే అవకాశం ఉంది.

బాలికకు నిప్పంటించిన మృగాడు

రాజ్‌గఢ్: మధ్యప్రదేశ్‌లో ఓ పదమూడేళ్ల దళిత బాలికపై మృగాడు రెచ్చిపోయాడు. తన కోరిక తీర్చలేదన్న కోపంతో ఏకంగా బాలికకే నిప్పటించాడు. వివరాలు.. రాజ్‌గఢ్‌లోని సుస్తానీ గ్రామానికి చెందిన బాలిక తల్లిదండ్రులతో కలసి నివసిస్తోంది. శనివారం బాలిక తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉండటాన్ని గమనించిన అదే గ్రామానికి చెందిన యువకుడు ఇంట్లోకి ప్రవేశించి లైంగిక వేధింపులకు దిగాడు. అతడి ప్రయత్నాన్ని బాలిక తీవ్రంగా ప్రతిఘటించింది. దీంతో తననే అడ్డుకుందన్న కోపంలో బాలికపై యువకుడు కిరోసిన్ పోసి నిప్పంటించాడు. మంటల్లో బాలిక శరీరం 50 శాతం కాలిపోయిందని.. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. బాలికపై దాడికి పాల్పడిన యువకుడిని ఆదివారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఆ నలుగురు జడ్జీలు చెప్పినా నమ్మరా?

న్యూఢిల్లీ : సీబీఐ జడ్జి బీహెచ్ లోయా మరణించిన రోజున అతనితో ఉన్న నలుగురు న్యాయమూర్తులు.. అది సహజ మరణమేనని చెప్పారని, వారి వాంగ్మూలాల్ని సందేహించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టుకు మహారాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. లోయా కేసులో మహారాష్ట్ర తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదిస్తూ.. ‘లోయాది సహజ మరణమేనంటూ నలుగురు జడ్జీలు(కులకర్ణి, బార్డే, మోదక్, ఆర్‌ఆర్ రతి) ఇచ్చిన వాంగ్మూలాలు నమ్మదగినవి. 2014 నవంబర్ 29 – డిసెంబర్ 1 మధ్య వారు లోయాతోనే ఉన్నారు. వాంగ్మూలాలపై ఆ నలుగురి సంతకాలు ఉన్నాయి. అలాంటప్పుడు అవి నమ్మదగినవి కావా?’ అని రోహత్గీ ప్రశ్నించారు. ఒకవేళ ఆ వాంగ్మూలాల్ని మీరు(కోర్టు) తిరస్కరించాలనుకుంటే.. వారిని సహకుట్రదారులుగా ప్రాథమికంగా అంగీకరిస్తున్నట్లేనని అన్నారు.

పాక్ మూల్యం చెల్లించాల్సిందే

సంజువాన్ ఉగ్రదాడిపై భారత్ హెచ్చరిక

- ఉగ్రవాదులంతా పాకిస్తానీయులే..
- జైషే ప్రమేయంపై ఆధారాలు సేకరించాం.. పాక్‌కు అందచేస్తాం
- రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటన
- శ్రీనగర్‌లో మరో ఉగ్రదాడిని తిప్పికొట్టిన సైన్యం

జమ్మూ/శ్రీనగర్: ఐదుగురు జవాన్లు, ఒక పౌరుడి మృతికి కారణమైన సంజువాన్ ఉగ్రదాడికి పాకిస్తాన్ తగిన మూల్యం చెల్లించక తప్పదని రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. ఆర్మీ శిబిరంపై దాడికి పాల్పడ్డ వారంతా పాకిస్తానీయులేనని, ఆ ఆధారాల్ని పాకిస్తాన్‌కు అందచేస్తామని ఆమె తెలిపారు. సంజువాన్ ఆర్మీ శిబిరంపై దాడి అనంతరం అక్కడి పరిస్థితిని సమీక్షించేందుకు సోమవారం సీతారామన్ జమ్మూలో పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ‘ఈ దుస్సాహసానికి పాకిస్తాన్ తగిన మూల్యం చెల్లిస్తుంది. మన సైనికుల మరణాల్ని వృథాగా పోనివ్వం. ఆర్మీకి ప్రభుత్వం అండగా ఉంటుంది’ అని చెప్పారు. సంజువాన్ ఉగ్రదాడి వివరాలు వెల్లడిస్తూ.. ‘మొత్తం ముగ్గురు ఉగ్రవాదులు హతమవడంతో సోమవారం ఉదయం ఆపరేషన్ ముగిసింది. అయితే తనిఖీలు కొనసాగుతున్నాయి. ఈ దాడిలో ఒక పౌరుడు సహా ఆరుగురు మరణించారు. నలుగురు ఉగ్రవాదులు పాల్గొన్నట్లు వార్తలొచ్చాయి. అయితే నాలుగో ఉగ్రవాది ఆర్మీ శిబిరంలోకి ప్రవేశించలేదు. లోపలికి వెళ్లేందుకు మిగతా వారికి సాయపడివుండవచ్చు’ అని చెప్పారు.

దాడిలో పాల్గొన్న ముగ్గురు ఉగ్రవాదులు పాకిస్తానీయులేనని.. సరిహద్దు వెంట జైషే మహమ్మద్ నేతృత్వంలో వారు పనిచేస్తున్నారని సీతారామన్ తెలిపారు.



సంజువాన్ ఉగ్రదాడి బాధితురాలిని పరామర్శిస్తున్న రక్షణమంత్రి నిర్మలా సీతారామన్

ఉగ్రవాదులకు స్థానికంగా సాయం అందినట్లు ఆధారాలున్నాయని చెప్పారు. ‘ఈ ఉగ్రదాడికి సంబంధించి జైషే ఉగ్రసంస్థ ప్రమేయంపై అన్ని ఆధారాల్ని సేకరించాం. ఎన్‌ఐఏ వాటిని పరిశీలిస్తోంది. తప్పకుండా వాటిని పాకిస్తాన్‌కు అందచేస్తాం. ఎన్నిసార్లు ఆధారాలు సమర్పించినా.. పాకిస్తాన్ మాత్రం ఎలాంటి చర్య తీసుకోవడం లేదు. అయినా ఆధారాలు అందచేయడం నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది’ అని పేర్కొన్నారు. అంతకుముందు ఏరియల్ సర్వే ద్వారా సంజువాన్ ఆర్మీ శిబిరాన్ని ఆమె పరిశీలించారు. ఉగ్రదాడిలో గాయపడి జమ్మూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు.

చర్చలే పరిష్కారం: మెహబూబా ముఫ్తీ

రాష్ట్రంలో కొనసాగుతున్న హింసకు ముగింపు పలికేందుకు భారత్, పాకిస్తాన్ తాజాగా చర్చలు జరపాలని జమ్మూ కశ్మీర్ సీఎం మెహబూబా ముఫ్తీ కోరారు. పాక్‌తో చర్చలు జరపాలని ఫరూక్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీలు కోరితే వారిని దేశ వ్యతిరేకులుగా ముద్ర వేస్తున్నారని, ఈ సమస్య పరిష్కారానికి చర్చలే పరిష్కారమన్నారు.

ఇంట్లో నక్కిన ఉగ్రవాదులు

సంజువాన్ ఉగ్రదాడి ఘటన మరువక ముందే.. శ్రీనగర్‌లో సీఆర్‌పీఎఫ్ శిబిరంపై ఉగ్రవాదులు దాడికి యత్నించారు. సోమవారం తెల్లవారుజామున శిబిరం వైపు చొచ్చుకొచ్చిన ఉగ్రవాదుల్ని భద్రతా బలగాలు తిప్పికొట్టాయి. అనంతరం సమీపంలోని ఇంట్లో నక్కిన ఉగ్రవాదుల్ని మట్టుబెట్టేందుకు జరిగిన ఎదురు కాల్పుల్లో ఒక సీఆర్‌పీఎఫ్ జవాను మృతిచెందారు. సీఆర్‌పీఎఫ్ 49వ బెటాలియన్‌కు చెందిన ఆ జవాను తీవ్రంగా గాయపడగా.. కొద్దిసేపటి అనంతరం మరణించాడు. ఇంట్లో దాగిన ఉగ్రవాదుల్ని మట్టుబెట్టడం లేదా సజీవంగా పట్టుకునేందుకు భద్రతా బలగాలు ఆపరేషన్ కొనసాగిస్తున్నాయి. మరోవైపు ఎన్‌కౌంటర్ జరుగుతున్న ప్రాంతానికి సమీపంలో భద్రతా సిబ్బందిపైకి కొందరు స్థానిక యువకులు రాళ్లు రువ్వడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అయితే అల్లరిమూకలను ఆర్మీ చెదరగొట్టింది. ‘తెల్లవారుజామున 4.30 గంటలకు ఇద్దరు అనుమానిత వ్యక్తులు బ్యాగులు ధరించి ఆయుధాలతో రావడం కాపలాగా ఉన్న సెంట్రీ గమనించాడు. వెంటనే వారిపైకి కాల్పులు జరిపాడు’ అని సీఆర్‌పీఎఫ్ ప్రతినిధి ఒకరు వెల్లడించారు.

వారిని ఏకాకి చేద్దాం

ఉగ్ర మద్దతుదారులపై భారత్-ఒమన్ దేశాధినేతలు

- మతం పేరు దుర్వినియోగాన్ని అరికట్టాలని నిర్ణయం
- ప్రధాని మోదీ, ఒమన్ సుల్తాన్ ఖబూస్ మధ్య ద్వైపాక్షిక చర్చలు
- రక్షణ, పెట్టుబడులు సహా పలు అంశాలపై 8 ఒప్పందాలు

మస్కట్: ఉగ్రవాదానికి సహకరిస్తున్న, ప్రోత్సహిస్తున్న వారిని ఏకాకిని చేయటంలో పరస్పర సహకారంతో ముందుకెళ్లాలని భారత్, ఒమన్ దేశాలు నిర్ణయించాయి. మతం పేరును దుర్వినియోగం చేస్తున్న వారి ప్రయత్నాలకు అడ్డుకట్ట వేయాలని ఇరుదేశాధినేతలు నరేంద్ర మోదీ, ఒమన్ సుల్తాన్ ఖబూస్ నిర్ణయించారు. ఒమన్ పర్యటనలో భాగంగా సుల్తాన్ ఖబూస్‌తో మోదీ సమావేశమయ్యారు. ద్వైపాక్షిక అంశాలపై విస్తృతంగా చర్చించారు. భారత్–ఒమన్ ద్వైపాక్షిక సంబంధాల్లో బలమైన పురోగతికి ఈ పర్యటన తోడ్పడిందని మోదీ పేర్కొన్నారు. అనంతరం మోదీ గల్ఫ్, పశ్చిమాసియాలోని ప్రముఖ వ్యాపారవేత్తలతో సమావేశమయ్యారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని వారిని ఆహ్వానించారు. అనంతరం మస్కట్‌లోని పురాతన శివాలయాన్ని మోదీ సందర్శించారు.

ఉగ్రవాదంపై ప్రత్యేకంగా..

‘ఇరుదేశాలు ఉగ్రవాదం కారణంగా ఇబ్బందులు పడుతున్నాయి. అందుకే ఈ ప్రాంతంలో, అంతర్జాతీయంగా శాంతినెలకొల్పే ప్రయత్నాల్లో కలసి ముందుకెళ్లాలని నిర్ణయించాం. ఉగ్రవాదానికి సహకరిస్తున్న వారిని ఏకాకిని చేయాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా పరస్పర సహకారానికి అంగీకరించాం’ అని ఇరుదేశాధినేతల సంయుక్త ప్రకటన పేర్కొంది. ఒమన్ అభివృద్ధిలో భారతీయుల పాత్రను సుల్తాన్ ఖబూస్ ప్రశంసించారు. వారి కష్టపడి పనిచేసేతత్వం, నిజాయితీని మరిచిపోలేమన్నారు.



మస్కట్‌లోని సుల్తాన్ ఖబూస్ గ్రాండ్ మసీదును సందర్శించిన ప్రధాని మోదీ

8 ఒప్పందాలు: మోదీ, ఖబూస్ సమక్షంలో ఇరుదేశాల ప్రతినిధులు 8 ఒప్పందాలపై సంతకాలు చేశారు. పౌర, వాణిజ్యపరమైన అంశాల్లో న్యాయ సహకారంపైనా ఒప్పందాలు జరిగాయి. దౌత్య, ప్రత్యేక, సేవా, అధికారిక వీసాలు ఉన్నవారికి సంయుక్త వీసా రద్దుకు సంబంధించిన ఒప్పందం కూడా ఈ జాబితాలో ఉంది. వైద్యం, పర్యాటకం, శాంతియుత ప్రయోజనాల కోసం అంతరిక్ష వినియోగం తదితర అంశాలపై ఒప్పందాలు జరిగాయి. డుక్మ్ ప్రత్యేక ఆర్థిక మండలిలో రెండు ప్రాజెక్టులకు సంబంధించి భారత సంస్థలు 1.8 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నాయన్నారు.

మధుర స్మృతి

‘భారత్–ఒమన్ దేశాల ప్రజల మధ్యనున్న శతాబ్దాల పురాతనమైన బంధాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు ఈ పర్యటన దోహదపడింది. వాణిజ్యం, పెట్టుబడుల బంధాలు సహా అన్నిరంగాల్లోనూ సహకారం మరింత వేగవంతమవనుంది. గౌరవనీయులైన సుల్తాన్ ఖబూస్ మీకు ప్రత్యేక ధన్యవాదాలు. మీ ఆతిథ్యం, స్నేహం.. నా ఒమన్ పర్యటనను మధుర స్మృతిగా మార్చేశాయి’ అని పర్యటన ముగింపు సందర్భంగా మోదీ పేర్కొన్నారు. అనంతరం మస్కట్‌లోని 125 ఏళ్ల పురాతన శివాలయాన్ని మోదీ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిష్టాత్మక సుల్తాన్ ఖబూస్ మసీదునూ ప్రధాని సందర్శించారు.

స్టెంట్ల ధరల్లో మార్పులు

- నేటి నుంచే అమల్లోకి..
- బీఎంఎస్ ధర 7,660కి పెంపు
- డీఈఎస్ రూ.27,890కి తగ్గింపు

న్యూఢిల్లీ: దాదాపు ఏడాది అనంతరం గుండె శస్త్రచికిత్సల్లో(యాంజియోప్లాస్టీ) వాడే కరోనరీ స్టెంట్ల గరిష్ట ధరల్లో కేంద్ర ప్రభుత్వం మార్పులు చేసింది. సవరించిన ధరల మేరకు బేర్ మెటల్ స్టెంట్ల(బీఎంఎస్) ధర రూ. 7,400 నుంచి రూ. 7,660కి పెరగగా, డ్రగ్‌తో కూడిన స్టెంట్ల(డీఈఎస్)ధర రూ. 30,180 నుంచి రూ. 27,890కి తగ్గింది. ఈ ధరలు నేటి నుంచి అమల్లోకి వస్తాయని, మార్చి 31, 2019 వరకూ అమల్లో ఉంటాయని జాతీయ ఫార్మాస్యూటికల్ ధరల నియంత్రణ విభాగం (ఎన్‌పీపీఏ) తెలిపింది. ఇప్పటికే స్టోర్లలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న స్టెంట్లకు కూడా తాజా ధరలే వర్తిస్తాయంది. డీపీసీఓ(డ్రగ్ ప్రైస్ కంట్రోల్ ఆర్డర్) 2013, షెడ్యూల్ 1 ప్రకారం కరోనరీ స్టెంట్లు ముఖ్యమైన డ్రగ్స్ కేటగిరీలోకి వస్తాయని, విస్తృత ప్రజా ప్రయోజనాల దృష్ట్యా వాటి ధరల నియంత్రణ కొనసాగాల్సిన అవసరముందని పేర్కొంది. స్టెంట్లపై తయారీదారులు జీఎస్టీ విధించవచ్చని, అయితే ఎమ్మార్పీ ధరకు అదనంగా ఏ ఇతర చార్జీలు ఉండవంది.



అసెంబ్లీలో జయ ఫొటో వద్ద నివాళులర్పిస్తున్న స్పీకర్, సీఎం, డిప్యూటీ సీఎం

తమిళ అసెంబ్లీలో జయ చిత్రపటం

సాక్షిప్రతినిధి, చెన్నై: తమిళనాడు అసెంబ్లీలో దివంగత సీఎం జయలలిత నిలువెత్తు చిత్రపటాన్ని అసెంబ్లీ స్పీకర్ ధనపాల్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్రాభివృద్ధి కోసం జయ చేసిన కృషిని స్పీకర్ కొనియాడారు. సీఎం పళనిస్వామి, డిప్యూటీ సీఎం పన్నీర్‌సెల్వం, డిప్యూటీ స్పీకర్ పొల్లాచ్చి జయరామన్, అన్నాడీఎంకే ఎంపీలు, ఎమ్మెల్యేలు తదితరులు ఈ కార్యక్రమానికి జయకు నివాళులర్పించారు. అసెంబ్లీ హాలులో ఇప్పటికే పెరియార్, అన్నాదురై సహా పదిమంది అగ్రనేతల చిత్రపటాలను గత ప్రభుత్వాలు ఏర్పాటుచేశాయి. కాగా, చిత్రపట ఆవిష్కరణ కార్యక్రమాన్ని డీఎంకే, కాంగ్రెస్ బహిష్కరించాయి. అన్నాడీఎంకే తిరుగుబాటు నేత, ఎమ్మెల్యే టీటీవీ దినకరన్ ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. ఆస్తుల కేసులో జయ దోషిగా తేలినందున ఆమె చిత్రపటాన్ని అసెంబ్లీ నుంచి తొలగించాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో డీఎంకే పిటిషన్ వేసింది.

ఆర్మీని అవమానించారు

భాగవత్ క్షమాపణ చెప్పాలి: రాహుల్ • వక్రీకరించారు: ఆరెస్సెస్

న్యూఢిల్లీ: ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ ఆర్మీపై చేసిన వ్యాఖ్యలు అవమానకరమనీ, వెంటనే ఆయన క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సోమవారం డిమాండ్ చేశారు. భాగవత్ ఆదివారం బిహార్‌లో ఆరెస్సెస్ స్వయంసేవకులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ‘సైనిక సిబ్బందిని సన్నద్ధం చేయడానికి ఆర్మీకి ఆరేడు నెలలు పట్టచ్చేమో కానీ ఆరెస్సెస్‌కు మూడు రోజులు చాలు’ అని అన్నట్లు వార్తలు వచ్చాయి. ప్రస్తుతం కర్ణాటకలో పర్యటిస్తున్న రాహుల్ మాట్లాడుతూ ‘భాగవత్ అలా అనడం తప్పు. ఆర్మీని ఆయన అవమానించారు. ఆ మాటలు నాకు బాధ కలిగించాయి. మన సైనికులు సరిహద్దుల్లో నిల్చొని రక్తం చిందిస్తున్నారు. భాగవత్ తన తప్పును ఒప్పుకుని క్షమాపణ చెప్పాలి’ అని అన్నారు. ఆర్మీ సామర్థ్యాన్ని భాగవత్ తక్కువ చేసి మాట్లాడారనీ, ఇలాంటి వ్యాఖ్యలు సైన్యం నైతిక స్థైర్యాన్ని దెబ్బతీస్తాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆనంద్ శర్మ అన్నారు.

అవమానించలేదు: ఆరెస్సెస్

భాగవత్ వ్యాఖ్యలను వక్రీకరించారనీ, ఆయన ఆర్మీని అవమానించలేదంటూ ఆరెస్సెస్ ఓ ప్రకటన విడుదల చేసింది. సంఘ్ స్వయం సేవకులతో సైనికులను భాగవత్ పోల్చలేదని ఆరెస్సెస్ అఖిల భారతీయ ప్రచార్ ప్రముఖ్ మన్మోహన్ వైద్య ఆ ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ఈ అంశాన్ని కావాలని రాజకీయం చేస్తోందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు.



కలమలలో రోడ్డుపక్కన బజ్జీలు తింటున్న రాహుల్

అధికారంలోకి వస్తే రుణమాఫీ

సాక్షి, బళ్లారి/రాయచూరు రూరల్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గెలిచి కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా పంట రుణాలు మాఫీ చేయడంతో పాటు స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తామని రాహుల్ గాంధీ హామీనిచ్చారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంతోపాటు ఎరువులు, పురుగు మందులపై రాయితీ ఇస్తామన్నారు. కర్ణాటకలో జనాశీర్వాద యాత్రలో భాగంగా సోమవారం రాయచూరు, యాదగిరి, గుల్బర్గాల్లో రాహుల్ పర్యటించారు.

‘ఎర్ర’కోటలో కాషాయ కాంతులు!

త్రిపురలో ఆసక్తి రేపుతున్న రాజకీయం

- ప్రచారంలో కాంగ్రెస్‌ను వెనక్కునెట్టి దూసుకెళ్తున్న బీజేపీ

అగర్తలా: ఈశాన్య రాష్ట్రాల్లో ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తున్న బీజేపీ.. ఈసారి త్రిపురలో అధికారం కోసం తీవ్రంగా శ్రమిస్తోంది. ఈ రాష్ట్రం కోసం ‘కాంగ్రెస్ ముక్త భారత్’ విధానాన్ని మార్చుకుని.. ‘కమ్యూనిస్ట్ ముక్త త్రిపుర’ నినాదంతో దూసుకెళ్తోంది. 1972లో త్రిపుర ఏర్పాటైనప్పటినుంచి తొలిసారిగా ‘లెఫ్ట్–రైట్’ మధ్య పోటీ నెలకొందని ‘పీపుల్స్‌పల్స్’ సంస్థ జరిపిన సర్వేలో వెల్లడైంది.

ప్రతి ఊరూ వామ‘పక్ష’మే


దేశవ్యాప్తంగా కమ్యూనిస్టుల ప్రాభవం తగ్గుతున్నా వారికి కంచుకోటలా ఉన్న రాష్ట్రాల్లో త్రిపుర చాలా కీలకమైనది. చిన్న రాష్ట్రమైనా 4 దశాబ్దాలుగా (1988–92 దఫా మినహా) అధికారంలో ఉండటంతో ఇంటింటికీ వేళ్లూనుకుపోయిన పరిస్థితి. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో వామపక్ష ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలదే పైచేయి. ‘ఎర్ర’ కోటలో కమ్యూనిస్టులను ఎదుర్కొనేందుకు ఇన్నాళ్లుగా కాంగ్రెస్ చాలా ప్రయత్నించింది. త్రిపురలో రెండే వర్గాలుంటాయి. ఒకటి సీపీఎం అనుకూల వర్గం (దాదాపు 60%), రెండోది వ్యతిరేక వర్గం (మిగిలిన 40%).

సీపీఎంను దెబ్బతీస్తూ..

త్రిపురలో బెంగాలీల జనాభా ఎక్కువ. దీనికి తోడు కొంతకాలంగా త్రిపురలో గిరిజన తెగల మధ్య (సీపీఎం అనుకూల, వ్యతిరేక వర్గాల మధ్య) ఘర్షణాత్మక వాతావరణం నెలకొంది. ఇన్నిసార్లు మద్దతిస్తున్నా కాంగ్రెస్‌కు అధికారం దక్కకపోవటంతో సీపీఎం వ్యతిరేక వర్గం ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూసింది. ఈ నేపథ్యంలో అధికార వ్యతిరేక వర్గాన్ని తనకు అనుకూలంగా మార్చుకునేందుకు మూడేళ్ల క్రితమే ప్రయత్నాలు మొదలెట్టింది. 25 ఏళ్లుగా అధికారంలో ఉన్న సీపీఎంపై ప్రభుత్వ వ్యతిరేకతను, రాష్ట్రం వెనుకబాటుతనాన్ని ప్రచారాస్త్రాలుగా మలచుకుంది. కమ్యూనిస్టులకు బలమైన అండగా నిలుస్తున్న కార్మిక, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలకు గాలం వేసేందుకు.. ‘అధికారంలోకి వస్తే ఏడో వేతనసవరణ అమలుచేస్తాం’ అని హామీ ఇచ్చింది. దీని ప్రభావం రాష్ట్రంలోని లక్షన్నర మంది ఉద్యోగులపై, వారి కుటుంబాలపై సానుకూల ప్రభావం చూపవచ్చని పీపుల్స్ పల్స్ వెల్లడించింది. అటు, బెంగాలీలు, గిరిజనులను, ప్రభుత్వ అనుకూల వర్గాలను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఎన్నడూ లేనంతగా త్రిపురలో ప్రముఖులతో ప్రచారం నిర్వహిస్తూనే.. ఇంటింటికి చేరువవుతోంది. అయితే విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్నప్పటికీ బలమైన కమ్యూనిస్టు కోటను ఈ ఒక్క ప్రయత్నంలోనే దెబ్బకొట్టలేరని పీపుల్స్ పల్స్ తెలిపింది. ఈసారికి ప్రధాన ప్రతిపక్షం హోదా దక్కవచ్చని అభిప్రాయపడింది.



అధికారం మాదే



ఈ ఎన్నికల్లో త్రిపురలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తామని బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా చెప్పారు. 20వ బీజేపీ పాలిత రాష్ట్రంగా త్రిపుర మారనుందని ఆయన అగర్తలాలో సోమవారం పేర్కొన్నారు. పార్టీ మేనిఫెస్టోను పూర్తిగా అమలు చేసి రాష్ట్రాభివృద్ధికి పాటుపడతామని ఓటర్లకు భరోసానిచ్చారు. మణిపూర్, అస్సాంలలోనూ గతంలో ఒక్కసీటు కూడా లేని పరిస్థితినుంచి ఏకంగా అధికారాన్ని అందుకున్న విషయాన్ని మరిచిపోవద్దన్నారు.


పెద్దకొండూరులో తనను చూసేందుకు వచ్చిన అవ్వతో ఆప్యాయంగా మాట్లాడుతున్న జగన్


తనను కలిసేందుకు వచ్చిన పెద్దాయన పాదరక్ష ఊడిపోవడంతో సరిచేయబోతున్న జననేత


సిద్దనకొండూరు వద్ద జగన్‌కు సమస్య చెబుతున్న పొగాకు కూలీలు


అయ్యప్పరెడ్డిపాలెం, పరికోటలో అవ్వల సమస్యలను ఓపికగా వింటున్న ప్రతిపక్ష నేత


సిద్దనకొండూరు హరిజనవాడలో ప్రతిపక్ష నేత వెంట నడుస్తున్న జనం (ఇన్‌సెట్‌లో) జగన్‌కు సలహా ఇస్తున్న రైతు

మోసం చేయడానికి
మళ్లీ మీ ముందుకొస్తారు..

- పెద్ద పెద్ద హామీలు గుప్పిస్తారు.. నమ్మి మోసపోవద్దు
- నాలుగేళ్లలో చంద్రబాబు ఒక్క హామీ నెరవేర్చలేదు..
- పాదయాత్రలో తనను కలిసిన ప్రజలతో ప్రతిపక్ష నేత జగన్
- మనందరి ప్రభుత్వం రాగానే అందరినీ ఆదుకుంటాం
- చిట్టి పిల్లలను బడికి పంపే తల్లికి ఏటా రూ.15 వేలు
- ఉన్నత చదువుల కోసం ఎంత ఖర్చు అయినా భరిస్తాం
- నవరత్నాల గురించి అందరికీ తెలియజెప్పాలని పిలుపు

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: 'రైతులు, డ్వాక్రా అక్కచెల్లెమ్మల రుణాలన్నీ మాఫీ చేస్తానన్నారా..? పేదోళ్లందరికీ మూడు సెంట్ల స్థలంలో ఇల్లు కట్టిస్తానన్నారా? కరెంటు బిల్లులు తగ్గిస్తానన్నారా? చదువుకున్న పిల్లోళ్లకు ఉద్యోగాలిస్తానన్నారా? అలా ఇవ్వలేకపోతే నెలకు రూ.2 వేలు నిరుద్యోగ భృతి ఇస్తానన్నారా? ఇన్ని హామీలిచ్చి ఓట్లు వేయించుకుని అధికారం చేపట్టిన పెద్దమనిషి ఈ నాలుగేళ్లలో ఏం చేశారు? ఒక్క హామీ అయినా నెరవేర్చారా?' అని ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై మండిపడ్డారు. ఆయన మాటలు నమ్మి.. రైతులు, డ్వాక్రా అక్కచెల్లెమ్మలు నిండా మునిగిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదిలో ఎన్నికలొస్తున్నాయి కనుక మళ్లీ మోసం చేయడానికి కొత్త హామీలతో మీ ముందుకు వస్తారని, ఆయనకు తగిన రీతిలో బుద్ధి చెప్పాలన్నారు. బాబు మోసాలపై ప్రజలను జాగృత పరచడానికే తాను పాదయాత్ర చేపట్టానని తెలిపారు. ప్రజాసంకల్ప యాత్ర సోమవారం 85వ రోజు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలోని అనంతాపురం గ్రామంలో ప్రారంభమై 14వ మైలు మీదుగా పెద్దకొండూరు వరకు సాగింది. మార్గం మధ్యలో రెండు చోట్ల జగన్ మహిళలు, రైతులను ఉద్దేశించి మాట్లాడారు.

నవరత్నాలతో అందరినీ ఆదుకుంటాం..

''ఎన్నికల ముందు నుంచి ఇప్పటి వరకు ఎప్పటికప్పుడు మాయ మాటలు చెబుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు మోసం చేశారు. మళ్లీ ఇప్పుడు పెద్ద పెద్ద హామీలిస్తూ మీ ముందుకు వస్తారు. ఆయన మాటలు మళ్లీ నమ్ముతారా? (నమ్మం.. నమ్మం అంటూ జనం నుంచి స్పందన) ఇలాంటి నాయకుడు మనకు అవసరమా? ఆలోచించండి. దేవుడి ఆశీర్వాదం, మీ అందరి దీవెనలతో మనందరి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకునేందుకు చేపట్టబోయే నవరత్నాల పథకాలను ఇప్పటికే ప్రకటించాను. ఈ నవరత్నాల గురించి మీకందరికీ తెలుసు కదా.. ఇంకా తెలియని వారికందరికీ మీరు తెలియజెప్పాలి. చిట్టి పిల్లలను బడికి పంపించే తల్లికి ఏటా రూ.15 వేలు ఇస్తామని చెప్పండి. వారు పెద్ద పెద్ద చదువులు చదువుకుంటేనే మన తలరాతలు మారతాయి. చిన్నపిల్లలను సక్రమంగా బడికి పంపడం ద్వారా వారు ఇంజినీరో లేదంటే డాక్టరో అయ్యారంటే ఆ కుటుంబాలు పేదరికం నుంచి పూర్తిగా బయటపడతాయి. పేద విద్యార్థులు పెద్ద పెద్ద చదువులు చదివేందుకు ఎంత ఖర్చు అయినా భరిస్తాం. అవ్వాతాతల పింఛన్‌ను రూ.2 వేలు చేస్తాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలందరికీ 45 ఏళ్లకే పింఛను ఇస్తాం. మిగిలిన వారికి ఇప్పుడు 65 ఏళ్లకు ఇస్తున్నారు. దానిని 60 ఏళ్లకే తగ్గిస్తాం. దీని వల్ల చాలా మంది కొత్త వాళ్లకు పింఛన్లు వచ్చే అవకాశం ఉంటుంది. డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు ఎన్నికల నాటికి బ్యాంకుల్లో ఎంత అప్పు ఉంటుందో అంత మొత్తాన్ని నాలుగు దఫాలుగా వారి చేతికే ఇస్తాం. చంద్రబాబు ప్రభుత్వం బ్యాంకులకు వడ్డీ డబ్బులు కట్టకపోవడంతో డ్వాక్రా అక్కచెల్లెమ్మలు, రైతులకు సున్నా వడ్డీకి రుణాలు ఇవ్వడం లేదు. మన ప్రభుత్వం రాగానే ఆ వడ్డీ ప్రభుత్వమే బ్యాంకులకు చెల్లిస్తుంది. దీంతో బ్యాంకులు తిరిగి సున్నా వడ్డీకి రుణాలు ఇస్తాయి. ఈ విషయాలన్నింటినీ ఊళ్లో అందరికీ చెప్పండి. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి అందరికీ మేలు జరగాలని దేవుడిని ప్రార్థించండి'' అని జగన్ కోరారు.


అయ్యప్పరెడ్డిపాలెం వద్ద అక్కలు ఇచ్చిన చిలగడదుంప (గెనుసుగడ్డ) తింటూ.. కొబ్బరి నీళ్లు తాగుతూ..

జగన్‌తో గోడు వెళ్లబోసుకున్న వలస కూలీలు

గుంటూరు జిల్లా నరసరావు పేట ప్రాంతం నుంచి నెల్లూరు జిల్లాకు వలస వచ్చిన కూలీలు సోమవారం పాదయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. నాగార్జున సాగర్ కాల్వలకు సకాలంలో నీళ్లు విడుదల చేయకపోవడం వల్ల తమ ప్రాంతంలో పనులు లేకుండా పోయాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా తమ గ్రామంలో పనులు కల్పించకపోవడం వల్లే తాము సొంత ఊరు వదిలి వలస రావాల్సి వచ్చిందని వాపోయారు. పొగాకు బ్యారన్‌లలో పని చేసుకుంటున్నామని, ఉదయం నుంచి రాత్రి వరకు పనిచేస్తే రూ.200 గిట్టుబాటు అవుతుందని వివరించారు.

ప్రజాసంకల్ప యాత్ర 85వ రోజు

ఇప్పటి వరకూ నడిచిన దూరం **1,155** కిలో మీటర్లు

85వ రోజు నడిచిన దూరం **14.1** కిలో మీటర్లు

ప్రారంభం: ఉ. 8.00 గంటలకు కలిగిరి మండలం అనంతాపురం

ముగింపు: సా. 5 గంటలకు కలిగిరి మండలం పెద్దకొండూరు శివారు

ముఖ్యాంశాలు: కలిగిరి మండలం అనంతాపురం, సిద్దనకొండూరు, సిద్దనకొండూరు హరిజనవాడ, పరికోట, 14వ మైలు, అయ్యప్పరెడ్డిపాలెం, పెద్దకొండూరు గ్రామాల్లో ప్రజలతో మమేకం

నేటి పాదయాత్ర షెడ్యూల్

ప్రారంభం: ఉ. 8 గంటలకు కలిగిరి మండలం పెద్దకొండూరు శివారు

ముఖ్యాంశాలు
- పెద్ద కొండూరు శివారు, పెద్దపాడు, పోలంపాడు గ్రామాల్లో ప్రజలతో మమేకం
- వీరారెడ్డి పాలెంలో పార్టీ జెండా ఆవిష్కరణ
- కలిగిరిలో బహిరంగ సభ


జగన్‌తో కలసి నడుస్తున్న ఎంపీ విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ప్రతాప్‌కుమార్‌రెడ్డి, పార్టీ నేత ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి



పరికోట వద్ద జగన్‌తో కలసి అడుగులేస్తున్న దివ్యాంగుడు శ్రీనివాసులు


పెద్దకొండూరులో జగన్‌తో కరచాలనం చేసేందుకు బస్సులోంచి పోటీపడుతున్న విద్యార్థులు, పరికోట వద్ద జగన్‌తో కలసి నడుస్తున్న చిన్నారులు


14వ మైలు వద్ద జగన్‌కు సమస్యలు వివరిస్తున్న అవ్వలు

85వ రోజు

12-02-2018, సోమవారం
పెద్దకొండూరు శివారు,
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా



ఎవరినైనా మోసం చేయగల నైపుణ్యం బాబుగారికే సాధ్యమేమో!

ఈ రోజు కోదండాపురం వద్ద వేములపాడుకు చెందిన అనేక పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలు తమ ఆవేదనను, ఆక్రోశాన్ని వెలిబుచ్చారు. చంద్రబాబు తమకు చేసిన మోసాన్ని ఆ సంఘాలకు చెందిన లీడర్లు, సభ్యులు ఎండగట్టారు. బాబుగారి రుణమాఫీ మోసంతో తామంతా డిఫాల్టర్లుగా మారిన వైనాన్ని వివరించారు. మాఫీ అవుతుంది కదా అని బ్యాంకులకు కిస్తీలు కట్టకపోవడం వల్ల వడ్డీల మీద వడ్డీలు, అపరాధ వడ్డీలు పెరిగి.. ఇప్పుడా అప్పు కట్టుకోలేనంతగా పెరిగిపోయిందన్నారు. ఆ అప్పు కట్టకపోతే ఇళ్లకు తాళాలు వేస్తామంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రయివేటు బ్యాంకులు, వడ్డీ వ్యాపారులు అప్పుల వసూళ్లకు రికవరీ ఏజెంట్లను పెట్టుకున్నట్లు.. ఈ ప్రభుత్వం పొదుపు సంఘాల మహిళలపైకి గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ(సెర్ప్) ఉద్యోగులను ఉసిగొల్పుతోందట. ఆ ఉద్యోగులకు ఇచ్చిన టార్గెట్ల ప్రకారం వసూళ్లు చేయకపోతే.. వారి ఉద్యోగాలు గల్లంతయ్యే పరిస్థితట. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కినందుకు సిగ్గుపడాల్సిందిపోయి, బాధితులను బెదిరిస్తుంటే.. ఈ పాలన తీరును ఏమనాలో అర్థం కావడం లేదు.

'సేవ్ ఆయుష్' అంటూ నినాదాలిచ్చి.. బాబు చేసిన నమ్మక ద్రోహాన్ని నిరసిస్తూ.. తమను కాపాడాలని నా వద్దకొచ్చారు ఆయుష్ విభాగంలో పనిచేసే పారామెడికల్ సిబ్బంది. వారి రాష్ట్ర సంఘం నేతలు వారికి జరిగిన మోసాన్ని వివరించారు. 'సార్.. 2012లో మా జీతాలు పెంచాలని, మమ్మల్ని రెగ్యులరైజ్ చేయాలని అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి గారికి చంద్రబాబుగారు లేఖ రాశారు. మా కోర్కెలు న్యాయమైనవని, వాటిని వెంటనే తీర్చాలని డిమాండ్ చేశారు. మా పోరాటానికి పూర్తి మద్దతిస్తున్నానని ప్రకటించారు. ఆయన అధికారంలోకి వచ్చాక మా కోర్కెలు తీరుస్తారని ఆశించాం. కానీ మా ఉద్యోగాలకే ఎసరు పెడతారని ఊహించలేదు. అంతకు మునుపే నయం.. జీతం తక్కువయినా, కనీసం ఉద్యోగం ఉండేది. ఈయనగారు వచ్చాక మా సేవలు అవసరం లేదంటూ, మమ్మల్ని ఉద్యోగంలోంచి తొలగించి, మా బతుకులను బజారుపాల్జేశాడు. 'పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టయింది మా పరిస్థితి' అంటూ ఆవేదన చెందారు. ఎవ్వరినైనా వంచించి, మోసం చేయగల నైపుణ్యం బాబుగారికే సాధ్యమేమో.

'చెడిపోయిన వ్యవస్థపై సమరభేరీ మోగించిన మీతో కలిసి అడుగేయాలని ఉందన్నా' అన్న సాయిదీప్తి భావోద్వేగం నాలోనూ ఆవేశాన్ని పెంచింది. ఇంటర్ పూర్తయి బీటెక్‌లోకి అడుగుపెట్టిన ఆ చిన్నారి.. ఓటు హక్కు నమోదు కోసం వెళుతోందట. చేతిలో ఓటరు నమోదు ఫారం, మాటల్లో చైతన్యం, మార్పు కోసం పడుతున్న తపన ఆ చిట్టి చెల్లెమ్మలో కనిపించాయి. ఆమె నోటి వెంట వచ్చిన మాటలు కట్టిపడేశాయి. 'నాకూ ఓటు వస్తుందన్నా.. నా మొట్టమొదటి ఓటు మీకే వేస్తాను' అంటూ గర్వంగా చెప్పింది. 'నా చేతికొచ్చే ఓటు అనే ఆయుధాన్ని మీ అమ్మల పాదికి చేరుస్తా' అంటూ తన ఆకాంక్షను వెలిబుచ్చింది. 'మీరొస్తే మార్పు వస్తుందన్నా.. పేదల బతుకుల్లో వెలుగులు వస్తాయన్నా.. యువత నైరాశ్యం వీడుతుందన్నా..' అంటూ నాపై పెంచుకున్న నమ్మకాన్ని ఆ చిన్నారి వ్యక్తంచేసింది. ఆ చిట్టి తల్లి మనసు తెలిశాక.. వెల్లువెత్తే యువ చైతన్యానికి సారథ్యం వహించాలన్న ఆకాంక్ష మరింత పెరిగింది. వాళ్ల నమ్మకాన్ని నిజం చేయాలన్న నా సంకల్పం రెట్టింపు అయింది.

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలంటూ గతంలో అప్పటి ముఖ్యమంత్రికి మీరు లేఖ రాయడం వాస్తవం కాదా? సదరు ఉద్యోగుల ఆందోళనలో పాల్గొని, వారికి మద్దతునీయడం నిజం కాదా? మీ మేనిఫెస్టోలో వారి గురించి హామీలిచ్చి.. అధికారంలోకి వచ్చాక వాటిని నెరవేర్చకపోగా.. ఉన్న ఉద్యోగాలను సైతం పీకేయడం న్యాయమేనా? ఇది నమ్మక ద్రోహం కాదా?

వైఎస్. జగన్.

ప్రజా సంకల్ప యాత్ర మరిన్ని చిత్రాలు టాబ్లాయిడ్‌లో

లోకల్ టేస్టుకు భలే గిరాకీ

- ఐఆర్‌సీటీసీ 'ఈ-కేటరింగ్'లో స్థానిక రుచులకు డిమాండ్
- రోజు 1.5 లక్షల మంది ప్రయాణికులకు 'ప్రాంతీయ' వంటకాలు
- 2 గంటల ముందు ఆర్డరిస్తే చాలు.. నోరూరించే రుచులు రెడీ



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నుంచి భువనేశ్వర్ వెళ్తున్నారు.. మధ్యలో విజయవాడలో రైలు ఆగింది.. అక్కడి కొర్రమీను పులుసు తినాలని నోరూరింది.. రైలు దిగి హోటల్ వెళ్లి తినడం కుదరదు.. మరెలా.. ఐఆర్‌సీటీసీ యాప్ ఓపెన్ చేయండి.. అందులోని ఈ-కేటరింగ్ ద్వారా మీకు నచ్చిన ప్రాంతీయ ఆహారాన్ని ఆర్డర్ చేయండి.. ఏ ఊరి వెరైటీ ఆ ఊళ్లోనే ఆరగించేయండి.. ప్రయాణికులకు ప్రాంతీయ వంటకాల రుచి చూపించేందుకు భారతీయ రైల్వే ప్రారంభించిన ఈ 'ఈ-కేటరింగ్' విధానానికి మంచి స్పందన లభిస్తోంది. రైల్వే నూతన కేటరింగ్ పాలసీలో భాగంగా ప్రవేశపెట్టిన 'స్థానిక రుచుల' సదుపాయానికి డిమాండ్ పెరుగుతోంది. ప్రతిరోజు 1.5 లక్షల మంది ప్రయాణికులకు రకరకాల ఆహార పదార్థాలను రుచి చూస్తున్నారు.

2 గంటల ముందు ఆర్డరిస్తే చాలు: ఉత్తరాది నుంచి దక్షిణాదికి, దక్షిణాది నుంచి ఉత్తరాదికి వెళ్లేవారు ఆయా ప్రాంతాల్లో లభించే వంటకాలను రుచి చూడాలనుకుంటారు. అలాంటి వారి కోసం రైల్వే 'ఈ-కేటరింగ్' విధానాన్ని ప్రవేశపెట్టింది. గూగుల్ ప్లేస్టోర్ నుంచి 'ఐఆర్‌సీటీసీ' మొబైల్ అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకొని అందులోని 'ఈ-కేటరింగ్' ద్వారా నచ్చిన వంటకాలు ఎంపిక చేసుకోవచ్చు. టికెట్ పీఎన్నార్ నంబర్ జత చేసి, సమీపంలోని ఏ రైల్వేస్టేషన్‌లో ఆహారం అందజేయాలో తెలియజేస్తే చాలు.. ఘుమఘుమలాడే వెరైటీ రుచులు మీ వద్దకే వచ్చేస్తాయి. అయితే ఎంపిక చేసుకునే రైల్వేస్టేషన్‌కు చేరుకోడానికి 2 గంటల ముందు ఆర్డర్ ఇవ్వాలి.

హైదరాబాద్ బిర్యానీ, నాటుకోడి కూర..: దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ప్రస్తుతం హైదరాబాద్ బిర్యానీ, నాటుకోడి కూర, రాయలసీమలో లభించే రాగి సంకటి, తలకాయ మాంసం, ఆంధ్రలో పీతలు, రొయ్యలు, కొర్రమీను చేపల వెరైటీ వంటకాలు మెనూలో ఉంచారు. స్థానిక స్వీట్లనూ ఈ కేటరింగ్ ద్వారా ఆర్డర్ ఇవ్వచ్చు. ఉదాహరణకు కాకినాడ కాజా, తాపేశ్వరం లడ్డు వంటి స్వీట్లు.. కేఎఫ్‌సీ, డోమినోస్ పిజ్జాలు, బర్గర్‌లు కూడా రెడీగా ఉన్నాయి. 'ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా మెనూ విస్తరిస్తున్నాం. ప్రస్తుతం రోజూ 2 వేల వరకు ఆర్డర్లు వస్తున్నాయి. రోజురోజుకూ డిమాండ్ పెరుగుతోంది' అని ఐఆర్‌సీటీసీ డిప్యూటీ జనరల్ మేనేజర్ సంజీవయ్య చెప్పారు.

త్వరలో బేస్ కిచెన్‌లు..: ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వే పరిధిలో దురంతో, తెలంగాణ ఎక్స్‌ప్రెస్, ఏపీ సంపర్క్ క్రాంతి, అజంతా, ఫలక్‌నుమా, దక్షిణ్ ఎక్స్‌ప్రెస్, సచ్‌ఖండ్, తపోవన్, దానాపూర్, పూర్ణ వంటి 49 ఎక్స్‌ప్రెస్ రైళ్లలోనే ప్యాంట్రీకార్లు ఉన్నాయి. ఇవిగాక 34 స్టేషన్‌లలో కిచెన్ యూనిట్లు ఉన్నాయి. ప్యాంట్రీ కార్లు, కుకింగ్ యూనిట్‌ల తరహాలోనే బేస్ కిచెన్‌లను ఏర్పాటు చేయనున్నారు. తొలుత సికింద్రాబాద్‌లో ప్రారంభించనున్నారు.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
మంగళవారం, 13-2-2018



“ ఆర్థికస్వేచ్ఛను మించి ఇంకేదీ స్త్రీలపై వివక్షను సమూలంగా నిర్మూలించలేదు.

- గ్లోరియా స్టెయినెమ్, స్త్రీవాది, సామాజిక కార్యకర్త

నేను శక్తి

ప్రతీకాత్మక చిత్రం



పుట్టింటి నుంచి
మెట్టినింటికి వెళ్లిన
అమ్మాయికి
మిగిలింది మట్టే!
జీవితాన్నంతా పిండి
ఆ మట్టిలో పోసినా..
ఆ పంట ఎప్పటికీ మెట్టినింటిదే.
మట్టిని నమ్ముకున్న మహిళకు..
మెట్టినిల్లు ఏమౌతుంది?
మట్టినిల్లే!

పదహారేళ్లు ప్రతిరోజూ పొలం పనిచేసిన రాజేశ్వరికి మిగిలింది హక్కు కాదు. మట్టి.

మట్టినిల్లు

సరిగ్గా గుర్తులేదు కానీ, పెళ్లయ్యేనాటికి పదమూడో పద్నాలుగో రాజేశ్వరికి! ఇంకా చెప్పాలంటే గవర్నమెంటు స్కూల్లో ఎయిత్ క్లాస్ బోర్డు మీదకు ఆమె పేరు ఎక్కినప్పుడు! అప్పుడు తనతో పాటు మరో ముప్ఫయ్ మంది అమ్మాయిలు కూడా అదే ఊర్లో బడిమానేసినట్లు రాజేశ్వరికి గుర్తు. టెన్త్ క్లాస్ కష్టపడి చదివి పాసైతే పక్కనే ఉన్న సిద్ధిపేట కాలేజీలో చేరొచ్చని తనూ తన ఫ్రెండ్సంతా ఎన్ని కలలుగన్నారు?! ఎలాగోలా టెన్త్‌లో మంచి మార్కులు తెచ్చుకుంటే ఇక ఇంట్లో కూడా.. చదువు మాన్పించమని నాన్న అడగరు. ఆ తరువాత నర్స్ ట్రైనింగ్‌కి వెళితే హైదరాబాద్‌లో ఏ ఆసుపత్రిలో నైనా జాబ్ చేయొచ్చు. తనకోసం, తన చెల్లెళ్లిద్దరికోసం ఎండనకా వాననకా అమ్మపడే కష్టం చూడలేకపోతోంది. పుస్తకాలకీ, పెన్నులకీ ఏ అవసరానికైనా అమ్మేగా డబ్బులివ్వాల్సింది. ఆమె కూలికెళ్లి దాచిన డబ్బుతో కష్టపడి చదువుకుంది కనుకనే అమ్మ కష్టం తీర్చాలనుకుంది. అసలు అమ్మ పోరు పడలేకే కదా నాన్న రాజేశ్వరిని బళ్లో చేర్పింది. ఆయనకైతే ఎప్పుడూ తనకు పెళ్లి చేసి పంపించేయాలన్న తొందరే ఉండేది. అయితే తను మాత్రం అంత త్వరగా బడి మానేయాల్సి వస్తుందని కలలో కూడా ఊహించలేదు రాజేశ్వరి. ఆ రోజు ఆ సంఘటన జరగకపోతే ఆమె కచ్చితంగా ఆ గొడ్డుచాకిరీ నుంచి తప్పించుకోగలిగి ఉండేది.

చదువుకు అదే చివరి రోజు!

అప్పటికే గుసగుసగా అంతా చెప్పుకుంటున్నారు. రాజేశ్వరిని హెడ్‌మాస్టర్ పిలిచారని. క్లాస్‌లోకి వెళ్లకుండానే మధ్యలోనే క్లాస్ టీచర్ ఎదురయ్యి చెప్పారు చాలా కోపంగా.. హెడ్‌మాస్టర్ రమ్మంటున్నారని. భయం భయంగానే హెడ్‌మాస్టర్ సుధాకర్ సార్ దగ్గరికి వెళ్లింది రాజేశ్వరి. ఏం జరిగిందో చెప్పకుండా చెడామడా తిట్టారాయన. ‘‘ఎందుకొస్తారు బడికి?

> **బడి మాన్పించారు. పెళ్లి చేసేశారు.**
> **పొలంలోనే భర్త ఉరివేసుకున్నాడు.**
> **ముగ్గురు పిల్లలతో ఏకాకి అయింది.**
> **తన భూమికే తను కూలీగా మిగిలింది.**

ఏ ఇంట్లోనో నాలుగు అంట్లు తోముకోకుండా? ఇలా మగపిల్లల్ని చెడగొట్టడానికా? కనీసం పుస్తకాలు కొనుక్కోడానికి డబ్బులుండవు కానీ ప్రేమాదోమా అంటూ ఊరేగుతున్నారు? ఇంకెప్పుడైనా ఇలా జరిగితే ఊర్కునేది లేదు. నీ ప్రమేయం లేకుండా వాడెవడో అలా ఎందుకు రాస్తాడు? మానేస్తే బడిమానేసెయ్! రేపు మీ నాన్నని తీసుకొని బడికిరా’’ కఠినంగా ఉంది హెడ్మాస్టర్ గొంతు! రాజేశ్వరికేం అర్థం కాలేదు. దుఃఖం పొంగుకొస్తోంటే పరుగుపరుగున క్లాసులోకి అడుగుపెట్టింది. ఇంకా సార్ రాలేదు. తన ప్లేస్‌లో కూర్చోగానే ఫ్రెండ్సంతా చుట్టుముట్టారు. ఏమైందంటూ. అనుకోకుండా బోర్డువైపు చూసాక కానీ అర్థం కాలేదు. ఏం జరిగిందో. చక్కగా చెక్కినట్టు ఉన్నాయి అక్షరాలు ‘ఐలవ్ రాజేశ్వరి’ అని! అదే ఆమె చదువుకు ఆఖరు. రాజేశ్వరిని చదువు మాన్పించి పెళ్లి చేసేసారు మేనమామకిచ్చి. ఆ తరువాత తెలిసింది.. ఆ భయంతో.. అదే స్కూల్లో చదువుతోన్న మరో ముప్ఫయ్ మంది అమ్మాయిలు వరుసగా మానేసారని!

• ❖ •

‘‘ఏ లోకంలో ఉన్నవమ్మా? ఎన్ని రోజులేడుస్తవ్? ఎన్ని రోజులేడిసినా పోయినోడు తిరిగొస్తడా.. సక్కనైన కొడుకునిచ్చిండు. అత్తమామ ఉండనే ఉన్నరు. ఒళ్లు దాసుకోకుండా కష్టం జేసి ఇంటికి సరిపోయే నాలుగు గింజలు పండిస్తున్నవ్. ఆడున్నా గానీ బాయికాడ కష్టమంత నీదే గదనే పోరి. పో.. పో..’’

పక్కింటి శాంతక్క మాటలకు ఉలిక్కిపడి ఈ లోకంలోకొచ్చింది రాజేశ్వరి. వ్యవసాయాన్ని ఇష్టంగా చేసినోడు తన భర్త. తిన్నడా తినలేదా? ఎవరికిదెలుసు? పొద్దున లేస్తే పొలంలనే ఉండెటోడు. పండించిన ధాన్యాన్ని అమ్ముకోలేక, ధర బల్కక ఉన్న పొలంలనే ఉరిబెట్టుకుండు.

భర్త పోయాక చేనే తోడయ్యింది

ఒక్కసారి శాంతక్క అన్న మాటలు గుర్తొచ్చాయి. వెంటనే భర్త, తండ్రి, మామ మాటలు కూడా గుర్తొచ్చాయి రాజేశ్వరికి. ‘‘ఆడున్న గానీ బాయికాడి కష్టమంత నీదేగదనే’’ అన్నది శాంతక్క. అరుగుమీద కూర్చున్న మామకి చురకెయ్యాలని అన్నదో, లేక తన కష్టాన్ని చూసింది కనుకనో మాటైతే అన్నది. ఒక్కసారి తనని తేరిపార చూసుకుంది రాజేశ్వరి. మట్టిముద్దలా ఉంది. బళ్లో తనెలా ఉండేది? సీన్మాయాక్టర్లెందుకు పనికొస్తరే నీదగ్గర అనేటోళ్లు ఫ్రెండ్సంతా. 30 ఏళ్లు కూడా నిండలేదు.. ముగ్గురు బిడ్డలతో భర్తను పోగొట్టుకొని ఏకాకిగా మిగిలింది. చేలో చేసిన చాకిరికి చిక్కి శల్యమైంది. ఈ మట్టిలోనే కదా తన పద్నాలుగో ఏటినుంచి పనిచేసింది. భర్తన్నా ఏదో ఒక రోజు ఇంట్లో ఉండేవాడు. పొలంలోకి అడుగుపెట్టకుండా ఏ రోజూ గడవలేదు. మట్టివాసన చూడని రోజు తనకి ముద్ద దిగదు గదా! భార్యాభర్తలిద్దరూ ఎప్పుడూ అనుకునేవారు.. ఛస్తే ఈ మట్టిలోనే చావాలి. అంతేగానీ వ్యవసాయం మాత్రం మానొద్దని. కానీ అలాంటిది రాత్రి ఎంత మాటన్నాడు మామ. తాను, తన భర్త ఎంతో ప్రేమించిన ఈ భూమి తన భర్త తరువాత తనకి రాదట. ఆడదాని పేరుమీదెట్ల బెడతరు పొలం అన్నడు. ఆడదాని కష్టమైతే తింటరుగానీ పొలం మాత్రం ఉండదట.

అప్పుడు చదువు.. ఇప్పుడు భూమి

ఆలోచిస్తోంటే అర్థమౌతోంది రాజేశ్వరికి. అమ్మ పేరు మీద భూమి లేదు. అత్త పేరునా లేదు. ఇప్పుడు తన పేరున కూడా ఉండదు. పొద్దున లేస్తే పొలంలో కాయకష్టం జేసే తనకి భూమిని రాసివ్వనని కరాఖండీగా చెప్పిన మామ తన మూడేళ్ల కొడుక్కిస్తానన్నాడు. అదికూడా వాడికి పద్దెనిమిదేళ్లొచ్చాక! అంటే ఇంతకాలం ఒక పశువులా పొలంలో పనిచేసిన తన కష్టం ఏమయ్యింది? ఇప్పుడు తనకి కాకుండా ఎప్పుడో పదిహేనేళ్ల తరువాత తనకొడుక్కి పొలం రాయడం ఏమిటి? ఆడవాళ్లకు భూములుండొద్దా? రేపు తన కొడుకు తనకి అన్నం పెట్టకపోతే... ఆ భూమి అమ్ముకుని తాగేస్తే... అప్పుడు చదువు, ఇప్పుడు భూమి ఏదీ తనకు సంబంధం లేకుండానే తనకు దూరమవుతాయి. అవి తనకెంత ప్రియమైనవైనా! ఆలోచిస్తూనే నడుస్తోంది. రాజేశ్వరికి తనకు తెలియకుండానే పొలంవైపు అడుగులు పడుతున్నాయి.

- అత్తలూరి అరుణ

మళ్లీ స్త్రీల చేతికి రావాలి

“ ఎక్కడైనా చూడండి స్త్రీల పేరున భూమి ఉండదు. ఉండనివ్వదు ఈ పురుషాధిపత్య సమాజం. ఎవరికైనా ఉంటే అది హింసకి కారణమౌతుంది. మరీ ముఖ్యంగా ఒంటరి స్త్రీల పేరున భూమి ఉన్నచోట స్త్రీలపై దాడులు ఎక్కువగా జరుగుతుంటాయి. అయితే దానికి ఆస్తి అనే కారణం పైకి కనిపించదు. చేతబడులు చేస్తోందనో, లేకపోతే ఆమెకు మంత్రాలూ, తంత్రాలూ వచ్చనో, అదీ కాకపోతే ఇంకేదో కారణం చూపుతారు తప్ప



ఆస్తి కారణంగా దాడి జరిగిన గుర్తులు బయటకు పొక్కనివ్వరు. అందుకే సంపదపై పురుషుడి పెత్తనం మాత్రమే ఉండాలి అనే ఆధిపత్య భావజాలాన్ని అంతమొందించాలి. ఉత్పత్తి సాధనాలపై పురుషులు ఆధిపత్యం సంపాదించిన నాటినుంచే స్త్రీలు ద్వితీయ శ్రేణి పౌరులుగా తయారయ్యారు. అవి మళ్లీ తిరిగి స్త్రీల చేతికి వస్తేనే స్త్రీలపై జరిగే అన్ని రకాల హింసల నుంచీ వారికి విముక్తి లభిస్తుంది. ఆ మార్పు రావాలి. అది ప్రభుత్వాల నుంచే మొదలు కావాలి.

- **ఉషా సీతాలక్ష్మి,** సామాజిక కార్యకర్త, రచయిత

షార్ట్ ఫిల్మ్‌లకు ‘సాక్షి’ ఆహ్వానం



చూస్తున్నారుగా.. ‘నేను శక్తి’ పేరిట సాక్షి ప్రచురిస్తున్న కథనాలు. దానిలో మీరూ భాగస్వాములు కండి.

- లింగవివక్ష
- గృహహింస
- వేధింపులు
- సాధికారత

అంశాలపై 10 నిమిషాల నిడివిగల షార్ట్ ఫిల్మ్‌లను తీసి మాకు పంపండి. వచ్చిన వాటిలోంచి ప్రముఖ సినీదర్శకులు నాలుగింటిని ఎంపిక చేస్తారు. వాటిని మార్చి 7వ తేదీన ముగింపు ఉత్సవంలో ప్రదర్శిస్తాం. విజేతలకు తగిన ప్రోత్సాహకం ఉంటుంది.

మీరు షార్ట్ ఫిల్మ్‌లను పంపాల్సిన మెయిల్ ఐడీ:
Mail ID : shakthi@sakshi.com

సూపర్ షీ

మహిళలకు మాత్రమే!



ఫిన్లాండ్ తీరంలోని మహిళా దీవి

ఫిన్లాండ్ తీరానికి ఆవల ఉన్న ఈ దీవి మహిళలకు మాత్రమే! ఇందులో అడుగుపెట్టడానికి పురుషులకు అనుమతి లేదు. క్రిస్టినా రోత్ అనే అమెరికన్ మహిళా వ్యాపారవేత్త ఆలోచన ఫలితంగా ఈ దీవి మహిళలకు విడిది కేంద్రంగా రూపుదిద్దుకుంది. వెకేషన్ కాలాన్ని ప్రశాంతంగా గడపడానికి క్రిస్టినా ఒకసారి రాంచ్ మాలిబు సమీపంలోని ఒక ఆశ్రమానికి వెళ్లారు. అక్కడ పురుషుల ఉనికి కారణంగా మహిళల ఏకాగ్రతకు, ప్రశాంతతకు భంగం కలిగే పరిస్థితులను గమనించారు. పురుషుల వల్ల మహిళలు ఇబ్బంది పడకుండా, కేవలం మహిళల కోసమే ఒక విడిది కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుందనుకున్నారు. ఫిన్లాండ్ తీరానికి ఆవల ఎనిమిదిన్నర ఎకరాల దీవి అమ్మకానికి సిద్ధంగా ఉండటంతో, దీనిని తానే కొనేసి, అన్ని సౌకర్యాలతో మహిళల విడిది కేంద్రంగా అభివృద్ధి చేశారు. ఇప్పుడు ఈ దీవిలో సేదదీరడానికి దేశ దేశాల నుంచి మహిళలు వస్తున్నారు.



● క్రిస్టినా రౌత్

చెట్టు నీడ

ఎటువైపైనా ఒక వైపే

ఒక యువకుడు గుర్రం మీద బయల్దేరాడు. అతడు కొత్తగా బౌద్ధధర్మాన్ని స్వీకరించాడు. గుర్రం మీద ప్రయాణిస్తూ ప్రయాణిస్తూ ఒక చోటికి చేరుకున్నాడు. అక్కడ ఒక చిన్న యేరు అడ్డం వచ్చింది. అది ఉధృతంగా పారుతోంది. గుర్రంతో సహా దిగలేనంత లోతుగా ఉందని వెంటనే అంచనాకు రాగలిగాడు. కానీ ఎలా దాటడం? అవతలి వైపునకు ఎలా చేరడం? ఎంత ఆలోచించినా ఉపాయం తోచలేదు. గుర్రం దిగి చాలాసేపు అలాగే నిరీక్షించాడు. గుర్రం పచ్చిక మేస్తూవుంది. సాయంత్రం కావస్తోంది.

> **‘గురువర్యా, నేను అవతలి వైపు ఎలా రావాలి?’గురువు ఏమాత్రం తడుముకోకుండా అంతే బిగ్గరగా సమాధానమిచ్చాడు. ‘నాయనా, నువ్వున్నది కూడా అవతలి వైపే’.**

యువకుడి సహనం నశిస్తూవుంది. అప్పుడు యేరుకు అటువైపు ఒక గురువు నడుస్తూ కనిపించాడు.

యువకుడు ఉత్సాహంగా లేచి, గొంతెత్తి కేకేశాడు. ‘గురువర్యా, నేను అవతలి వైపు ఎలా రావాలి?’

గురువు ఏమాత్రం తడుముకోకుండా అంతే బిగ్గరగా సమాధానమిచ్చాడు. ‘నాయనా, నువ్వున్నది కూడా అవతలి వైపే’.

ఇది హాస్యం కాదు. ఒక అవరోధం రాగానే ప్రయత్నాన్ని విరమించుకొమ్మని చెప్పడం కాదు. అసలు ఏ వైపైనా ఎందుకు దాటాలి? ఏ ప్రపంచం ఇవ్వగలిగే అనుభవం ఆ ప్రపంచానికే ఉండగా మరెక్కడికో చేరాలన్న ఉబలాటం దేనికి? గురువు చెప్పింది అర్థమైన యువకుడు సానుకూలంగా గురువుకు నమస్కరించి, తిరుగు ప్రయాణం కోసం మళ్లీ తన అశ్వం వైపు బయల్దేరాడు.

వైరల్

బీకాం ఫస్టియర్ సెలబ్రిటీ



ప్రియావారియర్ : మలయాళీ చిత్రం ‘ఒరు అదార్ లవ్’ లోని లవ్ సీన్.. ఫ్రేమ్ బై ఫ్రేమ్.

మీరు ఈ అమ్మాయిని గత ఇరవై నాలుగ్గంటల్లో ఎక్కడో చూసే ఉంటారు. లేదా రాగల ఇరవై నాలుగ్గంటల్లో కచ్చితంగా మీరు ఈ అమ్మాయి కంట్లో పడతారు. అప్పుడు తను మీకు కొంటెగా కన్నుగీటుతుంది. ఆ గీటడం మీకొక వాలెంటైన్ గిఫ్టులా అనిపించినా ఆశ్చర్యంలేదు. ఆమె నవ్వు కూడా మిమ్మల్ని సమ్మోహనపరుస్తుంది. ‘మరుపా.. మైమరుపా..’ అనే మణిరత్నం సినిమాలోని పాట మీ పెదవులపై మీకు తెలియకుండానే ‘హమ్’ అవుతుంది. ఇంతకీ ఎక్కడ కనిపిస్తుంది తను? విశ్వమంతా. అవును సోషల్ మీడియా అకౌంట్‌లలోకి ఒకర్నుంచి ఒకరికి ఈ ‘కన్నుకొడుతున్న అమ్మాయి’ ఇప్పుడు దర్శనభాగ్యం కలిగిస్తోంది. త్వరలో రాబోతోన్న మలయాళీ చిత్రం ‘ఒరు అదార్ లవ్’ లోని ‘మాణిక్య మలరయ పూవీ’ పాటలో కనిపించే టీనేజ్ నటి ప్రియా వారియరే ఈ అమ్మాయి. స్కూల్ రొమాన్స్ సీన్‌లోని ఆ పాటలో ఆమె కన్ను కొడుతుంది. ఆ ముక్కను కట్ చేసి ఎవరో ‘సోషల్ తెర’కు ఎక్కించారు! ప్రియ కేరళ అమ్మాయి. త్రిస్సూర్‌లోని విమల కాలేజీలో బీకాం ఫస్ట్ ఇయర్ చదువుతోంది. ఈ చిన్న క్లిప్పుతో సెలబ్రిటీ అయిపోయింది.




● షాలినీ పాండే

షాలినీ రాగం

షాలినీ రాగమా! ఇదెక్కడి రాగం? అసలు ఇలాంటి రాగం ఒకటి ఉందా అని అవాక్కవుతున్నారా? ఇది రాగం పేరు కాదండీ షాలినీ పాండే తీస్తున్న రాగం. ‘బేబీ.. బేబీ... ’ అంటూ ‘అర్జున్ రెడ్డి’లో బుజ్జి బుజ్జిగా తెలుగు పలుకులు పలికారు ప్రీతీ శెట్టి. అదేనండి షాలినీ పాండే. ఫస్ట్ సినిమాకే తెలుగు డబ్బింగ్ చెప్పుకుని తెలుగు ఆడియన్స్‌ను ఆశ్చర్యపరిచారీ జబల్‌పూర్ భామ. ఇప్పుడు మరోసారి తెలుగు ప్రేక్షకులను ఆశ్చర్యపరచటానికి రెడీ అయ్యారు షాలినీ. ఈసారి ఏకంగా పాట పాడేశారామె. ‘నా ప్రాణమై...’ అంటూ సాగే ఓ ప్రైవేట్ సాంగ్‌ను ఇటీవల రికార్డ్ చేశారు షాలినీ. ‘లగోరీ’ అనే ఇండియన్ బ్యాండ్ కంపోజ్ చేసిన ఈ పాటకు షాలినీ తన వాయిస్ అందించారు. వాలెంటైన్స్ డే సందర్భంగా ఈ 14న ఈ పాటను రిలీజ్ చేయనున్నారట. తొలి సినిమాతోనే తెలుగు డబ్బింగ్ చెప్పుకొని, రెండో సినిమా కూడా రిలీజ్ కాకముందే ఓ పాటను పాడటం విశేషమే కదండి. ఇదిలా ఉంటే ‘అర్జున్ రెడ్డి’ సినిమా సూపర్ సక్సెస్ తర్వాత వరుస ఆఫర్స్‌తో దూసుకెళ్లిపోతున్నారు షాలినీ. సావిత్రి బయోపిక్ ‘మహానటి’ సినిమాలో, జీ.వీ.ప్రకాశ్‌తో ‘100% లవ్’ తమిళ రీమేక్ ‘100% కాదల్ లో, జీవా సరసన ‘గొరిల్లా’ సినిమాలో నటిస్తూ బిజీగా ఉన్నారు.

లవ్ డాక్టర్ | నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్..! నా లవ్ స్టోరీ... నేను బీటెక్‌లో ఉన్న రోజుల్లో.. మెడిటేషన్ క్లాస్‌లో మొదలైంది. ఆ ఏంజెల్‌ని అక్కడే చూశాను. ఆ రోజు నుంచి తన కాళ్లకి చెప్పుల్లా, ఇంటికి సెక్యూరిటీ గార్డ్‌లా, తన అవసరాలకి సర్వెంట్‌లా తిప్పుకుంది. మార్నింగ్ ఏడు గంటలకు డ్యూటీ ఎక్కి, నైట్ పన్నెండు దాకా తన వెంటే తిరిగేవాణ్ని. తనకు ఒకరంటే ఇష్టం, తననే మ్యారేజ్ చేసుకుంటా అనేది. తనకి నేనే ప్రపంచం అనేది. సో నన్నే ఇష్టపడుతుందనుకున్నా. కానీ, కారణం లేకుండానే నా వాట్సాప్‌ని బ్లాక్ చేసింది. నా హార్ట్‌ని బ్రేక్ చేసింది. ఇంకొరికి ఓకే చెప్పింది. నాకు హ్యాండ్ ఇచ్చింది. నా చాప్టర్ క్లోజ్.. వన్ ఇయర్ దాటింది కానీ ఇంకా తన గుర్తులే నన్ను బాధిస్తున్నాయి. ఒకప్పుడు నా బర్త్‌డే వస్తే రోజంతా తను నాతోనే ఉండేది. కానీ ఇప్పుడు విష్ కూడా చెయ్యడంలేదు. విష్ చెయ్యొచ్చుగా.. అని అడిగితే ''చెప్పాల్సిన అవసరం ఏంటి?'' అని అవమానించింది. ఆ మాటలకి ఎంతగా ఏడ్చానంటే.. ఆ దేవుడికే తెలుసు. అసలు నా కథలో తప్పు ఎవరిదో చెప్పండి ప్లీజ్. నాదా? ఆ అమ్మాయిదా? లేక మా మధ్యలోకి వచ్చిన ఆ అబ్బాయిదా??

- బాలు

నీ కథ వింటుంటే ప్రాణం లాగేస్తోంది.

'లాగెయ్యడం అంటే ఏంటి సార్... అదేమైనా ఒక టైప్ జబ్బా?'

నీలాంబరీ నువ్వంత కోల్డ్ హార్టెడ్ అయితే ఎలా?

'ఒక్క క్షణం' అంటూ నీలాంబరీ కిటికీ దగ్గరకు వెళ్లి ఆకాశంలోకి తొంగి చూసింది...

ఏం చూస్తున్నావు నీలూ???

'సూర్యుడు ఇవాళ ఏమైనా వెస్ట్ నుంచి దర్శనం ఇచ్చాడా? అని చూస్తున్నా సార్...!'

అంటే అబ్బాయి బాధ నాకు అర్థమైందంటే సూర్యుడు యూ టర్న్ కొడతాడని వెటకారమా నీలూ???

'లేకపోతే ఏంటి సార్? అమ్మాయి చెప్పుల్లా... అమ్మాయి అలారం గడియారంలా.. అమ్మాయి పెంపుడు కుక్కలా.. అమ్మాయి తిని పారేసిన అరటి తొక్కలా.. ఆ తొక్క మీద జారి పడి హార్ట్ బ్రేక్ చేసుకున్న పూర్ ఫెలో మీకు ఉత్తరం రాస్తే ఎగిరి గంతులు వేసి కిందపడి ఉన్న వాడిపైనే డ్యాన్స్ చేసే రకం మీరు..!! ఏదో లాగుతుందని వెటకారం చెయ్యగా లేనిది నేను చేస్తే తప్పా సార్???'

చూశావా బాలూ...!? ఈ ప్రపంచంలో ప్రేమ తొక్క మీద కాలు వేసి.. పడి.. హార్ట్ బ్రేక్ చేసుకున్న వారిపైన ఎవరికీ దయ ఉండదు బాలూ. నువ్వు ఒక గొప్ప ప్రేమికుడివి. నీ గొప్ప ప్రేమ గొప్ప అమ్మాయికి అర్థమవుతుంది. ఇట్ ఈజ్ నాట్ ఈజీ ఫర్ ఆర్డినరీ గర్ల్స్ టు అండర్‌స్టాండ్ యువర్ గొప్ప లవ్. ఈసారి జాగ్రత్త బ్రో. ఒక గొప్ప అమ్మాయిని చూసి చెప్పులరిగేలా గుండెను గడియారం చేసుకుని తిరుగు. సక్సెస్ డ్యాం షూర్.

లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

అప్పుడు మహేశ్ పిలిచి మరీ చాన్స్ ఇస్తాడేమో!



● మంజుల

"ఏదో ఒక సినిమా డైరెక్షన్ చేయాలనే ఆలోచన, అవసరం నాకు లేదు. ప్రకృతిలో నేను ఏదైతే ఫీల్ అయ్యానో దాన్ని ప్రేక్షకులకు పంచాలని ఓ బాధ్యతగా 'మనసుకు నచ్చింది' కథ తయారు చేసుకున్నా. పైగా నాన్నగారు (కృష్ణ), మహేశ్‌బాబు సంపాదించుకున్న ఇమేజ్ వల్ల నాపై ఓ బాధ్యత ఉంటుంది" అని మంజుల ఘట్టమనేని అన్నారు. సందీప్ కిషన్, అమైరా దస్తూర్ జంటగా మంజుల దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'మనసుకు నచ్చింది'. సంజయ్ స్వరూప్. పి.కిరణ్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 16న విడుదలవుతోంది. మంజుల పంచుకున్న విశేషాలు..

■ ప్రస్తుత బిజీ లైఫ్‌లో మనం చిన్న చిన్న అనుభూతుల్ని కోల్పోతున్నాం. వాటిని ఎలా ఆస్వాదించాలి? ప్రకృతితో ఎలా మమేకం కావాలి? అన్నదే 'మనసుకు నచ్చింది' కథ. భాషపై నాకు పట్టు లేకపోవడంతో కథ రాయడానికి ఏడాది పట్టింది. నేను డైలాగులు ఇంగ్లీష్‌లో రాశా. వాటిని బుర్రా సాయిమాధవ్‌గారితో తెలుగులో రాయించాం.

■ నా ఫస్ట్ లవ్ ఎప్పుడూ డైరెక్షనే. నేను డైరెక్షన్ చేస్తాననగానే నా భర్త (సంజయ్ స్వరూప్) సపోర్ట్ చేశారు. నాన్నగారు (కృష్ణ) థ్రిల్ అయ్యారు. ఈ సినిమాకి కిరణ్‌గారు నిర్మాత అనగానే ఇంకా సంతోషపడ్డారు. మహేశ్‌బాబుకి చెప్పగానే 'నీకు పిచ్చెక్కిందా. సడెన్‌గా డైరెక్షన్ ఏంటి?' అన్నాడు. కానీ నా కథ విన్నాక నమ్మకం వచ్చింది. సినిమాలో ప్రకృతికి వాయిస్ ఓవర్ ఇచ్చాడు. ట్రైలర్ చూసి షాక్ అయ్యాడు. చాలా బాగుందన్నాడు.

■ ప్రకృతే మా సినిమాలో ప్రధాన హైలెట్. అది కూడా ఒక హీరోనే. స్వచ్ఛమైన ప్రేమకథ, ఫన్ అందరినీ ఆకట్టుకుంటాయి. ప్రతి సన్నివేశం నా హృదయం నుంచి వచ్చింది. ఇందులో నిత్య పాత్ర నా క్యారెక్టర్‌కి దగ్గరగా ఉంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే 'మనసుకు నచ్చింది' ఒక సముద్రం లాంటి సినిమా.

■ సందీప్‌ని దృష్టిలో పెట్టుకుని కథ రాయలేదు. ముందు కథ రాసుకున్నా. హీరో ఎవరైతే బాగుంటారా? అనుకున్నా. కిరణ్‌గారు సందీప్ పేరు చెప్పారు. అప్పటి వరకూ నేను సందీప్ సినిమాలు చూడలేదు. 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' సీడీ పంపితే చూశా. తర్వాత కలిసినప్పుడు కథకి తనే కరెక్ట్ అనిపించింది. మంచి పాత్ర ఇవ్వాలే కానీ తను బాగా నటిస్తాడు.

■ నాకు డైరెక్షన్ కష్టం అనిపించలేదు. చాలా ఎంజాయ్ చేశా. నేను డైరెక్షన్ చేసిన తీరు చూసిన కెమెరామెన్ రవి యాదవ్ 'మీకిది తొలి సినిమాలా లేదు మేడమ్. పది సినిమాలు తీసిన అనుభవం ఉన్నట్లుంది' అన్నారు. నా సినిమాకు రెహమాన్‌గారితో సంగీతం చేయించాలనే ఆలోచన ఉండేది. రధన్ స్వరపరచిన 'అందాల రాక్షసి' పాటలు వినగానే నాకు రెహమాన్‌గారు గుర్తుకొచ్చారు. రధన్ అద్భుతమైన పాటలు, నేపథ్య సంగీతం ఇచ్చారు.

■ నాన్నగారు, మహేశ్ ఇంకా ఈ సినిమా చూడలేదు. ఫస్ట్ డే ఫస్ట్ షో చూస్తామన్నారు. 16వ తేదీ ఎప్పుడొస్తుందా అని చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది. మహేశ్‌కి ఏ కథ అయినా సరిపోతుంది. తను ఇక్కడ ఉండటం టాలీవుడ్ అదృష్టం. తనతో పనిచేయడం నా కల. తన ఇమేజ్‌కి తగ్గట్టు కథ రెడీ చేస్తే పిలిచి మరీ అవకాశమిస్తాడేమో.

■ ట్రైలర్ చూసిన కొందరు కృష్ణవంశీగారిలా కొత్తగా తీశావని అభినందిస్తున్నారు. రెగ్యులర్ కమర్షియల్ చిత్రాలు తప్ప కొత్త కథలను ప్రేక్షకులు ఆదరించరనే భావన ఫిల్మ్‌మేకర్స్‌లో ఉంది. ఆ ఆలోచనా ధోరణి మారాలి. ప్రేక్షకులు చాలా తెలివైనవారు. కొత్త కథలనెప్పుడూ ఆదరిస్తారు. అందుకే 'పెళ్ళిచూపులు, అర్జున్‌రెడ్డి, తొలిప్రేమ' వంటి వైవిధ్యమైన చిత్రాలు వచ్చాయి.. హిట్ అయ్యాయి.

■ ఓ టాప్ హీరో ప్రజలకు సేవ చేద్దామనుకొని రాజకీయాల్లోకి ఎలా వెళ్లాడు? అనే అంశంపై ఓ కథ రాసుకున్నా. అది పవన్ కల్యాణ్‌గారి వ్యక్తిత్వానికి దగ్గరగా ఉంటుంది. అవకాశం వస్తే ఆయనతో చేయడానికి రెడీ. హీరోని దృష్టిలో పెట్టుకుని కథలు రాయను. కథ రాశాకే హీరో ఎవరని ఆలోచిస్తా.



● వరుణ్‌తేజ్

ప్రేమలో మునిగి.. వ్యోమగామిగా తేలి!

ప్రేమికుడు వ్యోమగామి (ఆస్ట్రోనాట్)గా మారబోతున్నాడు. ప్రేమ కోసం అమ్మాయి చుట్టూ తిరిగినవాడు ఒక ఆపరేషన్ నిమిత్తం అంతరిక్షంలో తిరగనున్నాడు. ఏం చెబుతున్నామో అర్థం కావడంలేదా? 'తొలిప్రేమ' సినిమాలో ప్రేమికుడిగా కనిపించి, మంచి హిట్‌ను సొంతం చేసుకున్న వరుణ్ తేజ్ తన నెక్ట్స్ సినిమాలో వ్యోమగామిగా కనిపిస్తారట. 'ఘాజీ' ఫేమ్ సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో ఓ స్పేస్ ఫిల్మ్‌లో వరుణ్ నటించనున్న విషయం తెలిసిందే. దాని కోసం ప్రిపరేషన్స్ కూడా మొదలుపెట్టేశారట. ఈ సినిమా గురించి నిర్మాత వై. రాజీవ్‌రెడ్డి మాట్లాడుతూ – ''ఘాజీ' తర్వాత సంకల్ప్ రెడ్డి మరో ఎగ్జైటింగ్ కాన్సెప్ట్‌తో వచ్చాడు. రెగ్యులర్ సినిమాల టైమ్ అయిపోయే తరుణం వచ్చింది. ఇప్పుడు కేవలం కంటెంట్ బేస్డ్ సినిమాలు ఆడే రోజులు వచ్చాయి. మా బ్యానర్ ద్వారా కంటెంట్ ఉన్న కథలను అందించాలన్నది మా ఆశయం. వరుణ్ తేజ్ ఈ సినిమా ఒప్పుకుంటారో.. ఒప్పుకోరో అని ఒక చిన్న టెన్షన్ ఉండేది. కానీ తను కూడా మాలాగే ఎగ్జైట్ అయి, సినిమా చేయటానికి ఒప్పుకున్నారు. అది మాకు ఇంకా ధైర్యాన్ని ఇచ్చింది. ఈ సినిమా మొత్తం స్పేస్‌లో జరగనున్నందు వల్ల దర్శకుడు సంకల్ప్, హీరో వరుణ్ తేజ్ ఒక నెల పాటు ఖజికిస్థాన్‌లో జీరో గ్రావిటీ కండీషన్స్‌లో ట్రైనింగ్ తీసుకుంటారు. సినిమాలో మిగతా క్యాస్ట్ అండ్ క్రూకి కూడా ఇలానే ట్రైన్ చేయనున్నాం'' అన్నారు. ఏప్రిల్‌లో సెట్స్ పైకి వెళ్లనున్న ఈ సినిమాను ముందుగా యూఎస్‌లో షూట్ చేద్దామనుకున్నారట. కానీ ఇప్పుడు జార్జియాలో షూట్ చేయాలనుకుంటున్నారట.

నచ్చకుంటే డబ్బు వాపసు

సొసైటీలో అనాథలను లేకుండా చేయాలనే సందేశాత్మక కథకి వినోదం జోడించి రూపొందించిన సినిమా 'సత్య గ్యాంగ్'. సాత్విక ఈశ్వర్, అక్షిత జంటగా ప్రభాస్ దర్శకత్వంలో మహేశ్ ఖన్నా నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని అనాథ బాలల చేత విడుదల చేయించారు. ఈ సందర్భంగా మహేశ్ ఖన్నా వారికి రూ. 10 వేలు ఆర్థిక సాయం చేశారు. ''మంచి కథాంశంతో రూపొందిన చిత్రమిది. మా సినిమా చూసి నచ్చలేదన్న వారికి డబ్బులు వాపసు ఇచ్చేస్తాం. సినిమాపై మాకున్న నమ్మకం వల్ల ఇలా అంటున్నాం. త్వరలోనే ఆడియో లాంచ్ చేస్తాం'' అన్నారు మహేశ్ ఖన్నా.



● ఈశ్వర్ అక్షిత

విందు భోజనంలా ఉంటుంది - కీరవాణి



● రుహానీ, బొత్స సత్యనారాయణ, రంజిత్, వీవీ వినాయక్, భరత్, కీరవాణి, పాలక్ లల్వాని, త్రికోటి

''ఈ సినిమాకు కీరవాణిగారు సంగీతం అందించటం చాలా గొప్ప విషయం. సినిమా బావుంటుంది అనుకుంటేనే ఆయన సంగీతం అందిస్తారు. కాబట్టి ఈ సినిమా మంచి విజయం సాధిస్తుంది. నటుడిగా రంజిత్‌కు మంచి గుర్తింపు రావాలి'' అన్నారు దర్శకులు వీవీ వినాయక్. రంజిత్, పాలక్ లల్వాని జంటగా త్రికోటి దర్శకత్వంలో భరత్ సోమి నిర్మించిన చిత్రం 'జువ్వ'. ఈ చిత్రం ఆడియో వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వినాయక్ మాట్లాడుతూ –''మా కుటుంబానికి ఆప్త మిత్రులు బొత్స సత్యనారాయణ గారు. వారి అల్లుడు, ఈ సినిమా నిర్మాత భరత్ సోమిగారికి శుభాకాంక్షలు. తమ్ముడి మీద ప్రేమతో రంజిత్‌ను హీరోగా పరిచయం చేస్తున్నందుకు ఆయనకు శుభాకాంక్షలు'' అన్నారు. ''త్రికోటి మొదటి సినిమా 'దిక్కులు చూడకు రామయ్య'కి మ్యూజిక్ నేనే చేశా. ఈ సినిమా విందు భోజనంలా ఉంటుంది. రంజిత్ ఫ్యూచర్‌లో పెద్ద హీరోగా ఎదగాలని కోరుకుంటున్నాను'' అన్నారు కీరవాణి. ''నాలాంటి కొత్తవాడి సినిమాకు సంగీతం ఇచ్చిన కీరవాణిగారు నాకు దేవుడితో సమానం. బడ్జెట్ విషయంలో భరత్‌గారు వెనకాడలేదు'' అన్నారు త్రికోటి. రంజిత్ మాట్లాడుతూ –''నా మెదటి సినిమాకు కీరవాణిగారు మ్యూజిక్ ఇవ్వడం నా లక్. మమ్మల్ని ఆశీర్వదించటానికి వచ్చిన అందరికీ థ్యాంక్స్'' అన్నారు రంజిత్. ''ముఖ్య అతిథిగా వచ్చిన వినాయక్‌గారికి, బొత్స సత్యనారాయణ గారికి, అతిథులందరికి కృతజ్ఞతలు. రత్నం గారి డైలాగ్స్ బాగుంటాయి. ఫిబ్రవరి 23న సినిమా రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అన్నారు నిర్మాత భరత్.

హ్యాపీ డేస్

ఆ మూడు రోజులూ హాయైన రోజులే

- రుతుస్రావంపై 'సహజ' అవగాహన కార్యక్రమం
- ఉచిత శానిటరీ నాప్కిన్ల పంపిణీ
- సర్వశిక్ష అభియాన్ డైరెక్టర్ జి. శ్రీనివాస్ చొరవ
- ఆంధ్రా 'ప్యాడ్‌మేన్'గా విద్యార్థినుల ప్రశంసలు


'సహజ' నాప్కిన్స్‌తో కస్తూరిబా విద్యాలయాల బాలికలు

'మౌనం వద్దు... మాట్లాడదాం..' అంటూ ఆడపిల్లల రుతుస్రావ పరిశుభ్రత మీద ఆంధ్రప్రదేశ్ సర్వ శిక్ష అభియాన్ చేపట్టిన అవగాహనా కార్యక్రమం 'సహజ' సత్ఫలితాలనిస్తోంది. అమ్మాయిలకు రుతుస్రావం సహజం అని, శానిటరీ నాప్కిన్స్ వాడటానికి సిగ్గుపడాల్సిన అవసరం లేదంటూ అభియాన్ చేపట్టిన ప్రచారం అమ్మాయిల ఆలోచనల్లో మార్పు తీసుకొచ్చింది. అభియాన్ ఆధ్వర్యంలో నడుస్తున్న కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల్లో చదువుతున్న మొత్తం 70 వేల మంది అమ్మాయిలలో నలభై వేల మంది అమ్మాయిలు ఇప్పుడు పెన్సిల్ అడిగినంత సహజంగా శానిటరీ నాప్కిన్ కావాలని అడిగి తీసుకొని వాడుతున్నారు. దీనికి కారణం సర్వశిక్ష అభియాన్ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ జి.శ్రీనివాస్ చూపిన చొరవ. ప్రదర్శించిన సహానుభూతి. అందువల్లే ఇప్పుడు ఆయన 'ప్యాడ్‌మేన్'గా ప్రశంసలు అందుకుంటున్నారు. తల్లిదండ్రులను కోల్పోయి ఆసరా కోసం అల్లాడుతున్న అమ్మాయిలను అక్కునచేర్చుకొని విద్యాబుద్ధులు నేర్పి చేయూతనిస్తున్న 'కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాలు' (కేజీబీవీ) నడుస్తున్న తీరుతెన్నులను 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో శ్రీనివాస్ వివరించారు.

- **దేశంలో శానిటరీ నాప్కిన్స్ వాడకం గురించి, రుతుస్రావ పరిశుభ్రత గురించి చైతన్య కార్యక్రమాలు నడుస్తున్నాయి. ఆ విధంగా చూసినప్పుడు కొంత ముందుగానే మీరు 'సహజ' కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం విశేషం అనే చెప్పాలి.**

అవును. ఆడపిల్లల రుతుస్రావ పరిశుభ్రత కోసం 'సహజ' కార్యక్రమం మేము మొదలుపెట్టాం. ఇది సత్ఫలితాలను ఇవ్వడం ఆనందంగా ఉంది.

- **వివరంగా చెప్పండి.**

ఆంధ్రప్రదేశ్‌లో 352 కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాలు ఉన్నాయి. ఒక్కో విద్యాలయంలో 200 మంది విద్యార్థినులు ఉన్నారు. తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లలు, సమాజంలో ఏ ఆసరా లేని పిల్లలకు వీటిలో ప్రవేశం ఉంటుంది. మధ్యలో చదువు మానేసిన(డ్రాపవుట్) పిల్లలనూ చేర్చుకుంటాం. ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు అన్నీ ఉచితమే. ఇంటర్ కూడా ప్రారంభిస్తున్నాం. చదువుతో పాటు దుస్తులు, పుస్తకాలు, భోజనం, వసతి, కాస్మోటిక్స్.. అన్నీ ఉచితంగా ఇస్తాము. కేజీబీవీల్లో 70 వేల మంది విద్యార్థినులు ఉంటే వారిలో 45 వేల మంది రుతుస్రావం దశలో ఉన్నారు. రుతుస్రావం సమయంలో వీరు సంప్రదాయ పద్ధతులను అనుసరించడం, అసురక్షిత పద్ధతులను ఆశ్రయించి అనారోగ్యం బారిన పడటం మా దృష్టికి వచ్చింది. రుతుస్రావం సమయంలో తాము రుతుస్రావంలో ఉన్నాం అని చెప్పుకోవడానికి కూడా వారు సంకోచించే పరిస్థితి. అదీగాక రుతుస్రావం భయంతో డ్రాపవుట్స్‌గా మారుతున్నారు. సాటి విద్యార్థినుల హేళన కూడా వాళ్లను కుంచించుకుపోయేలా చేసి చదువు మానేస్తున్నారు. ఇది చాలా తప్పు. అందువల్ల ముందు వారిలో చైతన్యం కలిగించాం. రుతుస్రావంకు సంబంధించి న్యూనత అక్కర్లేదని వారిలో ధైర్యం నూరిపోశాం. 'మౌనం వద్దు... మాట్లాడదాం' పేరిట వారిలో సంకోచాలన్నీ తొలగించాం.



- **నాప్కిన్స్ ఇవ్వాలన్న ఆలోచన ఎలా వచ్చింది?**

ఈ విద్యార్థినులకు పుస్తకాలు, బట్టలు ఇస్తున్నప్పుడు నాప్కిన్స్ ఎందుకు ఇవ్వకూడదు అని అనిపించింది. ఒకవేళ ఇచ్చే పరిస్థితి ఉన్నా ఇచ్చే పరిస్థితి ఉండాలి కదా. ముందు వారికి అడగడం చాలా మామూలు విషయమని ప్రిపేర్ చేశారు. ఆ తర్వాత ప్రతినెలా ఉచితంగా 'సహజ' బ్రాండ్ పేరుతో శానిటరీ నాప్కిన్స్ ఇస్తున్నాం. మూడు నెలలకు సరిపడా నిల్వలు ముందస్తుగా స్కూళ్లకు చేరుస్తాం. మొదట టీచర్లు వాడి చూశారు. నాణ్యత సంతృప్తికరంగా ఉన్న తర్వాతే సరఫరా కాంట్రాక్టర్‌ను ఎంపిక చేశాం. 'సహజ' అమలుకు ఏటా రూ. కోటి ఖర్చు చేస్తున్నాం. ఇంతకుమునుపు నాప్కిన్స్ అంటేనే సంకోచించే ఆడపిల్లలు ఇప్పుడు పెన్సిల్ అడిగినంత సులభంగా వాటిని తీసుకుని ఉపయోగిస్తున్నారు.

- **కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాలకు ఆదరణ ఎలా ఉంది?**

కేజీబీవీల్లో చదువుకుని జీవితంలో స్థిరపడిన 20 వేల మంది విద్యార్థినుల వివరాలు మా వద్ద ఉన్నాయి. దీనిని బట్టే ఈ విద్యాలయాల పని తీరు అంచనా వేయవచ్చు. కేజీబీవీలో చదువుకొని బయటకు వెళ్లిన వారు తమకాళ్ల మీద నిలబడగలిగే సత్తా ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. చదువుతో పాటు సాఫ్ట్ స్కిల్స్, స్పోర్ట్స్, కల్చరల్ యాక్టివిటీస్, ఆత్మరక్షణ.. అన్ని రకాలుగా శిక్షణ ఇస్తాం. ఎంతో మంది అమ్మాయిలు డాక్టర్లు, ఇంజనీర్లు అయ్యారు. ఉన్నత చదువులు చదువుతున్నారు. ఉద్యోగాలు చేస్తున్నారు. కేజీబీవీల్లో చదువుకున్న విద్యార్థినిలకు చదువుతో పాటు సామాజిక విషయాల్లో అవగాహన, వ్యక్తిగత పరిశుభ్రత, లలిత కళలు, బ్రతుకుదెరువుకు దోహదపడే నైపుణ్యాలు.. తప్పకుండా ఉంటాయి.

- **కేజీబీవీల్లో అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి వాటి నుంచి బయటపడటానికి చేపట్టిన కార్యక్రమాలు ఏమైనా ఉన్నాయా?**

పేదరికం, వెనకబాటుతనం కారణంగా పదో తరగతి కాగానే చాలా మంది అమ్మాయిలకు వివాహం చేస్తున్నారు. పదోతరగతి పరీక్షలు రాసి ఇళ్లకు వెళ్లిన అమ్మాయిలు తిరిగి విద్యాలయానికి రావడం లేదు. ఎందుకు రావడం లేదనే విషయాన్ని ఆరా తీస్తే.. పెళ్లిళ్లు చేస్తున్నారని తెలిసింది. పదోతరగతి పరీక్షల తర్వాత ఇళ్లకు వెళుతున్న విద్యార్థినులకు.. పెళ్లికి ఇది తగిన వయసు కాదని, బలవంతంగా పెళ్లి చేస్తే ఎదిరించాలని చెప్పి పంపిస్తున్నాం. విద్యాలయం ప్రిన్సిపాల్, స్థానిక పోలీస్ అధికారి, డీజీడీవో (గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్)... అందరి నంబర్లు ఇచ్చి పంపుతున్నాం. తల్లిదండ్రులు పెళ్లికి బలవంతం చేస్తే.. సమాచారం ఇవ్వమని చెబుతున్నాం. మేం చేసిన ఈ ప్రయత్నం ఫలించింది. చాలా మంది అమ్మాయిలు ధైర్యంగా ఫిర్యాదు చేసిన ఘటనలు


సర్వశిక్ష అభియాన్ డైరెక్టర్ జి. శ్రీనివాస్

ఉన్నాయి. 'పది తర్వాత పెళ్లి కాదు.. 11వ తరగతి' అని ప్రచారం చేయడంతో పాటు తల్లిదండ్రులకూ కౌన్సిలింగ్ ఇస్తున్నాం.

- **కేజీబీవీల్లో విద్యార్థినుల భద్రతకు తీసుకుంటున్న చర్యలు?**

ఈ విద్యాలయాల్లో సెక్యూరిటీ గార్డు నుంచి ప్రిన్సిపాల్ వరకు.. అందరూ మహిళలే. పురుషులకు ప్రవేశం లేదు. సమీపంలోని పోలీస్ స్టేషన్ నుంచి ఒక మహిళా కానిస్టేబుల్‌ను రాత్రి బీట్ కోసం పంపించమని అన్ని జిల్లాల ఎస్పీలకు లేఖలు రాశాం. నైట్‌బీట్ కానిస్టేబుల్‌ను పంపించడానికి ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. అన్ని స్కూళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఈ విద్యాలయాల్లో విద్యార్థినిలు సురక్షితమైన వాతావరణంలో ఉంటారు.

- **ఉత్తీర్ణత శాతం ఎలా ఉంది?**

పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం 87 నుంచి 96 శాతానికి పెరిగింది. ఇంటర్మీడియెట్‌లోనూ ఇదే తరహాలో ఉత్తీర్ణత నమోదవుతోంది. మధ్యలో స్కూలు మానేస్తున్న విద్యార్థినిల సంఖ్య ఇటీవల బాగా తగ్గింది.


- **ఎస్‌ఎస్‌ఏ తీసుకొస్తున్న 'కస్తూరి' ద్వైమాసిక పత్రికకు ఆదరణ ఎలా ఉంది?**

దేశంలో అమ్మాయిల కోసం ప్రత్యేకంగా పత్రిక తీసుకురావడం ఇదే తొలిసారి. కస్తూరి పత్రికను ఇటీవల కాలం వరకు కేజీబీవీ విద్యార్థినిలకు మాత్రమే ఇచ్చే వాళ్లం. పత్రిక కావాలని మిగతా వాళ్లు కూడా అడుగుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి బహిరంగ మార్కెట్‌లోకి కూడా విడుదల చేశాం.

– మల్లు విశ్వనాథరెడ్డి,
సాక్షి ప్రతినిధి, అమరావతి బ్యూరో

పరి పరిశోధన

ఉక్కులాంటి కలప



ఉక్కులాంటి దృఢమైన కలప త్వరలోనే భవన నిర్మాణరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురాగలదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. తుపాకి తూటాలను సైతం తట్టుకోగల అలాంటి 'సూపర్‌వుడ్'ను అమెరికాలోని మేరీలాండ్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు ప్రయోగాత్మకంగా రూపొందించారు. మామూలు కలపను నుజ్జు నుజ్జు చేసి, నీటిలో కరిగే ద్రావణంలో కలిపి ముద్ద చేసి అత్యధిక సాంద్రతతో రూపొందించిన ఈ 'సూపర్‌వుడ్'ను రకరకాలుగా పరీక్షించి దీని దారుఢ్యాన్ని నిగ్గుతేల్చారు. దారుఢ్యంలో ఇది ఉక్కును సరిపోలినా, సాధారణ కలప కంటే తేలికగానే ఉంటుందని మేరీలాండ్ వర్సిటీ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. నుజ్జు చేసిన కలపలో సోడియం హైడ్రాక్సైడ్, సోడియం సల్ఫేట్ రసాయనాలు కలిపిన నీటితో ముద్దగా చేసి, ఆ ముద్దను రెండు లోహపు పలకల మధ్య భూమి ఉపరితల వాతావరణం కంటే 50 రెట్లు ఎక్కువ పీడనంతో అదిమి పట్టి, వంద డిగ్రీల ఉష్ణోగ్రతతో వేడిచేయడం ద్వారా ఈ 'సూపర్‌వుడ్'ను రూపొందించినట్లు శాస్త్రవేత్తలు వెల్లడించారు.

ఉక్కునైనా ఛేదించగల వాటర్‌గన్



ఉక్కునైనా ఛేదించగల వాటర్‌గన్ అందుబాటులోకి వచ్చింది. దీనిని షూట్ చేస్తే, ఇందులోంచి పెనువేగంతో దూసుకొచ్చే నీరు.. ఉక్కు, కాంక్రీట్, ఇటుకలు, చివరకు బులెట్ ప్రూఫ్ గ్లాస్‌ను కూడా ఛేదించగలదు. ఏదైనా గోడపై దీనిని గురిచూసి ప్రయోగిస్తే, మూడంగుళాల రంధ్రం ఏర్పడి, అందులోంచి నీరు లోపలకు దూసుకుపోతుంది. అగ్నిమాపక పరికరాలను తయారు చేసే 'పైరోలాన్స్' అనే కంపెనీకి చెందిన నిపుణులు ఈ వాటర్‌గన్‌ను అల్ట్రా హైప్రెషర్ పరిజ్ఞానంతో తయారు చేశారు. ఈ 'పైరోలాన్స్' వాటర్ గన్స్‌ను ప్రస్తుతం అమెరికన్ నేవీ, ఎయిర్‌ఫోర్స్ బలగాలు ఉపయోగిస్తున్నాయి. కొద్ది విమానాశ్రయాల్లో కూడా ఇవి అందుబాటులో ఉన్నాయి. వీటి సైజును బట్టి ఒక్కొక్కటి 15 వేల డాలర్ల నుంచి 80 వేల డాలర్ల వరకు ఇవి దొరుకుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా అగ్నిమాపక దళాలు వీటిని ఉపయోగించేటట్లయితే చాలా వరకు అగ్నిప్రమాదాలను నిరోధించవచ్చని 'పైరోలాన్స్' కంపెనీకి చెందిన ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, బస్టాండులు, షాపింగ్‌మాల్స్, సినిమా థియేటర్స్ వంటి జనసమ్మర్దం గల ప్రదేశాల్లో వీటిని అందుబాటులో ఉంచితే, అగ్నిప్రమాదాలను తేలికగా అరికట్టడం సాధ్యమవుతుందని చెబుతున్నారు.

ఫ్యామిలీ డాక్టర్

పీడియాట్రిక్ కౌన్సెలింగ్

బాబుకు తరచూ జలుబు... సలహా ఇవ్వండి



మా బాబుకు తొమ్మిదేళ్లు. తరచూ జలుబు చేస్తుంటుంది. చల్లటి పదార్థాలు, పానీయాలు వద్దన్నా మానడు. ఒక్కోసారి ఊపిరి సరిగ్గా ఆడటం లేదని చెబుతుంటాడు. డాక్టర్‌ను సంప్రదించాం. మందులు ఇచ్చారు. వాటి ప్రభావం సరిగ్గా లేదు. బాబు ఆరోగ్య విషయంలో ఎటువంటి సలహాలు పాటించాలో తెలియజేయండి.

– ఎమ్. సుభానీ, నెల్లూరు

మీ బాబుకు ఉన్న కండిషన్‌ను అలర్జిక్ రైనైటిస్ అంటారు. అందులోనూ మీ బాబుకు ఉన్నది సీజనల్ అలర్జిక్ రైనైటిస్‌గా చెప్పవచ్చు. పిల్లల్లో సీజనల్ అలర్జిక్ రైనైటిస్ లక్షణాలు ఆరేళ్ల వయసు తర్వాత ఎక్కువగా కనిపిస్తుంటాయి. ఈ సమస్య ఉన్న పిల్లల్లో జలుబు, ముక్కు దురద, కళ్ల నుంచి నీరు కారడం, ముక్కు దిబ్బడ, ఊపిరి తీసుకోవడంలో కష్టం వంటి లక్షణాలు చూస్తుంటాం. ఈ సమస్య చాలా సాధారణం. దీనికి నిర్దిష్టమైన కారణం చెప్పలేకపోయినప్పటికీ వంశపారంపర్యంగా కనిపించడంతో పాటు వాతావరణ, పర్యావరణ మార్పులు కూడా ఇందుకు దోహదం చేస్తాయి. పూల మొక్కలు, దుమ్ము, ధూళి, పుప్పొడి, రంగులు, డిటర్జెంట్స్ వంటివి శరీరానికి సరిపడకపోవడం వంటివి ఈ సమస్యకు ముఖ్య కారణాలు.

మీ బాబుకు యాంటీహిస్టమైన్స్, ఇమ్యునోమాడ్యులేటర్స్, ఇంట్రానేసల్ స్టెరాయిడ్ స్ప్రేస్ వాడటం వల్ల చాలావరకు ప్రయోజనం ఉంటుంది. మీ అబ్బాయి విషయంలో ఎలాంటి ఆందోళనా అవసరం లేదు. చల్లటి పదార్థాలు తగ్గించడం, సరిపడని వాటికి దూరంగా ఉంచడంతో చాలావరకు ప్రయోజనం ఉంటుంది.

బాబు మాటిమాటికీ మూత్రానికి లేస్తున్నాడు...

మా బాబు వయసు పన్నెండేళ్లు. రాత్రిళ్లు చాలాసార్లు మూత్రవిసర్జనకు లేస్తుంటాడు. పగటి వేళ కూడా చాలాసార్లు వెళ్తుంటాడు. ఇప్పటికీ పక్కతడుపుతున్నాడు. ఈ సమస్యతో వాడికీ, మాకూ చాలా ఇబ్బందిగా ఉంది. తగిన సలహా ఇవ్వండి.

– సులక్షణ, సిద్ధిపేట

మీ బాబుకు ఉన్న కండిషన్‌ను ఇంక్రీజ్‌డ్ ఫ్రీక్వెన్సీ ఆఫ్ యూరినేషన్ అని చెప్పవచ్చు. దాంతోపాటు యూరిన్ ఎక్కువగా రావడాన్ని బట్టి చూస్తే పాలీయూరియా అన్న కండిషన్ కూడా ఉందేమోనని కూడా అనుమానించాలి. ఈ సమస్యకు అనేక కారణాలు ఉంటాయి. నీళ్లు ఎక్కువగా తాగడం, యూరినరీ ఇన్ఫెక్షన్స్,ఎండోక్రైన్ సమస్యలు, యూరినరీ బ్లాడర్ డిజ్‌ఫంక్షన్, దీర్ఘకాలికమైన కిడ్నీ సమస్యలు, సైకలాజికల్ సమస్యలు, మలబద్ధకం వంటివి ముఖ్యమైనవి. మీ బాబు విషయంలో అతడి సమస్యకు నిర్దిష్టమైన కారణాన్ని తెలుసుకోవడానికి కంప్లీట్ యూరిన్ అనాలిసిస్, 24 గంటల్లో అతడు విసర్జించే మూత్రపరిమాణం పరీక్షలతో పాటు యూరిన్ ఆస్మనాలిటీ, అల్ట్రాసౌండ్ ఆఫ్ కేయూబీ పరీక్షలు చేయించాల్సి ఉంటుంది.

ఇలాంటి పిల్లల్లో సాధారణంగా సాయంత్రం నుంచి రాత్రివరకు నీళ్లు ఎక్కువగా తాగకుండా చూడటం, తియ్యటి పదార్థాలను ఎక్కువగా తీసుకోకుండా చూడటం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. దాంతో పాటు వాళ్లు మూత్రవిసర్జన చేసే సమయంలో అసంపూర్తిగా కాకుండా పూర్తిగా చేసేలా చూడాలి. ఇలాంటి మంచి విసర్జక అలవాట్లతో ఈ సమస్య పూర్తిగా తగ్గుతుంది. అయితే మీవాడి సమస్యకు కారణాలు ఏమైనా ఉన్నాయేమో తెలుసుకునేందుకు కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్ చేయించండి. మీరు ఒకసారి మీ పిల్లల వైద్యనిపుణుడిని సంప్రదించండి.




డా. రమేశ్‌బాబు దాసరి
సీనియర్ పీడియాట్రీషియన్, రోహన్ హాస్పిటల్స్,
విజయనగర్ కాలనీ, హైదరాబాద్

మళ్లీ చెప్పుకుందాం! రీటోల్డ్ కథలు - 03


• కేతు విశ్వనాథరెడ్డి

చీకట్లో తోడేలు





చీకట్లో కుక్క గతికిన చప్పుడు వినిపించింది.

కుక్కేనా?

కంగారుపడి కళ్లు తెరిచాడు. నల్లటి నలుపు. కారు చీకటి. గదిలో ఏమీ కనిపించడం లేదు.

తల దగ్గర పెట్టుకుని ఉన్న టార్చ్‌లైట్‌ను టప్‌మంటూ వెలిగించాడు.

ఒక మనిషి నిలబడి ఉన్నాడు– ఆ అమ్మాయి కాళ్ల దగ్గర.

ఆ అమ్మాయి విసుక్కుంటూ అటు తిరిగి పడుకోబోతూ అంది–

'ఏం సార్. నిద్ర పట్టట్లేదా. నన్నుగానీ మీ పెళ్లాం అనుకుంటున్నారా ఏంది?'

లైట్ ఫోకస్ ఆ మనిషి వైపు తిరిగింది.

'అదీ... దారి ఎటో కనిపించలేదు. నిద్ర పట్టక సిగరెట్ తాగుదామనుకుని లేస్తే ఈ అమ్మాయి కాలు తగిలింది' నసిగాడు.

ఆ అమ్మాయి ఈవైపు పడుకుని ఉంది. తలుపు ఆ వైపు ఉంది. తలుపు వైపు వెళితే అమ్మాయికి కాలెందుకు తగులుతుంది?

టార్చ్ వేసి దారి చూపించాడు.

అతడు పిల్లిలా బయటకు వెళ్లి అయిదు నిమిషాలసేపు తాత్సారం చేసి తిరిగి వచ్చి గుట్టుగా బెంచీ మీద సర్దుకున్నాడు.

పాతకాలపునాటి గవర్నమెంట్ స్కూల్ గది అది. తెల్లవారితే పోలింగ్. ఆ డ్యూటీ మీద సాయంత్రం వచ్చి ఊరివాళ్లు ఇచ్చిన భోజనం చేసి నిద్రపోయారు. పోలింగ్ ఆఫీసరు, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసరు, హోంగార్డ్‌గా వచ్చిన ఆ అమ్మాయి.

జిల్లా హెడ్‌క్వార్టర్స్ నుంచి అందరూ లారీలో బయలుదేరినప్పటి నుంచి గమనిస్తున్నాడు. పోలింగ్ ఆఫీసరు ఆ అమ్మాయితో చనువుగా మాట్లాడటానికి ప్రయత్నిస్తున్నాడు. గొప్పలు చెబుతున్నాడు. గొప్పతనం తనకే ఉన్నట్టుగా దర్పాలు పోతున్నాడు. అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్‌కి ఆ అమ్మాయిని చూస్తుంటే ముచ్చటగా అనిపిస్తోంది. తనకు అంత వయసు కూతురు ఉంది. తన కూతురు చదువుకుంటోంది. ఈ అమ్మాయి హోమ్‌గార్డ్‌గా పని చేస్తోంది. తన కూతురు ఈ సమయంలో ఇంట్లో సురక్షితంగా నిద్రపోతూ ఉంటుంది. ఈ అమ్మాయి ఈ పాతకాలం నాటి స్కూల్లో కాళ్ల దగ్గర కుక్కలాగా ఒక మగాడు తారాట్లాడుతుండగా....

చీకటి అలాగే ఉంది.

మళ్లీ నిద్ర పట్టేసింది.

బోరింగ్ శబ్దం వినవస్తుంటే మెలకువ వచ్చింది. కళ్లు తెరిచి చూశాడు. చీకటిగానే ఉంది. టార్చి వేసి టైమ్ చూసుకున్నాడు. ఐదుంపావు. గదిలో ఎవరూ లేరు. ఆ అమ్మాయి గొంతు వినిపించింది–

'పీవో సారూ... ఇటువైపు రావద్దు. స్నానం చేస్తున్నా. కాసేపు ఆగి రండి. ఇటువైపు రావద్దన్నానా'

లేచి కూర్చున్నాడు. పీవో బూడిదరంగు నీడలాగా గదిలోకి వచ్చాడు.

'అదీ కడుపులో బాగలేకపోతే లేచానండీ' నసిగాడు.

తెల్లవారిపోయింది. పోలింగ్ మొదలైపోయింది. పీవో ధుమధుమలాడుతూ డ్యూటీ చేస్తున్నాడు. ఆ అమ్మాయి ఓపిగ్గా డోర్ దగ్గర నిలబడి వచ్చే జనాన్ని అదుపుచేస్తూ లోపలికి పంపుతూ ఉంది. నవ్వు ముఖం. లొంగని నవ్వు ముఖం. ఆ నవ్వు చూస్తుంటే పీవోకి ధుమధుమ పెరిగిపోతోంది.

డ్యూటీ ముగించుకుని ఆ రాత్రి తిరుగుప్రయాణంలో లారీ ఎక్కారు. పీవో, ఏపీవో, ఆ హోమ్‌గార్డు అమ్మాయి.

ఉన్నట్టుండి పీవో వాగాడు– 'పోలీసులు రేపులు చేశారని వార్తలు వస్తుంటాయి. ఏం... వాళ్లకు ఆడపోలీసులు సరిపోకనా? ఆడపోలీసులు ఉంటారుగా వాళ్లకు'

కచ్చ తీరింది.

ఆ అమ్మాయి చురుగ్గా చూసింది.

'ఏం నోరు సార్ మీది. ఈ మాట అన్న నోటితో మీరు అన్నం ఎలా తింటారు?' అంది.

డిస్ట్రిక్ట్ హెడ్‌క్వార్టర్స్ వచ్చాక పీవో మాటవరుసకు వెళ్లొస్తానని కూడా అనకుండా వెళ్లిపోయాడు. ఏపీవో దగ్గరకు ఆ అమ్మాయి వచ్చింది సెలవు తీసుకోవడానికి.

'ఎలా చేస్తున్నావమ్మా ఈ ఉద్యోగం'

'తప్పదు సార్. బతకాలంటే చేయకతప్పదు కదా.'

'మరి ఈ ఇబ్బందులు'

'ఇబ్బందులకు బయపడతామా సార్. ఎక్కడకు వెళ్లినా ఇలాంటి కుక్కలు ఉండనే ఉంటాయి'

మళ్లీ అంది–

'ఆడదంటే నడుమూ వీపూ కండ అని మగాళ్లు అనుకునే వాతావరణం ఉన్నంతకాలం ఇది తప్పదు సార్'

ఆ మాట అంటున్నప్పుడు ఆ అమ్మాయి గొంతులో జీర కదలాడింది.

ఏపీవో గుండెలో కూతురుని తలుచుకుని చిన్న భయం తారాట్లాడింది.

తన కూతురు సురక్షితంగా తన రెక్కల కింద పెరుగుతోంది అనుకుంటున్నాడు గానీ ఆ రెక్కల బలమెంత... బయట గాలివాన ఎంత?

పెద్ద ప్రశ్న.

కథ ముగిసింది.

కేతు విశ్వనాథ రెడ్డి రాసిన 'రెక్కలు' కథ ఇది.

లోకం ఇలాగే ఉంటుందా... లోకం ఇలా ఇంకా ఎంతకాలం ఉంటుంది. సంఘంలో ఎందరో మగవాళ్లు. పెద్ద పెద్ద ఆఫీసర్లు, ఉద్యోగులు, నాయకులు, సంస్థాధిపతులు, లెక్చరర్లు, టీచర్లు.... పగటి వేళ వాళ్లు మనుషులు కావచ్చు. చీకటి పడితే తోడేళ్లు కావచ్చు.

స్త్రీల మాంసం కోసం కాచుకుని ఉండే ఇలాంటి తోడేళ్లను లొంగని ఆత్మబలం అనే చెప్పుతో కొట్టాలి. అలా కొట్టమని చెప్పే పైలం చెప్పే కథ, ఈ కథ– రెక్కలు.

పునః కథనం: **ఖదీర్**

మార్పు ఎప్పుడూ బాధాకరం కాదు.. ప్రతిఘటనే బాధాకరం!
- బుద్ధుడు

సాగుబడి

'సాక్షి' అందిస్తున్న 'సాగుబడి' కథనాలపై స్పందించదలచారా? అయితే, ఫేస్‌బుక్‌లో sakshi saagubadi గ్రూప్‌ను చూడండి.

ధనిష్ట కార్తె: ఫిబ్రవరి 18 వరకు



సిరిధాన్యాలతో చికిత్సా పద్ధతులపై పాఠకుల ప్రశ్నలకు డాక్టర్ ఖాదర్ సమాధానాలు sakshi.com 'ఫ్యామిలీ' / 'సాగుబడి'లో చదవండి.

● నివాళి

మూడేళ్లయినా అందని సాయం..



శ్రీకాకుళం జిల్లా భామిని మండలం పాత గానసర గ్రామానికి చెందిన వలరోతు భాస్కర్‌రావు 2 ఎకరాల సొంత భూమికి తోడు 5 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి, పత్తి పంటలు సాగు చేశాడు. వరుసగా రెండు సంవత్సరాలు నష్టం వచ్చింది. కూతురు ఝాన్సీ పెళ్లికి రూ. లక్ష అప్పు అయ్యింది. పంటలకు చేసిన అప్పు రూ. 2 లక్షలు కలసి.. మొత్తం ప్రైవేటు అప్పు రూ. 3 లక్షలు. వడ్డీ నెలకు నూటికి 3 రూపాయలు. ఇక అప్పుల బాధ తీరదని భావించిన భాస్కర్‌రావు 2014 డిసెంబర్ 24న పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మూడేళ్లు దాటిపోయింది. కానీ, భాస్కర్‌రావు భార్య లక్ష్మికి ఇంతవరకూ వితంతు పింఛను కూడా రావటం లేదు. ఇక ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి ప్రభుత్వం ఇచ్చే ఎక్స్‌గ్రేషియా ఊసేలేదు. ఆంధ్రప్రదేశ్‌లో రైతు ఆత్మహత్య బాధిత కుటుంబాలపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇదొక ఉదాహరణ.

● శిక్షణ

పండ్లు, కూరగాయల శుద్ధిపై 4 రోజుల శిక్షణ

సొసైటీ ఫర్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ అండ్ డవలప్‌మెంట్(సీడ్), స్వచ్ఛంద సంస్థ, ఆధ్వర్యంలో ఫిబ్రవరి 27 నుంచి మార్చి 2 వరకు హైదరాబాద్‌లో సోలార్ డ్రయ్యర్లతో పండ్లు, కూరగాయలను ఎండబెట్టి శుద్ధి(ప్రోసెసింగ్) చేయడంపై శిక్షణా శిబిరం జరగనుంది. మామిడి, పైనాపిల్, చిరుధాన్యాలు, కేరట్ తదితర పండ్లు, కూరగాయలను సోలార్ డ్రయ్యర్ల ద్వారా పరిశుభ్రమైన, పర్యావరణ అనుకూల పద్ధతుల్లో సౌర విద్యుత్తుతో శుద్ధి చేయడం ప్రత్యక్షంగా నేర్పిస్తారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 7లోని 'సీడ్' పరిశోధనాశాలలో శిక్షణ ఇస్తారు. రిజిస్ట్రేషన్ తదితర వివరాలకు.. 040– 23608892/23546036 నంబర్లలో సంప్రదించవచ్చు. www.seedngo.com

సహజ సాగుపై 41 రోజుల ఉచిత శిక్షణ



వ్యవసాయ రంగంలో ఉపాధి పొందగోరే టెన్త్, ఇంటర్, డిగ్రీ, వ్యవసాయ పాలిటెక్నిక్ చదివిన యువకులకు డా. చోహాన్ క్యూ(దక్షిణ కొరియా) సహజ సాగు, చింతల వెంకటరెడ్డి (సీవీఆర్) మట్టి ద్రావణంతో సాగు పద్ధతులపై 41 రోజుల పాటు క్షేత్రస్థాయిలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు న్యూలైఫ్ ఫౌండేషన్(హైదరాబాద్) వ్యవస్థాపకుడు షిండే శివశంకర్ తెలిపారు. మార్చి 1 నుంచి రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో భోజన వసతితో కూడిన ఉచిత శిక్షణ ఇస్తారు. ఫిబ్రవరి 18 లోగా 81210 08002/ 70938 55664 నంబర్లలో 'వాట్సాప్' ద్వారా సంప్రదించవచ్చు.



భర్తను కోల్పోయిన యువతికి బతుకుబాట చూపిన ప్రకృతి వ్యవసాయం. జీవామృతాల ఉత్పత్తులతో దేశవిదేశీ ప్రముఖుల ప్రశంసలందుకుంటున్న యువ మహిళా రైతు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నూతక్కి గ్రామానికి చెందిన మహిళా రైతు కొండా ఉషారాణి విజయగాథ ఇది.



జీవామృతమే జీవనాధారం!

"పదోతరగతి పూర్తికాగానే పదిహేడేళ్ల వయసులో పెళ్లి పేరుతో అత్తింట కాలు మోపాను. మూడున్నరేళ్లలో ఇద్దరు బిడ్డలు కలిగారు. సాఫీగా సాగుతున్న నా జీవితంలో భర్త సుధాకర్‌రెడ్డి ఆకస్మిక మరణం నాకో పెద్ద షాక్. ఏం చేయాలో తెలీదు. చంటిపిల్లలు. అర ఎకరం భూమి తప్ప ఆస్తులు లేవు. చదువు పెద్దగా లేదు. బిడ్డల్ని ఎలా సాకాలో దిక్కుతోచేది కాదు. దుఃఖాన్ని దిగమింగుకుంటూనే మా అమ్మ సాయంతో సమీప గ్రామం కాజలో పొగాకు కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిలో చేరాను. రోజూ 12 గంటల డ్యూటీ చేసినా నెలాఖరుకు చేతిలో పడేవి రూ.1500. అవి ఏమూలకూ వచ్చేవి కావు. ఇలా కాదని రూ.20 వేలు పెట్టుబడితో చీరలు తెచ్చి, ఇంట్లోనే అమ్మసాగాను. కొన్ని రోజులు ఫర్వాలేదు అనిపించింది. ఓ రోజు ఇంట్లో దొంగలు పడి విలువైన వస్తువులతో పాటు చీరలూ ఎత్తుకుపోయారు. దీంతో మళ్లీ నా బతుకు ప్రశ్నార్థకమైంది. ఉపాధి కోసం వెతుకులాట.

బయో ఎరువుల మార్కెటింగ్

నేను రైతు కుటుంబం నుంచి వచ్చాను కాబట్టి వ్యవసాయం పట్ల అవగాహన ఉంది. చుట్టు పక్కల రైతులు కొందరు సొంతంగా జీవామృతాలను తయారుచేసి వాడటం చూసేదాన్ని.

బయో ఎరువుల కంపెనీ నుంచి అలాంటి మార్కెటింగ్ చేస్తే బాగుంటుందనిపించింది. ప్రయత్నించి చూద్దామని షాపుల వాళ్లను కలిసి, ఎరువుల శాంపిల్స్ తీసుకున్నాను. సంచిలో ఆ శాంపిల్స్ పెట్టుకొని ఆటోలో మంగళగిరి చుట్టుపక్కల 14 గ్రామాలు తిరుగుతూ మార్కెటింగ్ చేసేదాన్ని. సూర్యోదయంతో పాటే నా ప్రయాణం మొదలయ్యేది. ఉదయం 6.30 గంటలకు బయట కాలుపెడితే తిరిగొచ్చే సరికి చీకటి పడేది. చంటి బిడ్డల ఆలనా పాలనా చూడలేకపోతున్నాను అనే నిస్సహాయత గుండెను పిండేస్తుండేది. కానీ, ఈ పని మానుకొంటే నా పిల్లల నోటికి నాలుగు మెతుకులు అందించేదెలా? అమ్మానాన్నలు ఎన్నాళ్లని సాయం చేస్తారు? అందుకే నా నడక ఆగేది కాదు.

ఆశల సాగు



ఈ క్రమంలోనే 2007–08లో సుభాష్ పాలేకర్ ప్రకృతి వ్యవసాయం గురించి తెలుసుకున్నాను. నా జీవితానికో ఆలంబన దొరుకుతుందన్న ఆశ మొలకెత్తింది. కాకినాడ, గుంటూరు, తిరుపతిలో శిక్షణ తరగతులకు హాజరయ్యాను. ప్రతి అంశాన్నీ నోట్స్ రాసుకుని సొంతంగా ప్రకృతి సేద్య ప్రయోగాలు ఆరంభించాను. జీవామృత తయారీకి ఆవు కావాలి. కొనాలంటే డబ్బు లేక కొన్ని గోశాలల నుంచి గో మూత్రం, పేడ సేకరించేదాన్ని. ఉమ్మెత్త, వేపాకు, రావి, జిల్లేడు.. వంటి ఆకులను సేకరించి వీటితో జీవామృత కషాయాల తయారీని మొదలుపెట్టాను. వీటిని రైతులకు ఎలా అమ్మాలి.. నేను ఆచరణలో పెడితేనే నలుగురూ నమ్ముతారు. అందుకే మా ఆయన మిగిల్చి వెళ్లిన అర ఎకరం పొలం, పుట్టింటి వాళ్లిచ్చిన 40 సెంట్ల పొలంలో దొండ పందిరి, మినుము వేశాను. తర్వాత మునగ, అంతర పంటగా మిర్చి సాగు చేశాను. నా కష్టాన్ని చూసి ఎగతాళి చేసినవారున్నారు. సాధ్యమయ్యే పనికాదని నిరుత్సాహపరిచిన వారున్నారు. కానీ, మా అమ్మ నాకు అండగా నిలిచింది. పంటలకు నేను తయారు చేసిన జీవామృత కషాయాలను వాడాను. దిగుబడులు బాగానే వచ్చాయి. పంట మార్పిడి కోసం కాలీఫ్లవర్ వేశాను. ధరలు తగ్గిపోవడంతో నష్టం వచ్చింది. నాలుగేళ్లుగా మునగ, పసుపు, వరి పంటలు సాగు చేస్తున్నాను. తర్వాత 80 సెంట్లలో మినుము 4.5 క్వింటాళ్ల దిగుబడి రావడంతో అంతరపంటగా కూరఅరటి, చిక్కుళ్లు సాగు చేశాను. కిందటి సీజనులో 40 సెంట్లలో వేసిన మునగ నెలన్నర ముందుగానే దిగుబడినిచ్చింది. టన్నుకు పైగా మునగ కాయల దిగుబడి వచ్చింది. మళ్లీ ఇప్పుడు మునగ, పసుపు, వరి పైర్లు సాగులో ఉన్నాయి. ఇప్పుడు నా దగ్గర రెండు ఆవులు ఉన్నాయి. వీటి మూత్రం, పేడ, ఆకులతో చేసిన జీవామృతం మా పొలం వరకు సరిపోతాయి. నేను సాగుచేస్తున్న విధానాలు చూసిన రైతులు ఘన, ద్రవ జీవామృతాన్ని తయారుచేసిమ్మన్నారు.

> ప్రభుత్వం ఆర్థికంగా తోడ్పాటునందిస్తే 500 ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేయించాలని, సమీప ఊళ్లలో ఆదర్శ వ్యవసాయ క్షేత్రాలను నెలకొల్పాలనేది నా ఆశయం

రైతుల ఆదరణతో కషాయాల ఉత్పత్తి

రెండేళ్ల క్రితం ఊరి బయట మా సొంత స్థలంలోనే శ్రీవాసవీ దుర్గా ప్రకృతి వ్యవసాయ కషాయాల ఉత్పత్తుల యూనిట్‌ను స్థాపించాను. ప్రభుత్వం ఎన్‌పీఎం యూనిట్ కింద రూ.40 వేలు సబ్సిడీ ఇచ్చారు. ఘనజీవామృతం, ద్రవ జీవామృతం, దశపర్ణిక కషాయం, పంచగవ్య, అగ్నాస్త్రం, బ్రహ్మాస్త్రం, నీమాస్త్రం సొంతంగా యూనిట్‌లో తయారీ చేస్తున్నాను. వీటికి కావల్సిన గోమూత్రం, పేడ గోశాలల నుంచి సేకరిస్తున్నాను. 2 కేజీల నుంచి 50 కేజీల వరకు వీటి ప్యాకింగ్ ఉంటుంది. వీటిని దాదాపు 150 మంది రైతుల వరకు కొనుగోలు చేసి ప్రకృతి సేద్యంలో వినియోగిస్తున్నారు.

ఇటీవల విజయవాడలో జరిగిన ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన స్టాల్‌కు మంచి ఆదరణ లభించింది. పూల నర్సరీల నిర్వాహకులు, మేడలపై ఇంటిపంటల సాగుదారులు, పల్నాడు రైతులు కూడా ఈ ఉత్పత్తులను కొని తీసుకెళుతున్నారు. ఒక్కోసారి డిమాండుకు సరిపడా సరఫరా చేయలేకపోయానే అనుకునే సందర్భాలూ ఉన్నాయి. ఇద్దరు పనివారిని పెట్టుకుని స్వయంగా ఈ పనులను చేస్తుంటాను. మా అమ్మ, పిల్లలూ ఈ పనిలో సాయం చేస్తుంటారు. ఖర్చునెలకు రూ.65 వేల వరకు వస్తుంది. అన్ని ఖర్చులు పోను నెలకు 15 నుంచి 20 వేల రూపాయల వరకు ఆదాయం ఉంటుంది.

నిపుణుల ప్రశంసలు

ఈ విజయంతో ప్రకృతి వ్యవసాయ సలహాదారు విజయకుమార్, కెన్యాలోని వరల్డ్ ఆగ్రో ఫారెస్ట్రీకి చెందిన నిపుణులు సహా పలువురు విదేశీ ప్రతినిధులు, ప్రముఖులు మా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల యూనిట్‌ను సందర్శించి, అభినందించారు. ప్రభుత్వం ఆర్థికంగా తోడ్పాటునందిస్తే 500 ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేయించాలని, సమీప ఊళ్లలో ఆదర్శ వ్యవసాయ క్షేత్రాలను నెలకొల్పాలనేది నా ఆశయం'' అంటూ తన విజయగాథను వివరించారు ఉషారాణి. ఆమె (94948 49622) కల నెరవేరాలని ఆశిద్దాం.

- బి.ఎల్.నారాయణ,
సాక్షి, తెనాలి, గుంటూరు జిల్లా

పసుపు తవ్వే పరికరం ఇదిగో..!

తయారు చేసుకున్న తొంబరావుపేట రైతు శాస్త్రవేత్తలు..10 రోజులు తవ్వే పసుపును ఈ పరికరంతో ఒక్క రోజులోనే పూర్తి



పసుపును సాగు చేసే రైతులు, పసుపు తవ్వకం సమయంలో కూలీలు దొరక్క చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం తొంబరావుపేట గ్రామానికి చెందిన పసుపు రైతులు తమ సమస్యలకు తామే తగిన పరిష్కారాలు వెతుక్కుంటున్నారు. గత జూలైలో పసుపు విత్తే సమయంలో కూడా కూలీల కొరత నేపథ్యంలో తమకు అవసరమైన విధంగా పసుపు వేసే పరికరాన్ని తయారు చేసుకున్నారు (దీనిపై 'సులువుగా పసుపు విత్తే పరికరం' కథనాన్ని 2017 జూలై 11న 'సాగుబడి'లో ప్రచురించాం). అదే వరుసలో.. ట్రాక్టర్‌కు బిగించి పసుపు తవ్వే పరికరాన్ని తాజాగా రూపొందించుకోవడం విశేషం.

బెడ్ పద్ధతికి అనువుగా నూతన పరికరం..

ఈ అధునాతన పసుపు తవ్వే పరికరాన్ని మినీ ట్రాక్టర్‌కు వెనుక జోడించి ఉపయోగించవచ్చు. బెడ్ పద్ధతిలో సాగు చేసిన పసుపు పంటకు ఇది మరింతగా ఉపయోగపడుతుంది. బెడ్‌ల మధ్య 18 అంగుళాలు, సాళ్ల మధ్య 12 అంగుళాల దూరం ఉంటుంది. ఒక బెడ్‌పై రెండు లైన్ల పసుపు మొక్కలు ఉంటాయి. పసుపు పక్వానికి వచ్చి ఆకులు పసుపు వర్ణానికి మారిన తర్వాత, రైతులు పసుపు ఆకును కోస్తారు. ఆ తర్వాత పసుపు తవ్వడానికి మినీ ట్రాక్టరుకు ఈ పరికరాన్ని జోడించి ఉపయోగిస్తున్నారు.

పసుపు తవ్వకానికి నాలుగు రోజులు ముందు పొలమంతా సాగు నీటిని పారగట్టడం తప్పని సరి. ఈ పరికరం పసుపు సాళ్లలో వెళ్లినప్పుడు పసుపు పైకిలేచి తిరిగి అందులోనే ఉంటుంది. దీనివల్ల పసుపు ఎండిపోకుండా ఉంటుంది. పరికరం ద్వారా తవ్విన తర్వాత కూలీలు వచ్చినప్పుడు కొమ్ములను విరుచుకోవచ్చు. పసుపు తవ్వినందుకు ట్రాక్టర్ కిరాయిగా ప్రస్తుతం గంటకు రూ. 800 వరకు తీసుకుంటున్నారు. భూమి ఎత్తు పల్లాలు లేకుండా ఉంటే తవ్వకం తొందరగా పూర్తవుతుంది. కొంతమంది రైతులు ఇటీవల పెద్ద ట్రాక్టర్‌కు సైతం ఇలాంటి పరికరాన్ని రూపొందిస్తున్నారు.

- పన్నాల కమలాకర్ రెడ్డి,
జగిత్యాల అగ్రికల్చర్, సాక్షి

రైతులందరం కలిసి తయారుచేసుకున్నాం..



పసుపు విత్తడానికి, తవ్వడానికి మా ఊర్లో కూలీలు దొరకడం లేదు. దీంతో, యువ రైతులందరం కలిసి ఆలోచించాం. దాంతో, ఒక్కొక్కరు తమ అనుభవాలను చెప్పడంతో, దాని ప్రకారం ట్రాక్టర్‌కు బిగించి పసుపు విత్తే పరికరాన్ని గతంలో తయారు చేశాం. ఇప్పుడు పసుపు తవ్వే పరికరాన్ని రూపొందించాం. దీంతో, రోజుల తరబడి చేసే పనులను ఒకే రోజులో చేయగలుగుతున్నాం. పెద్ద ట్రాక్టర్‌కు కూడా బిగించే పరికరాన్నీ సిద్ధం చేస్తున్నాం.

- ఏలేటి రాజిరెడ్డి(94942 72409),
తొంబరావుపేట, జగిత్యాల జిల్లా

ఒక కూలీ ఖర్చుతోనే అరెకరం పసుపు తవ్వాను..



ఈ నూతన పరికరం ద్వారానే తన ఎకరం తోటలో వేసిన పసుపును తవ్వాను. అంతకుముందు కూలీలతో తవ్వించినప్పుడు పసుపు కొమ్ములు చెడిపోయేవి. ఎకరం పసుపు తవ్వకానికి కూలీలు దొరక్క దాదాపు 10 రోజులు పట్టేది. ఈ పరికరం రావడంతో ఒక రోజు తవ్వి, మరో రోజు కొమ్ములు విరవడంతో పని తేలికైంది. ఒక కూలీ ఖర్చుతోనే అర ఎకరం పసుపు తవ్వాను.

- నల్ల రవి(95535 25623),
తొంబరావుపేట, మేడిపల్లి మం.,
జగిత్యాల జిల్లా

● అగ్రి టూరిజం



కళాత్మక వరి పొలం!

చేస్తున్న పనికి కళను, సృజనాత్మకతను జోడిస్తే చాలు.. అద్భుతమైన కళాకృతులు కళ్లముందు ప్రత్యక్షమవుతాయి. ఈ సూత్రం కేన్వాసుకే కాదు.. పొలానికి కూడా వర్తిస్తుంది! వరి పొలానికి కళాకాంతులు అద్దితే.. అది సందర్శకులను ఆకర్షించే పర్యాటక స్థలంగా మారిపోతుంది. జపాన్‌లోని ఇనకటడె అనే గ్రామం రైస్ పాడీ ఆర్ట్‌కు పెట్టింది పేరు. డజన్ల కొద్దీ రంగు రంగుల దేశీ వరి వంగడాలను భారీ కళాకృతుల రూపంలో నాటి సాగు చేయడంతో పచ్చని వరి పొలాలు పర్యాటక స్థలాలుగా మారి కాసులు కురిపిస్తున్నాయి. ఈ అగ్రి టూరిజం టెక్నిక్.. మహారాష్ట్రలోని దొంజె ఘట అనే గ్రామాన్ని సైతం పర్యాటక కేంద్రంగా మార్చి వేసింది. జపాన్‌లో సంచలనం సృష్టిస్తున్న పాడీ ఆర్ట్ గురించి ఇంటర్నెట్ ద్వారా తెలుసుకున్న.. పుణేకి చెందిన శ్రీకాంత్ ఇంగాల్‌హలికర్ అనే ఇంజనీర్ తన ఐదెకరాల వరి పొలంలో 40 మీటర్ల భారీ వినాయకుడు, తదితర కళాకృతులను రూపొందించారు. ఆకుపచ్చని వరి పొలంలో నల్లగా ఉండే వరి మొక్కలను నాటడం ద్వారా ఆహ్లాదకర దృశ్యాన్ని ఆవిష్కరించారు.

వంటింటి తడి చెత్తతో కుండీల్లోనే కంపోస్టు!

అపార్ట్‌మెంట్లలో నివసించే కుటుంబం వంటింటి తడి చెత్తను బయట పారేయకుండా చేయగలగడం ఎలా? ఈ సమస్యకు సరైన పరిష్కారం వెదకగలిగితే నగరాలు, పట్టణాల్లో మున్సిపాలిటీ వాళ్లకు చెత్తకు సంబంధించి సగం యాతన/ఖర్చు తగ్గుతుంది. ఈ దిశగా ఓ యువకుడి అన్వేషణ చక్కని పరిష్కారాన్ని ఆవిష్కరించింది. బాల్కనీలో ఐదు కుండీలు పెట్టుకొని ఆకుకూరలు పెంచుతూ, ఆ కుండీల్లోని మట్టిలోనే ఒక మూలన చెత్త డబ్బాను ఏర్పాటు చేసుకొని వంటింటి వ్యర్థాలతో కంపోస్టు తయారు చేసే(వార్మ్‌బిన్) పద్ధతిని అనుసరిస్తున్నారు.



టేకూరు రవిశంకర్ స్వస్థలం నెల్లూరు రూరల్ మండలంలోని వెంకన్నపాలెం. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. రాజేంద్రనగర్ ఉప్పరపల్లిలో అపార్ట్‌మెంట్‌లో నివాసం. బాల్కనీలో 5 కుండీలను ఏర్పాటు చేసుకొని పాలకూర, తోటకూర, మెంతికూర, కొత్తిమీరను సాగు చేసుకుంటూ సేంద్రియ ఆహారాన్ని తింటున్నారు. వంటింటి నుంచి వెలువడే తడి చెత్తను బాల్కనీలో వాసన ఇతరత్రా ఇబ్బందులూ లేకుండా కంపోస్టుగా మార్చడానికి రవిశంకర్ చేయని ప్రయత్నాల్లేవు.. చివరకు మొక్కలు పెరుగుతున్న కుండీల్లోనే.. వంటింటి వ్యర్థాలను కంపోస్టుగా మార్చే ఉపాయాన్ని ఆలోచించి, విజయవంతంగా ఆచరణలో పెట్టారు. నిశ్చింతగా కంపోస్టు తయారు చేసుకోవడం, ఆకుకూరలు పండించుకోవడం సజావుగానే సాగుతోంది.

బాల్కనీలో 3 అడుగుల పిట్టగోడపైన గ్రిల్స్ బిగించి అక్కడ కుండీలను ఏర్పాటు చేశారు. 3 అడుగుల ఎత్తయిన కుండీలను తీసుకొని.. అందులో అర అడుగు ఎత్తు ఉండే ఖాళీ ప్లాస్టిక్ సీసా/డబ్బాను పెట్టారు. డబ్బా అడుగును పూర్తిగా కత్తిరించి తీసేశారు. దానికి చుట్టూతా చిన్నపాటి బెజ్జాలు చేశారు. దాన్ని కుండీలోని మట్టిలో ఒక అంగుళం పైకి కనపడే విధంగా పెట్టారు. ఒక్క మాటలో చెప్పాలంటే.. ఆకుకూరలు పెరిగే కుండీలోనే వానపాములు కంపోస్టు తయారు చేసే డబ్బానొకదాన్ని(దీనికి 'వార్మ్ బిన్' అని పేరు పెట్టారు) ఏర్పాటు చేశారన్నమాట.

రెండు రోజులకోసారి...

ప్లాస్టిక్ డబ్బాలో అడుగున (బొమ్మలో చూపిన విధంగా) అడుగున ఒకటి, కొంచెం కంపోస్టు వేసి.. ఆపైన పండ్లు, కూరగాయల తొక్కలు వేసి, గుడ్డను కప్పుతారు. డబ్బాకు పైన మూతపెడతారు.

కొద్ది రోజుల్లోనే వానపాముల సంఖ్య పెరిగి ఈ తడి చెత్తను తింటూ కంపోస్టుగా మారుస్తూ ఉంటాయి. రెండు రోజులకోసారి వంటింట్లో కూరగాయలు, పండ్లు వేసి, మూత పెడుతూ ఉంటే చాలు.. వానపాములు ఈ డబ్బా అడుగు నుంచి, పక్కన బెజ్జాలలో నుంచి కిందికి పైకి తిరుగుతూ తడి చెత్తను తింటూ కంపోస్టుగా మారుస్తూ ఉంటాయి. ఈ క్రమంలో వెలువడే పోషక ద్రవం మొక్కల వేళ్లకు ఎప్పటికప్పుడు అందుతూ చక్కని పోషకాలను అందిస్తూ ఉంటుందంటున్నారు రవిశంకర్(97030 16820).

ఏఎన్‌యూ దూర విద్య డిగ్రీ పరీక్షా ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో గత ఏడాది డిసెంబరులో నిర్వహించిన బీఎస్సీ, బీహెచ్ఎం, బీబీఎం, బీబీఏ, బీఏ కోర్సుల మొదటి, రెండో, మూడో సంవత్సరం పరీక్షా ఫలితాలను సోమవారం విడుదల చేశారని దూర విద్యా కేంద్రం పరీక్షల విభాగం డిప్యూటీ రిజిస్ట్రార్ జి.జాన్సన్ తెలిపారు. ఫలితాలను www. anucde. info వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చు అన్నారు. రీవాల్యుయేషన్ ఫీజు చెల్లించేందుకు ఈ నెల 23 చివరితేదీగా నిర్ణయించామని, ఫీజు ఒక్కో పేపర్‌కు రూ.770 చెల్లించాలన్నారు. సంబంధిత దరఖాస్తులను ఈనెల 28వ తేదీలోగా యూనివర్సిటీ దూర విద్యా కేంద్రంలో సమర్పించాలని సూచించారు.

22 నుంచి ప్రొఫెసర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పలు విభాగాల్లో ప్రొఫెసర్, బ్యాక్‌లాగ్ అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఈ నెల 22వ తేదీ నుంచి ఇంటర్వ్యూలు జరుగుతాయని వర్సిటీ వీసీ ఎ.రాజేంద్రప్రసాద్ తెలిపారు. 22వ తేదీన తెలుగు, ఓరియంటల్ లాంగ్వేజీల్లో ప్రొఫెసర్ పోస్టుకు, ఇంగ్లిషు విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సోషియాలజీ అండ్ సోషల్‌వర్క్ విభాగంలో ప్రొఫెసర్ పోస్టుకు, లా విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్, మ్యాథమ్యాటిక్స్ విభాగంలో ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. 23వ తేదీన జువాలజీ, బోటనీ అండ్ మైక్రోబయాలజీ విభాగంలో ప్రొఫెసర్ పోస్టులకు, 24న హిస్టరీ అండ్ ఆర్కియాలజీ విభాగంలో ప్రొఫెసర్ పోస్టు, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో అసిస్టెంట్ పోస్టుకు, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో ప్రొఫెసర్ పోస్టు, 25న టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని వెల్లడించారు.

మోసపోయాననే బాధతో అగ్రిగోల్డ్ బాధితుడి మృతి

విశాఖపట్నంలో ఘటన


సూరిబాబు (ఫైల్)

ఆనందపురం(భీమిలి): అగ్రిగోల్డ్ సంస్థ వల్ల మోసపోయిన మరో బాధితుడు సోమవారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం లొడగలవానిపాలేనికి చెందిన లొడగల సూరిబాబు రోజువారీ కూలితో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతనికి భార్య, సంతానంగా ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారు. సూరిబాబు గ్రామంలో ఉన్న కొద్దిపాటి భూమిని అమ్మేసి ఇల్లు నిర్మించుకున్నాడు. మిగిలిన రూ. 10 లక్షలు తన ముగ్గురు పిల్లల భవిష్యత్తు అవసరాల కోసం అగ్రిగోల్డ్ సంస్థలో ఆరేళ్లకు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశాడు. 2016లో డిపాజిట్ కాలం పూర్తి కావడంతో సూరిబాబుకు రూ.20 లక్షలు రావాల్సి ఉంది. అప్పటికే అగ్రిగోల్డ్ సంస్థ బోర్డు తిప్పేయడంతో సూరిబాబు తీవ్ర మనస్థాపంతో అనారోగ్యం పాలయ్యాడు. ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో సోమవారం ప్రాణాలు విడిచాడు.

2014 జూన్ నుంచే బీజేపీపై దుష్ప్రచారం: కన్నా



రైలుపేట(గుంటూరు): ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీని ఎదగనివ్వకుండా చేసేందుకు 2014 జూన్ నుంచే తెలుగుదేశం పార్టీ నేతలు పథకం ప్రకారం కుట్ర చేస్తూ వచ్చారని బీజేపీ నేత కన్నా లక్ష్మీనారాయణ ఆరోపించారు. గుంటూరులోని తన స్వగృహంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా బదులుగా ప్రత్యేక ప్యాకేజీని కేంద్రం ప్రకటించినప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఇతర మంత్రులు సంబరాలు చేసుకున్నారని గుర్తు చేశారు. ప్యాకేజీ తెచ్చిన వారికి సన్మానాలు చేసిన విషయం మర్చిపోయారా అంటూ ప్రశ్నించారు. కేంద్రం నుంచి ఎన్ని నిధులు వచ్చాయి, ఏ పనుల కోసం ఎంతెంత నిధులు ఖర్చు చేశారనేదానిపై టీడీపీ శ్వేతపత్రం విడుదల చేయాలని కన్నా డిమాండ్ చేశారు.

కేంద్ర సహకారాన్ని నేరుగా ప్రజలకే వివరిస్తాం

బీజేపీ నేత జమ్ముల శ్యాం కిషోర్



సాక్షి, అమరావతి: రాష్ట్రానికి కేంద్రం అందించిన సహకారాన్ని నేరుగా ప్రజల వద్దకే వెళ్లి వివరిస్తామని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమ్ముల శ్యాం కిషోర్ పేర్కొన్నారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ తాము ప్రజలకే జవాబుదారీగా ఉంటామని, రాజకీయ పార్టీలకు కాదన్నారు. టీడీపీ మిత్రపక్ష ధర్మాన్ని పాటించకుండా పార్లమెంట్ లోపలా, బయటా నిందాపూర్వక ఆరోపణలు చేయడాన్ని ఆక్షేపించారు. చంద్రబాబు కూడా రాష్ట్ర విభజనకు అనుకూలంగా రాష్ట్రపతికి లేఖ రాశారన్నారు. ఆ విషయాన్ని ధైర్యంగా ప్రజల వద్ద చెప్పలేకపోయారని గుర్తు చేశారు.

ఈఎస్‌ఐల ఏర్పాటుకు అనుమతులివ్వండి

కేంద్రాన్ని కోరిన మంత్రి పితాని

సాక్షి, న్యూఢిల్లీ: విశాఖపట్నంకు మంజూరు చేసిన 500 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి, అమరావతికి మంజూరు చేసిన 300 పడకల ఈఎస్ఐ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని విజయవాడ ఈఎస్ఐ ఆస్పత్రి ప్రాంగణంలో నిర్మించేందుకు అనుమతులివ్వాలని కేంద్ర కార్మిక శాఖ మంత్రి సంతోష్‌కుమార్ గంగ్వార్‌ను రాష్ట్ర మంత్రి పితాని సత్యనారాయణ కోరారు. కేంద్ర మంత్రి గంగ్వార్‌ను సోమవారం ఢిల్లీలోని ఆయన కార్యలయంలో కలిసిన పితాని రాష్ట్రంలోని పలు ఈఎస్ఐ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, నూతన డిస్పెన్సరీల ఏర్పాటుపై చర్చించారు. అలాగే విజయనగరంలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి అవసరమైన భూములను కేంద్రానికి అప్పగించిన నేపథ్యంలో వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరారు. రాష్ట్రంలోని కార్మిక బీమా పథకాన్ని ప్రధాని మంత్రి జన జీవన్‌బీమా యోజనాలో అనుసంధానం చేసి కేంద్రం, రాష్ట్రం చెల్లిస్తున్న బీమా వ్యత్యాసాన్ని సవరించాలన్నారు. ఈ ప్రతిపాదనలపై సంబంధిత అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్టు తెలిపారు.

రఘువీరారెడ్డికి పవన్ ఫోన్!

స్పందించని పీసీసీ చీఫ్

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అందించిన ఆర్థిక సహాయం గురించి చర్చించేందుకు పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డికి జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఫోన్ చేసినా ఆయన స్పందించలేదని తెలిసింది. సోమవారం రఘువీరా పుట్టినరోజు కావడంతో ఆయన కుటుంబ సభ్యులతో తప్ప ఎవరితోనూ మాట్లాడరని కాంగ్రెస్ పార్టీ నాయకులు చెబుతున్నారు. కేంద్రం రాష్ట్రానికి ఇచ్చిన నిధులపై నిజనిర్ధారణ కమిటీ వేసి వాస్తవాలు వెల్లడిస్తామని పవన్ ఇటీవల వెల్లడించిన విషయం తెలిసిందే. రఘువీరా స్పందించకపోవడంతో ఆయన సతీమణి సునీతకు ఫోన్ చేసి మాట్లాడే ప్రయత్నం చేసినా మరొకరోజు మాట్లాడాలని ఆమె పవన్‌కు చెప్పినట్లు సమాచారం.

ఇద్దరు అంతర్జాతీయ స్మగ్లర్ల అరెస్టు

ఎస్పీ అభిషేక్ మొహంతి వెల్లడి


నిందితులు, దుంగలతో ఎస్పీ అభిషేక్

తిరుపతి క్రైం : చిత్తూరు జిల్లా శేషాచల అడవిలో విలువైన ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్జాతీయ స్మగ్లర్లను రామచంద్రాపురం పోలీసులు అరెస్టు చేసినట్టు అర్బన్ జిల్లా ఎస్పీ అభిషేక్ మొహంతి వెల్లడించారు. ఎమ్మార్‌పల్లి సమీపంలోని ఏఆర్ పరేడ్ గ్రౌండ్స్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్న బెంగళూరుకు చెందిన జి. నజీర్ అహ్మద్ అలియాస్ బీటీఎం నజీర్ అలియాస్ నజీర్‌తో పాటు నేపాల్ దేశం ఖాట్మాండ్‌కు చెందిన అంతర్జాతీయ స్మగ్లర్ తషీ షెర్ప అలియాస్ మహ్మద్ ఇషాక్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి 105 కిలోల ఎర్రచందనం దుంగలను, ఒక కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. నజీర్ అహ్మద్‌పై చిత్తూరు జిల్లాలో ఇప్పటికే 10 కేసులు వున్నాయన్నారు. నిందితులు ఇచ్చిన సమాచారంతో రామచంద్రాపురం ఎస్ఐ భాస్కర్‌నాయక్, అర్బన్ జిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సోమవారం తెల్లవారుజామున మైసూరులోని ఎర్రచందనం గోడౌన్‌పై దాడిచేశారని ఎస్పీ చెప్పారు. అక్కడ ఒకటిన్నర టన్నుల బరువుగల 45 దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

‘అమ్మ’ కొలువైనా..

ఆమెకు లేదు రక్షణ

- బెజవాడలో మహిళల భద్రత ప్రశ్నార్థకం
- మహిళా మిత్ర సర్వేలో వెల్లడి

సాక్షి, అమరావతి బ్యూరో

మహిళ అర్ధరాత్రి ధైర్యంగా నడిచి వెళ్లగలిగిన రోజే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు అని మహాత్మా గాంధీ అన్నారు. అయితే రాష్ట్ర రాజధానిలో భాగమైన విజయవాడలో అర్ధరాత్రి కాదు కదా పట్టపగలే మహిళ ధైర్యంగా వెళ్లగలిగే పరిస్థితి లేదు. నగరంలో ఈవ్‌టీజర్లు, రౌడీలు చెలరేగిపోతున్నారు. నగరంలో ప్రధాన ప్రాంతాల్లోనూ మహిళలు ఒంటరిగా సంచరించే పరిస్థితుల్లేవని ఓ మహిళా మిత్ర సభ్యులే తేల్చిచెప్పడం విశేషం. వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో ‘క్లాప్’ కార్యక్రమంలో నిర్వహించిన సర్వేలో వెల్లడైన విషయాలు రాజధానిలో మహిళల దుస్థితిని తేటతెల్లం చేస్తున్నాయి.

ఇదీ ‘క్లాప్’

అమెరికా కాన్సులేట్ కార్యాలయం సహకారంతో విజయవాడలోని వాసవ్య మహిళా మండలి ‘క్లాప్’ అనే కార్యక్రమాన్ని చేపట్టింది. విజయవాడ పోలీస్ కమిషరేట్‌లో అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేసిన ‘మహిళా మిత్ర’ సభ్యులకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ఉద్దేశం. ఇందులో భాగంగా మొదటి దశలో విజయవాడలో గవర్నర్‌పేట, సూర్యారావుపేట, మాచవరం, సత్యనారాయణపురం, సింగ్‌నగర్, నున్న పోలీస్‌స్టేషన్ల పరిధిలో మహిళా మిత్ర సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా ఈ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మహిళల భద్రతపై మహిళా మిత్ర సభ్యుల అభిప్రాయం తెలుసుకోవాలని సర్వే నిర్వహించారు.

40
సర్వేకి ఎంపిక చేసిన ప్రదేశాలు

27
సురక్షితం కానివి



నగర శివార్లలో అధ్వానం

విజయవాడ నడిబొడ్డున ఉన్న ప్రదేశాల్లోనే మహిళలకు రక్షణ కరువైందని సర్వేలో తేటతెల్లమైంది. మరీ ఎక్కువగా నగర శివార్లలోని పోలీస్‌స్టేషన్ల పరిధిలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా ఉందని పోలీసువర్గాలే చెబుతున్నాయి. శివారు ప్రాంతాల్లోనే కాలేజీలు, ఇతర విద్యా సంస్థలు ఎక్కువగా ఉన్నాయి. రౌడీ గ్యాంగ్‌లు, పోకిరీలు నగరంలో ఎక్కడపడితే అక్కడ ఈవ్‌టీజింగ్, వేధింపులకు పాల్పడుతున్నారు. విజయవాడ పోలీసుల అధికారిక లెక్కల ప్రకారమే గతేడాది 2,,500 మంది ఈవ్‌టీజర్లను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించారు.

సర్వే ఇలా..

ఆరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో 40 ముఖ్య ప్రదేశాలను ఎంపిక చేశారు. ఈ ప్రదేశాల పేర్లతో ప్రశ్నావళిని రూపొందించి మహిళా మిత్ర సభ్యులకు నాలుగు ఆప్షన్లు ఇచ్చారు. అవి.. ఎలాంటి అనుమతి లేకుండానే వెళ్లగలం, కుటుంబసభ్యుల అనుమతి తీసుకుంటేనే వెళ్లగలం, ఒక్కరమే వెళ్లలేం, అసలు వెళ్లలేం. ఈ నాలుగు ఆప్షన్లల్లో ఏవి ఆ 40 ప్రదేశాలకు సరిపోతాయని మహిళా మిత్ర సభ్యులను ప్రశ్నించారు. అందుకు వారు ఇచ్చిన సమాధానాలు విజయవాడలో మహిళలు ఎదుర్కొంటున్న విపత్కర పరిస్థితులను తెలిపాయి. ఆ 40 ప్రదేశాల్లో 27 మహిళలకు సురక్షితమైనవి కావని సమాధానమిచ్చారు. కేవలం 13 ప్రదేశాలకు మాత్రమే కుటుంబసభ్యుల అనుమతి లేకుండా ధైర్యంగా వెళ్లగలమన్నారు. ఇంకో 13 ప్రదేశాలకు వెళ్లాలంటే ముందుగా కుటుంబసభ్యుల అనుమతి తీసుకోవాల్సిందేనని చెప్పారు. వీటిలో కంట్రోల్ రూమ్, నెహ్రూ బస్టాండ్, రాజీవ్ గాంధీ పార్క్, కాళీమాత ఆలయం, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం మొదలైన ప్రదేశాలు ఉండటం గమనార్హం. ఈ ప్రదేశాల్లో మహిళలు వేధింపులకు గురవడానికి అవకాశాలు ఎక్కువ ఉన్నాయని స్పష్టం చేశారు. మరో 13 ప్రదేశాలకు కుటుంబ సభ్యులు, స్నేహితులు తోడు లేకుండా వెళ్లలేమని వెల్లడించారు. వాటిలో పాత ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డు, లెనిన్ సెంటర్, సింగ్‌నగర్ బ్రిడ్జ్, టైమ్ ఆస్పత్రి రోడ్, అలంకార్ థియేటర్, సదర్న్ హోటల్ రోడ్డు, రమేశ్ ఆస్పతి రోడ్డు మొదలైనవి ఉండటం గమనార్హం. ఈ ప్రదేశాలకు ఒంటరి మహిళలు వెళ్తే ఈవ్‌టీజింగ్, వేధింపుల బారిన పడాల్సిందేనని తేల్చిచెప్పారు. ఒక ప్రదేశానికి తోడు ఉన్నాసరే వెళ్లలేమని పేర్కొన్నారు.

మెడ్‌టెక్ జోన్‌కు నిధుల ప్రవాహం

- 2015 నుంచి ఇప్పటివరకూ ఒక్క కంపెనీ రాలేదు
- గతంలో ఖర్చుచేసిన రూ.42 కోట్లకూ లెక్కలు లేవు
- 2017–18లో కేటాయించిన రూ. 30 కోట్లు గల్లంతు
- తాజాగా 2018–19 బడ్జెట్‌లో రూ. 285 కోట్ల ప్రతిపాదన



సాక్షి, అమరావతి: పీకల్లోతు అవినీతి కోరల్లో ఇరుక్కుపోయి కోట్లాదిరూపాయల ప్రజాధనాన్ని లూటీ చేస్తున్న మెడ్‌టెక్ జోన్(మెడికల్ టెక్నాలజీ పార్క్–విశాఖ) మళ్లీ నిధుల ప్రవాహం ఊపందుకుంది. తాజాగా 2018–2019 ఆర్థిక సంవత్సరానికి రూ. 285 కోట్లు నిధులు బడ్జెట్‌లో పెట్టాలని ప్రతిపాదించడం విస్మయపరుస్తోంది. 2015లో ఏర్పాటు చేసిన ఈ ప్రాజెక్టులో భాగంగా ఇప్పటివరకూ ఇక్కడకు ఒక్క సంస్థ కూడా కంపెనీలు ఏర్పాటు చేస్తామంటూ ముందుకు రాలేదు. ఇప్పటికే ఆ సంస్థ పేరు చెప్పి రూ. 42కోట్లు ల్యాంకో సంస్థకు ఇచ్చారు. ఆ తర్వాత ఆ సంస్థకు టెండర్లు రద్దుచేశారు. కానీ నిధులు ఏమయ్యాయి అన్నది మాత్రం చెప్పలేదు. ఆ తర్వాత 2017–18 ఏడాదికి రూ. 30 కోట్లు కేటాయించారు. దీనికి కూడా లెక్కలు లేవు. మెడ్‌టెక్ జోన్‌కు సంబంధించి నిధుల వ్యయంపై పలు ఆర్టీఐ దరఖాస్తులు సంబంధిత విభాగానికి వచ్చినా దీనిపై ఎలాంటి సమాధానాలూ రావడం లేదు. ప్రస్తుతం ఈ సంస్థకు ప్రైవేటు కన్సల్టెంట్ అయిన జితేంద్రశర్మ సీఈవోగానూ, డైరెక్టర్‌గానూ ఉన్నారు.

ఇద్దరు డైరెక్టర్లు పదవుల నుంచి తప్పుకున్నా...

గతంలో అప్పటి కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సుజాతా శర్మ, ప్రస్తుత ఆరోగ్యశ్రీ సీఈవో డా.రవిశంకర్ అయ్యన్నార్‌లు మెడ్‌టెక్ జోన్ డైరెక్టర్ పదవుల నుంచి తప్పుకున్నారు. ఈ అవినీతి ఫైళ్లపై సంతకాలు చెయ్యలేమని ఏకంగా మంత్రికీ, ప్రభుత్వానికే లేఖలు రాశారు. అనంతర పరిణామాల నేపథ్యంలో కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సుజాతాశర్మను బదిలీ కూడా చేశారు. ఇప్పుడు కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ సంతకాలు కూడా అవసరం లేకుండా నేరుగా ఉన్నతాధికారులే చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఇందులో వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య, ఆరోగ్యశాఖ సలహాదారు జితేంద్రశర్మలే డైరెక్టర్లుగా కొనసాగుతున్నారు. ఒక్క కంపెనీ ఏర్పాటు చేయకుండా, డైరెక్టర్లు లేఖలు రాసినా పట్టించుకోకుండా, ఏసీబీ, విజిలెన్స్ విభాగాలకు లేఖలు ఇచ్చినా తొక్కిపెట్టి కొనసాగుతున్న ఈ నిధుల ప్రవాహంపై రోజురోజుకూ అనుమానాలు తీవ్రమవుతున్నాయని కుటుంబ సంక్షేమశాఖ అధికారులు చెబుతున్నారు. ఒక దశలో ఆర్థిక మంత్రే మెడ్‌టెక్ జోన్‌పై సంతకాలు చేయకపోతే, నేరుగా ముఖ్యమంత్రి వద్దకే వెళ్లి సంతకాలు చేయించుకుంటున్నట్టు ఆరోపణలున్నాయి.

దళిత తేజం కాదు.. దళిత ద్రోహం

- దళితులపై దాడులు, హత్యలు పెరిగాయి
- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మేరుగ నాగార్జున



విజయవాడ సిటీ: దళిత తేజం అంటే.. దళితులను కింద కూర్చోబెట్టి అగ్రవర్ణాలు కుర్చీల్లో కూర్చోవడమేనా చంద్రబాబూ? అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరుగ నాగార్జున ప్రశ్నించారు. వైఎస్సార్ జిల్లాలో జరిగిన దళిత తేజం సమావేశంలో దళితులను కింద కూర్చోబెట్టిన సంఘటనపై చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ‘దళిత తేజం–తెలుగుదేశం’ పేరును ‘దళిత ద్రోహం–తెలుగుదేశం’గా మార్చుకోవాలని సూచించారు. విజయవాడ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు పాలనలో దళితులపై దాడులు, దళిత మహిళలపై అఘాయిత్యాలు, దళిత నాయకుల హత్యలు పెరిగాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎన్నో అకృత్యాలు

‘స్వయానా చంద్రబాబే దళితుల్లో పుట్టాలని ఎవరు కోరుకుంటారంటూ చెప్పిన మాటలను జనం ఇంకా మర్చిపోలేదు. దళితులు మురికిగా ఉంటారని బాబు కేబినెట్ మంత్రి మాట్లాడినా ఆయన్ను మందలించింది లేదు. దళితుల భూములు టీడీపీ నాయకులు లాక్కుంటున్నా చర్యల్లేవు. గరగప్రరులో దళితులను వెలివేసినా, దేవరపల్లిలో దళితుల భూములు లాక్కున్నా, అనకాపల్లిలో దళితుడిపై దాడి చేసినా, జెర్రిపోతులపాలెంలో దళిత మహిళను వివస్త్రను చేసినా ఏమాత్రం పట్టించుకోరు..’ ఇలా ఎన్నో అకృత్యాలు, అన్యాయాలు జరిగినా మాట్లాడని చంద్రబాబు.. దళిత తేజం అంటూ పోస్టర్లు వేసి కొత్త డ్రామాలు ఆడుతున్నారని నాగార్జున దుయ్యబట్టారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను నీరుగార్చిన చరిత్ర చంద్రబాబుదేనన్నారు. ఇంత జరుగుతున్నా స్పందించని మీరు అసలు దళితులేనా అని మంత్రులు నక్కా ఆనందబాబు, జవహర్‌ను ప్రశ్నించారు. ఆత్మాభిమానం చంపుకొని చంద్రబాబు వద్ద పాలేర్లలా బతకవద్దని ఆయన హితవుపలికారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే దళితులు పండించుకునే భూములకు వారినే యజమానులుగా చేస్తామని చెప్పి వైఎస్ జగన్ దళిత పక్షపాతిగా నిలిచారన్నారు. ప్రతి దళిత గడపకు వెళ్లి చంద్రబాబు అసమానతలు, అంటరానితనాన్ని ప్రచారం చేస్తామని హెచ్చరించారు. దళితలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు.

హెచ్‌టీ విత్తనాలను మేము అమ్మలేదు

నూజివీడు సీడ్స్

సాక్షి, అమరావతి: అనుమతి లేని కలుపును తట్టుకునే హెచ్‌టీ పత్తి విత్తనాలను తమ సంస్థ విక్రయించినట్టు వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని నూజివీడ్స్ సీడ్స్ లిమిటెడ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ తమకు సంజాయిషీ నోటీసు ఇచ్చినట్టు పత్రికల్లో వచ్చిన వార్తలపై ఆ సంస్థ వివరణ ఇచ్చింది. ఒక రైతు ప్రకటన ఆధారంగా ఏపీ స్టేట్ టాస్క్‌ఫోర్స్ నిజానిజాలు తెలుసుకోకుండానే షోకాజ్ నోటీసు ఇచ్చిందని, వాస్తవానికి తాము అదే రోజు టాస్క్‌ఫోర్స్ కమిటీకి వివరణ ఇచ్చామని తెలిపింది. హెచ్‌టీ విత్తనాలను తాము ఉత్పత్తి, అభివృద్ధి చేయలేదని పేర్కొంది. రైతు మన్నవ సూరిబాబు తమ డీలర్ నుంచి రాజా హైబ్రీడ్ సీడ్‌ను కొనలేదని వివరించింది. ఆ రైతు గుర్తుతెలియని సంస్థ నుంచి విత్తనాలు కొనుగోలు చేసి 20 ఎకరాల్లో హెచ్‌టీ కాటన్‌ను సాగుచేస్తున్నారని చెప్పింది. ఈ విత్తనాల అమ్మకంలో తమకు సంబంధం లేదని స్పష్టం చేసింది

ప్రపంచ స్థాయికి తీసిపోనిది తెలుగు సాహిత్యం

- ఇతర భాషల్లోకి అనువాదం కాకపోవడం పెద్ద లోపం
- సాహిత్య అకాడమీపై ఉత్తరాది ప్రభావం భావన సరికాదు
- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు స్వీకరణ సందర్భంగా దేవిప్రియ


దేవిప్రియకు అవార్డు అందజేస్తున్న కంబార్ చంద్రశేఖర్

సాక్షి, న్యూఢిల్లీ : తెలుగు కవిత్వం, సాహిత్యం ప్రపంచంలోని మరే ఇతర సాహిత్యానికీ తీసిపోదని.. దానికి అత్యున్నత ప్రమాణాలు, నాణ్యత ఉన్నాయని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహిత దేవిప్రియ అభిప్రాయపడ్డారు. ఆయన రచించిన ‘గాలిరంగు’ కవిత్వం.. 2017 సంవత్సరానికిగానూ ఉత్తమ కవితా సంపుటి అవార్డుకు ఎంపికైన విషయం తెలిసిందే. 24 భాషల్లో పురస్కారాలకు ఎంపికైన రచయితలకు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం సోమవారం ఢిల్లీలో జరిగింది. కేంద్ర సాహిత్య అకాడమీ నూతన అధ్యక్షుడు డా. కంబార్ చంద్రశేఖర్ చేతుల మీదుగా దేవిప్రియ ఈ అవార్డు అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా కొనసాగిన తన రచనా ప్రస్థానంలో తెలుగు నుంచి ‘గాలిరంగు’కు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకోవడం సంతోషానిచ్చిందన్నారు. ప్రపంచంలోని ఏ సాహిత్య ప్రమాణాలతోనూ తీసిపోని తెలుగు సాహిత్యం, ఇతర భాషల్లోకి అనువాదం కాకపోవడం పెద్ద లోపమని ఆయన అభిప్రాయపడ్డారు. సాహిత్య అకాడమీపై ఉత్తరాది వారి ప్రభావం ఎక్కువగా ఉందన్న భావనను తెలుగు రచయితలు, కవులు వదులుకోవాలన్నారు. తెలుగు సాహిత్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వాలు కూడా చొరవ తీసుకోవాలని కోరారు. తెలుగులో విద్యనభ్యసించే అవకాశాలను ప్రభుత్వాలు భవిష్యత్తు తరాలకు కల్పించాలని, పిల్లలు తెలుగు నేర్చుకునే విషయంలో తల్లిదండ్రులు, కుటుంబం నుంచి స్ఫూర్తి పొందే విధంగా ఉండాలని ఆకాంక్షించారు. కాగా, ఉర్దూలో మొహమ్మద్ బేగ్ ఈ అవార్డును అందుకున్నారు. యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఆయన ఉర్దూ విభాగాధిపతిగా పనిచేసి రిటైరయ్యారు. చిన్న కథల విభాగంలో ఆయన రచించిన ‘దుఃఖమ’ అవార్డుకు ఎంపికైంది. పురస్కారాలు అందుకున్న రచయితలకు జ్ఞాపికతోపాటు రూ.లక్ష నగదు అందజేశారు.

నిర్మాణంలో 30 మోడల్ పోలీస్‌స్టేషన్లు: డీజీపీ

అవనిగడ్డ: దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లోనే తొలిసారిగా మోడల్ పోలీస్‌స్టేషన్లకు శ్రీకారం చుట్టామని డీజీపీ ఎం.మాలకొండయ్య చెప్పారు. అవనిగడ్డలో రూ.1.44 కోట్లతో నిర్మించనున్న మోడల్ పోలీస్‌స్టేషన్‌కు డీజీపీ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో 30 మోడల్ పోలీస్‌స్టేషన్లు నిర్మాణ దశలో ఉండగా, ఇప్పటికే గుంటూరు జిల్లాలో రెండు, సత్తెనపల్లి, కుప్పంలో మోడల్ పోలీస్ స్టేషన్లను ప్రారంభించినట్టు చెప్పారు. మోపిదేవిలో పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మోడల్ పోలీస్‌స్టేషన్లలో ఆధునిక సాంకేతిక పోలీసింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ హౌసింగ్ బోర్డు చైర్మన్ కె.నాగుల్ మీరా, మచిలీపట్నం ఎంపీ కొనకళ్ల నారాయణ, ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, పోలీస్ హౌసింగ్ బోర్డు ఎండీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, జిల్లా ఎస్పీ సర్వశ్రేష్ట త్రిపాఠీ, డీఎస్పీ వి.పోతురాజుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కోట్ల విలువైన స్థలం కబ్జాకు యత్నం

- నకిలీ డాక్యుమెంట్లతో భారీ స్కెచ్
- 10 మందిని అరెస్టుచేసిన విజయవాడ పోలీసులు


నిందితుల వివరాలు మీడియాకు వెల్లడిస్తున్న డీసీపీ గజరాపు భూపాల్

విజయవాడ : నగరంలోని పటమట పోలీసుస్టేషన్ పరిధిలో రూ.6కోట్ల విలువైన స్థలానికి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి సొంతం చేసుకునేందుకు యత్నించిన 10మంది సభ్యుల ముఠాను పోలీసులు సోమవారం అరెస్టుచేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను లా అండ్ ఆర్డర్ డీసీపీ–1 గజరావు భూపాల్ మీడియాకు వివరించి నిందితులను హాజరుపరిచారు. సూర్యారావుపేటలో ఉండే డాక్టర్ యేపూరి మధుసూదనరావు ఇద్దరి కుమార్తెలు, నాదెండ్ల మాధవరావు కుమార్తె పేరుతో రామచంద్రనగర్‌లో సుమారు 1,484 చదరపు గజాల స్థలం ఉంది. తన ఇద్దరు కుమార్తెలు విదేశాల్లో ఉండడంతో ఆ స్థలానికి మధుసూదనరావు జీపీ హోల్డర్‌గా వ్యవహరిస్తున్నారు. మధుసూదనరావు ఈ స్థలాన్ని 2012లో అరుణా మోటార్స్ కంపెనీకి 2017 వరకు లీజుకు ఇచ్చారు. అరుణా మోటార్స్ కంపెనీ వారు సుద్దపల్లి గోపి కమలాకర్ అలియాస్ గోపి అనే వ్యక్తిని అక్కడ వాచ్‌మన్‌గా ఉంచారు. అక్కడ తన తల్లి సుద్దపల్లి విజయకుమారి, తండ్రి సుద్దపల్లి శివయ్యలతో కలిసి గోపి ఉంటున్నాడు. 2017లో అరుణా మోటార్స్ వారు ఈ స్థలాన్ని ఖాళీ చేశారు. ఈ క్రమంలో స్థలాన్ని సొంతం చేసుకుని విక్రయించేందుకు ఒంగోలుకు చెందిన మందాడి ఆదిరెడ్డి, రవి, సొందిపోగు రవీంద్ర అలియాస్ బుజ్జి అనే వ్యక్తులు స్కెచ్ వేశారు.

పథకం ఇలా..

- ప్రకాశం జిల్లా భగవాన్‌రాజుపాలెంకు చెందిన నార్నె పోతురాజు అనే బినామీ వ్యక్తిని తెరపైకి తీసుకొచ్చి, అతనే స్థలానికి యజమానిగా నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు.
- అలాగే సుద్దపల్లి గోపి కమలాకర్, సుద్దపల్లి విజయకుమారిని సంప్రదించి పోతురాజు అనే వ్యక్తి తమను సంబంధిత స్థలంలో వాచ్‌మన్‌లుగా నియమించినట్లు చెబితే వారికి డబ్బు ఇస్తామని చెప్పి ఒప్పించారు.
- అనంతరం ఆదిరెడ్డి, రవీంద్రలు కలిసి అబ్దుల్లా అనే రియల్ ఎస్టేట్ బ్రోకర్ ద్వారా ఖాజా మధుసూదనరావు అనే వ్యకికి రూ.1.10కోట్లకు విక్రయించేందుకు అగ్రిమెంట్ చేసుకుని అడ్వాన్సుగా రూ.10 లక్షలు తీసుకున్నారు.
- తన స్థలాన్ని విక్రయించేందుకు ప్రయత్నం జరుగుతోందని తెలుసుకున్న డాక్టర్ యేపూరి మధుసూదనరావు, తన స్థలంలో ఉంటున్న గోపి కమలాకర్, విజయకుమారిలను తక్షణం ఖాళీ చేయమని చెప్పారు.
- డాక్టర్ మధుసూదనరావు పటమట పోలీసులకు నార్నె పోతురాజు, విజయకుమారిలపై ఫిర్యాదు చేశారు. పటమట సీఐ ఉమామహేశ్వరరావు సమగ్ర విచారణ జరిపి నిందితులు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి కోర్టులో కూడా పిటిషన్ దాఖలు చేసినట్లు గుర్తించారు.

నిందితుల అరెస్టు

దీంతో ఈ కేసులో సూత్రధారులు, పాత్రధారులైన సందెపోగు రవీంద్ర అలియాస్ బుజ్జి, నార్నె పోతురాజు, సుద్దపల్లి విజయకుమారి, సుద్దపల్లి గోపి కమలాకర్, షేక్ అబ్దుల్లా, నక్కా వీరకుమార్, మర్రి రవీంద్ర, ఖాజా మధుసూదనరావు, షేర్ సిరావుద్దీన్ అలియాస్ దిలీప్‌కుమార్, వెల్లంకి సుధాకర్‌లను అరెస్టుచేశారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు మండాది అదిరెడ్డి ఆచూకి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఇమ్మిగ్రేషన్ సిబ్బందికి శిక్షణ ప్రారంభం

గన్నవరంలో శ్రీకారం చుట్టిన విజయవాడ సీపీ గౌతం సవాంగ్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ గౌతం సవాంగ్

విమానాశ్రయం (గన్నవరం) : కృష్ణాజిల్లా గన్నవరం విమానాశ్రయం కేంద్రంగా అంతర్జాతీయ విమాన సర్వీసులు నడిపేందుకు మరో ముందడుగు పడింది. కీలకమైన ఇమ్మిగ్రేషన్ కార్యకలాపాల నిర్వాహణ నిమిత్తం రాష్ట్ర పోలీస్ శాఖ కేటాయించిన అధికారులు, సిబ్బందికి శిక్షణ ప్రారంభమైంది. తొలి విడతగా 13 మందికి ఇమ్మిగ్రేషన్ శిక్షణ తరగతులను సోమవారం విజయవాడ నగర పోలీస్ కమిషనర్ గౌతం సవాంగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇమ్మిగ్రేషన్ నిమిత్తం 55 మంది పోలీస్ అధికారులు, సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు. మొదటి బ్యాచ్‌కు వారం పాటు గన్నవరం విమానాశ్రయంలో, మరో వారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో శిక్షణ ఇస్తామన్నారు. ఇమ్మిగ్రేషన్ విధుల్లో పత్రాల తనిఖీతో పాటు తమ ప్రవర్తన తీరుతో ఆకట్టుకోవాలని సిబ్బందికి సవాంగ్ సూచించారు. ఇంటెలిజెన్స్ బ్యూరో జాయింట్ కలెక్టర్ ఆర్.ఎ. చంద్రశేఖర్ మాట్లాడుతూ, అమెరికాలో 50 లక్షల మంది ప్రవాస భారతీయులు ఉండగా, వారిలో 25 లక్షల మంది తెలుగు వారేనని చెప్పారు. ఎయిర్‌పోర్టు డైరెక్టర్ మధుసూదనరావు మాట్లాడుతూ, మార్చి 15 నాటికి కస్టమ్స్, ఇమ్మిగ్రేషన్ కార్యాలయాల ఏర్పాటుచేస్తామన్నారు. ముంబై నుంచి గన్నవరం వరకు నడుపుతున్న ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌ను దుబాయ్ వరకు విస్తరించడం ద్వారా తొలి విదేశీ సర్వీస్‌కు శ్రీకారం చుడతామని తెలిపారు.

ప్రముఖ వైద్యుడు జీఆర్‌రెడ్డికి అంతర్జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ జీఆర్‌రెడ్డి

తాడేపల్లిగూడెం: పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ జీఆర్‌రెడ్డికి అంతర్జాతీయ అవార్డు లభించింది. ఆసియా పసిఫిక్ అకాడమీ ఆఫ్ ఆప్తమాలజీ ప్రకటించిన అవార్డును ఆయన ఈ నెల 10వ తేదీన హాంకాంగ్‌లో జరిగిన అంతర్జాతీయ నేత్ర వైద్య సదస్సులో అందుకున్నారు. భారతదేశం నుంచి జీఆర్ రెడ్డికి మాత్రమే ఈ అరుదైన పురస్కారం దక్కింది. అంధత్వ నివారణకు కృషి చేస్తున్న వైద్యులకు ఈ అవార్డు ప్రదానం చేస్తారు. 23 దేశాలకు చెందిన 10 మందికిపైగా వైద్యులు సభ్యులుగా ఉన్న ఆసియా పసిఫిక్ సంస్థ ప్రతి ఏడాది సమావేశం ఏర్పాటు చేసి వైద్యులకు ఈ అవార్డును అందజేస్తుంది. గ్రామీణ ప్రాంతంలో గ్లోకోమా (నీటి కాసులు)పై అవగాహన కల్పించడంతోపాటు 30 ఏళ్లుగా డయాబెటిక్ రెటినోపతిని జీఆర్‌రెడ్డి ప్రజలకు చేరువ చేశారు. భారత్‌లో అత్యధికంగా రెటీనా శస్త్రచికిత్సలు చేసిన డాక్టర్‌గా ఆయనకు మంచి గుర్తింపు ఉంది. ఇటీవల ఆయన అధునాతన సౌకర్యాలతో కంటి ఆస్పత్రిని కూడా ప్రారంభించారు. ఖరీదైన రెటీనా ఆపరేషన్లను ఉచితంగా చేస్తున్నారు.

ఉద్యోగం ఇప్పిస్తామని రూ.6 లక్షలు కాజేశారు

విజయవాడకు చెందిన దంపతులపై బాధితుడి ఫిర్యాదు

గుంటూరు: సీఎం క్యాంపు కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తామని విజయవాడకు చెందిన భార్యాభర్తలు తన వద్ద నుంచి రూ.6 లక్షలు కాజేశారని బాధితుడు షేక్ బాజీ సోమవారం సీసీఎస్ డీఎస్పీ సి.హెచ్.శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి వివరాల ప్రకారం.. తెనాలికి చెందిన షేక్ బాజీకి తన స్నేహితుడు షేక్ జియావుద్దీన్ ద్వారా విజయవాడ గుణదలకు చెందిన పులి శ్వేతశ్రీ, ఆమె భర్త రాజు పరిచయమయ్యారు. రూ. 8 లక్షలు ఇస్తే ముఖ్యమంత్రి కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికారు. గతేడాది పలుమార్లు అతడి వద్ద నుంచి మొత్తం రూ.6 లక్షలు వసూలు చేశారు. నెలలు గడుస్తున్నా ఉద్యోగం రాకపోవడంతో బాజీ వారిని నిలదీశాడు. అయితే తమకు సీఎం కార్యాలయంలో మంచి పలుకుబడి ఉందని, పోలీసులకు ఫిర్యాదు చేసినా తమకు భయం లేదని, డబ్బు మాత్రం తిరిగి ఇచ్చేది లేదని తేల్చిచెప్పారు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన బాజీ తన డబ్బును తిరిగి ఇప్పించాలని సోమవారం సీసీఎస్ డీఎస్పీకి విన్నవించాడు. విచారణ జరిపి న్యాయం చేస్తామని డీఎస్పీ హామీ ఇచ్చారు.

కాలువలో నకిలీ రూ.2 వేల నోట్లు

కర్ణాటకలోని గుల్బర్గా జిల్లాలో ఘటన



కాలువలో కొట్టుకువచ్చిన నకిలీ రూ. 2 వేల నోట్లు

కలబురిగి (సాక్షి, బెంగళూరు): పంట కాలువలో కొట్టుకు వచ్చిన రూ.2 వేల నోట్ల కోసం జనం ఎగబడ్డారు. దొరికినోళ్లకి దొరికినన్ని తీసుకొని పరుగులు తీశారు. ఈ ఘటన కర్ణాటక గుల్బర్గా జిల్లాలోని ఇల్‌కళ్ తాలూకా హీరేహళ్ల గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామంలోని కాలువలో రూ.2 వేల నోట్లు కొట్టుకు వస్తుండడాన్ని గమనించిన రైతులు వెంటనే కాలువలోకి దూకి నోట్ల తీసుకునేందుకు పోటీపడ్డారు. అనంతరం అవి నకిలీనోట్లుగా తేలడంతో నిరాశకు గురయ్యారు. తర్వాత ఇల్‌కళ్ పోలీసులు అక్కడికి చేరుకుని సుమారు పది లక్షల రూపాయల మేరకు రూ.2 వేల నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు.

మార్చి 6 నుంచి ఢిల్లీలో కాంగ్రెస్ ధర్నాలు

- విభజన చట్టం హామీల సాధనకు దశలవారీ ఆందోళన
- ఎంపీ టి.సుబ్బరామిరెడ్డి

పెదవాల్తేరు (విశాఖతూర్పు): ప్రత్యేక హోదా, రైల్వేజోన్, విభజన చట్టం హామీల సాధనకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో పలు ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు రాజ్యసభ సభ్యుడు డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి వెల్లడించారు. ఈ మేరకు మార్చి 6 నుంచి 8 వరకు ఢిల్లీలో ధర్నాలు నిర్వహిస్తామని, అలాగే మార్చి 19, 20 తేదీల్లో ఏపీలో అన్ని ఆర్డీవో కార్యాలయాల ఎదుట ధర్నాలు చేస్తామని చెప్పారు. ఆయన విశాఖలో సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇప్పటివరకు ప్రవేశపెట్టిన అన్ని కేంద్ర బడ్జెట్‌ల్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీకి రూ.26 వేల కోట్ల లోటు బడ్జెట్ ఉండగా కేంద్రం మాత్రం రూ.2 వేల కోట్లు మాత్రమే ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విషయమై ఇప్పటికే పార్లమెంటులో కాంగ్రెస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు ఆందోళన చేస్తున్నాయని తెలిపారు. విభజన చట్టం హామీల అమలు సాధనలో కాంగ్రెస్ విఫలమైందా అని ప్రశ్నించగా.. కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో ఏం చేసినా మీడియాలో వార్తలు రావడం లేదని చమత్కరించారు.

హత్యకేసులో ఏడుగురికి యావజ్జీవం

ఏలూరు టౌన్: ఏలూరుకు చెందిన ఓ వ్యక్తి హత్యకేసులో ఏడుగురికి యావజ్జీవ శిక్ష విధిస్తూ.. న్యాయమూర్తి తీర్పుచెప్పారు. వివరాలు.. 2008లో ఏలూరుకు చెందిన చిట్టి సతీష్‌ను కొందరు హత్య చేశారు. ఈ కేసులో 14 మంది నిందితులు కాగా, విచారణ సమయంలో ముగ్గురు చనిపోయారు. కోర్టు 11 మందిని దోషులుగా తేల్చి అప్పట్లో జైలు శిక్ష విధించింది. ఈ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య రాజీ యత్నాలు జరిగాయి. ఈ నేపథ్యంలోనే ప్రతీకార చర్యగా బొట్టా గంగాధర్‌ను తంగెళ్ళమూడిలో వైరి వర్గం హత్య చేసింది. దీనిపై జగురోతుల సత్యనారాయణ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసులో 8 మంది దోషులుగా ఉండగా విచారణ సమయంలో ఒక వ్యక్తి మరణించాడు. విచారణలో ఏడుగురిని దోషులుగా తేల్చారు. కేసులో ఏ2గా ఉన్న కంచి నరేంద్రకృష్ణ కుమార్(పెద్దకృష్ణ) 2016లో హత్యకు గురయ్యాడు. ఏ1 కంచి మురళీకృష్ణ(చిన్నకృష్ణ), ఏ3 మీసాల దుర్గారావు, ఏ4 చిట్టి ప్రసాదు, ఏ5 ఎండీ జానీభాషా, ఏ6 కత్తెర సతీష్, ఏ7 కెంగం గణేష్ అలియాస్ గని, ఏ8 అమరసింగ్ చంద్రసతీష్ కనకరామ్మోహనరావుకు జీవితఖైదు విధిస్తూ జిల్లా మొదటి అదనపు సెషన్స్ న్యాయమూర్తి జి.గోపి తీర్పు చెప్పారు.

ప్రభుత్వ ఆస్పత్రుల స్థాయి పెంపు

బోధనాస్పత్రుల్లో వసతులు కల్పిస్తున్నాం

- 13 ఆస్పత్రులకు ఎన్ఏబీహెచ్ గుర్తింపు కోసం ప్రయత్నిస్తున్నాం
- దీనికోసం రూ.167 కోట్ల వరకూ వ్యయం చేస్తున్నాం
- 'సాక్షి'తో వైద్య విద్యా సంచాలకులు డా.సుబ్బారావు



సాక్షి, అమరావతి: నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ (ఎన్ఏబీహెచ్) ఈ పేరు చాలామందికి తెలియకపోవచ్చు. ఆస్పత్రుల ప్రమాణాలను గుర్తించి నిర్ధారించే సంస్థ ఇది. ఈ సర్టిఫికెట్ ఉందంటే ఆ ఆస్పత్రుల్లో మెరుగైన వసతులు ఉన్నట్టు లెక్క. ఈ సర్టిఫికెట్ ఉన్న ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఇన్సూరెన్స్ నుంచి నగదు వైద్యం వరకూ రేట్లు కాస్త ఎక్కువే. ఉద్యోగుల నగదు రహిత వైద్యం, ఆరోగ్యశ్రీ ఇలా ప్రతి దాంట్లో ఎన్ఏబీహెచ్ గుర్తింపు ఉన్న సంస్థకు ప్రాధాన్యత ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఎన్ఏబీహెచ్ గుర్తింపు ప్రభుత్వ ఆస్పత్రులకూ ఉంటే ఎలా ఉంటుంది? గుర్తింపు పొందడానికి ఎలాంటి సౌకర్యాలు కల్పించాలి? తదితర అంశాలపై వైద్య విద్యా సంచాలకులు డా.ఎన్.సుబ్బారావు 'సాక్షి'తో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

రూపురేఖలు మారిపోతాయి

ఎన్ఏబీహెచ్ గుర్తింపు వస్తే ప్రభుత్వ బోధనాస్పత్రుల రూపురేఖలు మారిపోతాయి. ఈ గుర్తింపు రావడానికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో కావాల్సిన మౌలిక సౌకర్యాలు, వసతులు కల్పిస్తున్నాం. ఎలాంటి సౌకర్యాలు కల్పించాలి? ఏం చేయాలి? అనేదానిపై ఒక సంస్థను నియమించి నివేదిక ఇచ్చిన మేరకు సౌకర్యాలు అందిస్తున్నాం. రాష్ట్రంలో మొత్తం 13 ఆస్పత్రులకు ఎన్ఏబీహెచ్ గుర్తింపు కోసం ప్రయత్నిస్తున్నాం. వీటిలో ఎనిమిది బోధనాస్పత్రులు, రెండు రిమ్స్ కళాశాలలతోపాటు విశాఖపట్నంలోని ఛాతీ ఆస్పత్రి, మానసిక వైద్యశాల, తిరుపతి మెటర్నిటీ ఆస్పత్రులు ఉన్నాయి.

గుర్తింపు పొందాలంటే 17 రకాల సౌకర్యాలు ఉండాలి

ఎన్ఏబీహెచ్ గుర్తింపు పొందాలంటే ప్రభుత్వాస్పత్రులను ఎంతో మెరుగ్గా తీర్చిదిద్దాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఫైర్ సేఫ్టీ నుంచి క్యాజువాలిటీ వరకు ఎన్నో సౌకర్యాలను కల్పించాల్సి ఉంటుంది. నడవలేని రోగులను లోపలకు తీసుకెళ్ళేందుకు అత్యాధునిక వీల్‌చైర్లు, ఆస్పత్రులకు కరెంటు సమస్య లేకుండా జనరేటర్, ఇన్వర్టర్లు, ఫార్మసీ ఔట్‌లెట్లు, ఆపరేషన్ థియేటర్‌లో అన్ని రకాల పరికరాలు, ఎక్స్‌రే సేవలు, తాగునీటి ప్లాంట్ ఏర్పాటు చేయాలి. రోగుల భద్రత కూడా ముఖ్య అంశమే. మరో ప్రధాన అంశం అన్ని ఆస్పత్రుల్లో పారిశుధ్యానికి పెద్దపీట వేయాలి. నిర్మాణాల పనులు పెండింగ్‌లో లేకుండా పూర్తి చేయాల్సి ఉంటుంది.

ఎన్ఏబీహెచ్ కోసం వివిధ ఆస్పత్రులు చేస్తున్న వ్యయం (రూ.కోట్లలో)

ఆస్పత్రి	నిధులు
జీజీహెచ్, నెల్లూరు	19.17
జీజీహెచ్, అనంతపురం	10.35
రిమ్స్, శ్రీకాకుళం	7.98
కింగ్‌జార్జ్, విశాఖపట్నం	21.90
మెటర్నిటీ ఆస్పత్రి, తిరుపతి	4.27
విక్టోరియా ఆస్పత్రి, విశాఖ	4.15
మెంటల్‌కేర్ ఆస్పత్రి, విశాఖ	5.43
జీజీహెచ్, గుంటూరు	13.94
జీజీహెచ్, కాకినాడ	13.45
ఛాతీ ఆస్పత్రి, విశాఖ	5.64
జీజీహెచ్, కర్నూలు	29.87
ఎస్వీఆర్ఆర్, తిరుపతి	16.00
జీజీహెచ్, విజయవాడ	15.14

ఇలా ప్రభుత్వ బోధనాస్పత్రుల్లో మొత్తం 17 రకాల సౌకర్యాలను కల్పించాలి. దీనికోసం 13 ఆస్పత్రులకు రూ.167 కోట్లు వ్యయం చేస్తున్నాం. వసతుల కల్పన వేగంగా జరుగుతోంది. ఎన్ఏబీహెచ్ గుర్తింపు పొందాలంటే ఇలా ఏటా సౌకర్యాలను మెరుగుపర్చాల్సి ఉంటుంది.

వినతి పత్రం విసిరేసిన ఎంపీ గంగరాజు

- టీడీపీ నాయకులపై తీవ్ర ఆగ్రహం
- ఎంపీ కార్యక్రమాలను బాయ్‌కాట్ చేస్తామన్న టీడీపీ నేతలు



అండలూరులో ఎంపీ గంగరాజుకు ప్యాకేజిపై వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

వీరవాసరం: మిత్రపక్షమైన తెలుగుదేశం పార్టీ నాయకులపై బీజేపీ ఎంపీ గోకరాజు గంగరాజు సోమవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్యాకేజీపై టీడీపీ నేతలు ఇచ్చిన వినతిపత్రాన్ని లాక్కుని విసిరేశారు. దీంతో టీడీపీ నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఎంపీ కార్యక్రమాలను బాయ్‌కాట్ చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో రాకపోతే మానేయండి అంటూ ఎంపీ గంగరాజు అసహనం వ్యక్తం చేశారు. ఇదంతా పక్కనే ఉండి చూస్తున్న టీడీపీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మౌనంగా ఉండిపోవడంపైనా టీడీపీ కార్యకర్తలు మండిపడ్డారు.

అసలేం జరిగిందంటే..: పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండలంలో సోమవారం పలు గ్రామాల్లో ఎంపీ నిధులతో వేసిన సీసీ రోడ్లకు ఎంపీ గోకరాజు గంగరాజు, ఎమ్మెల్యే రామాంజనేయులు ప్రారంభించారు. అండలూరు గ్రామంలో టీడీపీ జిల్లా బీసీ సంఘం ఉపాధ్యక్షుడు వీరవల్లి చంద్రశేఖర్, జిల్లా తెలుగు యువత నాయకుడు రాయపల్లి వెంకటేశ్వర రావు, భీమవరం నియోజకవర్గ సమన్వయ సంఘ కార్యదర్శి మన్నే శ్రీనివాస్, టీడీపీకి చెందిన ఎంపీటీసీ కొరిపల్లి నాగహనుమంతరావు, సర్పంచ్ పంపన వెంకటలక్ష్మి మరికొంత మంది ఎంపీని కలసి ప్రత్యే హోదాపై వినతిపత్రం అందించారు. దీనిపై వారు మాట్లాడుతుండగానే ఎంపీ ఆ పత్రాన్ని నేలకేసివిసిరేసి దీనిపై మీకేం తెలుసు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో టీడీపీ నేతలు, ఎంపీకి మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు టీడీపీ నేతలను బయటకు నెట్టేశారు. అనంతరం బలుసుగొయ్యిలపాలెం వెళ్లి తిరిగి వస్తున్న ఎంపీ కారును బుధారాయుడు చెరువు వద్ద టీడీపీ నాయకులు అడ్డగించారు. ఎంపీ కార్యక్రమాలను బహిష్కరిస్తున్నామని నినాదాలు చేశారు. దీంతో ఎంపీ వస్తేరండి లేదంటే పోండి అంటూ వ్యాఖ్యానించారు.

బాబు-మోదీ జోడీ రాష్ట్ర ప్రజల్ని మోసం చేసింది

- వైఎస్సార్‌సీపీ రాష్ట అధికార ప్రతినిధి జోగి రమేష్
- ఐదు కోట్ల ఆంధ్రులకు గుండు గీయించారు
- నాలుగేళ్లు సోమరిపోతుల్లా నిద్రపోయారు
- ఏం సాధించారని ఎంపీలు సంబరాలు చేసుకుంటారు?



విజయవాడ సిటీ: కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనల్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై అతలాకుతలం అవుతుంటే... గత 12 రోజులుగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం కలుగులో దాక్కోవడం తగదని, వెంటనే బయటకు వచ్చి ప్రజలకు సమాధానం చెప్పాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జోగి రమేష్ డిమాండ్ చేశారు. విజయవాడ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. పార్లమెంటులో ప్రధాన మంత్రి మోడీ, ఆర్థిక మంత్రి జైట్లీ , రాష్ట్ర ప్రజల ఆందోళనలను, ఆకాంక్షలను ఏమాత్రం పట్టించుకోకుండా మాట్లాడితే, మన రాష్ట్రానికి చెందిన టీడీపీ ఎంపీలు మాత్రం ఊరేగుతూ, ప్రదర్శనలతో టపాకాయలు కాల్చుకోవడంపై తీవ్రంగా మండిపడ్డారు. పార్లమెంటులో ఏం సాధించారని ఎంపీలు ఊరేగుతూ సంబరాలు చేసుకుంటున్నారని ప్రశ్నించారు. పార్లమెంటులో ఒకలా, పార్లమెంటు బయట మరోలా, రకరకాల వేషాలు వేస్తున్న ఎంపీలకు ఈ సంవత్సరపు నంది అవార్డులను ఇవ్వాలన్నారు. తెర వెనుక ఉండి నటిస్తున్న చంద్రబాబుకు ఆస్కార్ అవార్డు ఇస్తే బాగుంటుందని ఎద్దేవా చేశారు. బీజేపీ అంటే ఎందుకు భయపడుతున్నారో చంద్రబాబు చెప్పాలని డిమాండ్ చేశారు. విచ్చలవిడి అవినీతి, ఓటుకునోటు కేసులో జైల్లో వేస్తారని భయమా? అని ప్రశ్నించారు. నాలుగేళ్ల పాటు సోమరిపోతుల్లా నిద్రపోయిన ఎంపీలను వారి నియోజకవర్గాల్లో గాడిదలపై ఊరేగించి సన్మానం చేయాలని పిలుపునిచ్చారు. ఒకవైపు మోడీ మంత్రివర్గంలో కొనసాగుతూ, మరోవైపు అన్యాయం జరుగుతోందంటూ ప్రజలను మభ్యపెట్టడం వంచన కాక మరేమిటని ప్రశ్నించారు. ఇకనైనా ముఖ్యమంత్రి చంద్రబాబు మీడియా, ప్రజల ముందుకు వచ్చి తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

న్యాయమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు

విశాఖలో ఘటన.. పోలీసులకు నిందితుడి అప్పగింత

విశాఖ లీగల్: నగరంలోని ప్రధాన ఫ్యామిలీ కోర్టులో ఓ అగంతకుడు న్యాయమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తీవ్ర కలకలం రేపింది. సోమవారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో కోర్టు విధులు ప్రారంభమయ్యాక ఓ గుర్తు తెలియని వ్యక్తి కోర్టు హాల్లోకి ప్రవేశించాడు. వచ్చీ రావడంతోనే ఫొటోలు తీయడం మొదలుపెట్టాడు. గమనించిన న్యాయమూర్తి సాయి రమాదేవి అతనిని ప్రశ్నించడంతో ఆమెపై అనుచిత వ్యాఖ్యలు చేశాడు. దీంతో న్యాయవాదులు అతనిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. న్యాయమూర్తి ఫిర్యాదు మేరకు టుటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సంఘటనను జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. వెంకట జ్యోతిర్మయి హైకోర్టుకు తెలిపారు. కాగా, తమ కుమారుడి మానసిక స్థితి సరిగాలేదని నిందితుడి తల్లిదండ్రులు పోలీసులకు తెలిపారు.

నాలుగేళ్లు పంగనామాలు పెట్టి.. ఇప్పుడు గావుకేకలా..!

సీఎం చంద్రబాబుపై ముప్పాళ్ల ధ్వజం



సాక్షి, అమరావతి: నాలుగేళ్లుగా పంగనామాలు పెట్టిన చంద్రబాబు చివరి క్షణంలో గావుకేకలు పెడుతున్నారని, విభజన హామీలు సాధించకుండా రాష్ట్ర ప్రయోజనాలు ఎలా కాపాడుతారో ప్రజలకు చెప్పాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. విజయవాడ దాసరి భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుపై జరుగుతున్న నాటకాలు చివరి అంకానికి చేరుకున్నాయన్నారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందని చెబుతున్న చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంలోని తన మంత్రులతో రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఎంపీ హరిబాబుకు నిజాయితీ ఉంటే రాష్ట్రంలో బీజేపీకి చెందిన ఇద్దరు మంత్రులు, ఇద్దరు ఎంపీలు, నలుగురు ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించి ప్రజాక్షేత్రంలోకి రావాలని స్పష్టం చేశారు. విభజన హామీలపై మార్చి 5 నాటికి కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించకపోతే ప్రధాని మోదీ ఇంటి వద్ద ఆంధ్రప్రదేశ్ ఎంపీలు ధర్నా చేయాలని కోరారు. భవిష్యత్ కార్యాచరణ కోసం ఈ నెల 18న అన్ని రాజకీయ పక్షాలతో కలిసి విజయవాడలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తామని నాగేశ్వరరావు ప్రకటించారు. కాగా, అగ్రిగోల్డ్ బాధిత కుటుంబాలకు పరిహారం అందించే జీవో అధికారుల తీరు వల్లే ఆలస్యమైందని ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆరోపించారు. రాష్ట్రంలో 180 మంది అగ్రిగోల్డ్ బాధితులు చనిపోయారని, వారిలో 130 మందికి పరిహారం అందించే అవకాశం ఉందన్నారు. తొలుత 96 మందికి పరిహారం ఇవ్వనున్నారని చెప్పారు.

'పచ్చదనం'లో ఏపీ భేష్

ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా ప్రశంస

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ అధికారుల కృషివల్ల పచ్చదనం పెంపులో రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందని ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా తెలిపింది. ప్రతి రెండేళ్లకు ఓ సారి ఈ సంస్థ సర్వే చేసి నివేదిక వెల్లడిస్తుంది. రాష్ట్రంలో 2,141 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో పచ్చదనం పెంపొందించినట్లు పేర్కొంది. వనం-మనం కార్యక్రమం ద్వారా 49.93 కోట్ల మొక్కలను నాటినట్లు అటవీ శాఖ దళాధిపతి పి.మల్లికార్జునరావు తెలిపారు.

గంజాయి స్మగ్లర్ల ఆస్తుల వేలం!

- కేంద్ర పరిధిలోని నార్కోటిక్ విభాగానికి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రతిపాదనలు
- స్మగ్లర్లలో ఇతర రాష్ట్రాలకు చెందిన వారే అధికంగా ఉన్నారని నివేదిక

సాక్షి, అమరావతి: గంజాయి స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపేందుకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంట్ విభాగం నడుం బిగించింది. సెక్షన్ 68 ప్రకారం, గంజాయి అక్రమ రవాణా ద్వారా సంపాదించిన ఆస్తులుగా తేలితే, వాటిని స్వాధీనం చేసుకుని వేలం వేయాలని యోచిస్తోంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ అధీనంలోని నార్కోటిక్ విభాగానికి ప్రతిపాదనలు పంపింది. వాస్తవానికి గంజాయి స్మగ్లర్లలో తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, హరియాణా, ఒడిశా, కేరళ రాష్ట్రాలకు చెందిన వారే అధికంగా ఉన్నారు. వారిపై కేసులు నమోదు చేసిన అధికారులు.. వారి ఆస్తులను స్వాధీనం చేసుకునేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇతర రాష్ట్రాలకు చెందిన స్మగ్లర్లు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి గిరిజన గ్రామాల్లో గంజాయిని సాగు చేయిస్తున్నారు. గిరిజన యువకులకు ఆకర్షణీయమైన బైక్‌లు, మొబైల్స్ కొనిచ్చి గంజాయి సాగును ప్రోత్సహిస్తున్నారు. గతేడాది అక్టోబరు నుంచి డిసెంబరు వరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు గంజాయి సాగు నిర్మూలనపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. మొత్తం 2,907 ఎకరాల్లో గంజాయి సాగు నిర్మూలించినట్లు ఎక్సైజ్ విభాగం ప్రభుత్వానికి నివేదించింది. అయితే ఇందులో అత్యధికంగా 2,343 ఎకరాలు ప్రభుత్వ భూములే కావడం గమనార్హం. మరో 562 ఎకరాలు అటవీ భూములు ఉండగా, రెండెకరాల్లోనే పట్టా భూములున్నాయి. మొత్తంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం 322 కేసుల్ని నమోదు చేసింది. ఇతర రాష్ట్రాలకు చెందిన స్మగ్లర్లపై కేసులు నమోదుచేశామని, వారి వివరాలు నార్కోటిక్స్ విభాగానికి పంపినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డైరెక్టర్ వెంకటేశ్వరరావు 'సాక్షి'కి తెలిపారు. స్మగ్లర్లపై సెక్షన్ 68 ప్రయోగించి వారి ఆస్తుల్ని స్వాధీనం చేసుకుంటామని చెప్పారు.

రెట్టింపు పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం

- 24 నుంచి మూడో విడత భాగస్వామ్య పెట్టుబడుల సదస్సు
- 18 దేశాల నుంచి 2 వేల మంది ప్రతినిధుల రాక
- మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడి

సాక్షి, విశాఖపట్నం: గత సదస్సుల సందర్భంగా కుదిరిన ఒప్పందాలకు రెట్టింపు సంఖ్యలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ ఏడాది భాగస్వామ్య పెట్టుబడుల సదస్సు నిర్వహిస్తున్నట్టు మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. గతంలో కుదిరిన ఒప్పందాల్లో రూ.10.97 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి 876 ఒప్పందాలు కార్యరూపం దాల్చాయని చెప్పారు. సదస్సు ఏర్పాట్లకు సంబంధించి విశాఖలో అధికారులతో సమీక్షించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెల 24 నుంచి జరగనున్న మూడో విడత భాగస్వామ్య పెట్టుబడుల సదస్సుకు 18 దేశాల నుంచి 2 వేల మంది ప్రతినిధులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఏపీఐఐసీ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న ఈ సదస్సును ఉపరాష్ట్రపతి వెంకయ్య, సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారని తెలిపారు. కేంద్ర మంత్రులు అశోక్ గజపతిరాజు, సురేశ్‌ప్రభులు సదస్సుకు హాజరవుతారని చెప్పారు. తొలిరోజు పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ రానున్నారని పేర్కొన్నారు. సదస్సు నేపథ్యంలో నగరంలోని స్టార్ హోటల్స్‌లో 900 గదులను బ్లాక్ చేసినట్లు తెలిపారు. సదస్సు ముగింపు రోజైన 26న ఏపీఐఐసీ గ్రౌండ్స్‌లో దక్షిణ భారత దేశంలోనే అతిపెద్ద కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారని చెప్పారు. అదే రోజు విశాఖలో కియో మోటార్స్ పరిశ్రమకు కూడా శంకుస్థాపన చేస్తారన్నారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం రామలింగరాజు, సీఐఐ ప్రతినిధి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

● తెలంగాణ

'హుండీ' దందా.. రూ.వెయ్యి కోట్లు!

- సిటీలో అక్రమంగా ద్రవ్యమార్పిడి దందా టర్నోవర్ ఇది
- ఐదు కీలక ముఠాలు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు
- ఓ గ్యాంగ్‌ను పట్టుకున్న నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ టీమ్
- ఆరుగురు నిందితుల అరెస్టు, రూ.1.4 కోట్లు స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: నగరంలో అక్రమంగా ద్రవ్యమార్పిడికి పాల్పడే హవాలా, హుండీ ముఠాల వార్షిక టర్నోవర్ రూ.వెయ్యి కోట్లు ఉండొచ్చని సిటీ పోలీసు కమిషనర్ వీవీ శ్రీనివాసరావు వెల్లడించారు. ఇప్పటికి గుర్తించిన ఐదు ముఠాల్లో ఓ గ్యాంగ్‌ను నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారన్నారు. వీరి టర్నోవరే ఏడాదికి రూ.200 కోట్ల వరకు ఉంటుందన్నారు. మొత్తం ఆరుగురు నిందితుల్ని పట్టుకుని వారి నుంచి రూ.1.4 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పూర్తి వివరాలు వెల్లడించారు.

'వజ్రాల'కన్నా 'హుండీ'మేలని...

రెండు దేశాల మధ్య జరిగే అక్రమ ద్రవ్యమార్పిడిని హవాలా అని, దేశంలోని రెండు ప్రాంతాల మధ్య జరిగే దాన్ని హుండీ అని అంటారు. గుజరాత్‌కు చెందిన జయేశ్ కుమార్ పటేల్ అలియాస్ అతుల్ 2009లో హైదరాబాద్‌కు వలసవచ్చాడు. అబిడ్స్ కేంద్రంగా వజ్రాలు, బంగారం వ్యాపారం చేసే సమయంలో కొన్ని అక్రమ ద్రవ్యమార్పిడి ముఠాలతో పరిచయం ఏర్పడింది. దీంట్లో లాభాల గురించి తెలుసుకుని చిరాగ్ అలీ లైన్‌లో ఓ కార్యాలయం అద్దెకు తీసుకుని ఏకంగా హుండీ దందా చేసే కంపెనీ తెరిచాడు. దేశంలోని ఇతర నగరాల్లో ఉన్న హుండీ వ్యాపారులు, ఏజెంట్లతో సంబంధాలు ఏర్పాటు చేసుకున్నాడు. 2013 నుంచి ఈ దందా చేస్తున్న పటేల్‌ను 2014లో ఓసారి ఐటీ అధికారులు పట్టుకున్నా తీరు మార్చుకోలేదు.

వాట్సాప్‌ను విరివిగా వాడేసుకుంటూ...

ప్రధానంగా బడా వ్యాపారులు పన్ను ఎగ్గొట్టడానికి, నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకోవడానికి హవాలా, హుండీ మార్గాలను ఆశ్రయిస్తుంటారు. నగరానికి చెందిన రియల్టర్లు, బంగారం వ్యాపారులతో పాటు బడా వ్యాపారులకు పటేల్ సహకరిస్తున్నాడు. నగదు తీసుకునే పటేల్ రూ.50 లేదా రూ.100 నోటు నంబర్‌ను చెప్పడమో, వాట్సాప్ ద్వారా షేర్ చేయడమో చేస్తాడు. దీన్ని సదరు సంస్థకు చెందిన వ్యక్తులు నగదు రిసీవ్ చేసుకోవాల్సిన వారికి వాట్సాప్ ద్వారా పంపిస్తారు. పటేల్ సైతం అదే నంబర్‌ను ఆయా నగరాల్లో ఉన్న తమ ఏజెంట్‌కు పంపిస్తాడు. నగదు తీసుకోవాల్సిన సంస్థ ప్రతినిధి ఈ నంబర్‌ను అక్కడి ఏజెంట్‌కు చెప్తే చాలు ఆ మొత్తం అతడికి అందుతుంది.

జూబ్లీహిల్స్‌లో భారీ పేలుళ్లు

- రాళ్లు పగలగొట్టేందుకు గదిలో డిటోనేటర్లు నిల్వ
- గది బయట వంట చేస్తుండగా ఘటన



బాంబ్ స్క్వాడ్ తనిఖీలు...

హైదరాబాద్: ఒక్కసారిగా పేలుళ్లు.. భారీ శబ్దాలకు పగిలిన పొరుగు ఇంటి కిటికీలు.. చుట్టుపక్కల 400 మీటర్ల మేర గాలిలోకి లేచిన రాళ్లు.. ధ్వంసమైన కార్లు. ఇదీ సోమవారం ఉదయం హైదరాబాద్‌లో చోటు చేసుకున్న బీభత్స దృశ్యం. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 48లో ప్లాట్ నంబర్ 969లో సిద్ధార్థ కన్‌స్ట్రక్షన్స్ భవన నిర్మాణ పనుల్లో భాగంగా రాళ్లు పగలగొట్టే పనిని ఆశిష్ అనే వ్యక్తి కాంట్రాక్ట్‌కు తీసుకున్నాడు. అతడు మహేందర్ అనే సబ్ కాంట్రాక్టర్‌కు రాళ్లను కొట్టే పనిని అప్పగించాడు. ఈ క్రమంలో ఎలక్ట్రానిక్ డిటోనేటర్లను పెద్ద మొత్తంలో ఓ గదిలో నిల్వ ఉంచాడు. ఉదయం వాచ్‌మన్ ఆశారాం భార్య భగవతి గది ముందు వంట చేస్తుండగా వేడికి పేలుళ్లు సంభవించాయి. దీంతో ఆ గది కుప్పకూలి గాలిలోకి రాళ్లు ఎగిరిపడి ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి. ఎదురుగా ఉన్న ఇంటి అద్దాలు ధ్వంసమయ్యాయి. నాలుగు ఇళ్ల గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. రాళ్లు ఎగిరి అక్కడే ఉన్న ఓ కారుపై పడడంతో అది ధ్వంసమైంది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. బాంబు డిస్పోజల్ టీమ్, క్లూస్‌టీమ్ ఆధారాలు సేకరించాయి. పేలని 98 డిటోనేటర్లు, బండరాయిని ధ్వంసం చేసేందుకు పెట్టిన మరో డిటోనేటర్‌ను బాంబుస్క్వాడ్ వెలికి తీసిందని పోలీసులు తెలిపారు. సుమారు 25 డిటోనేటర్లు పేలి ఉంటాయని పోలీసుల అంచనా. ఈ మేరకు పోలీసులు కాంట్రాక్టర్లపై కేసు నమోదు చేశారు.

పోలీస్ జాగిలాల దీక్షాంత్ పరేడ్..

పాల్గొన్న సీఎస్ జోషీ, డీజీపీ మహేందర్‌రెడ్డి



జాగిలాల పరేడ్‌లో సీఎస్ జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ శివారులోని మొయినాబాద్‌లో ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ సెంటర్‌లో సోమవారం పోలీస్ జాగిలాల దీక్షాంత్‌పరేడ్ జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాద, మావోయిస్టు కార్యకలాపాల నియంత్రణలో పోలీస్ జాగిలాల కృషి ఎనలేనిదని అభిప్రాయపడ్డారు. జాగిలాలకు శిక్షణనిచ్చిన సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీజీపీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ భద్రత వ్యవహారాల పర్యవేక్షణ, వీఐపీ రక్షణ, కేసుల దర్యాప్తులో సిబ్బందికి ఉన్నతమైన శిక్షణ ఇవ్వగలుగుతున్నామని, అందులో ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీ కృషి అభినందనీయమన్నారు. ఈ ట్రైనింగ్ అకాడమీలో తెలంగాణతోపాటు వివిధ రాష్ట్రాలు, ఇతర పోలీస్ విభాగాలకు చెందిన 71 పోలీస్ జాగిలాలు 8 నెలలపాటు శిక్షణ పొందినట్టు ఇంటెలిజెన్స్ ఐజీ నవీన్‌చంద్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా జాగిలాల డ్రిల్స్ ఆకట్టుకున్నాయి. శిక్షణలో ప్రతిభ కనబరిచిన జాగిలాలకు సీఎస్, డీజీపీ మెడల్స్ బహూకరించారు. పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన జాగిలాల బ్యారక్‌లను ప్రారంభించారు.

తెలంగాణలో ఇక స్మార్ట్ పాలన

- రాష్ట్రంలో పరిపాలన త్వరలో కొత్తపుంతలు
- క్షేత్రస్థాయి నుంచి సీఎస్ దాకా అందరికీ స్మార్ట్‌ఫోన్లు
- సచివాలయంలో కమాండ్ కంట్రోల్ విభాగం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పరిపాలన కొత్త పుంతలు తొక్కనుంది. క్షేత్రస్థాయి అధికారుల నుంచి రాష్ట్ర స్థాయి వరకు 'స్మార్ట్'గా పరిపాలన నిర్వహించేందుకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన శైలేంద్ర కుమార్ జోషి ఈ దిశగా సరికొత్త ప్రయత్నాలు ప్రారంభించారు. పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ తరహాలో సచివాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసేందుకు త్వరలోనే శ్రీకారం చుట్టనున్నారు. రాష్ట్రంలో జరిగే పరిణామాలన్నీ ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతోపాటు గ్రామస్థాయి వరకు ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలు, వాటి అమలు తీరును పర్యవేక్షించేందుకు వీలుగా ఈ కంట్రోల్ సెంటర్‌ను అభివృద్ధి చేస్తారు. ఇందులో భాగంగా గ్రామస్థాయిలో మౌలిక సదుపాయాలు మొదలు రాష్ట్ర స్థాయి వరకు ప్రతి సమాచారం అందుబాటులో ఉండేలా డేటాబేస్‌ను రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా డిజిటల్ మానిటరింగ్ విధానంలో జిల్లాల కలెక్టరేట్లు, జిల్లా స్థాయి అధికారుల కార్యాలయాలను సచివాలయం నుంచే అనుసంధానిస్తారు. ఇంటిగ్రేటెడ్ అడ్మినిస్ట్రేషన్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ పేరుతో కొత్త పరిపాలన విధానానికి అవసరమైన పరిజ్ఞానాన్ని ప్రభుత్వం సమకూర్చుకుంటోంది.

శాశ్వత సిమ్ కార్డులు.. స్మార్ట్ ఫోన్లు

స్మార్ట్ పరిపాలనలో భాగంగా రాష్ట్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు అధికారులందరికీ స్మార్ట్ ఫోన్లు, శాశ్వత సిమ్ కార్డులు అందించనున్నారు. సీఎస్ నుంచి ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, అన్ని విభాగాల హెచ్‌వోడీలు మొదలు కలెక్టర్లు, జిల్లాల్లో అన్ని విభాగాల అధికారులందరూ ఒకే నెట్‌వర్క్‌లో ఉండేలా ఏర్పాట్లు చేశారు. అందరికీ ఐడియా సిమ్ కార్డులను అందజేయాలని నిర్ణయించారు. 711 సిరీస్‌తో ఈ నంబర్లు ప్రారంభమవుతాయి. అధికారులు బదిలీపై వెళ్లినా.. ఆ హోదాలో ఉన్న అధికారికి తిరిగి అదే నంబర్ ఉండేలా ఏర్పాట్లు చేస్తారు. స్మార్ట్‌ఫోన్ల ద్వారా సీఎస్ నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులందరికీ వేగంగా సమాచార మార్పిడి జరిగేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించాలని నిర్ణయించారు. స్మార్ట్‌ఫోన్లను సచివాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానిస్తారు.

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా

సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

సివిల్స్ ఇంటర్వ్యూ

బోర్డు ప్రశ్నలు – సమాధానాలు

సివిల్స్ ఇంటర్వ్యూలు ఈ నెల 19న ప్రారంభంకానున్నాయి. దాదాపు 2,500 మందికి పైగా ఇంటర్వ్యూకు హాజరుకానున్నారు. దీంతో ఇంటర్వ్యూలో ఎలాంటి ప్రశ్నలు అడుగుతారు? ఎలా సిద్ధం కావాలి? తదితర సందేహాలతో అభ్యర్థుల్లో కొంత ఆందోళన సహజం. ఇంటర్వ్యూలో విజయానికి స్వీయ సన్నద్ధతతోపాటు.. గత విజేతల సూచనలు, సలహాలు తప్పనిసరి. అందుకే సాక్షి గతేడాది సివిల్స్‌లో ఆరో ర్యాంకు సాధించిన 'కొత్తమాసు దినేష్ కుమార్'తో మాట్లాడింది. వినయ్ మిట్టల్ నేతృత్వంలోని ప్యానెల్ తనను ఇంటర్వ్యూ చేసిందని.. ఎక్కువగా సమకాలీన అంశాలు, ప్రొఫైల్ ఆధారిత ప్రశ్నలే అడిగారంటున్నారు దినేష్ కుమార్. ఆ ఇంటర్వ్యూ పూర్తి వివరాలు..





గ్రాడ్యుయేట్స్ స్పెషల్

భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్)ను వదిలి, సివిల్ సర్వీసెస్‌లో ఎందుకు చేరాలనుకుంటున్నారు?
- భారత్ పెట్రోలియంలో పనిచేయడం గర్వంగా భావిస్తున్నా.. అయితే సివిల్ సర్వీస్‌తో మరింత మెరుగైన కెరీర్ అవకాశాలు లభిస్తాయి. ఈ సర్వీస్‌కే సొంతమైన వైవిధ్యమైన పని స్వభావం, క్షేత్రస్థాయిలో పనిచేసే అవకాశం, సమాజానికి తిరిగి ఇచ్చే క్రమంలో పొందే ఉద్యోగ సంతృప్తి.. నన్ను సివిల్స్ వైపు నడిపించాయి.

బీసీసీఐ, లోధా కమిటీ మధ్య ఏం జరుగుతోంది?
- బీసీసీఐ జాతీయ క్రికెట్ జట్టును ఎంపిక చేయడంతోపాటు క్రికెట్ సంబంధిత వ్యవహారాలను పర్యవేక్షిస్తుంది. ఇది సొసైటీ రిజిస్ట్రేషన్ చట్టం కింద రిజిస్టర్ అయిన పబ్లిక్ బాడీ. కానీ, దీని నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం లోపించాయి. దీంతో బీసీసీఐలో సంస్కరణలు తెచ్చేందుకు సుప్రీంకోర్టు లోధా కమిటీని నియమించింది. ఈ కమిటీ బీసీసీఐ ప్రక్షాళనకు కొన్ని సిఫారసులు చేసింది.

లోధా కమిటీ చేసిన సిఫారసుల్లో కొన్ని చెప్పండి?
- వన్ స్టేట్-వన్ క్రికెట్ బాడీ; బీసీసీఐను సమాచార హక్కు చట్టం కిందకు తీసుకురావడం; రాజకీయ నాయకులు, ప్రభుత్వాధికారులను పాలకమండలికి దూరంగా ఉంచడం.

వన్ స్టేట్-వన్ బాడీ ఎందుకు?
- సర్, వన్ స్టేట్-వన్ బాడీ అవసరం. జట్టులో బిహార్, ఈశాన్య రాష్ట్రాలతో పోల్చితే.. మహారాష్ట్ర వంటి వాటికి ఎక్కువ ప్రాతినిధ్యం లభిస్తోంది. దీంతో ప్రస్తుత విధానంలో 'సమాన అవకాశాలు' అనే సూత్రానికి ఆస్కారమే లేదు. అదే 'వన్ స్టేట్-వన్ బాడీ' ఉంటే అందరికీ అవకాశాలు లభిస్తాయి.

ఇలాంటి విషయాల్లో రాజ్యం జోక్యం అవసరమా?
- ప్రభుత్వ లక్ష్యం.. సంక్షేమాన్ని ప్రోత్సహించడం. ఆటలు, విద్య, వైద్యం, ఉద్యోగాలు తదితర అంశాల్లో సమానత్వం కోసం.. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా రాజ్యం జోక్యాన్ని సమర్థించొచ్చు.

ఫ్రాన్స్ అధ్యక్షుడిగా ఇమాన్యుయేల్ మేక్రన్ ఎంపికపై మీ అభిప్రాయం?
- ఆయన ఎంపిక లిబరల్ ప్రపంచానికి సంకేతం. దీన్నిబట్టి ప్రజల మూడ్‌ను అర్థంచేసుకోవచ్చు. ఫ్రాన్స్ ప్రజలు రైటిస్ట్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేశారు. మొత్తంగా చూస్తే ఇది కేవలం ట్రైలర్ మాత్రమే.. జర్మనీలో జరగబోయే ఎన్నికలతో పూర్తి స్పష్టత వస్తుంది. వెంటనే బోర్డ్ సభ్యులు కల్పించుకొని జర్మనీలో రైటిస్ట్ పార్టీల గురించి అడిగారు. నాకు వాటి పేర్లు గుర్తు లేవని చెప్పాను.

మొదటి సభ్యుడు

క్రికెట్ బ్యాట్స్‌మెన్‌కు అనుకూలంగా మారింది. బ్యాలెన్స్ చేయడానికి సూచనలు?
- టీ20 యుగంలో క్రికెట్ బ్యాట్స్‌మెన్‌కు అనుకూలంగా మారిన మాట వాస్తవమే. దీన్ని గుర్తించి గ్రాఫైట్ కోటింగ్ లేకుండా బ్యాట్‌లను తయారు చేయాలి. బౌలర్లకు ప్రయోజనం చేకూరేలా బ్యాట్ కొలతలను మార్చాలి. బౌలర్లను దృష్టిలో పెట్టుకొని ప్రస్తుత పవర్ ప్లే పరిమితుల్లో మార్పులు తీసుకురావాలి.

గ్రాస్ రిఫైనరీ మార్జిన్ అంటే? (గతంలో చేసిన ఉద్యోగానికి సంబంధించిన ప్రశ్న)
- X అనేది ఇన్‌పుట్ కాస్ట్.. Y అనేది ఔట్‌పుట్ కాస్ట్ అయితే.. Y-X ను గ్రాస్ రిఫైనరీ మార్జిన్ అంటారు.

నెల్సన్ కాంప్లెక్సిటీ ఇండెక్స్ అంటే?
- సెకండరీ పెట్రోలియం ఉత్పత్తుల రిఫైనరీ కొలత.

ప్రైవేటు రిఫైనరీ కేంద్రాలతో పోల్చితే ప్రభుత్వ రంగ సంస్థల పనితీరు ఎందుకు పేలవంగా ఉంటుంది?
- పబ్లిక్ సెక్టార్ యూనిట్లు చాలా ఏళ్ల కిందట ఏర్పాటు చేసినవి. కొత్తగా వచ్చిన ప్రైవేటు సంస్థలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కలిగి ఉన్నాయి. ఒక అధ్యయనంలో కీలకమైన పెర్ఫార్మెన్స్ పరామితుల ప్రకారం ప్రభుత్వ శుద్ధికేంద్రాలు 74 శాతం స్కోరు సాధించాయి. తాజాగా ఈ లెక్క 80 శాతానికి చేరింది. కాబట్టి సాపేక్షికంగా పీఎస్‌యూలు మెరుగైన పనితీరు కనబరుస్తున్నాయని చెప్పొచ్చు. పీఎస్‌యూలకు కేవలం లాభాపేక్షే లక్ష్యం కాదు.. సామాజిక న్యాయానికి తోడ్పడటం వీటి ప్రధాన లక్ష్యాల్లో ఒకటిగా ఉంది. దీంతో పీఎస్‌యూల గ్రాస్ రిఫైనరీ మార్జిన్ మీద ఒత్తిడి పెరుగుతుంది.

బీపీసీఎల్‌లో మీ విధుల గురించి చెప్పండి?
- నేను జలంధర్‌లో సైట్ ఇంజనీర్‌గా ఉద్యోగంలో చేరాను. ఎంబీ లాల్ సిఫారసుల మేరకు చేపట్టిన ప్రాజెక్టులను చూసుకునే వాడిని.

రెండో సభ్యుడు

ప్రస్తుత జమ్మూకశ్మీర్ పరిస్థితిపై మీ అభిప్రాయం?
- భారత ప్రభుత్వం చెబుతున్నట్లుగా అక్కడ అసాధారణ పరిస్థితులు నెలకొన్నాయని నేను భావించడం లేదు.

గుంపును నియంత్రించే క్రమంలో పెల్లెట్ గన్స్ వాడకంపై మీ అభిప్రాయం?
- తుపాకుల వినియోగం హింసను సూచిస్తుంది. కాబట్టి వాటిని ఉపయోగించకూడదు. శాంతిభద్రతల పరిరక్షణ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం. ఇందులో భాగంగా ప్రాణహాని తక్కువగా ఉండే పెల్లెట్ గన్ వినియోగాన్ని సూచించొచ్చు. దీనిపై ప్రభుత్వం ఒక కమిటీని వేసింది. కమిటీ సిఫారసులను అనుసరించడం మేలని నా అభిప్రాయం.

అవినీతిని ఎలా నియంత్రించొచ్చు?
- అవినీతి.. సప్లై, డిమాండ్ పద్ధతిలో కొనసాగుతుంది. సప్లై సైడ్ అవినీతిని ప్రజల్లో ప్రశ్నించేతత్వం పెంపొందించి నియంత్రించొచ్చు. డిమాండ్ సైడ్ అవినీతిని నిఘా విభాగాన్ని పటిష్టం చేయడం, అవినీతిపరులకు కఠిన శిక్షలు పడేలా చేయడం ద్వారా నియంత్రించొచ్చు.

ప్రభుత్వం అవినీతి నియంత్రణ దిశగా వేసిన అడుగులు?
- అవినీతిని తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఈ-గవర్నెన్స్‌ను ప్రవేశపెట్టింది.

ఈ-సేవ అంటే ఏమిటి?
- ఇంటర్నెట్/ఆన్‌లైన్ ద్వారా సేవలు అందించేందుకు ఏపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-గవర్నెన్స్‌నే ఈ-సేవ అంటారు. ఇది విజయవంతమైన ప్రభుత్వ ప్రాజెక్ట్.

మూడో సభ్యుడు

జస్టిస్ కర్ణన్ సమస్యపై మీ అభిప్రాయం?
- ఆ సమస్య కంటే న్యాయవ్యవస్థలో జవాబుదారీతనం, పారదర్శకత కొరవడడం నన్ను మరింత బాధిస్తుంది.

మీడియా.. జస్టిస్ కర్ణన్‌ను ఇంటర్వ్యూ చేయొద్దని, హైలైట్ కూడా చేయొద్దని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. దీనిపై మీ అభిప్రాయం?
- ప్రజాస్వామ్యానికి మీడియా నాలుగో స్తంభం. కాబట్టి మీడియా హక్కులను కుదించడం మంచి పరిణామం కాదు. మీడియా తన కర్తవ్యాలను సక్రమంగా నిర్వహిస్తుంది. దానికి జస్టిస్ కర్ణన్ సమస్యను కవరేజీ చేయడానికి అనుమతివ్వాలి.

నాలుగో సభ్యురాలు

మీరు ఖమ్మంలో జన్మించారు కదా, అక్కడి విశేష అంశాలు చెప్పండి?
- ఖమ్మం సహజవనరుల నిల్వలకు పెట్టింది పేరు. అక్కడ బొగ్గు వంటి సహజ నిక్షేపాలు పెద్ద మొత్తంలో ఉన్నాయి. గిరిజన జనాభా ఎక్కువగా ఉంటుంది. అడవుల శాతం కూడా ఎక్కువ.

దినేష్‌కుమార్ ప్రొఫైల్

- **పరీక్ష:** సివిల్ సర్వీసెస్-2016
- **సొంత రాష్ట్రం:** ఆంధ్రప్రదేశ్
- **చదువు:** బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్, నిట్-వరంగల్
- **రాతపరీక్షలో మొత్తం మార్కులు:** 912
- **ఇంటర్వ్యూలో మార్కులు:** 179
- **ఆల్ ఇండియా ర్యాంక్:** 6

ఆధార్ లేకున్నా.. దరఖాస్తు

- ఎన్‌రోల్‌మెంట్ నంబరు ఉంటే చాలు
- ప్రాక్టికల్ అప్రోచ్ కోసమే 'ఓపెన్'కు అనర్హత
- నీట్-యూజీ 2018 డైరెక్టర్ డాక్టర్ సాన్యమ్ భరద్వాజ్ స్పష్టీకరణ



డాక్టర్ సాన్యమ్ భరద్వాజ్
నీట్-యూజీ 2018 డైరెక్టర్

నేషనల్ ఎలిజిబిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్.. సంక్షిప్తంగా నీట్. జాతీయ స్థాయిలో ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల్లో ప్రవేశానికి.. ఈ ఎంట్రన్స్‌లో ఉత్తీర్ణత తప్పనిసరి. నీట్ 2018 నోటిఫికేషన్ ఇటీవల విడుదలైంది. దరఖాస్తుల ప్రక్రియ కూడా ప్రారంభమైంది. అయితే నోటిఫికేషన్‌లో పేర్కొన్న పలు కొత్త నిబంధనలపై విద్యార్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఆధార్ సంఖ్య తెలపాలనడం.. ఓపెన్ స్కూల్ విద్యార్థులను, బయాలజీ/ బయోటెక్నాలజీ అదనపు సబ్జెక్టుగా చదివిన విద్యార్థులను అనర్హులుగా ప్రకటించడం.. గరిష్ట వయోపరిమితిని తిరిగి ప్రవేశపెట్టడం.. వంటి నిబంధనలపై విద్యార్థులతోపాటు తల్లిదండ్రుల్లోనూ పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థుల సందేహాలకు నీట్-యూజీ 2018 డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న నీట్ నిర్వాహక సంస్థ సీబీఎస్ఈ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) జాయింట్ సెక్రటరీ డాక్టర్ సాన్యమ్ భరద్వాజ్ సమాధానాలు..

గెస్ట్ కాలమ్

నోటిఫికేషన్ విడుదలచేసిన సమయంలో ఆధార్ సంఖ్య తప్పనిసరి అని పేర్కొన్న మాట వాస్తవమే. ఆధార్ సంఖ్య లేని విద్యార్థులు ఆందోళన చెందనక్కర్లేదు. వారు ఆన్‌లైన్ అప్లికేషన్ ఐడెంటిటీ కాలమ్‌లో ఆధార్‌తోపాటు పేర్కొన్న ఇతర డాక్యుమెంట్లలో దేన్నయినా ఎంపిక చేసుకోవచ్చు. ఆధార్ కాలమ్‌లో మాత్రం.. ఎన్‌రోల్‌మెంట్ నంబరు తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంటుంది. అంటే.. ఆధార్ లేని విద్యార్థులు.. తమ దగ్గరలోని ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ సెంటర్లలో తమ వివరాలు నమోదు చేసుకొని.. అక్కడ ఇచ్చే ఎన్‌రోల్‌మెంట్ నంబరును ఆన్‌లైన్ అప్లికేషన్‌లో పొందుపర్చాలి. ఇది మాత్రం తప్పనిసరి. ఈ విషయంలో.. దరఖాస్తు చివరి తేదీని పరిగణనలోకి తీసుకుంటే విద్యార్థులకు వీలైనంత సమయం అందుబాటులో ఉంది. ఇక +2, ఇంటర్మీడియెట్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు ఈ ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియను వెంటనే ముగించుకోవాలి.

> **చాలా రాష్ట్రాల్లో ఇప్పటికీ సీబీఎస్ఈ సిలబస్‌కు సరితూగేలా సిలబస్‌లో మార్పులు జరగని మాట వాస్తవమే. అందుకే.. సీబీఎస్ఈ సిలబస్‌తోనే ప్రశ్నలు రూపొందించకుండా.. అన్ని రాష్ట్రాల సిలబస్‌లను పరిగణనలోకి తీసుకుంటాం.**

వేలిముద్ర లేకున్నా.. సమస్య లేదు

పరీక్ష హాల్లో హాజరు పత్రంలో వేలిముద్ర తప్పనిసరి అని పేర్కొనడం జరిగింది. కానీ, బొటన వేలు లేని విద్యార్థులు మరో వేలి ముద్ర వేయొచ్చు. అన్ని వేళ్లు లేని విద్యార్థులను డిఫరెంట్లీ ఏబుల్డ్ కేటగిరీగా పరిగణించి.. వేలిముద్ర నిబంధన నుంచి మినహాయిస్తాం. ఇందుకు సంబంధించి ధ్రువీకరణ పత్రం అవసరం.

ప్రాక్టికల్ అప్రోచ్ కోసమే

నీట్ యూజీకి దరఖాస్తు విషయంలో ఓపెన్ స్కూల్ విధానంలో, అదే విధంగా 10+2 స్థాయిలో బయాలజీ/ బయోటెక్నాలజీని అదనపు సబ్జెక్ట్‌గా ఎంపిక చేసుకున్న విద్యార్థులను అనర్హులుగా పేర్కొనడానికి ప్రధాన కారణం.. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ఉండే ప్రాక్టికాలిటీని దృష్టిలో పెట్టుకోవడమే. ప్రాక్టికాలిటీని అందిపుచ్చుకోవాలంటే.. అందుకు ఇంటర్మీడియెట్ స్థాయిలోనే పునాది పడాలి. అది కేవలం రెగ్యులర్ కోర్సు ద్వారానే సాధ్యం. అందుకే ఓపెన్ స్కూల్, 10+2 స్థాయిలో బయాలజీ/బయోటెక్నాలజీని అదనపు సబ్జెక్ట్‌గా చదివిన విద్యార్థులను ఎంసీఐ అనర్హులుగా పేర్కొనాలని సిఫార్సు చేసింది.

గరిష్ట వయోపరిమితి.. అందుకే

గరిష్ట వయోపరిమితి (25 ఏళ్లు) నిబంధనను మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) మార్గనిర్దేశకాల ప్రకారమే పేర్కొన్నాం. నీట్ నిర్వహణలో భాగంగా ఎంసీఐ, ఎంహెచ్ఆర్‌డీ చర్చల్లో సీబీఎస్ఈ వర్గాలు కూడా పాల్గొన్నాయి. గరిష్ట వయోపరిమితి లేకపోతే.. ఒక ఏడాది విఫలమైన విద్యార్థులు మరోసారి ప్రయత్నిద్దాం.. అనే కోణంలో ఎంబీబీఎస్, బీడీఎస్ కోసమే ఏళ్ల తరబడి కృషిచేసే పరిస్థితి ఏర్పడుతుంది. అలా విద్యార్థులు తమ విలువైన సమయం అంతా నీట్ కోసమే వెచ్చిస్తారు. అందుబాటులో ఉన్న వేరే అవకాశాలను చూడరు. గరిష్ట వయోపరిమితి నిబంధన విధిస్తే.. సరైన వయసులో ప్రత్యామ్నాయ అవకాశాలపైనా దృష్టిపెడతారనే అభిప్రాయం వ్యక్తమైంది. గతేడాది కోర్టు ఉత్తర్వుల ద్వారా గరిష్ట వయోపరిమితి నిబంధనను ఎత్తివేసినా.. ఈ సంవత్సరం ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్ వెలువడింది.

పరిగణనలోకి అన్ని రాష్ట్రాల సిలబస్

సీబీఎస్ఈ సిలబస్ ప్రకారమే ప్రశ్నలు రూపొందిస్తారేమోనని ఆందోళన విద్యార్థుల్లో నెలకొంది. చాలా రాష్ట్రాల్లో ఇప్పటికీ సీబీఎస్ఈ సిలబస్‌కు సరితూగేలా సిలబస్‌లో మార్పులు జరగని మాట వాస్తవమే. అందుకే.. సీబీఎస్ఈ సిలబస్‌తోనే ప్రశ్నలు రూపొందించకుండా.. అన్ని రాష్ట్రాల సిలబస్‌లను పరిగణనలోకి తీసుకుంటాం. కాబట్టి సీబీఎస్ఈ సిలబస్‌కు సరితూగే సిలబస్ అమలు కాని రాష్ట్రాల విద్యార్థులు ప్రశ్నలు.. సిలబస్ పరంగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

స్టడీ అబ్రాడ్.. నీట్ ఉత్తీర్ణత!

విదేశాల్లో మెడికల్ కోర్సులు చదవాలనుకునే విద్యార్థులు ఈ ఏడాది నుంచి నీట్ ఉత్తీర్ణత సాధించాలనే నిబంధన ఎంసీఐ నిర్ణయం మేరకే ఉంటుంది. ఇది పూర్తిగా ఎంసీఐ పరిధిలోని అంశం. గత ఏడాదికంటే ఈ సంవత్సరం దరఖాస్తుల సంఖ్య అయిదు నుంచి పది శాతం మేర పెరిగే అవకాశముంది.

విద్యార్థులకిచ్చే సలహా

ముందుగా నోటిఫికేషన్‌ను, సీబీఎస్ఈ నీట్ వెబ్‌సైట్‌లో ఉంచిన ఇన్ఫర్మేషన్ బులెటిన్‌ను ఆసాంతం చదవాలి. అలా చేయకుండా అనవసరపు ఆందోళనకు గురవడం సరికాదు. సీబీఎస్ఈ ఎప్పుడూ విద్యార్థుల ప్రయోజనం కోణంలోనే ఆలోచిస్తుంది. బులెటిన్‌ను చదివాక.. తల్లిదండ్రులు లేదా అనుభవజ్ఞుల సమక్షంలో ఆన్‌లైన్ అప్లికేషన్ పూర్తి చేయండి. కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా ఆన్‌లైన్ అప్లికేషన్ పూర్తి చేసే విద్యార్థులు.. ఈ ఆన్‌లైన్ అప్లికేషన్‌పై పూర్తి అవగాహన ఉన్న సెంటర్ వద్దకు వెళ్లడం మంచిది. నీట్ ఆన్‌లైన్ దరఖాస్తును, ఆధార్ ఎన్‌రోల్‌మెంట్‌ను తక్షణమే పూర్తిచేసుకుంటే లాస్ట్‌మినిట్ టెన్షన్‌కు ఫుల్‌స్టాప్ పెట్టొచ్చు!!

బులెటిన్ బోర్డ్

ఎన్ఐటీ మిజోరంలో 15 ఖాళీలు

మిజోరంలోని ఐజ్వాల్‌లో ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)... 15 బోధన ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **పోస్టు-ఖాళీలు:** ప్రొఫెసర్-5, అసోసియేట్ ప్రొఫెసర్-10.
- **విభాగాలు:** ఈఈఈ, ఈసీఈ, సీఎస్ఈ, ఎంఈ, సీఈ, బీఎస్ అండ్ హెచ్ఎస్ఎస్.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను అనురించి పీహెచ్‌డీతోపాటు నిబంధనల మేర ఉద్యోగానుభవం.
- **దరఖాస్తు రుసుం:** జనరల్/ఓబీసీ-రూ.1,000; ఎస్సీ/ ఎస్టీ-రూ.500; దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.
- **దరఖాస్తు సమర్పణకు చివరి తేదీ:** మార్చి 8, 2018.
- **వెబ్‌సైట్:** www.nitmz.ac.in

హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో 7 ఖాళీలు

విశాఖపట్నంలోని హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్).. 7 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **పోస్టు-ఖాళీలు:** సీనియర్ మేనేజర్ (సెక్యూరిటీ)-1 (అన్‌రిజర్వ్‌డ్); మెడికల్ ఆఫీసర్-6 (అన్‌రిజర్వ్‌డ్-5+ ఓబీసీ-1).
- **వేతనం:** సీనియర్ మేనేజర్-రూ.29,100-రూ.54,500; మెడికల్ ఆఫీసర్-రూ.31,200.
- **అర్హతలు:** సీనియర్ మేనేజర్‌కు కనీసం 55 శాతం మార్కులతో డిగ్రీతోపాటు ఎక్స్‌డిఫెన్స్/ సీఐఎస్ఎఫ్/ బీఎస్ఎఫ్/ పోలీస్/ పారామిలటరీ ఫోర్సెస్‌లో అనుభవం ఉండాలి. సెక్యూరిటీలో డిప్లొమా/కోర్సు అభిలషణీయం; మెడికల్ ఆఫీసర్‌కు ఎంబీబీఎస్‌తోపాటు ఎంసీఐ రిజిస్ట్రేషన్, కనీసం ఏడాది అనుభవం ఉండాలి. జనరల్ మెడిసిన్/ ఇండస్ట్రియల్ మెడిసిన్/ ఓబీ అండ్ గైనకాలజీ/ రేడియాలజీ పీడియాట్రిక్స్‌లో పీజీ డిగ్రీ/ పీజీ డిప్లొమా ఉత్తీర్ణులకు ప్రాధాన్యం.
- **దరఖాస్తు రుసుం:** రూ.100; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ కేటగిరీలకు ఫీజు లేదు.
- **వయసు:** 2018, మార్చి 6 నాటికి సీనియర్ మేనేజర్ (సెక్యూరిటీ)కి 42 ఏళ్లు; మెడికల్ ఆఫీసర్‌కు 61 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, హార్డ్‌కాపీకి సంబంధిత ధ్రువపత్రాలు జతచేసి పంపాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 6, 2018.
- **దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** మార్చి 15, 2018.
- **వెబ్‌సైట్:** hslvizag.in

ఐఐఎస్‌టీలో 5 ఫెలోషిప్ ఖాళీలు


తిరువనంతపురంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐఐఎస్‌టీ).. 5 ఫెలోషిప్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **పోస్టు-ఖాళీలు:** రీసెర్చ్ ప్రాజెక్ట్ ఫెలో (ఆర్‌పీఎఫ్)-2; జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్)-3.
- **స్టైపెండ్:** ఆర్‌పీఎఫ్-రూ.18,000; జేఆర్ఎఫ్-రూ.25,000+హెచ్ఆర్ఏ.త
- **అర్హతలు:** ఆర్‌పీఎఫ్‌కు.. బీఎస్సీ (అగ్రికల్చర్/ ఫారెస్ట్రీ/ ప్లాంట్ సైన్సెస్/ తత్సంబంధ)/ ఎంఎస్సీ(బోటనీ/ ప్లాంట్ సైన్సెస్/జియోఇన్ఫర్మేటిక్స్/తత్సంబంధ); జేఆర్ఎఫ్‌కు... ఎంఎస్సీ (ఫిజిక్స్)/ ఎంఈ/ఎంటెక్ (ఆప్టికల్/ అప్లైడ్ ఆప్టిక్స్/ఆప్టో ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రికల్/ నానోటెక్నాలజీ/ మెటీరియల్ సైన్స్/ బయోటెక్నాలజీ/ మెకానికల్/ తత్సబంధ)/ ఎంఎస్ (ఆప్టోఎలక్ట్రానిక్స్/ మెకానికల్/ ఏరోస్పేస్/ తత్సంబంధ) విద్యలో ఉత్తీర్ణత.
- **వయసు:** 2018, ఫిబ్రవరి 20 నాటికి 35 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** ఫిబ్రవరి 20, 2018.
- **వెబ్‌సైట్:** www.iist.ac.in

ఐఐటీ ఢిల్లీలో 10 ఖాళీలు

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఢిల్లీ (ఐఐటీడీ).. 10 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **పోస్టు-ఖాళీలు:** ప్రాజెక్ట్ అసోసియేట్ (పీఏ)-3; ప్రాజెక్ట్ సైంటిస్ట్ (పీఎస్)-3; జూనియర్ ప్రాజెక్ట్ అటెండెంట్-2.
- **అర్హతలు:** జూనియర్ ప్రాజెక్ట్ అటెండెంట్‌కు పదోతరగతి; మిగిలిన పోస్టులకు బీఈ/బీటెక్ (ఈసీఈ/ సీఎస్ఈ/ మెకానికల్/..). అలాగే నిబంధనల మేర ఉద్యోగానుభవం.
- **దరఖాస్తు విధానం:** ఈమెయిల్.
- **దరఖాస్తు సమర్పణకు చివరి తేదీ:** ఫిబ్రవరి 15, 2018.
- **వెబ్‌సైట్:** www.iitd.ac.in

ఎన్ఐఏబీలో 6 ఖాళీలు

హైదరాబాద్‌లోని మియాపూర్‌లో ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏనిమల్ బయోటెక్నాలజీ (ఎన్ఐఏబీ).. 6 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఇది కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖకు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ పరిధిలోని అటానమస్ ఇన్‌స్టిట్యూట్.



- **పోస్టు-ఖాళీలు:** రీసెర్చ్ అసోసియేట్ (ఆర్ఏ)-1; ప్రాజెక్ట్ అసిస్టెంట్ (పీఏ)-1; ఫీల్డ్ అసిస్టెంట్ (ఎఫ్ఏ)-4.
- **ఫెలోషిప్:** ఆర్ఏ-రూ.46,800; పీఏ-రూ.22,000; ఎఫ్ఏ-రూ.20,000.
- **అర్హతలు:** ఆర్ఏకి.. బయోఇన్ఫర్మేటిక్స్/కంప్యూటేషనల్ బయాలజీ/కంప్యూటర్ సైన్స్ అనుబంధ విభాగాల్లో పీహెచ్‌డీ లేదా ఎంటెక్+కనీసం మూడేళ్ల అనుభవం; పీఏకి.. ఏదైనా డిగ్రీతోపాటు ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్‌లో అనుభవం; ఎఫ్ఏకి.. డిప్లొమా (ఏనిమల్ హజ్బెండరీ) లేదా ఇంటర్మీడియెట్ (సైన్సెస్)తోపాటు లార్జ్ ఏనిమల్ హ్యాండ్లింగ్‌లో కనీసం ఏడాది అనుభవం.
- **దరఖాస్తు విధానం:** ఆర్ఏ, పీఏకి ఆన్‌లైన్; ఎఫ్ఏకి ఆఫ్‌లైన్.
- **దరఖాస్తు సమర్పణకు చివరి తేదీ:** ఫిబ్రవరి 23, 2018.
- **వెబ్‌సైట్:** www.niab.org.in

సాక్షి బిజినెస్
మంగళవారం 13-2-2018
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
295 ▲	85 ▲
34,300	10,540

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30కి)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	6,973	▲	99
డోజోన్స్	24,542	▲	351
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,177	▲	85
డాక్స్	12,283	▲	175
షాంఘై	3,154	▲	24
నికాయ్ (9 ముగింపు)	21,383	▼	508

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	థామస్‌కుక్	58.46	67.79
£	బ్రిటన్ పౌండ్	థామస్‌కుక్	80.93	93.86
€	యూరో	థామస్‌కుక్	71.78	83.26
¥	జపాన్ ఎన్ (100)	థామస్‌కుక్	53.78	62.36
AUS	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	45.78	52.97
SS	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	44.07	52.20
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.54	18.43
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.91	18.60
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.22	11.70

బీఓఐ నష్టం రూ.2,341 కోట్లు

- రెట్టింపునకు మించిన కేటాయింపులు
- తగ్గిన నికర వడ్డీ ఆదాయం



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో రూ.2,341 కోట్ల నికర నష్టాలు వచ్చాయి. మొండి బకాయిలకు కేటాయింపులు రెట్టింపునకు పైగా మించడంతో పాటు, నికర వడ్డీ, ఇతర, నిర్వహణ ఆదాయాలు తగ్గడంతో ఈ స్థాయిలో నష్టాలు వచ్చాయని బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలిపింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ3లో రూ.102 కోట్ల నికర లాభం సాధించామని పేర్కొంది. గత క్యూ3లో రూ.11,594 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం ఈ క్యూ3లో 10,376 కోట్లకు తగ్గిందని తెలిపింది. మొండి బకాయిలకు కేటాయింపులు రూ.2,546 కోట్ల నుంచి రూ.4,373 కోట్లకు పెరిగాయని పేర్కొంది. నికర వడ్డీ ఆదాయం 18 శాతం తగ్గి రూ.2,501 కోట్లకు, ఇతర ఆదాయం 70 శాతం క్షీణించి రూ.1,041 కోట్లకు, నిర్వహణ లాభం 82 శాతం క్షీణించి రూ.1,354 కోట్లకు తగ్గాయని తెలిపింది.

పెరిగిన మొండి బకాయిలు

స్థూల మొండి బకాయిలు 13.38 శాతం నుంచి 16.93 శాతానికి, నికర మొండి బకాయిలు 7.09 శాతం నుంచి 10.29 శాతానికి ఎగిశాయని బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలిపింది. సీక్వెన్షియల్‌గా చూస్తే, స్థూల మొండి బకాయిలు 30 శాతం వృద్ధితో రూ.64,249 కోట్లకు, నికర మొండి బకాయిలు 53 శాతం వృద్ధితో రూ.36,117 కోట్లకు పెరిగాయని వివరించింది. గత ఆర్థిక సంవత్సరానికి అవకతవకలు(డైవర్జెన్స్–ఆర్‌బీఐ మదింపు, బ్యాంక్ వెల్లడించిన వాటికి మధ్య గల తేడా) స్థూల మొండి బకాయిల్లో రూ.14,000 కోట్లు, నికర మొండి బకాయిల్లో రూ.9,707 కోట్లు, కేటాయింపుల్లో రూ.4,350 కోట్ల మేర ఉన్నాయని వివరించింది. ప్రొవిజన్ కవరేజ్ రేషియో 56.96 శాతంగా ఉందని తెలిపింది.

ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్ 1.6 శాతం లాభంతో రూ.145 వద్ద ముగిసింది.

ఇండియన్ బ్యాంక్ మొండి బాకీలు తగ్గాయ్..



ఆర్థిక ఫలితాలను వెల్లడించిన ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల్లో తమ బ్యాంకే అత్యుత్తమ ఫలితాలను ప్రకటించిందని కారత్ తెలిపారు.

చెన్నై: ప్రభుత్వ రంగ ఇండియన్ బ్యాంక్ నికర లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో 19 శాతం తగ్గింది. గత క్యూ3లో రూ.373 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.303 కోట్లకు తగ్గిందని ఇండియన్ బ్యాంక్ తెలిపింది. పెట్టుబడులపై మార్క్ టు మార్కెట్ తరుగుదల రూ.407 కోట్లుగా ఉండడం వల్ల నికర లాభం తగ్గిందని బ్యాంక్ ఎమ్‌డీ, సీఈఓ కిశోర్ కారత్ తెలిపారు. ఇటీవల కాలంలో ఒక్కో క్వార్టర్‌లో మంచి ఫలితాలు సాధిస్తున్నామని, ఈ క్వార్టర్లో కూడా మంచి ఫలితాలు సాధించామని వివరించారు. మొత్తం ఆదాయం రూ.4,557 కోట్ల నుంచి రూ.4,903 కోట్లకు పెరిగిందని తెలిపారు. రుణ నాణ్యత మెరుగుపడిందని పేర్కొన్నారు. స్థూల మొండి బకాయిలు 7.69 శాతం నుంచి 6.27 శాతానికి, నికర మొండి బకాయిలు 4.76 శాతం నుంచి 3.3 శాతానికి తగ్గాయని తెలిపారు. ఒత్తిడి రుణాలు 12.41 శాతం నుంచి 8.88 శాతానికి తగ్గాయని పేర్కొన్నారు. నికర వడ్డీ ఆదాయం 30 శాతం వృద్ధితో రూ.1,623 కోట్లకు పెరిగిందని పేర్కొన్నారు. క్యాపిటల్ అడెక్వసీ రేషియో 12.44 శాతంగా ఉందని తెలిపారు. కాగా, ఇప్పటివరకూ క్యూ3

ఆర్థిక ఫలితాలు బాగా ఉండటంతో బీఎస్‌ఈలో ఇండియన్ బ్యాంక్ షేర్ 5 శాతం లాభంతో రూ.356 వద్ద ముగిసింది.

కంపెనీలకు ఐటీఆర్ మినహాయింపులు రద్దు

ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి



న్యూఢిల్లీ: డొల్ల కంపెనీలపై కొరడా ఝుళిపించే క్రమంలో కేంద్రం మరిన్ని చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా .. కట్టాల్సిన పన్ను రూ. 3,000కు లోబడి ఉండే సంస్థలకు ఐటీ రిటర్నుల (ఐటీఆర్) దాఖలు నుంచి మినహాయింపునిస్తుండటాన్ని ఇకపై రద్దు చేయాలని నిర్ణయించింది. ఏప్రిల్ 1 నుంచి ఇది అమల్లోకి వస్తుందని కేంద్ర ఆర్థిక శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఆయా కంపెనీలు పెట్టే పెట్టుబడులను ఆదాయ పన్ను విభాగం నిశితంగా పరిశీలిస్తుందని వివరించారు. లాభం తక్కువగా చూపే సంస్థలు, అలాగే తొలిసారిగా ఐటీ రిటర్నులు దాఖలు చేస్తున్న సంస్థలపైన కూడా మరింతగా దృష్టి పెట్టనున్నట్లు అధికారి పేర్కొన్నారు. సుమారు అయిదు లక్షలకు పైగా కంపెనీలు రిటర్నులు దాఖలు చేయడం లేదని, మనీలాండరింగ్‌కు ఇవి ఉపయోగపడుతున్నాయన్న సందేహాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 12 లక్షల పైగా సంస్థలు క్రియాశీలకంగా ఉన్నాయి. వీటిలో సుమారు 7 లక్షల సంస్థలు వార్షిక నివేదికలతో పాటు రిటర్నులూ దాఖలు చేస్తున్నాయి. ఇందులో 3 లక్షల సంస్థలు ఆదాయమే లేనట్లుగా చూపుతున్నాయి. ఐటీ చట్టంలోని సెక్షన్ 276సీసీ ప్రకారం ఉద్దేశపూర్వకంగా గడువులోపల ఐటీ రిటర్నులు దాఖలు చేయని వారిపై జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా విధించవచ్చు.

పరిశ్రమలు రయ్.. రయ్

డిసెంబర్‌లో పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి రేటు 7.1 శాతం

- జనవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం 5.07 శాతం

న్యూఢిల్లీ: పారిశ్రామిక ఉత్పత్తి (ఐఐపీ), రిటైల్ ద్రవ్యోల్బణం అంశాలకు సంబంధించి సోమవారంనాడు విడుదలైన తాజా గణాంకాలు కొంత ఊరటనిచ్చాయి. తయారీ రంగం ఊతంతో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) వృద్ధి 2017 డిసెంబర్‌లో 7.1 శాతంగా ఉంది. 2016 డిసెంబర్‌లో ఈ రేటు 2.4 శాతం. అయితే నవంబర్ 2017తో (8.8 శాతం) పోల్చితే మాత్రం ఐఐపీ తక్కువగా నమోదయ్యింది. డిసెంబర్‌తో పోల్చితే జనవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం స్వల్పంగా తగ్గింది. కేంద్ర గణాంకాల కార్యాలయం సోమవారం నాడు విడుదల చేసిన గణాంకాలు చూస్తే...

పారిశ్రామిక ఉత్పత్తిలో ముఖ్యాంశాలు...

- **తయారీ:** మొత్తం సూచీలో 74 శాతంగా ఉన్న ఈ విభాగంలో డిసెంబర్‌లో వృద్ధి 0.6 శాతం నుంచి భారీగా 8.4 శాతానికి పెరిగింది. ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్య రేటు మాత్రం 5 శాతం నుంచి 3.8 శాతానికి తగ్గింది. తయారీ రంగంలోని మొత్తం 23 పారిశ్రామిక గ్రూపుల్లో 16 సానుకూల ఫలితాన్ని నమోదుచేసుకున్నాయి.
- **మైనింగ్:** వృద్ధి రేటు డిసెంబర్‌లో 10.8 శాతం నుంచి తీవ్రంగా 1.2 శాతానికి పడిపోయింది. ఆర్థిక సంవత్సరం ఏడు నెలల కాలంలో ఈ రేటు 4.3 శాతం నుంచి 2.8 శాతానికి తగ్గింది.



- **విద్యుత్:** డిసెంబర్‌లో వృద్ధి రేటు 6.4 శాతం నుంచి 4.4 శాతానికి తగ్గగా, ఏడు నెలల కాలంలో ఈ రేటు 6.3 శాతం నుంచి 5.1 శాతానికి పడింది.
- **క్యాపిటల్ గూడ్స్:** పెట్టుబడులకు ప్రతిబింబంగా పరిగణించే ఈ విభాగంలో డిసెంబర్‌లో వృద్ధి రేటు 6.4 శాతం నుంచి 16.4 శాతానికి ఎగసింది.
- **అన్ని విభాగాలూ కలిసి...** రేటు 2.4 శాతం నుంచి 7.1 శాతానికి పెరిగింది. అయితే ఆర్థిక సంవత్స రం ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్య నెలల్లో ఈ రేటు 5.1 శాతం నుంచి 3.7 శాతానికి తగ్గింది.

రిటైల్ ధరలు కాస్త తగ్గాయి

2018 జనవరిలో టోకు ధరల సూచీ ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం 5.07 శాతంగా ఉంది. 2017 డిసెంబర్‌లో ఈ రేటు 17 నెలల గరిష్ట స్థాయిలో 5.21 శాతం. అయితే 2017 జనవరిలో మాత్రం రిటైల్ ద్రవ్యోల్బణం 3.17 శాతంగా నమోదయ్యింది. అంటే నెలవారీలో తగ్గినా వార్షికంగా చూస్తే రిటైల్ ద్రవ్యోల్బణం పెరిగిందన్నమాట.

విభాగాలవారీగా...



జనవరిలో ఐదు ప్రధాన విభాగాల్లో ద్రవ్యోల్బణాన్ని చూస్తే...ఆహారం, పానీయాల ద్రవ్యోల్బణం 4.58 శాతం, పాన్, పొగాకు, ఇతర హానికారక ఉత్పత్తుల ద్రవ్యోల్బణం 7.58 శాతం, దుస్తులు పాదరక్షల విభాగంలో ధరలు 4.94 శాతం, హౌసింగ్ విషయంలో 8.33 శాతం, ఫ్యూయెల్ అండ్ లైట్‌కు సంబంధించి 7.73 శాతం ధరలు పెరిగాయి. ఆహారం, పానీయాల విషయంలో ప్రధానంగా పప్పు దినుసులు (20.19 శాతం క్షీణత) మినహా మిగిలిన అన్ని ఆహార ఉత్పత్తుల ధరలు పెరిగాయి. కూరగాయల ధరలు భారీగా 26.97 శాతం ఎగశాయి. గుడ్ల ధరలు 8.70 శాతం పెరిగాయి. పండ్ల ధరలు 6.24 శాతం పెరగ్గా, మాంసం చేపల ధరలు 4.34 శాతం, పాలు, పాల పదార్థాల ధరలు 4.21 శాతం ఎగశాయి.

గెయిల్ 1:3 బోనస్

- మూడు షేర్లకు ఒక షేర్ బోనస్
- 28 శాతం పెరిగిన లాభం



న్యూఢిల్లీ: గెయిల్ ఇండియా కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ క్వార్టర్లో రూ.1,262 కోట్ల నికర లాభం సాధించింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ3లో సాధించిన నికర లాభం(రూ.983 కోట్లు)తో పోల్చితే 28 శాతం వృద్ధి సాధించామని గెయిల్ ఇండియా తెలిపింది. గ్యాస్ మార్కెటింగ్, ప్రసార వ్యాపారం మంచి మార్జిన్‌లు సాధించడంతో నికర లాభం ఈ స్థాయిలో పెరిగిందని కంపెనీ సీఎమ్‌డీ బి.సి. త్రిపాఠి చెప్పారు. ప్రతి మూడు షేర్లకు ఒక షేర్‌ను ఉచితంగా(బోనస్ 1:3) ఇవ్వడానికి తమ డైరెక్టర్ల బోర్డ్ ఆమోదం తెలిపిందని వివరించారు. ఆదాయం 17 శాతం వృద్ధి చెంది రూ.14,717 కోట్లకు, స్థూల మార్జిన్ 14 శాతం వృద్ధితో రూ.2,273 కోట్లకు పెరిగాయని పేర్కొన్నారు. పెట్రోకెమికల్ విభాగం అమ్మకాలు 21 శాతం, ఎల్‌పీజీ విభాగం అమ్మకాలు 10 శాతం చొప్పున వృద్ధి చెందాయని తెలిపారు.

మొండి బాకీల్లో వ్యత్యాసాలకు చెక్..

- వచ్చే ఏడాది పది శాతం మేర రుణ వృద్ధి అంచనా
- ఆచి తూచి కార్పొరేట్ రుణాలు
- ఎస్‌బీఐ చైర్మన్ రజనీష్ కుమార్



ముంబై: మొండి పద్దుల వర్గీకరణలో రిజర్వ్ బ్యాంక్ లెక్కలకు, తమ లెక్కలకు మధ్య ఇకపై వ్యత్యాసాల (డైవర్జెన్స్) సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) చైర్మన్ రజనీష్ కుమార్ స్పష్టం చేశారు. మార్చితో ముగిసే పూర్తి ఆర్థిక సంవత్సరం లెక్కల్లో ఎటువంటి తేడాలు లేకుండా జాగ్రత్తలు పాటిస్తామని ఆయన చెప్పారు. ఇటీవల డిసెంబర్ త్రైమాసిక ఫలితాల వెల్లడి సందర్భంగా.. 2017 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఎస్‌బీఐ రూ. 23,000 కోట్ల మేర మొండి బకాయిల డైవర్జెన్స్ చూపిన నేపథ్యంలో రజనీష్ కుమార్ వివరణ ప్రాధాన్యం సంతరించుకుంది. వర్గీకరణలో 'కాలవ్యవధిపరమైన' అంశాల కారణంగానే మొండిబాకీల లెక్కల్లో వ్యత్యాసాలు తలెత్తాయని కుమార్ ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. వాస్తవానికి 2017 మార్చి నాటికే సదరు రుణాలను మొండిబాకీల కింద గుర్తించినప్పటికీ.. అధికారికంగా వర్గీకరణ జరగకపోయి ఉండొచ్చని ఆయన తెలిపారు. 2016–17 ఆర్థిక సంవత్సరంలో ఎస్‌బీఐ భారీ మొత్తంలో ఎన్‌పీఏలను తక్కువగా చూపించినట్లు ఆర్‌బీఐ తనిఖీల్లో బైటపడిన సంగతి తెలిసిందే. గతేడాది ఆగస్టులో సవరించిన నిబంధనల ప్రకారం ఎన్‌పీఏల విషయంలో ఆర్‌బీఐ లెక్కలకు, బ్యాంకు లెక్కలకు మధ్య 15 శాతం పైగా వ్యత్యాసం ఉన్న పక్షంలో రిజర్వ్ బ్యాంక్‌కు కచ్చితంగా తెలియజేయాల్సి ఉంటుంది. దీని ప్రకారం చూస్తే ఎస్‌బీఐ లెక్కల్లో 21 శాతం మేర వ్యత్యాసం ఉన్నట్లు వెల్లడైంది. దీంతో.. వీటన్నింటికి కేటాయింపులు పెంచాల్సి రావడంతో డిసెంబర్ త్రైమాసికంలో ఎస్‌బీఐ రూ. 1,887 కోట్ల నికర నష్టం ప్రకటించాల్సి వచ్చింది.

భారీ పద్దులకు పరిష్కారం..

సుదీర్ఘకాలం మొండిబాకీలుగా కొనసాగుతున్న కొన్ని ఖాతాల మూలంగా ప్రొవిజనింగ్ సైతం అధిక స్థాయిలోనే ఉంటోందని రజనీష్ కుమార్ చెప్పారు. అయితే, భారీ మొండి పద్దులను ఈ ఏడాది సెప్టెంబర్ నాటికల్లా పరిష్కార చర్యల ద్వారా గానీ లేదా రైట్ డౌన్ రూపంలో గానీ ఖాతాల నుంచి తొలగించే అవకాశాలు ఉన్నాయని ఆయన వివరించారు. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం సుదీర్ఘకాలంగా ఎన్‌పీఏగా ఉన్న ఖాతాకు మరింత ఎక్కువ కేటాయింపులు చేయాల్సి వస్తుంది. గతేడాది డిసెంబర్ ఆఖరు నాటికి ఎస్‌బీఐ స్థూల మొండిబాకీలు (ఎన్‌పీఏ) రూ. 1.86 లక్షల కోట్ల నుంచి రూ. 1.99 లక్షల కోట్లకు, నికర ఎన్‌పీఏ నిష్పత్తి 9.83 శాతం నుంచి 10.35 శాతానికి పెరిగింది. మరోవైపు, రిటైల్ విభాగం ఊతంతో వచ్చే ఆర్థిక సంవత్సరం రుణ వృద్ధి 10 శాతం మేర ఉండొచ్చని రజనీష్ కుమార్ అంచనా వేశారు. అయితే, కార్పొరేట్ రుణాల విషయంలో మాత్రం ఇంకా ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు వివరించారు.

జనవరిలో ప్యాసింజర్ స్పీడ్..

- విక్రయాల్లో 7.57 శాతం వృద్ధి
- కార్ల అమ్మకాలు 1.25 శాతం డౌన్
- 85,850 యూనిట్లకు యుటిలిటీ వాహన విక్రయాలు
- సియామ్ గణాంకాల వెల్లడి

గ్రేటర్ నోయిడా: దేశీ ప్యాసింజర్ వాహన (పీవీ) విక్రయాల్లో వార్షిక ప్రాతిపదికన జనవరి నెలలో 7.57 శాతం వృద్ధి నమోదయ్యింది. ఇవి 2,65,389 యూనిట్ల నుంచి 2,85,477 యూనిట్లకు పెరిగాయి. దీనికి యుటిలిటీ వాహనాల బలమైన డిమాండ్ ప్రధాన కారణం. అయితే కార్ల విక్రయాల్లో 1.25 శాతం క్షీణత కనిపించింది. ఇవి 1,86,596 యూనిట్ల నుంచి 1,84,264 యూనిట్లకు తగ్గాయి. యుటిలిటీ వాహన (యూవీ) అమ్మకాలు ఏకంగా 37.88 శాతం వృద్ధితో 62,263 యూనిట్ల నుంచి 85,850 యూనిట్లకు ఎగిశాయి. నెలవారీ విక్రయాల పరంగా చూస్తే ఇది రెండో గరిష్ట స్థాయి. గతేడాది జూలైలో యుటిలిటీ వాహన విక్రయాలు అత్యధికంగా 86,874 యూనిట్లుగా నమోదయ్యాయి. సియామ్ తాజా గణాంకాల్లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ప్యాసింజర్ వాహన విక్రయాల్లో వృద్ధి అంచనాలకు అనుగుణంగానే ఉందని సియామ్ డైరెక్టర్ జనరల్ విష్ణు మాథూర్ తెలిపారు. యుటిలిటీ విభాగపు జోరు కొనసాగుతోందన్నారు. అయితే కారు సెగ్మెంట్‌లో విక్రయాలు స్థిరంగా ఉన్నాయని, దీనికి ఎంట్రీ లెవెల్ విభాగంలో కొత్త ఆవిష్కరణలు లేకపోవడం, కస్టమర్లు క్రాస్ ఓవర్స్, కాంపాక్ట్ ఎస్‌యూవీల వైపు మళ్లడం వంటివి కారణంగా పేర్కొన్నారు. మోటార్‌సైకిల్స్, స్కూటర్లకు గ్రామీణ, పట్టణ మార్కెట్లలో బలమైన డిమాండ్ ఉందని తెలిపారు.

మారుతీ విక్రయాలు 4 శాతం అప్

దేశీ దిగ్గజ కార్ల కంపెనీ మారుతీ సుజుకీ ఇండియా దేశీ ప్యాసింజర్ వాహన విక్రయాలు 4.05 శాతం వృద్ధితో 1,39,189 యూనిట్లకు పెరిగాయి. ఇక హ్యుందాయ్ మోటార్ ఇండియా అమ్మకాల్లో 8.31 శాతం వృద్ధి నమోదయ్యింది. ఇవి 45,508 యూనిట్లుగా ఉన్నాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్ ప్యాసింజర్ అమ్మకాలు వరుసగా 17.73% వృద్ధితో 23,656 యూనిట్లకు, 48.58% వృద్ధితో 21,872 యూనిట్లకు ఎగశాయి.



టూవీలర్ జోరు: జనవరిలో మొత్తం టూవీలర్ విక్రయాలు 33.43 శాతం వృద్ధితో 12,62,140 యూనిట్ల నుంచి 16,84,066 యూనిట్లకు పెరిగాయి. మోటార్‌సైకిల్ అమ్మకాల్లో 28.64 శాతం వృద్ధి కనిపించింది. ఇవి 10,54,062 యూనిట్లుగా ఉన్నాయి. మార్కెట్ లీడర్ హీరో మోటోకార్ప్ దేశీ మోటార్‌సైకిల్ అమ్మకాలు 24.39 శాతం వృద్ధితో 4,36,771 యూనిట్ల నుంచి 5,43,325 యూనిట్లకు పెరిగాయి. ఇక హోండా స్కూటర్ అండ్ మోటార్‌సైకిల్ (హెచ్‌ఎంఎస్‌ఐ) విక్రయాల్లో 21.82 శాతం వృద్ధి, బజాజ్ ఆటో విక్రయాల్లో 36.14 శాతం వృద్ధి కనిపించింది. ఇక టీవీఎస్ మోటార్స్ అమ్మకాల్లో 25.91 శాతం వృద్ధి, హీరో మోటోకార్ప్ విక్రయాల్లో 117.63 శాతం వృద్ధి కనిపించింది. ఇక వాణిజ్య వాహన అమ్మకాలు 39.73 శాతం వృద్ధితో 85,660 యూనిట్లకు పెరిగాయి.

ఈవీ జర్నీకి పరిశ్రమ రెడీ! కానీ..?



వాహన పరిశ్రమ ఎలక్ట్రిక్ వెహికల్స్ (ఈవీ) జర్నీకి వేగంగా సిద్ధమౌతోందని సియామ్ పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం చార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సహా పరిశ్రమ ఎదుర్కొంటున్న పలు సవాళ్ల పరిష్కారానికి ఒక దీర్ఘకాలిక పాలసీని ఆవిష్కరించాలని కోరింది. అలాగే ఈవీలపై జీఎస్‌టీ రేటును 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలని డిమాండ్ చేసింది. దీనివల్ల అందుబాటు ధరలో ఈవీలు కస్టమర్లకు లభ్యమౌతాయని పేర్కొంది. 'ఆటో ఎక్స్‌పోలో వివిధ కంపెనీలు పలు విభాగాల్లో కాన్సెప్ట్ వెహికల్స్‌ను మాత్రమే కాకుండా 28 వరకు మార్కెట్–రెడీ ఎలక్ట్రిక్ వాహనాలను కూడా ఆవిష్కరించాయి. ఇందులో టాటా మోటార్స్, మహీంద్రా, అశోక్ లేలాండ్, లోహియా, జేబీఎం వంటి పలు కంపెనీల వెహికల్స్ ఉన్నాయి. వాహన పరిశ్రమ ఈవీలపై ఏ స్థాయిలో దృష్టి కేంద్రీకరించిందో దీన్నిబట్టి అర్థంచేసుకోవచ్చు' అని విష్ణు మాథూర్ పేర్కొన్నారు.

ఎస్సార్ స్టీల్ కొనుగోలురేసులో ఆర్సెలర్ మిట్టల్



న్యూఢిల్లీ: రుణ సంక్షోభంతో దివాలా చర్యలు ఎదుర్కొంటున్న ఉక్కు సంస్థ ఎస్సార్ స్టీల్‌ను దక్కించుకునేందుకు అంతర్జాతీయ ఉక్కు దిగ్గజం ఆర్సెలర్ మిట్టల్ కూడా బరిలోకి దిగింది. ఆర్సెలర్ మిట్టల్ అనుబంధ సంస్థ ఆర్సెలర్‌మిట్టల్ ఇండియా (ఏఎంఐపీఎల్) ఇందుకోసం సోమవారం బిడ్ దాఖలు చేసింది. ఎస్సార్ పనితీరు, లాభదాయకతను మెరుగుపర్చేందుకు తీసుకోబోయే ప్రణాళికను ఇందులో వివరించినట్లు ఆర్సెలర్‌మిట్టల్ ఒక ప్రకటనలో తెలిపింది. మరోవైపు, గణనీయంగా వృద్ధి చెందుతున్న భారత మార్కెట్లో ప్రవేశించేందుకు ఎస్సార్ కొనుగోలు కూడా తమకు తోడ్పడగలదని ఆర్సెలర్‌మిట్టల్ చైర్మన్ లక్ష్మీనివాస్ మిట్టల్ పేర్కొన్నారు.

డిసెంబర్‌లోపు లీప్ విమాన ఇంజిన్ల తయారీ

- ఆదిభట్లలోని టీఏఎస్‌ఎల్ ప్లాంట్‌లో అభివృద్ధి షురూ
- తెలంగాణ ప్రభుత్వం, జీఈ, టీఏఎస్‌ఎల్ మధ్య ఒప్పందం
- డిజైన్, ఆర్డర్ల వంతు జీఈది.. తయారీ, నైపుణ్యం టాటాది



విశాల్ వాన్‌చూ, కేటీఆర్, బన్మాలీ అగర్వాలా (ఎడమ నుంచి కుడికి)

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హైదరాబాద్‌లోని ఆదిభట్లలో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్ లిమిటెడ్ (టీఏఎస్‌ఎల్) కేంద్రంలో లీప్ విమాన ఇంజిన్ అభివృద్ధి పనులు మొదలయ్యాయి. ఈ ఏడాది డిసెంబర్ ముగింపులోగా తయారీ పూర్తయి విపణిలోకి విడుదల కానుంది. గతేడాది అమెరికాకు చెందిన జనరల్ ఎలక్ట్రిక్ (జీఈ), టీఏఎస్‌ఎల్ మధ్య వ్యూహాత్మక ఒప్పందం జరిగిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా సోమవారమిక్కడ ఇరు కంపెనీలు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీఓఈ) కేంద్రానికి భూమి పూజ చేశాయి. ఈ కేంద్రంలో ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా అమ్ముడవుతున్న జెట్, సీఎఫ్‌ఎం లీప్ ఇంజిన్లను అభివృద్ధి చేస్తామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ కేంద్రంలో జీఈ, టీఏఎస్‌ఎల్‌తో పాటూ తెలంగాణ ప్రభుత్వం కూడా ప్రధాన పెట్టుబడి వాటాదారుగా ఉన్నట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి కేటీ రామారావు మాట్లాడుతూ.. ''దేశార్థికాభివృద్ధిలో తయారీ రంగం కీలకమైంది. అందులోనూ వైమానిక రంగంలో తయారీ అనేది అత్యంతకీలకమైందని.. అలాంటి కీలక కేంద్రం తెలంగాణలో ఉండటం రాష్ట్ర అభివృద్ధి సూచికని'' వివరించారు. హైదరాబాద్‌లోని ప్రముఖ కంపెనీల్లో టాటా ఒకటని.. ఇందులో జీఈ జత కట్టడం ముదావహమన్నారు. 'గతంలో ఢిల్లీలో జీఈ సీఈఓ, చైర్మన్ జాన్ ఫ్లానెర్రీ కలిశానని.. వచ్చే ఐదేళ్ల వరకూ జీఈ ఆర్డర్ బుక్ ఫుల్‌గా ఉందని ఈ విషయాన్ని చెప్పారని'' కేటీఆర్ గుర్తుచేశారు. వైమానిక రంగంలో నైపుణ్య శిక్షణ నిమిత్తం అకడమిక్స్‌తో ఒప్పందం చేసుకున్నామని తెలిపారు.

భవిష్యత్తులో వాణిజ్య, మిలిటరీ ఇంజిన్లు..

జీఈకి ప్రస్తుతం హైదరాబాద్, బెంగళూరులో పరిశోధన మరియు అభివృద్ధి (ఆర్‌అండ్‌డీ), సాంకేతికత కేంద్రాలున్నాయి. ఇందులో హైదరాబాద్ కేంద్రంలో 700 మంది ఇంజనీర్లు పనిచేస్తున్నారని జీఈ సౌత్ ఏషియా సీఈఓ, ప్రెసిడెంట్ విశాల్ వాన్‌చూ తెలిపారు. సాంకేతికత విభాగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతున్నామన్నారు. ''జీఈ మిలిటరీ ఇంజిన్లకు పెద్ద చరిత్రే ఉంది. ఇప్పటికే ఎయిర్ ఫోర్స్, ఇండియన్ నేవీ వంటి రక్షణ విభాగానికి జెట్ ఇంజిన్స్, మెరైన్ గ్యాస్ టర్బైన్స్ అభివృద్ధి చేశాం. అలాగే భవిష్యత్తులో టీఏఎస్‌ఎల్ కేంద్రంలో వాణిజ్య, మిలిటరీ ఇంజిన్లను కూడా తయారు చేస్తామని'' వాన్‌చూ వివరించారు.

ప్రస్తుతం ఎగుమతులకే..

జీఈ భాగస్వామ్యంతో దేశీయంగా తయారీ నైపుణ్యం మెరుగవ్వడంతో పాటూ అంతర్జాతీయ విమానయాన రంగంలో టాటా సామర్థ్యం మరింత వృద్ధి చెందుతుందని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డిఫెన్స్ అండ్ ఎయిరోస్పేస్ ప్రెసిడెంట్ బాన్మాలీ అగర్వాల్ అన్నారు. ప్రస్తుతానికైతే దేశీయంగా ఎలాంటి లీప్ ఇంజిన్ల ఆర్డర్లు లేవని, అభివృద్ధి చేస్తున్నవాటిని ఎగుమతి చేస్తామని ఆయన పేర్కొన్నారు. లీప్ ఇంజిన్లతో పాటు, ఇంజిన్‌లోని విడిభాగాలను కూడా తయారు చేస్తామన్నారు. ప్రపంచవ్యాప్తంగా లీప్ ఇంజిన్లకు డిమాండ్ పెరుగుతుంది. ప్రస్తుతం ఏడాదికి వెయ్యి ఇంజిన్ల డిమాండ్ ఉందని.. 2020 నాటికి ఏటా 2 వేల ఇంజిన్లకు చేరుతుందని వాన్‌చూ తెలిపారు. సీఎఫ్‌ఎం ఇంటర్నేషనల్ ఉత్పత్తే లీప్ ఇంజిన్. ఇది జీఈ, సాఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్ 50:50 జాయింట్ వెంచర్. 18 నెలల్లో 5 దేశాలకు చెందిన 35 ఎయిర్‌లైన్స్‌కు 200 లీప్ ఇంజిన్లు అభివృద్ధి చేశామని ఆయన వివరించారు.

నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

వస్తువు	ధర
పత్తి (వరంగల్, వ్యాపారస్తులు)	రూ. 4,500 (కనిష్ఠం), రూ. 4,800 (గరిష్ఠం)
మిర్చి (వరంగల్, తేజ)	రూ. 7,000 (కనిష్ఠం), రూ. 9,700 (గరిష్ఠం)
పసుపు (నిజామాబాద్, కొమ్ము)	--, --
ఉల్లి (కర్నూలు)	--, --
చక్కెర (చెన్నై)	రూ.3,600
బియ్యం (కరీంనగర్)	3,800 (హెచ్‌ఎంటీ)
కందిపప్పు (చెన్నై)	రూ.7,200
సుబాబులు (కృష్ణా)	రూ.4,400 (టన్నుకు)
ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)	--

10,500 పైకి నిఫ్టీ

సానుకూల అంతర్జాతీయ సంకేతాలు
- 295 పాయింట్ల లాభంతో 34,300కు సెన్సెక్స్
- 85 పాయింట్లు పెరిగి 10,540కు నిఫ్టీ

ఇటీవల పతనం కారణంగా ధరలు తగ్గి ఆకర్షణీయంగా ఉన్న షేర్లలో కొనుగోళ్లు జరగడంతో సోమవారం స్టాక్ మార్కెట్ లాభాల్లో ముగిసింది. గత పది ట్రేడింగ్ సెషన్లలో స్టాక్ సూచీలు లాభపడడం ఇది రెండో రోజు. అంతర్జాతీయ సంకేతాలు సానుకూలంగా ఉండటంతో పాటు, కంపెనీల క్యూ3 ఫలితాలు అంచనాలను మించడం, మార్కెట్ ముగిసిన తర్వాత వెలువడే రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలపై ఆశావహ అంచనాలు సెంటిమెంట్‌కు జోష్‌నిచ్చాయి. సెన్సెక్స్ 295 పాయింట్ల లాభంతో 34,300 పాయింట్ల వద్ద, నిఫ్టీ 85 పాయింట్ల లాభంతో 10,540 పాయింట్ల వద్ద ముగిశాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 346 పాయింట్లు, నిఫ్టీ 101 పాయింట్లు చొప్పున లాభపడ్డాయి.గత రెండు వారాల్లో బాగా నష్టపోయిన విద్యుత్తు, రియల్టీ, క్యాపిటల్ గూడ్స్, బ్యాంకింగ్, ఫార్మా షేర్లలో కొనుగోళ్లు జోరుగా జరిగాయి. ఐటీ, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు మినహా అన్ని రంగాల సూచీలు లాభాల్లో ముగిశాయి.

టాటా స్టీల్ 4 శాతం అప్..

ఈ క్యూ3లో నికర లాభం ఐదింతలు పెరగడంతో టాటా స్టీల్ షేర్ 4 శాతం లాభపడింది సెన్సెక్స్‌లో బాగా లాభపడిన షేర్ ఇదే. ఇంట్రాడేలో 5 శాతం లాభంతో రూ.718ను తాకిన ఈ షేర్ చివరకు 4.2 శాతం లాభంతో రూ.713 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.7,063 కోట్లు పెరిగింది. ఫలితాలు బలహీనంగా ఉండటంతో ఎస్‌బీఐ షేర్ 3 శాతం కుదేలైంది. ఎన్‌ఎస్‌ఈ ఇంట్రాడేలో రూ.285 కనిష్ట స్థాయికి పడిపోయిన ఈ షేర్ చివరకు 2.1 శాతం నష్టంతో రూ.290 వద్ద ముగిసింది. ఈ బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.6,819 కోట్లు తగ్గి రూ.2,49,035 కోట్లకు పడిపోయింది. శుక్రవారం అమెరికా మార్కెట్ లాభపడిన దన్నుతో సోమవారం ఆసియా స్టాక్ మార్కెట్లు లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు లాభాల్లో ఆరంభమయ్యాయి.

నేడు మార్కెట్‌కు సెలవు

మహాశివరాత్రి సందర్భంగా నేడు (మంగళవారం) స్టాక్ మార్కెట్‌కు సెలవు. బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈల్లో ట్రేడింగ్ మళ్లీ బుధవారం మొదలవుతుంది.

శ్రీమలాని ఫోమ్స్ పరిశ్రమలో ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఐకియా ప్రతినిధి, సిద్ధార్థ మలాని

శ్రీమలానితో ఐకియా జట్టు

చిన్నశంకరంపేట(మెదక్): స్వీడన్‌కి చెందిన ఫర్నీచర్ దిగ్గజ సంస్థ ఐకియా తాజాగా శ్రీమలాని ఫోమ్స్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం ఐకియా సంస్థకు తాము స్ప్రింగ్ ఫోమ్స్‌ను సరఫరా చేయనున్నట్లు శ్రీమలాని ఫోమ్స్ ఎండీ సిద్ధార్థ మలాని తెలిపారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో మెరుగైన ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు ఈ ఒప్పందం తోడ్పడగలదని వివరించారు. భారత్‌లో కార్యకలాపాలను విస్తరించే క్రమంలో శ్రీమలాని ఫోమ్స్‌తో చేతులు కలిపినట్లు ఐకియా బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ పంకజ్ దత్తా తెలిపారు. మెదక్‌లోని శ్రీమలాని ఫోమ్స్ ప్లాంటును ఐకియా ప్రతినిధులు సందర్శించిన సందర్భంగా ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు.

వృద్ధి పుంజుకుంటుంది...!

- 2018–19లో 7.5 శాతం వృద్ధి
- డాయిష్ బ్యాంక్ నివేదిక

న్యూఢిల్లీ: భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు వచ్చే ఆర్థిక సంవత్సరం (2018 ఏప్రిల్–2019 మార్చి) పుంజుకుంటుందని అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం–డాయిష్ బ్యాంక్ అంచనావేస్తోంది. వృద్ధి రేటు 7.5 శాతంగా ఉంటుందని విశ్లేషించింది. సమీప భవిష్యత్తులో రెపోరేటును (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు– ప్రస్తుతం 6 శాతం) రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పెంచుతుందన్న భయాలనూ డాయిష్‌బ్యాంక్ త్రోసిపుచ్చింది. 2018లో ఈ అవకాశాలు లేవని అభిప్రాయపడింది. ద్రవ్యోల్బణం తీవ్ర స్థాయికి పెరిగే అవకాశాలు లేకపోవడమే తన విశ్లేషణకు ఆధారమని వివరించింది. ఇది వృద్ధికి దోహదపడే అంశంగా పేర్కొంది. అయితే రేటు పెంపు నిర్ణయంవైపు ఆర్‌బీఐ మొగ్గుచూపితే, వృద్ధి ఊహించినదానికన్నా తగ్గుతుందనీ హెచ్చరించింది. సోమవారంనాడు విడుదల చేసిన నివేదికలో ముఖ్యాంశాలు చూస్తే...

- పెద్దనోట్ల రద్దు, వస్తు, సేవల పన్ను అమల్లో ఇబ్బందులు తత్సబంధ అంశాలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపాయి. రానున్న ఆర్థిక సంవత్సరంలో ఈ సవాళ్లు తొలగిపోతాయన్నది ప్రస్తుత విశ్లేషణ.
- అయితే వృద్ధికి కొన్ని అవరోధాలూ ఉన్నాయి. అంతర్జాతీయ చమురు ధరల ధోరణి, వర్షపాతం, కనీస మద్దతు ధరల పెరుగుదల, ప్రపంచ ఆర్థిక మార్కెట్ల ఒడిదుడుకుల తీవ్రత వంటి అంశాలను ఇక్కడ పరిగణనలోకి తీసుకోవాలి.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–జూన్‌లో భారత్ వృద్ధి మూడేళ్ల కనిష్టస్థాయి 5.7 శాతానికి పడిపోయింది. జూలై–సెప్టెంబర్ త్రైమాసికంలో కొంచెం మెరుగుపడి 6.3 శాతంగా ఉంది. అయితే డిసెంబర్, మార్చి త్రైమాసికంలో వృద్ధి మరింత పుంజుకుంటుంది.

కార్పొరేషన్ బ్యాంక్ నష్టాలు రూ.1,240 కోట్లు

న్యూఢిల్లీ: కార్పొరేషన్ బ్యాంక్‌కు ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబర్ క్వార్టర్లో రూ.1,240 కోట్ల నికర నష్టాలు వచ్చాయి. గత క్యూ3లో రూ.159 కోట్ల నికర లాభం సాధించామని కార్పొరేషన్ బ్యాంక్ తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరం క్యూ2లో రూ.1,035 కోట్ల నికర నష్టాలు వచ్చాయని పేర్కొంది. గత క్యూ3లో రూ.5,840 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం ఈ క్యూ3లో రూ.4,841 కోట్లకు తగ్గిందని తెలిపింది.

రెట్టింపునకు పైగా కేటాయింపులు...

స్థూల మొండి బకాయిలు 11.26 శాతం నుంచి 15.92 శాతానికి, నికర మొండి బకాయిలు 7.64 శాతంనుంచి 10.73 శాతానికి పెరిగాయని కార్పొరేషన్ బ్యాంక్ తెలిపింది. ఇక మొండి బకాయిలకు కేటాయింపులు రూ.992 కోట్ల నుంచి రూ.2,495 కోట్లకు పెరిగాయని పేర్కొంది. గత ఏడాది డిసెంబర్ చివరినాటికి ప్రొవిజన్ కవరేజ్ రేషియో 59.48 శాతంగా ఉందని కార్పొరేషన్ బ్యాంక్ తెలిపింది. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో కార్పొరేషన్ బ్యాంక్ షేర్ 2 శాతం వరకూ లాభపడి రూ.36 వద్ద ముగిసింది.

రెండింతలకుపైగా పెరిగిన విశాక లాభం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డిసెంబర్ త్రైమాసికంలో విశాక ఇండస్ట్రీస్ నికరలాభం క్రితంతో పోలిస్తే రూ.6 కోట్ల నుంచి రూ.14 కోట్లకు ఎగిసింది. టర్నోవరు రూ.220 కోట్ల నుంచి రూ.243 కోట్లకు చేరింది. 2017–18 ఏప్రిల్–డిసెంబర్‌లో రూ.787 కోట్ల టర్నోవరుపై రూ.51 కోట్ల నికరలాభం పొందింది.

సాంఖ్యా ఇన్ఫోటెక్ లాభం రూ.1.3 కోట్లు..

గడిచిన త్రైమాసికంలో సాంఖ్యా ఇన్ఫోటెక్ నికరలాభం క్రితంతో పోలిస్తే రూ.1.4 కోట్ల నుంచి రూ.1.3 కోట్లకు వచ్చి చేరింది. టర్నోవరు రూ.38 కోట్ల నుంచి రూ.45 కోట్లకు ఎగిసింది.

కోరమాండల్ అగ్రోకు నష్టం..

డిసెంబర్ క్వార్టరులో కోరమాండల్ అగ్రో ప్రొడక్ట్స్ అండ్ ఆయిల్స్‌కు రూ.2 కోట్ల నష్టం వాటిల్లింది. క్రితం ఏడాది ఇదే కాలంలో కంపెనీ రూ.30 లక్షల నికరలాభం పొందింది. టర్నోవరు రూ.20 కోట్ల నుంచి రూ.23 కోట్లకు చేరింది.

మూడింతలైన బార్‌ట్రానిక్స్ నష్టం

డిసెంబర్ త్రైమాసికంలో బార్‌ట్రానిక్స్ నష్టాలు క్రితంతో పోలిస్తే మూడింతలై రూ.18 కోట్లకు చేరుకున్నాయి. టర్నోవరు రూ.20 కోట్ల నుంచి రూ.17 కోట్లకు వచ్చి చేరింది.

ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్‌కు రూ.70 లక్షల లాభం..

డిసెంబర్‌లో ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ ఇంజనీరింగ్, కన్‌స్ట్రక్షన్ కంపెనీ రూ.70 లక్షల నికరలాభం పొందింది. క్రితం ఏడాది రూ.1.9 కోట్ల నష్టం వచ్చింది. టర్నోవరు రూ.445 కోట్ల నుంచి రూ.489 కోట్లకు ఎగిసింది.

సూర్యలక్ష్మి కాటన్‌కు రూ.20 లక్షల లాభం..

గడిచిన క్వార్టరులో సూర్యలక్ష్మి కాటన్ మిల్స్ రూ.20 లక్షల లాభం నమోదు చేసింది. క్రితం ఏడాది కంపెనీకి రూ.61 లక్షల నష్టం వాటిల్లింది. టర్నోవరు రూ.146 కోట్ల నుంచి రూ.169 కోట్లకు ఎగిసింది.

60 శాతం తగ్గిన పెబ్స్ లాభం..

డిసెంబర్ క్వార్టరులో పెబ్స్ పెన్నార్ నికరలాభం క్రితంతో పోలిస్తే 60 శాతం తగ్గి రూ.2 కోట్లు నమోదు చేసింది. టర్నోవరు రూ.152 కోట్ల నుంచి రూ.117 కోట్లకు వచ్చి చేరింది.

జీఐసీ రీ లాభం రూ.673 కోట్లు

ముంబై: ప్రభుత్వ రంగ రీ ఇన్సూరెన్స్ దిగ్గజం జీఐసీ రీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ క్వార్టర్లో రూ.673 కోట్ల నికర లాభం సాధించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్లో రూ.401 కోట్ల నికర నష్టాలు వచ్చాయని జీఐసీ రీ తెలిపింది. గత క్యూ3లో 105.9 శాతంగా ఉన్న కంబైన్డ్ రేషియో ఈ క్యూ3లో 101.1 శాతం సాధించడం, వాహన, సముద్ర, అగ్ని తదితర అన్ని బీమా రంగ విభాగాల్లో మంచి పనితీరు సాధించడం వల్ల ఈ నికర లాభం సాధించామని కంపెనీ సీఎమ్‌డీ అలిస్ వైద్యన్ తెలిపారు. కాగా స్టాక్ మార్కెట్లో లిస్టయిన తర్వాత ఈ కంపెనీ వెల్లడించిన తొలి ఆర్థిక ఫలితాలు ఇవి. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో జీఐసీ రీ షేర్ స్వల్పంగా లాభపడి రూ.746 వద్ద ముగిసింది.

యునైటెడ్ బ్యాంక్‌కు 'మొండి' భారం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్–డిసెంబర్ క్వార్టర్‌కు రూ.638 కోట్ల మేర నికర నష్టాలు వచ్చాయి. పెట్టుబడుల ఆదాయం తగ్గడం, మొండి బకాయిల కేటాయింపులు పెరగడం వల్ల ఈ స్థాయిలో నష్టాలు వచ్చాయని యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలిపింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో రూ.64 కోట్ల నికర లాభం సాధించామని పేర్కొంది.

క్షీణించిన రుణ నాణ్యత: గత క్యూ3లో రూ.3,086 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం ఈ క్యూ3లో రూ.2,483 కోట్లకు తగ్గిందని బ్యాంక్ తెలిపింది. నికర వడ్డీ ఆదాయం రూ.361 కోట్ల నుంచి రూ.348 కోట్లకు తగ్గిందని పేర్కొంది. స్థూల మొండి బకాయిలు 15.98 శాతం నుంచి 20.10 శాతానికి, నికర మొండి బకాయిలు 10.62 శాతం నుంచి 11.96 శాతానికి పెరిగాయని తెలిపింది. కేటాయింపులు రూ.495 కోట్ల నుంచి రూ.964 కోట్లకు ఎగిశాయని వివరించింది. డిపాజిట్లు ఫ్లాట్‌గా రూ.1,25,579 కోట్లుగా ఉండగా, రుణాలు రూ.68,250 కోట్లకు పెరిగాయని పేర్కొంది. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్ 0.6 శాతం లాభంతో రూ.15 వద్ద ముగిసింది.

బొలెరో పికప్ శ్రేణిపై బైబ్యాక్, మెయింటెనెన్స్ ఆఫర్లు

హైదరాబాద్: ప్రముఖ వాహన తయారీ కంపెనీ 'మహీంద్రా అండ్ మహీంద్రా' తాజాగా తన బొలెరో పికప్ శ్రేణి వాహనాలపై గ్యారెంటీ ఆఫర్లను ప్రకటించింది. నాలుగు సంవత్సరాల తర్వాత కనీసం 4 లక్షల కచ్చితమైన బైబ్యాక్ విలువ, రెండేళ్లపాటు ఉచిత మెయింటెనెన్స్ వంటివి ఇందులో ఉన్నాయని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. తాజా ఆఫర్ల ద్వారా వినియోగదారులు వారి పెట్టుబడులకు ఉత్తమ విలువను పొందటంతోపాటు నిర్వహణ ఖర్చులను తగ్గించుకొని అధిక సంపాదన పొందొచ్చని సంస్థ ఆటోమోటివ్ విభాగపు (సేల్స్ అండ్ మార్కెటింగ్) చీఫ్ వాజీరామ్ నక్రా తెలిపారు.

బోర్డ్ మీటింగ్స్

డీఎల్‌ఎఫ్, క్రిసిల్, జీఎమ్ఆర్ ఇన్‌ఫ్రా, ఎన్‌బీసీసీ, యూనిటెక్, గాడ్‌ఫ్రే ఫిలిప్స్, ఇండియా టూరిజమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, కోల్టే పాటిల్ డెవలపర్స్, మ్యాక్స్ ఇండియా, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా.

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9, 10గ్రా)	30,225
బంగారం (99.5, 10గ్రా)	30,075
వెండి (కిలో)	37,925
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	– –
బంగారం (22 క్యారెట్లు)	28,770
వెండి (కిలో)	--
హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	30,210
బంగారం (22 క్యారెట్లు)	28,770
వెండి (కిలో)	41,000
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	31,050
బంగారం (22 క్యారెట్లు)	28,680
వెండి (కిలో)	39,200
విశాఖపట్నం	
బంగారం(24 క్యారెట్లు)	31,429
బంగారం (22 క్యారెట్లు)	28,100
వెండి (కిలో)	41,000
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	31,100
బంగారం (22 క్యారెట్లు)	28,800
వెండి(కిలో)	39,100
ఏపీ బులియన్ అసోసియేషన్	
బంగారం (24 క్యారెట్లు)	31,110
బంగారం (22 క్యారెట్లు)	28,770
వెండి (కిలో)	39,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	59.77 (రాత్రి 11.00కు)	$59.20 (శుక్రవారం ముగింపు)
బ్రెంట్	63.19 (రాత్రి 11.00కు)	$62.79 (శుక్రవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 13-2-2018

విశాఖ	375–00
చిత్తూరు	388–00
వరంగల్	373–00
ముంబై	415–00
చెన్నై	395–00
విజయవాడ	370–00
గోదావరి	370–00
నమక్కల్	380–00
12-2-2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	371–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.30
బెంగళూరు	377–00
ఢిల్లీ	393–00
కోల్‌కతా	395–00

ఎన్‌ఎస్‌ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PO	403.35	399
AMBUJA C	256.9	258.9
ASIAN PA	1144.4	1130.75
AXIS BAN	564.2	557.55
BAJAJ AU	3154.1	3099.25
BAJAJ FI	1643.8	1639.4
BHARTI A	424.4	422.5
BOSCH LI	19545.85	19482.6
BHARAT P	467.55	475.4
CIPLA LT	621.65	621.4
COAL IND	300.65	300.15
EICHER M	27901.4	27747.95
GAIL (IN	465	462.45
HCL TECH	939.15	964
HDFC LTD	1805.45	1773.05
HDFC BAN	1876.65	1849.5
HERO MOT	3611.9	3546.1
HINDALCO	243.25	243.5
HIND.petrol	391.45	395.7
HIND.unilever	1344.45	1333.05
INDIABUL	1314.85	1288.4
ICICI BA	326.25	326.75
INDUSIND	1687.8	1649.85
BHARTI I	338.25	341.5
INFOSYS	1102.8	1109.15
INDIAN O	379.05	378.65
ITC LTD	269.85	271.35
KOTAK MA	1042.95	1032
LARSEN &	1350.5	1329.25
LUPIN LI	840.45	822.15
MAHINDRA	746	750.05
MARUTI S	9117.85	8936.1
NTPC LTD	164.9	163.25
OIL AND	191	187.35
POWER GR	198.5	193.2
RELIANCE	915.5	897.85
STATE BA	288.75	296.4
SUN PHAR	589.15	582.7
TATA MOT	371.8	368.75
TATA STE	713.1	685.3
TATA CON	2967.3	2971.7
TECH MAH	590.35	595.25
ULTRATEC	4200.3	4153.3
UPL LIMI	726.5	708.35
VEDANTA	315.55	316.3
WIPRO LT	288.95	285
YES BANK	335.4	325.55
ZEE ENTE	584.5	580.95

నిఫ్టీ నెక్ట్స్ ఫిఫ్టీ

ABB INDI	1610.65	1590.8
ACC LIMI	1651.55	1660.95
ASHOK LE	133.3	134.2
BAJAJ FI	5235.45	5059.35
BANK OF	168.65	156.25
BHARAT E	157.75	156.3
BHEL	97.5	94.4
BRITANNI	4772.5	4641.15
CADILA H	423.65	411.75
COLGATE	1093.9	1100.85
CONTAINE	1325.3	1317.65
CUMMINS	845	824.45
DABUR IN	344.75	340.55
DLF LIMI	233.75	229.05
AVENUE S	1187.2	1177.8
EMAMI LI	1080.85	1088.05
GLAXOSMI	2449.05	2466.25
GLENMARK	535.35	535.2
GODREJ C	1029.5	1016.6
GLAXOSMI	5971.1	6080.2
HAVELLS	516.05	515.25
HIND.zinc	307.65	303.55
ICICI PR	416	415.1
IDEA CEL	84.5	83.7
INTERGLO	1250.85	1258.65
JSW STEE	310.75	309.35
LIC HOUS	521.5	511.85
MARICO L	310.05	297.2
UNITED S	3268.2	3194
MOTHERSO	364.45	359.95
MRF LTD	71640.9	70013.8
NHPC LTD	29.5	28.7
NMDC LTD	137.4	136
ORACLE F	4052.7	4069.15
OIL INDI	360.75	355.05
PIRAMAL	2687.3	2633.75
PETRONET	248.7	246.8
POWER FI	111.25	109.3
P&G HYGI	9344.1	9310
PIDILITE	894.5	878.2
PUNJAB N	161.65	156.8
RURAL EL	154.05	149.95
STEEL AU	95.35	93.95
SHREE CE	16953.35	17041.45
SIEMENS	1255.5	1229.4
SHRIRAM	1325.9	1311.3
SUN TV N	985.1	973.55
TATA POW	86.75	85.05
TITAN CO	809.05	796.8
TORRENT	1430.8	1434.35

బీఎస్‌ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
Alphageo	844.05	848.6
Alu Flouride	116.95	117.9
Amar Raja Bat	844.95	798.45
And Bank	48.75	47.2
And Cemen	11.88	11.88
And Paper	349.3	342.95
And Petro	62.45	64.6
Anjani Portl	214	211.5
Aries Agro Ltd	225.2	214.5
Aurobindo Ph	607.85	590.15
Avantel Soft	607.9	605.5
Avanti Feeds	2506.25	2437.95
AvonOrg	12.8	13.35

A B C D

20 MICRO	54.35	54
3M INDIA	21706.7	18924.45
5PAISA C	294.9	290.75
63 MOONS	105.4	104.3
8K MILES	801	751.2
A AND M	66.55	65
AARTI DR	624.75	612.4
AARTI IN	1132.65	1139.2
AARVI EN	92.9	88.5
ABAN OFF	190.15	186.95

BANSWARA	120.05	119.4
BASF IND	2226.05	2121.65
BATA IND	714.5	714.9
BAYER CR	3887	3898.75
BEARDSEL	63.5	57.9
BEML LIM	1347.85	1256.15
BERGER P	249.45	246.65
BETA DRU	166	163
BF INVES	357.85	345.6
BF UTILI	495.2	473.5
BGR ENER	125.3	121.9
BHAGERIA	308.4	303
BHANSALI	182.9	178.45
BHARAT B	1474.95	1397.1

DFM FOOD	1680.55	1646.3
DHAMPUR	207.85	204.85
DHANUKA	696.2	685.5
DHUNSERI	157.2	150.85
DHUNSERI	400.4	421.45
DHUNSERI	440.9	435.7
DIC INDI	528.3	525.05
DILIP BU	975.75	933.65
DISH TV	74.65	73.85
DISHMAN	345.15	344.75
DIXON TE	3436.4	3458.3
DOLLAR I	430.05	415.6
DOLPHIN	100.7	97.65
DONEAR I	64.9	63.95

GRUH FIN	532.55	532.85
GTPL HAT	168	166.1
GUFIC BI	128.7	125.9
GUJ IND	122.7	122.35
GUJ NAR	488.55	476.8
GUJ STAT	137.85	132.5
GUJ. APO	229.55	229
GUJARAT	145.75	145.95
GUJARAT	145.7	148.45
GUJARAT	199.6	202.5
GUJARAT	256.3	242.3
GUJARAT	759.75	742.95
GUJARAT	787.55	776.95
GUJARAT	850.65	856.85

JAIN IRR	123.15	118.15
JALAN TR	59.5	59
JAMNA AU	82.3	79.5
JASH ENG	179.15	178
JAY BHAR	499.55	499.25
JAYANT A	391.9	391.25
JAYSHREE	109.8	111.05
JBF INDU	179.5	177.15
JBM AUTO	490.9	470.6
JET AIRW	823.4	791.7
JET KNIT	109	110
JHS SVEN	67.3	67.85
JIND POL	69.6	67.65
JINDAL D	174.25	170.8

MAHINDRA	471.5	471.95
MAITHAN	879.3	848.3
MAJESCO	494	487.4
MAN INDU	139.8	135.95
MAN INFR	61.4	60.45
MANAKSIA	63.2	64.1
MANAPPUR	105.9	104.35
MANG.CHE	71.55	68.5
MANGALAM	167.55	172.6
MANGALAM	382.8	377.75
MANPASAN	420.5	399.95
MANUGRAP	52.35	52.9
MARATHON	518.1	514.1
MAS FINA	610.1	614.85

PERSISTE	783.3	796.3
PETRON E	131.9	131.6
PFIZER L	2321.4	2309.3
PG ELECT	329.25	321.9
PHILIPS	1156.4	1101.35
PI INDUS	840.45	810.45
PIONEER	191.9	194.1
PLASTIBL	209.75	200.65
PNB HOUS	1245.55	1216.05
PNC INFR	174.15	172.6
PODDAR H	1143.25	1149.95
PODDAR P	297.8	298.25
POKARNA	215.95	209.7
POLY MED	256.45	254.7

SHAKTI P	576.3	571.85
SHALBY L	234.8	233.75
SHALIM P	187.05	183.35
SHANKARA	1779.8	1771.45
SHANTHI	157.05	141.55
SHARDA C	394.15	382.9
SHARDA M	2453.9	2375.75
SHEELA F	1611.9	1589.85
SHEMAROO	508.35	525.7
SHILPA M	508.75	520.15
SHIPPING	85.45	77.4
SHIRPUR	164.1	155.75
SHIVA TE	608.85	610.05
SHIVAM A	83.4	81.25

THE INDI	162.05	161.4
THE MAND	141.4	146.2
THE NEW	737.5	696.6
THE PHOE	599.9	589.3
THE RAMC	739.9	710.9
THE RUBY	352.3	341.75
THE STAT	159.25	155.55
THE TINP	248.15	241.1
THEJO EN	585	585
THEMIS M	585	575.05
THERMAX	1181.05	1183.65
THIRUMAL	2170.7	2064
THOMAS C	243.5	238.25
THYROCAR	656.85	655.15

నీకన్నా తెలివైనోడిని

జల సంరక్షణ కార్యక్రమంలో ఓ వ్యక్తినుద్దేశించి సీఎం వ్యాఖ్య

సాక్షి అమరావతి బ్యూరో: 'నువ్వు తెలివైన వాడివైతే.. నీకంటే నేను ఇంకా తెలివైన వాడిని..' అని సోమవారం జల సంరక్షణ కార్యక్రమం సందర్భంగా తన సమస్య గురించి ప్రస్తావించిన ఓ వ్యక్తిని ఉద్దేశించి సీఎం వ్యాఖ్యానించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెంకటపాలెంలో నీరు – ప్రగతిలో భాగంగా రెండో దశ కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు. సీఎం ప్రసంగం ముగిసిన వెంటనే కృష్ణా జిల్లా జి.కొండూరు మండలానికి చెందిన రామాంజనేయులు అనే వ్యక్తి మాట్లాడుతూ 'టీడీపీ ప్రభుత్వంలో జల సంరక్షణ కాదు.. జనానికి రక్షణ కరువైంది' అని పేర్కొనటంతో కలకలం రేగింది. మందడం గ్రామానికి చెందిన మాదల సుబ్బయ్య అనే వ్యక్తి కుమారుడు తనపై దాడి చేశాడని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని సీఎం వద్ద వాపోయారు. ఆయన ఇంకా మాట్లాడుతుండగా.. సీఎం కల్పించుకుని రామాంజనేయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెప్పేది విని తర్వాత మాట్లాడాలని హెచ్చరించారు. 'నువ్వు తెలివైన వాడివైతే.. నీకంటే నేను ఇంకా తెలివైన వాడిని' అని వ్యాఖ్యానించారు. అనంతరం ఆయన సమస్య గురించి ఎస్పీకి చెబుతానంటూ సీఎం నిష్క్రమించారు.

రాష్ట్రమంతా 116 రోజులు: నీటి సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని, నీటిని వినియోగించే ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలని సీఎం సూచించారు. రాష్ట్రమంతా 116 రోజులు ఈ కార్యక్రమాన్ని చేపట్టి పూడికతీత, అలుగు, తూముల కాంక్రీట్ పనులు, పంట సంజీవనుల తవ్వకం చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మంత్రులు దేవినేని ఉమా, ప్రత్తిపాటి, జలవనరులశాఖ సెక్రటరీ శశి భూషణ్ కుమార్, ఎంపీ గల్లా జయదేవ్, సీఆర్‌డీఏ కమిషనర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


సీఎంకు సమస్యను విన్నవించుకునేందుకు వచ్చిన రామాంజనేయుల్ని అడ్డుకుంటున్న పోలీసులు

మీ హామీలు ఒక్కటీ అమలు కాలేదు

సాక్షి, అమరావతి: ఆర్టీసీ కార్మికులు, సంస్థను ఆదుకుంటామని మేనిఫెస్టోలో టీడీపీ ఇచ్చిన హామీలు ఇంతవరకు అమలు కాలేదని నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) నేతలు పేర్కొన్నారు. 2015, 2017లో వేలాది మంది ఆర్టీసీ కార్మికుల సమక్షంలో నిర్వహించిన సభల్లో ఇచ్చిన హామీలను ఒక్కటీ నెరవేర్చలేదని సీఎం చంద్రబాబు వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం సచివాలయంలో సీఎంను కలిసిన ఎన్ఎంయూ నేతలు ఆర్టీసీ ఆర్థిక పరిస్థితిపై వినతి పత్రం ఇచ్చారు.

సిటీ సివిల్ కోర్టులో తాత్కాలిక హైకోర్టు!

- రాష్ట్ర ప్రభుత్వం తాజా ప్రతిపాదన
- నాలుగు ఎకరాల్లో తాత్కాలిక హైకోర్టు యోచనకు స్వస్తి
- సీఆర్‌డీఏ అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్షలో నిర్ణయాలు

సాక్షి, అమరావతి: రాజధానిలో తాత్కాలిక హైకోర్టు నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం కొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. అమరావతిలో సిటీ సివిల్ కోర్టు నిర్మించి అందులోనే తాత్కాలికంగా హైకోర్టు ఏర్పాటు చేయాలని భావిస్తోంది. తాత్కాలిక హైకోర్టును నాలుగెకరాల్లో నిర్మించే ఆలోచనను విరమించుకుంది. సోమవారం వెలగపూడిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సీఆర్‌డీఏ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు.

ఆమోదించిన సీఎం చంద్రబాబు

రాజధానిలో 1.96 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో సిటీ సివిల్ కోర్టు ఏర్పాటు చేసి అందులోనే తాత్కాలికంగా హైకోర్టు ఏర్పాటు చేయాలని తాజాగా నిర్ణయించారు. 8 నెలల్లో దీన్ని నిర్మించడానికి ప్రణాళిక రూపొందించినట్లు సీఆర్‌డీఏ అధికారులు ముఖ్యమంత్రికి వివరించగా ఆయన అంగీకారం తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణాన్ని నేషనల్ హైవే అథారిటీకి అప్పగించాలని, భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి భూమిని భూ సమీకరణ ద్వారా సేకరించాలని నిర్ణయించారు. ఏప్రిల్ 10 నుంచి 12 వరకూ విజయవాడలో ఆనంద నగరాల అంతర్జాతీయ సదస్సు నిర్వహించాలని నిర్ణయించారు. గతంలో పవిత్ర సంగమం వద్ద దీన్ని నిర్వహించాలని భావించినా తాజాగా విజయవాడలోని ప్రైవేట్ ఫంక్షన్ హాలు ఏ–1 కన్వెన్షన్ సెంటర్‌లో దీన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సమావేశం అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ ఇన్నర్ రింగ్ రోడ్డు పనులకు త్వరలోనే టెండర్లు పిలుస్తామన్నారు.

స్వాతంత్ర్య పోరాటంలా పార్లమెంటులో పోరాటం

పార్లమెంట్ టీడీపీ ఎంపీలు చేపట్టిన నిరసనలను సీఎం చంద్రబాబు దేశ స్వాతంత్ర్య పోరాటంతో పోల్చారు. స్వాతంత్ర్యం కోసం పోరాడటం గత చరిత్రని, రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడటం ప్రస్తుత చరిత్రని చెప్పారు. సోమవారం అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం.

వెబ్‌సైట్లో పోలవరం వివరాలు

పోలవరం ప్రాజెక్టు పనులను 2019 నాటికి పూర్తి చేసేందుకు వారం రోజుల్లోగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సీఎం జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలోని తన కార్యాలయం నుంచి ప్రాజెక్టు పనులపై ఆయన వర్చువల్ రివ్యూ నిర్వహించారు. మార్చి 15 నాటికి పురుషోత్తపట్నం ఎత్తిపోతల పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నెల్లూరు బ్యారేజీ, సంగం బ్యారేజీ పనులను జూన్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మంత్రి దేవినేని విలేకరులతో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు వివరాలను www.polavaram.apegov.com పేరిట ప్రత్యేక వెబ్‌సైట్లో ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఉంచుతామని ప్రకటించారు.

15న ఢిల్లీకి చంద్రబాబు

సీఎం చంద్రబాబు 15న ఢిల్లీ వెళ్లనున్నారు. కేంద్ర బడ్జెట్ అనంతరం బీజేపీ–టీడీపీ మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో సీఎం ఢిల్లీ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది.

హోదా కోసం నినదించిన విద్యార్థిలోకం



గుంటూరు శంకర్‌విలాస్ సెంటర్‌లో ర్యాలీగా వస్తున్న విద్యార్థులు

పట్నంబజారు (గుంటూరు): ప్రత్యేక హోదా.. ఆంధ్రుల హక్కు అని విద్యార్థిలోకం కదం తొక్కింది. గుంటూరులోని శంకర్ విలాస్ సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాంక్షిస్తూ విద్యార్థులు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మేరుగ నాగార్జున, పార్టీ నగర అధ్యక్షుడు లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆతుకూరి ఆంజనేయులు, పెదకూరపాడు నియోజకవర్గ సమన్వయకర్త కావటి మనోహర్‌నాయుడు, గుంటూరు జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు పానుగంటి చైతన్య, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు డైమండ్‌బాబు పాల్గొన్నారు. తొలుత లాడ్జిసెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నేతలు నివాళులు అర్పించారు. అనంతరం అక్కడి నుంచి శంకర్‌విలాస్ సెంటర్ వరకు విద్యార్థులతో కలసి భారీ ర్యాలీ నిర్వహించారు.

సర్వం శివమయం


విద్యుత్ దీపకాంతులతో కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి ఆలయం

నరసరావుపేటరూరల్/పుట్టపర్తి అర్బన్/యనమలకుదురు (పెనమలూరు)/శ్రీశైలం/శ్రీకాళహస్తి: మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్రంలోని శ్రీశైలం, శ్రీకాళహస్తి వంటి ప్రముఖ శైవక్షేత్రాల్లో వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండలోని శ్రీత్రికోటేశ్వర స్వామి దేవస్థానం సర్వాంగసుం దరంగా ముస్తాబయింది. లక్షలాది మంది తరలివచ్చే తిరునాళ్లను దృష్టిలో ఉంచుకుని పోలీస్ శాఖ ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టింది.

గజవాహనంపై దర్శనమిచ్చిన శ్రీశైలేశుడు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీశైలంలో జ్యోతిర్లింగ స్వరూపుడైన మల్లికార్జునస్వామి భ్రమరాంబ దేవి సమేతంగా సోమవారం రాత్రి గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవమూర్తులకు ఆలయ ప్రదక్షిణ చేయించారు. ప్రధానాలయ రాజగోపురం గుండా రథశాలకు నుంచి బయలు వీరభద్రస్వామి ఆలయం వరకు కొనసాగిన గ్రామోత్సవం రాత్రి 9.30 గంటలకు యథాస్థానానికి చేరుకుంది. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మంగళవారం రాత్రి 10 గంటల నుంచి శ్రీమల్లికార్జునస్వామి వార్లకు ఏకాదశ రుద్రాభిషేకాన్ని ప్రారంభిస్తారు. మల్లన్న వరుడయ్యే శుభముహూర్తం రాత్రి 10.30 నుంచి ప్రారంభమవుతుంది. అనంతరం ఆలయప్రాంగణంలోని నాగులకట్ట సమీపంలో అత్యంత శోభాయమానంగా అలంకరించిన కల్యాణవేదికపై శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల బ్రహ్మోత్సవ కల్యాణం జరిపిస్తారు. కాగా, చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం నాగరాత్రి సందర్భంగా పలు కార్యక్రమాలను వేడుకగా నిర్వహించారు.

విజయవాడలో పెళ్లికుమారుడిగా స్వామివారు

కృష్ణా జిల్లా యనమలకుదురు గ్రామంలో మహాశివరాత్రి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామివారిని పెళ్లికుమారుడిని చేశారు. ఆలయ కమిటీతో పాటు ఆలయ కార్యనిర్వాహణాధికారులు ఎన్.భవాని, సత్యవతి లాకుల వద్ద ఉన్న కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద నుంచి స్వామివారికి పట్టు వస్త్రాలు తీసుకు వచ్చారు.

సీతా.. ఎంత మారిపోయావ్‌రా!

అమ్మ ఒడిలో ఒదిగిన సీతారాం ఏచూరి



భీమవరం నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకేనన్నట్టు సుదీర్ఘ కాలం తర్వాత తనయుడిని చూసిన ఆ తల్లి సంబరపడిపోయింది. 'సీతా.. ఎలా ఉన్నావ్‌రా?' అంటూ ఆప్యాయంగా ముద్దాడింది. చిన్న పిల్లాడికి తినిపించినట్టు కంచంలో అన్నం తెచ్చి కొసరి తినిపించింది. ఎన్నో కబుర్లు చెప్పింది. ఏమిటిదంతా అనుకుంటున్నారా? భీమవరంలో జరుగుతున్న సీపీఎం 25వ రాష్ట్ర మహాసభల్లో పాల్గొనేందుకు వచ్చిన పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి కొద్ది విరామం దొరికింది. దీంతో ఆయన పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాంకు మనసులో మాట చెప్పారు. 'మా అమ్మను చూసి చాలాకాలం అయింది. ఒక్కసారి కాకినాడ వెళ్లి చూసొస్తా.. వాహనం ఏర్పాటు చేయగలరా?' అని కోరారు. దానికాయన 'మీరు వెళ్లటం ఎందుకు? అమ్మనే ఇక్కడకు (భీమవరం) తీసుకొద్దాం' అని చెప్పగా ఏచూరి సున్నితంగా తిరస్కరించారు. తానే వెళ్తానని ఆదివారం కాకినాడ బయల్దేరారు. కాకినాడ కుళాయిచెరువు సమీపంలోని గాంధీపార్క్ వద్ద తన ఇంటికి వెళ్లే సమయానికి ఏచూరి మాతృమూర్తి కల్పకం పూజ చేస్తున్నారు. ఏచూరి రాక గురించి తెలియటంతో ఆమె పరుగు పరుగున వచ్చి.. 'సీతా, ఎలా ఉన్నావ్ రా.. ఎంత మారిపోయావ్' అంటూ కౌగిలించుకున్నారు. శిరసు వంచి ముద్దాడింది. అమ్మ ప్రేమను తనివితీరా ఆస్వాదించిన సీతారాం ఏచూరి 'ఎలా ఉన్నావమ్మా? మావయ్య వాళ్లు ఎలా ఉన్నారు?' అంటూ వాకబు చేశారు. అమ్మతో కలిసి తృప్తిగా భోజనం చేశారు. అనంతరం కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని తిరిగి కాకినాడకు బయల్దేరారు. స్వతంత్ర భావాలు గలిగిన కల్పకం ఏచూరి 80 ఏళ్ల వయస్సులో తన సహాయకురాలితో కలిసి కాకినాడలో ఉంటున్నారు.

పురాతన పంచలోహ విగ్రహాలు లభ్యం

నాగేంద్రుని పుట్టలో బయటపడ్డ శివ, పార్వతుల విగ్రహాలు



కోవెలకుంట్ల: కర్నూలు జిల్లా కోవెలకుంట్ల పట్టణ శివారులోని పాటి మీద వెలసిన శివాలయం సమీపంలో సోమవారం పురాతన పంచలోహ విగ్రహాలు లభ్యమయ్యాయి. ఆలయ సమీపంలోని నాగేంద్రుని పుట్ట వద్ద సోమవారం వేద పండితుల ఆధ్వర్యంలో అభిషేకం, ఇతర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పుట్టలో నుంచి పొగ రావడాన్ని గమనించిన వేద పండితులు ఈ విషయాన్ని ఆలయ కమిటీకి తెలియజేశారు. కమిటీ సభ్యులు అక్కడకు చేరుకుని పుట్టను నీటితో కరిగించారు. విభూతి లింగం బయటపడింది. దీన్ని కరిగించగా అందులో ఒక అడుగు ఎత్తున్న శివపార్వతుల పంచలోహ విగ్రహాలు లభ్యమయ్యాయి. వీటిని ఆలయంలో ప్రతిష్ఠించారు. సుమారు ఎనిమిది వందల ఏళ్ల క్రితం ఈ ప్రాంతంలో కనుమలపాడు అనే గ్రామం ఉండేది. కాలక్రమేణా ఈ గ్రామం కనుమరుగు కాగా.. అక్కడ ఆంజనేయస్వామి, శివాలయం మాత్రమే మిగిలాయి. శివాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో ఏడాది క్రితం పట్టణానికి చెందిన పవన్ ఏజెన్సీ నిర్వాహకులు శ్రీనివాసరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి ఆలయాన్ని జీర్ణోద్ధరణ గావించారు. అప్పటి నుంచి నిత్య పూజలు కొనసాగిస్తున్నారు. మంగళవారం శివరాత్రి పండుగ కావడంతో ఆలయంలో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. శివ పార్వతుల విగ్రహాలు లభ్యం కావడంతో భక్తులు భారీగా వచ్చి దర్శించుకున్నారు.

ఏవోబీలో ఎదురు కాల్పులు!

భారీగా మావోల కిట్ బ్యాగులు, సామగ్రి స్వాధీనం

ముంచంగిపుట్టు (అరకులోయ): ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతంలో సోమవారం తెల్లవారు జామున కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసు బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు జరిగినట్లు తెలిసింది. ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జోడహం పంచాయతీ జగన్నాథపురం అటవీ ప్రాంతంలో స్పెషల్‌పార్టీ, గ్రేహౌండ్స్ బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్న సమయంలో మావోయిస్టులు తారసపడటంతో ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. కాల్పులు జరుపుతూనే మావోలు సంఘటన స్థలం నుండి తప్పించుకున్నట్లు సమాచారం. సంఘటనా స్థలాన్ని పోలీసు బలగాలు పరిశీలించగా మావోలకు చెందిన 70 కిట్ బ్యాగులు, సామగ్రి లభించాయి. అయితే ఎదురు కాల్పుల్లో ఇరువర్గాలకు ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. ఈ సంఘటనలో మావోయిస్టు అగ్ర నేత ఆర్కే ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

పేరుకే ప్రమోషన్!

సాక్షి, అమరావతి: గిరిజన సంక్షేమ శాఖలో నెలరోజుల క్రితం పలువురికి ఇచ్చిన పదోన్నతులు మొక్కుబడిగా మారాయి. సహాయ గిరిజన సంక్షేమ అధికారులకు జిల్లా గిరిజన సంక్షేమాధికారులుగా పదోన్నతులు దక్కాయి. అయితే, ఆయాచోట్ల రెవెన్యూ అధికారులు డిప్యుటేషన్‌పై జిల్లా పోస్టులో ఉండటంతో ఐటీడీఏలో ఏపీవోగా ఒక అధికారి బాధ్యతలు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. గిరిజన సంక్షేమ శాఖలో గత ఏడాది డిసెంబరు 4న జిల్లా ప్రమోషన్ కమిటీ (డీపీసీ) సమావేశమై 2018 జనవరి 17న పదోన్నతులు ఇచ్చింది. దీంతో వైఎస్సార్ జిల్లాలో సహాయ గిరిజన సంక్షేమ అధికారిగా పనిచేస్తున్న లలితాబాయికి ప్రకాశం జిల్లా గిరిజన సంక్షేమ అధికారిగా పోస్టింగ్ ఇచ్చారు. కానీ, అక్కడ రెవెన్యూ శాఖకు చెందిన కె రాజ్యలక్ష్మి ఉండటంతో లలితాబాయికి జిల్లా పోస్టు దక్కలేదు. దీంతో నెల్లూరు ఐటీడీఏలో ఏపీవోగా ఆమెకు బాధ్యతలు ఇచ్చారు. పేరుకే ప్రమోషన్ తప్ప ఉపయోగమేంటని అధికారులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

ఎందుకీ హైడ్రామాలు బాబూ!

- వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ నిలదీత
- ఏం పోరాడారని సన్మానాలు సత్కారాలు



సాక్షి, హైదరాబాద్: చంద్రబాబు అసమర్థత, అవకాశవాదం, స్వప్రయోజనాల వల్లే కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ ధ్వజమెత్తారు. దీన్ని తమ పార్టీతో సహా విపక్షాలన్నీ ఏకమై ప్రశ్నిస్తోంటే, తెలుగుదేశం పార్టీ మాత్రం ఏదో సాధించినట్టు సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. పార్లమెంట్‌లో అటూ ఇటూ కాని ప్రసంగం చేసినందుకే ఆ పార్టీ ఎంపీ గల్లా జయదేవ్‌కు ఊరేగింపులు, సత్కారాలు, సన్మానాలు చేయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. హైదరాబాద్ లోటస్ పాండ్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్ ప్రవేశపెట్టి 12 రోజులైనా చంద్రబాబు మీడియా ముందుకు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఆయన వల్లే రాష్ట్రానికి తీరని నష్టం వాటిల్లుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక ప్రసంగానికే ఎంపీకి సన్మానం చేస్తే.. నాలుగేళ్లుగా నోరు మెదపకుండా చేసిన మోసానికి చంద్రబాబుకు ఎలాంటి శిక్ష వేయాలని నిలదీశారు.

ఏ అలుగులో ఉన్నావ్!

రోజూ మీడియా ముందుకొచ్చి ఊదరగొట్టే చంద్రబాబు 12 రోజులైనా కన్పించకపోవడానికి కారణాలేమిటని వాసిరెడ్డి ప్రశ్నించారు. ఆయన వ్యవహారం చూస్తుంటే.. మడుగులో దాక్కున్న దుర్యోధనుడే గుర్తుకొస్తున్నాడని ఎద్దేవా చేశారు. నాలుగేళ్లుగా జరుగుతున్న అన్యాయాన్ని సమర్థిస్తూ 26 పేజీల పుస్తకంలో విస్తృతంగా ప్రచారం చేసి, ఇప్పుడు ఉన్నట్టుండి రాష్ట్రానికి నష్టం జరగబోతోందని డ్రామాలాడటం ప్రజలను మభ్యపెట్టడమేనని చెప్పారు.

వెన్నుపోటు... లొంగుబాట్లే: ప్రజా సమస్యలపై ఉద్యమించిన చరిత్ర ఏనాడూ చంద్రబాబుకు లేదని వాసిరెడ్డి దుయ్యబట్టారు. జీవితమంతా వెన్నుపోట్లు, లొంగుబాట్లు, కుట్రలతోనే సాగిందని విమర్శించారు. తోడల్లుడు, తమ్ముడు, బావమరిది, వదిన... ఎవరినైనా మోసం చేస్తాడని, సెంటిమెంట్ అనేదే ఆయనలో కన్పించదని చెప్పారు. అధికారం కోసం ఏమైనా చేస్తాడని, కేసులకు భయపడి కేసీఆర్‌కు సగం, కాంగ్రెస్ పార్టీకి మరో సగం అమ్మేశారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు స్థానంలో ఒక సామాన్య వ్యక్తి ఉన్నా రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై మాట్లాడేవారని చెప్పారు. విభజన హామీలు నెరవేరకపోయినా, ప్రత్యేక హోదా ఇవ్వకపోయినా నాలుగేళ్లుగా మాట్లాడని చంద్రబాబు ఇప్పుడు ఉన్నట్టుండి బీజేపీ మీద డ్యాన్సులు కట్టడం అంతా డ్రామానే అని, రాజకీయ లబ్ధి కోసమే ఇదంతా చేస్తున్నారని మండిపడ్డారు.

రుద్రవరంలో వింత పక్షులు



ఆళ్లగడ్డ: కర్నూలు జిల్లా రుద్రవరం మండల కేంద్రంలోని శోభన్‌బాబు అనే వ్యక్తి ఇంట్లోకి సోమవారం మూడు వింత పక్షులు ప్రవేశించాయి. దీనిపై స్థానికులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. సెక్షన్ అధికారి నాగతిరుపాలు అక్కడికి చేరుకుని మూడు పక్షులను స్వాధీనం చేసుకున్నారు. ఈ పక్షుడు గుడ్లగూబలను పోలివున్నాయి. కాగా, ఇతర ప్రాంతాల నుంచి పక్షులు వలస వస్తున్నాయని వాటికి హాని తలపెట్టకుండా తమకు అప్పగించాలని అటవీ అధికారులు కోరారు.

పనిలేని వాళ్ల గురించి ఏం మాట్లాడతాం: కేఈ

కోటగుమ్మం (రాజమహేంద్రవరం): ఎన్నికల్లో పోటీ చేయని వాళ్ల గురించి.. పని లేని వారి గురించి ఏం మాట్లాడతామని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌ను ఉద్దేశించి డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. సోమవారం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆర్ అండ్ బీ అతిథి గృహంలో పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పవన్‌కల్యాణ్ జేఏసీపై విధి, విధానాలే ప్రకటించలేదని, ఇదో పనికిరాని జేఏసీ అని వ్యాఖ్యానించారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని, ఈ విషయం కేంద్రానికి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు ఇప్పుడు సందిగ్ధంలో పడ్డాయన్నారు.



కామన్వెల్త్ గేమ్స్‌కు దీపా కర్మాకర్ దూరం

భారత స్టార్ జిమ్నాస్ట్ దీపా కర్మాకర్ ఈసారి కామన్వెల్త్ గేమ్స్‌లో బరిలోకి దిగడం లేదు. ఏప్రిల్‌లో ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్ నగరం ఈ మెగా ఈవెంట్‌కు వేదికగా నిలువనుంది. 2014 గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్‌లో దీపా కాంస్య పతకాన్ని గెలిచి ఈ ఘనత సాధించిన తొలి భారతీయ జిమ్నాస్ట్‌గా రికార్డు సృష్టించింది. 2016 రియో ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో నిలిచిన దీపా గతేడాది ప్రాక్టీస్ సందర్భంగా గాయపడింది. మోకాలి గాయం నుంచి పూర్తిగా కోలుకోలేకపోవడంతో కామన్వెల్త్ గేమ్స్‌లో దీపా పాల్గొనటంలేదని ఆమె కోచ్ బిశ్వేశ్వర్ నంది తెలిపారు.

ఎవరి గాలి వీస్తుందో!

'విండీ సిటీ' వేదికగా నేడు ఐదో వన్డే • సిరీస్ గెలిచేందుకు భారత్‌కు మరో అవకాశం • ఆత్మవిశ్వాసంతో దక్షిణాఫ్రికా



కోహ్లి

దక్షిణాఫ్రికా గడ్డపై తొలిసారి వన్డే సిరీస్ నెగ్గేందుకు అతి చేరువగా వచ్చిన భారత్ గత మ్యాచ్‌లో ఆ అవకాశాన్ని కోల్పోయింది. వర్షం కారణంగా లక్ష్యం తగ్గిపోవడం, మరి కాస్త అదృష్టం కూడా కలిసొచ్చి సఫారీ జట్టు నాలుగో వన్డేలో గట్టెక్కింది. అయితే టీమిండియా ఇంకా సిరీస్ ఫలితాన్ని శాసించే స్థితిలోనే ఉంది. తొలి మూడు వన్డేల్లో చూపిన ఫామ్‌ను మరోసారి ప్రదర్శిస్తే ఈసారి గెలుపు అసాధ్యం కాబోదు. మరోవైపు వరుస పరాజయాలకు వాండరర్స్‌లో అడ్డుకట్ట వేయడంలో సఫలమైన సఫారీ జట్టులో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఈ నేపథ్యంలో భారత్ మరో మ్యాచ్‌కు ముందే సిరీస్‌ను తమ ఖాతాలో వేసుకుంటుందా లేక దక్షిణాఫ్రికా ఫలితాన్ని చివరి మ్యాచ్ వరకు తీసుకెళుతుందా అనేది చూడాలి.

పోర్ట్ ఎలిజబెత్: టెస్టు సిరీస్‌లో పరాజయం తర్వాత వన్డే సిరీస్‌ను ఎలాగైనా ఒడిసి పట్టుకోవాలని పట్టుదలగా ఉన్న భారత్ ఆ దిశగా మరొక్క విజయాన్ని ఆశిస్తోంది. తమ జోరుకు నాలుగో వన్డేలో బ్రేక్ పడినా అది తాత్కాలికమేనని, సిరీస్ గెలవగల సత్తా తమలో ఉందని నిరూపించేందుకు కోహ్లి సేన సన్నద్ధమైంది. ఈ నేపథ్యంలో భారత్, దక్షిణాఫ్రికా మధ్య నేడు ఇక్కడి సెయింట్ జార్జెస్ పార్క్‌లో ఐదో వన్డే జరగనుంది. ప్రస్తుతం 3–1తో ముందంజలో ఉన్న టీమిండియా ఈ మ్యాచ్‌లో గెలిస్తే సిరీస్ సొంతం కావడంతో పాటు నంబర్‌వన్ ర్యాంక్ కూడా సుస్థిరమవుతుంది. సొంతగడ్డపై సిరీస్ కాపాడుకునే ప్రయత్నంలో గత మ్యాచ్‌లో రాణించిన సఫారీ జట్టు అదే ప్రదర్శనను పునరావృతం చేయాలని భావిస్తోంది.

కేదార్ జాదవ్ ఉంటాడా!

జొహన్నెస్‌బర్గ్ వన్డేలో భారత్‌కు ప్రతికూల ఫలితం రావడంతో పాటు కొన్ని అంశాలు కొత్త పాఠాన్ని నేర్పాయి. తొలి మూడు మ్యాచ్‌లలో అద్భుత ప్రదర్శనతో జట్టును గెలిపించిన ఇద్దరు లెగ్ స్పిన్నర్లపైనే కోహ్లి అమితంగా ఆధారపడటం సరైంది కాదని తేలింది. డెత్ బౌలింగ్‌లో భువనేశ్వర్, బుమ్రాలను సరైన విధంగా వాడుకోవాలని కూడా అర్థమైంది. ఈ నేపథ్యంలో భారత్ కొత్త వ్యూహాలతో బరిలోకి దిగాల్సిన అవసరం ఉంది. గత మ్యాచ్‌లో జాదవ్ ఉండి ఉంటే 'లో ఆర్మ్' బౌలింగ్ జట్టుకు ఉపయోగపడేదేమో. అతను అనారోగ్యం నుంచి కోలుకుంటే తుది జట్టులోకి రావచ్చు. పైగా స్పిన్‌కు పిచ్ అనుకూలంగా ఉంది కాబట్టి అది బలంగా మారవచ్చు కూడా. మరోవైపు దైవాధీనంలా ఉన్న రోహిత్ శర్మ బ్యాటింగ్ మెరుగుపడాలని జట్టు కోరుకుంటోంది. అదే విధంగా నాలుగో స్థానంలో పాతుకుపోయే అవకాశం దక్కినా రహానే ఆశించిన స్థాయిలో ఆడలేకపోతుండటం నిరాశ కలిగించే అంశం. తొలి వన్డేలో అర్ధ సెంచరీ తర్వాత అతను రెండు సార్లు పేలవంగా 11, 8 పరుగులకే వెనుదిరిగాడు. రహానే స్థానంలో మనీశ్ పాండేను ప్రయత్నించే అవకాశం కూడా లేకపోలేదు. ప్రాక్టీస్ సెషన్‌ను బట్టి చూస్తే ఇద్దరు స్పిన్నర్లలో ఒకరి స్థానంలో లేదా పాండ్యాకు బదులుగా అక్షర్ పటేల్‌ను ఎంచుకోవచ్చని కూడా ఒక అంచనా. అయితే బౌలింగ్ మార్పులు ఎలా ఉన్నా మరోసారి మన బలమైన బ్యాటింగ్‌పైనే భారమంతా ఉంది. ముఖ్యంగా కోహ్లి, ధావన్ సూపర్ ఫామ్ మరోసారి జట్టుకు భారీ స్కోరు అందిస్తే ఇక తిరుగుండదు. చివరి వన్డే దాకా ఒత్తిడి పెంచుకోకుండా ఉండాలంటే సిరీస్‌ను ఇక్కడే ముగించాల్సి ఉంది.

ఈసారి హీరో ఎవరు?

దక్షిణాఫ్రికా ఎట్టకేలకు విజయాన్ని అందుకున్న నాలుగో వన్డేలో ఓవరాల్‌గా చూస్తే అందరూ తలా ఓ చేయి వేసి జట్టును గెలిపించారు. ఆమ్లా, డివిలియర్స్, మిల్లర్ చేసినవీ భారీ స్కోర్లేమీ కావు. అదే విధంగా చివర్లో టి20 తరహాలో ఆడటం వల్ల క్లాసెన్, ఫెలుక్‌వాయో కొన్ని మెరుపులు మెరిపించగలిగారు. ఇది చాలు దక్షిణాఫ్రికా జట్టులో ఆత్మవిశ్వాసం రెట్టింపు చేసేందుకు. మూడు మ్యాచ్‌ల వరకు కనీసం స్పిన్ బంతిని కూడా అర్థం చేసుకోలేని స్థితి నుంచి ఎదురుదాడితో మ్యాచ్ గెలవవచ్చని వారు నిరూపించగలిగారు. ఇదే ఆటను మళ్లీ చూపిస్తే సఫారీల పని సులువవుతుంది. బౌలింగ్‌లో రబడ ముందుండి నడిపిస్తున్నాడు. అతడిని ఎదుర్కోవడంలో భారత బ్యాట్స్‌మెన్ ఇబ్బంది పడుతున్నారు. అయితే మరో ఇద్దరు పేసర్లు మోర్కెల్, ఇన్‌గిడిలలో ఒకరు ఈ సారి పెవిలియన్‌కే పరిమితం కావచ్చు. గత మ్యాచ్‌కు దూరమైన తాహిర్ మళ్లీ వచ్చే అవకాశం ఉంది. నాలుగో వన్డేలో కేవలం డుమిని పార్ట్ టైమ్ స్పిన్‌నే దక్షిణాఫ్రికా నమ్ముకొని బరిలోకి దిగింది. కానీ ఇక్కడి పిచ్‌పై ఆ జట్టుకు ప్రధాన స్పిన్నర్ అవసరం ఉంది. మొత్తంగా డివిలియర్స్ రావడమే ఆ జట్టులో కొత్త స్ఫూర్తి నింపినట్లుంది. అయితే ఈ మైదానంలో సఫారీల రికార్డు గొప్పగా లేకపోవడం ప్రతికూలాంశం. 32 మ్యాచ్‌లలో 11 ఓడిన ఆ జట్టు... గత పది మ్యాచ్‌లలో ఆరు ఓడింది.

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: కోహ్లి (కెప్టెన్), రోహిత్, ధావన్, రహానే, జాదవ్/అయ్యర్, పాండ్యా, ధోని, భువనేశ్వర్, బుమ్రా, చహల్, కుల్దీప్.

దక్షిణాఫ్రికా: మార్క్‌రమ్ (కెప్టెన్), ఆమ్లా, డుమిని, డివిలియర్స్, మిల్లర్, క్లాసెన్, ఫెలుక్‌వాయో, మోరిస్, రబడ, మోర్కెల్, ఇన్‌గిడి/తాహిర్.

పిచ్, వాతావరణం

దక్షిణాఫ్రికాలోని నెమ్మదైన పిచ్‌లలో ఇది ఒకటి. అయితే ఆరంభంలో మంచి బ్యాటింగ్ వికెట్. ఆపై స్పిన్నర్లు ప్రభావం చూపించగలరు. మ్యాచ్ సమయంలో వర్ష సూచన ఉంది.

సా.గం. 4.30 నుంచి సోనీ టెన్ 1, 3లలో ప్రత్యక్ష ప్రసారం



దక్షిణాఫ్రికాలో భారత్‌కు పేలవ రికార్డు ఉన్న మైదానాల్లో ఇక్కడి సెయింట్ జార్జెస్ పార్క్ ఒకటి. 1992 నుంచి ఈ స్టేడియంలో ఐదు వన్డేలు ఆడిన భారత్ అన్నీ ఓడిపోయింది. నాలుగు సార్లు దక్షిణాఫ్రికా చేతిలో పరాజయంపాలు కాగా, ఒకసారి కెన్యా చేతిలోనూ ఓడింది. పైగా టీమ్ అత్యధిక స్కోరు కూడా 176 మాత్రమే. 'విండీ సిటీ'గా పేరున్న పోర్ట్ ఎలిజబెత్‌లో విపరీతమైన వేగంతో గాలులు వీస్తాయి. దానిని దృష్టిలో ఉంచుకొని కూడా తుది జట్టును ఎంపిక చేస్తామని భారత్ ఫీల్డింగ్ కోచ్ ఆర్.శ్రీధర్ వెల్లడించారు.

పొరపాట్ల నుంచి పాఠాలు నేర్చుకోవాలి

సునీల్ గావస్కర్

వర్షం అడ్డంకుల మధ్య అదృష్టం కూడా కలిసొచ్చి విజయం దక్కినందున దక్షిణాఫ్రికా ఇక ప్రతి వన్డేను గులాబీ దుస్తుల్లోనే ఆడాలని భావిస్తుండవచ్చు. 'పింక్ డే' మ్యాచ్‌లో వారెప్పుడూ ఓడిపోని రికార్డును కొంత వర్షంతో పాటు ఓ చేజారిన క్యాచ్, ఓ నోబాల్ పదిలంగా ఉంచాయి. మంచి షాట్లతో భారత్‌ను విజయానికి దూరం చేసిన డేవిడ్ మిల్లరే ఈ రెండు సార్లూ లబ్ధి పొందాడు. కెరీర్‌లో రెండో వన్డే ఆడుతున్న హెన్రిక్ క్లాసెన్ అవకాశాన్ని అందిపుచ్చుకుని స్పిన్నర్ల బౌలింగ్‌లో హిట్టింగ్‌కు దిగి విజయవంతమయ్యాడు.

డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ఎక్కువగా లక్ష్యాన్ని ఛేదించే జట్టుకే ప్రయోజనకారి అని నిరూపితమైంది. అందుకని మ్యాచ్‌కు వర్షం ముప్పు ఉన్నదని తెలిసీ టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేయాలన్న భారత్ నిర్ణయాన్ని ప్రశ్నించకుండా ఉండలేం. జట్టు స్కోరు 300 దాటకపోవడం, ఓటమి కారణంగా ధావన్, కోహ్లి అద్భుత భాగస్వామ్యం మరుగున పడింది. ఏది సురక్షిత స్కోరు అనేది తెలియకపోవడమే కొన్నిసార్లు మొదట బ్యాటింగ్ చేయడంలో ఉన్న సమస్య. స్కోరింగ్ రేట్ పెంచే క్రమంలో అవుటై కోహ్లి మరో శతకం చేజార్చుకున్నాడు. ధావన్ ఈసారి సెంచరీ కొట్టినా... వర్షం అంతరాయం అతడి ఏకాగ్రతను దెబ్బ తీసింది.

మన బౌలింగ్ తీరు చూశాక మరో గెలుపు దారిలో ఉన్నట్లే అనిపించింది. కానీ డివిలియర్స్ తమ జట్టుకు ఊపు తెచ్చాడు. చహల్ నోబాల్ కూడా వారికి కలిసొచ్చింది. ప్రత్యర్థి బ్యాట్స్‌మన్ ఇలా లైఫ్ పొంది మ్యాచ్‌ను మలుపు తిప్పే ఇన్నింగ్స్ ఆడటం ఇది ఇటీవలి కాలంలో రెండోసారి. ఆధునిక సాంకేతికత అందుబాటులో ఉన్న ఈ రోజుల్లోనూ పరిమిత ఓవర్ల క్రికెట్‌లో నోబాల్ వేయడం అన్నది నేరంతో పాటు ప్రాథమిక అంశాలకు కట్టుబడకపోవడంలో నిర్లక్ష్యం, బద్ధకానికి నిదర్శనం. నోబాల్ అదనపు పరుగు మాత్రమే ఇవ్వదు. తదుపరి బంతికి బ్యాట్స్‌మన్‌కు ఫ్రీ హిట్ లభించి అతడికి ఆత్మవిశ్వాసాన్నిస్తుంది. వాతావరణం కారణంగా చేజారిన నాలుగో మ్యాచ్ గురించి టీమిండియా ఎక్కువగా ఆలోచించాల్సిన పనిలేదు. మంచి జట్లు తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుంటాయి. పోర్ట్ ఎలిజబెత్‌లో మనం దానిని చూస్తామనే నమ్మకం ఉంది.



సెరెనా

సెరెనా ఆడింది... సోదరి జతగా

అమ్మ ఆట ఓటమితో మొదలైంది

అషెవిల్లే (అమెరికా): అమెరికన్ టెన్నిస్ స్టార్ సెరెనా విలియమ్స్ ఆట మొదలైంది. అమ్మ హోదా వచ్చాక అధికారిక టోర్నమెంట్‌లో తొలిసారి బరిలోకి దిగిన ఆమెకు పరాజయమే ఎదురైంది. ఫెడ్ కప్ టీమ్ టోర్నమెంట్‌లో సోదరి వీనస్ విలియమ్స్‌తో కలిసి డబుల్స్ మ్యాచ్ ఆడిన సెరెనా 2–6, 3–6తో లెస్లే కెర్కోవ్–డెమి షుర్స్ (నెదర్లాండ్స్) జంట చేతిలో ఓడింది. 36 ఏళ్ల సెరెనా గత ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ సింగిల్స్ టైటిల్ తర్వాత మళ్లీ రాకెట్ పట్టడం ఇదే మొదటిసారి. వారాల గర్భంతోనే టైటిల్ సాధించిన ఆమె ఇప్పుడు తన గారాలపట్టి ఒలింపియా (ఐదు నెలల కుమార్తె)ను ప్రేక్షకుల గ్యాలరీలో ఉంచి కోర్టులో ఆడింది. ఈ టీమ్ చాంపియన్‌షిప్‌లో 15 ఏళ్ల తర్వాత విలియమ్స్ సిస్టర్స్ జోడీ కట్టడం మరో విశేషం. 2003 తర్వాత జతగా ఈ ఇద్దరు ఫెడ్‌కప్ ఆడలేకపోయారు. అయితే చివరి సారిగా ఇద్దరు కలిసి ఆడిన వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ (2016)లో మాత్రం డబుల్స్ టైటిల్ నెగ్గారు. మ్యాచ్ ముగిశాక సెరెనా మాట్లాడుతూ 'కెరీర్‌లో ఎత్తుపల్లాలు సహజం. తిరిగి నా ఆట నేను తేలిగ్గా ఆడేందుకు సోదరి వీనస్ జత కావడమే కారణం' అని చెప్పింది. డబుల్స్‌లో అమెరికన్ జోడీ ఓడినప్పటికీ సింగిల్స్‌లో వీనస్... రిచెల్ హొగెన్‌కెంప్‌పై విజయం సాధించడంతో అమెరికా జట్టు 3–1తో నెదర్లాండ్స్‌పై గెలిచి సెమీఫైనల్స్ చేరింది.



మ్యాచ్ వీక్షిస్తున్న సెరెనా భర్త అలెక్సిస్, కుమార్తె ఒలింపియా

హైదరాబాద్ ఆశలు సజీవం

- రోహిత్ రాయుడు మరో సెంచరీ
- జమ్మూ కశ్మీర్‌పై హైదరాబాద్ విజయం



రోహిత్ రాయుడు

సాక్షి, హైదరాబాద్: సమష్టి ఆటతీరుతో ఆకట్టుకున్న హైదరాబాద్ జట్టు విజయ్ హజారే ట్రోఫీ వన్డే టోర్నమెంట్‌లో క్వార్టర్ ఫైనల్ చేరే అవకాశాలను సజీవంగా నిలబెట్టుకుంది. జమ్మూ కశ్మీర్‌తో సోమవారం ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో జరిగిన గ్రూప్ 'డి' మ్యాచ్‌లో హైదరాబాద్ 149 పరుగులతో ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న హైదరాబాద్ సరిగ్గా 50 ఓవర్లలో 312 పరుగులకు ఆలౌటైంది. జమ్మూ కశ్మీర్ బౌలర్ ఉమర్ నజీర్ ధాటికి హైదరాబాద్ 41 పరుగులకు 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో ఓపెనర్ రోహిత్ రాయుడు (130 బంతుల్లో 130; 11 ఫోర్లు, 3 సిక్స్‌లు), బావనాక సందీప్ (74 బంతుల్లో 72; 5 ఫోర్లు) బాధ్యతాయుత బ్యాటింగ్‌తో ఆదుకున్నారు. రోహిత్ ఈ టోర్నీలో రెండో సెంచరీ నమోదు చేయగా... సందీప్ రెండో అర్ధ సెంచరీ సాధించాడు. స్కోరు 212 పరుగులవద్ద సందీప్ ఔటవ్వడంతో నాలుగో వికెట్‌కు 171 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత ధాటిగా పరుగులు సాధించే క్రమంలో హైదరాబాద్ వికెట్లు కోల్పోయి 312 పరుగులకు ఆలౌటైంది. జమ్మూ కశ్మీర్ బౌలర్ ఉమర్ నజీర్ 52 పరుగులిచ్చి 5 వికెట్లు తీయడం విశేషం. 313 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జమ్మూ కశ్మీర్ ఏదశలోనూ లక్ష్యాన్ని ఛేదించేలా కనిపించలేదు. హైదరాబాద్ బౌలర్లు సిరాజ్ (2/33), రవికిరణ్ (2/17), ఆకాశ్ భండారి (3/34) వరుస విరామాల్లో వికెట్లు తీయడంతో ఆ జట్టు 34.1 ఓవర్లలో 163 పరుగులకు ఆలౌటైంది. ఇదే గ్రూప్‌లోని ఇతర మ్యాచ్‌ల్లో ఛత్తీస్‌గఢ్ ఏడు వికెట్లతో జార్ఖండ్‌పై... సౌరాష్ట్ర ఎనిమిది వికెట్లతో సర్వీసెస్‌పై గెలిచాయి.

ప్రస్తుతం గ్రూప్ 'డి'లో విదర్భ, హైదరాబాద్, ఛత్తీస్‌గఢ్ 16 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉండగా... 12 పాయింట్లతో సౌరాష్ట్ర రెండో స్థానంలో ఉంది. బుధవారం జరిగే చివరి రౌండ్‌లో ఛత్తీస్‌గఢ్‌తో హైదరాబాద్; విదర్భతో సౌరాష్ట్ర తలపడతాయి. సమీకరణాల ప్రకారం ఈ నాలుగు జట్లకూ క్వార్టర్ ఫైనల్ చేరే అవకాశాలు మిగిలి ఉన్నాయి.

నాకౌట్ దశకు ఆంధ్ర

- వరుసగా ఐదో విజయం నమోదు
- భరత్ సెంచరీ, అశ్విన్ 99
- గుజరాత్‌పై తొమ్మిది వికెట్లతో గెలుపు



భరత్



అశ్విన్

చెన్నై: విజయ్ హజారే టోర్నీలో ఆంధ్ర క్రికెట్ జట్టు జైత్రయాత్ర కొనసాగిస్తూ క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. గుజరాత్‌తో సోమవారం జరిగిన గ్రూప్ 'సి' మ్యాచ్‌లో ఆంధ్ర తొమ్మిది వికెట్లతో గెలిచింది. ఈ టోర్నీలో వరుసగా ఐదో విజయం నమోదు చేసిన ఆంధ్ర 20 పాయింట్లతో ప్రస్తుతం అగ్రస్థానంలో ఉంది. ముంబై 16 పాయింట్లతో ఇదే గ్రూప్ నుంచి క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది.

గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర 251 పరుగుల లక్ష్యాన్ని కేవలం వికెట్ నష్టపోయి 45.2 ఓవర్లలో ఛేదించింది. ఓపెనర్ శ్రీకర్ భరత్ (132 బంతుల్లో 106 నాటౌట్; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అజేయ సెంచరీ చేయగా... మరో ఓపెనర్ అశ్విన్ హెబర్ (108 బంతుల్లో 99; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) కేవలం పరుగు తేడాతో శతకాన్ని చేజార్చుకున్నాడు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 192 పరుగులు జోడించడం విశేషం. అశ్విన్ ఔటయ్యాక కెప్టెన్ విహారి (35 బంతుల్లో 39; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు)తో కలిసి భరత్ ఆంధ్ర విజయాన్ని ఖాయం చేశాడు. అంతకుముందు గుజరాత్ సరిగ్గా 50 ఓవర్లలో 250 పరుగులకు ఆలౌటైంది. పార్థివ్ పటేల్ (39; 7 ఫోర్లు), రిజుల్ భట్ (74; 2 ఫోర్లు), పియూష్ చావ్లా (56; 6 ఫోర్లు, ఒక సిక్స్) రాణించారు. ఆంధ్ర బౌలర్లలో కార్తీక్ రామన్ (4/32), బండారు అయ్యప్ప (2/68), నరేన్ రెడ్డి (2/35) ఆకట్టుకున్నారు.

ఇక టి20 సిరీస్‌పై దృష్టి

దక్షిణాఫ్రికాతో భారత మహిళల తొలి మ్యాచ్ నేడు



హర్మన్‌ప్రీత్

పోట్చెఫ్‌స్ట్రూమ్: వన్డే సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత మహిళల జట్టు ఇప్పుడు టి20లపై కన్నేసింది. ఆతిథ్య దక్షిణాఫ్రికాతో ఐదు టి20ల సిరీస్ నేడు జరిగే తొలి మ్యాచ్‌తో మొదలవుతోంది. తొలి రెండు వన్డేల్లోనూ భారీ తేడాతో గెలుపొందిన మిథాలీ సేన మూడో మ్యాచ్‌లో మాత్రం ఓడింది. ఇప్పుడు కొత్త కెప్టెన్ హర్మన్‌ప్రీత్ నేతృత్వంలో పొట్టి ఫార్మాట్‌లోనూ తమ ఆధిపత్యం చాటాలని భావిస్తోంది. ఇందులో 17 ఏళ్ల ముంబై అమ్మాయి జెమీమా రోడ్రిగ్స్ ఆకర్షణగా నిలవనుంది. భారత క్రీడాకారిణుల్లో స్మృతి మంధానతో పాటు, దీప్తి శర్మ, వేద కృష్ణమూర్తి ఫామ్‌లో ఉన్నారు. కెప్టెన్ హర్మన్ ధాటిగా ఆడటంలో దిట్ట. మూడో వన్డేలో విశ్రాంతి తీసుకున్న వెటరన్ బౌలర్ జులన్ గోస్వామి తిరిగి తుది జట్టులోకి రావడం భారత్‌కు లాభించనుంది. ఈమెతో పాటు శిఖా పాండే, దీప్తి శర్మ, పూజ ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను ఇబ్బంది పెట్టగలరు. చివరి వన్డేలో దక్షిణాఫ్రికా జట్టులో డు ప్రీజ్, లారా వోల్వార్డ్ నిలకడగా ఆడారు. కెప్టెన్ డేన్ వాన్ నికెర్క్ ఫామ్‌లో ఉంది. దీంతో ఇరు జట్ల మధ్య ఆసక్తికర పోరు జరగనుంది.

బీసీసీఐ ప్రజా సంస్థే: లా కమిషన్

ఆర్టీఐ పరిధిలోకి తీసుకురావాలని సిఫారసు

న్యూఢిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)కి మింగుడు పడని నిర్ణయాన్ని లా కమిషన్ తీసుకుంది. ప్రపంచంలోనే అత్యంత ధనవంతమైన ఈ క్రికెట్ బోర్డు ప్రజా సంస్థ అని తేల్చింది. సమాచార హక్కు (ఆర్టీఐ) పరిధిలోకి తీసుకురావాలని సిఫారసు చేయనుంది. కేంద్ర ప్రభుత్వం లా కమిషన్ సిఫారసులను ఆమోదిస్తే, ఆర్టీఐ చట్టపరిధిలోకి బోర్డు వస్తే... కోర్టుల్లో ఇక ప్రజాప్రయోజన వ్యాజ్యాలు (పిల్) వెల్లువెత్తుతాయి. జట్ల సెలక్షన్, ఆటగాళ్లను ఏ ప్రాతిపదికన తీసుకున్నారని పిల్ దాఖలు చేసే అవకాశాలుంటాయి. జస్టిస్ బి.ఎస్.చౌహాన్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న లా కమిషన్... బోర్డు, ఆటగాళ్లకు అందుతున్న పురస్కారాలను ఈ సందర్భంగా విశ్లేషించింది. దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆటగాళ్లు తమ జెర్సీలపై త్రివర్ణాలను, హెల్మెట్‌లపై అశోక ధర్మ చక్రాన్ని ప్రముఖంగా ధరిస్తున్నారని, వారు సాధించిన ఘనతలకు భారత ప్రభుత్వం అత్యున్నత పౌరపురస్కారాలను, పన్ను మినహాయింపులను, ప్రోత్సాహకాలను అందిస్తోందని... కాబట్టి దీన్ని ప్రైవేట్ ఆర్గనైజేషన్‌గా చూడలేమని, ప్రభుత్వ సంస్థే అవుతుందని కమిషన్ తమ సిఫారసులో పేర్కొంది.

పీజీ మెడికల్ ఫలితాలు విడుదల

విజయవాడ (హెల్త్ యూనివర్సిటీ): డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ గతేడాది నవంబర్, డిసెంబర్‌లో నిర్వహించిన పీజీ (డిగ్రీ, డిప్లొమా) మెడికల్ పరీక్షా ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాలను http:// ntruhs.ap.nic.in వెబ్‌సైట్‌లో పొందవచ్చని వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ మేజర్ ఎంవీ భీమేశ్వర్ తెలిపారు. విద్యార్థులు మార్కుల రీ–టోటలింగ్ కోసం ఈనెల 28వ తేదీలోగా సబ్జెక్టుకు రూ.2 వేలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రదీప్‌కుమార్ బినామీ లాకర్‌లో రూ.22 లక్షల బంగారం

ఏసీబీ డీజీ ఆర్పీ ఠాకూర్ ప్రకటన

సాక్షి, అమరావతి: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో పట్టుబడిన అడిషనల్ చీఫ్ అర్బన్ ప్లానర్ పసుపర్తి ప్రదీప్‌కుమార్‌కు చెందిన బినామీ లాకర్‌లో బంగారు నగలను సోమవారం స్వాధీనం చేసుకున్నట్టు ఏసీబీ డీజీ ఆర్పీ ఠాకూర్ ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం అడిషనల్ చీఫ్ అర్బన్ ప్లానర్ ప్రదీప్‌కుమార్‌పై గత నెల 29న ఏసీబీ దాడులు నిర్వహించారు. ఆయనకు చెందిన బ్యాంకు లాకర్లు స్వాధీనం చేసుకున్నారు. ప్రదీప్‌కుమార్ పెద్ద సోదరి భర్త పేరుతో ఉన్న చెన్నై టి.నగర్‌లో ఉన్న ఎస్‌బీఐ బ్రాంచిలోని లాకర్లు తెరవడంతో రూ.22 లక్షల విలువైన 905 గ్రాముల బంగారు ఆభరణాలు గుర్తించారు. అవే లాకర్లలో ప్రదీప్‌కుమార్ గతంలో కొనుగోలు చేసిన ఆస్తులకు సంబంధించిన పత్రాలు కూడా దొరకడంతో బంగారు నగలు కూడా ఆయనే బినామీల పేరుతో దాచినట్టు ఠాకూర్ తెలిపారు.

‘అగ్రిగోల్డ్’ పరిహారంలో నిబంధనల సడలింపు

సాక్షి, అమరావతి: మృతి చెందిన అగ్రిగోల్డ్ బాధిత కుటుంబాలను ఆదుకునేలా రూ.5 లక్షలు పరిహారం అందించేందుకు పాలనాపరమైన అనుమతినిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం జీవో జారీ చేసింది. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు చొప్పున పరిహారం ఇచ్చేందుకు రూ.5 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఇటీవల పలు జీవోలిచ్చింది. తాజాగా నిబంధనలు సడలిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. మానసిక ఒత్తిడి, ఆందోళన, ఆవేదన వంటి కారణాలతో గుండెపోటుకు గురైన, ఆత్మహత్య చేసుకున్న అగ్రిగోల్డ్ డిపాజిటర్లు, ఏజెంట్ల కుటుంబాలకు ఈ పరిహారం అందించనున్నారు. గతంలో పోస్టుమార్టం రిపోర్టు, ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు (ఎఫ్ఐఆర్) తదితర పత్రాలు ఉంటేనే పరిహారం అందించాలని ప్రభుత్వం నిబంధనలు విధించింది. వాటిని సడలించాలని ఇటీవల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియమించిన ‘అగ్రిగోల్డ్ బాధితులకు భరోసా కమిటీ’, అగ్రిగోల్డ్ అసోసియేషన్, డిపాజిటర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో దీనిపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

గల్లా జయదేవ్ చరిత్ర అంతా మా దగ్గర ఉంది

- టీడీపీ నిందలు వేస్తే భరించేది లేదు
- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి సురేశ్‌రెడ్డి



ఒంగోలు: టీడీపీపై ప్రజల్లో పెరుగుతున్న అసహనాన్ని బీజేపీపై నెట్టి నిందలు వేస్తుంటే సహించేందుకు తమ పార్టీ సిద్ధంగా లేదని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి సురేశ్‌రెడ్డి హెచ్చరించారు. ఒంగోలులోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గల్లా జయదేవ్ కాంగ్రెస్ పార్టీలో ఉండి కుంభకోణాలు చేసి సంపాదించిన సొమ్మును టీడీపీకి డొనేషన్‌గా ఇచ్చి ఎంపీగా గెలిచారని మండిపడ్డారు. అలాంటి వ్యక్తి కాంగ్రెస్‌కు పట్టిన గతే బీజేపీకి పడుతుందంటూ వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గల్లా జయదేవ్ కుటుంబ చరిత్ర మొత్తం తన దగ్గర ఉందన్నారు. భూకబ్జాలు, రూ.40లక్షల విలువ చేసే ఎస్సీ, ఎస్టీల భూములను రూ.40 వేలకే కాజేశారన్నారు. ఎంఆర్ కేసులో రూ.130 కోట్ల కుంభకోణం కేసులో సీబీఐ ప్రత్యేక కోర్టు విచారణ చేయాలని ఆదేశించిన వ్యవహారం సైతం ప్రజలు గమనించాలన్నారు. అమరావతికి సంబంధించిన ఎస్సీ, ఎస్టీల భూములను అతి తక్కువ ధరకే కొట్టేసేందుకు ప్లాన్ చేసిన చరిత్ర గల్లా జయదేవ్‌దన్నారు. అసలు టీడీపీ ఎప్పుడో కబ్జాకు గురైందని విమర్శించారు. తెలంగాణలో లోకేశ్, ఏపీలో చంద్రబాబు సీఎంగా చక్రం తిప్పాలనే ఉద్దేశంతోనే నాడు చంద్రబాబు రాష్ట్ర విభజనకు లేఖ ఇచ్చి.. నేడు కట్టుబట్టలతో బయటకు పంపారంటూ మాట్లాడడం తగదన్నారు. తాత్కాలిక రాజధాని అంటూ రూ.160కోట్ల అంచనాతో ప్రారంభించి నేడు ఏకంగా వెయ్యి కోట్లకు పెంచుకుంటూ పోయి చదరపు అడుగుకు పదివేలు చొప్పున వ్యయం చేయడం టీడీపీ ఇష్టారాజ్యాన్ని తెలియజేస్తోందన్నారు. రాజధాని నిర్మాణం కోసం కేంద్రం ఇచ్చిన రూ.3,500 కోట్లు దేనికి ఖర్చు చేశారో చెప్పాలన్నారు. ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీకి పోలవరం ప్రాజెక్టు నిర్మించే సత్తా లేదని ఒక వైపు మీడియా మొత్తం గగ్గోలు పెట్టినా ఆ కంపెనీచేతే నిర్మాణం చేయించాలని ఎందుకు భావించారని ప్రశ్నించారు. నేడు ట్రాన్స్‌ట్రాయ్ వెనక్కు తగ్గితే అది కోర్టుకు వెళ్లడం ద్వారా నెపం బీజేపీపై నెట్టేద్దామని టీడీపీ యత్నిస్తోందని, దానిని తిప్పికొట్టేందుకు బీజేపీ 2019 మార్చినాటికి నిర్మాణం పూర్తిచేసే బాధ్యతను భుజాన వేసుకుందన్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్యేలను తీసుకొని వారికి మంత్రి పదవులు కట్టబెట్టిన టీడీపీ నాయకులకు బీజేపీ విశ్వసనీయతను ప్రశ్నించే హక్కులేదన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు పి.వి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా కోసం రాజీనామాలు చేయాలి

కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం


కావలిలో కాపు నేతలతో ముద్రగడ

కావలి (శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా): రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం ముఖ్యమంత్రి, మంత్రులు తమ పదవులకు రాజీనామా చేసి రోడ్ల పైకి వస్తే కేంద్రం దిగివస్తుందని కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం అన్నారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక హోదా కోసం సీఎం చంద్రబాబు చిత్తశుద్ధితో కృషి చేస్తే అందరం ఆయన వెంట ఉండేవారమన్నారు. నాలుగు సంవత్సరాలు పూర్తి అయ్యాక ఈ అంశాన్ని ముఖ్యమంత్రి మాట్లాడటం ఎలా అర్థం చేసుకోవాలని అన్నారు. మార్చి 31 లోపు కాపు, బలిజలకు బీసీ–ఎఫ్ సర్టిఫికెట్లు మంజూరు చేసేలా ఆదేశాలు జారీ కావాలన్నారు. లేకపోతే మరో ఉద్యమానికి కాపులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక కాపు నాయకులు మెతుకు రాజేశ్వరి, చింతాల వెంకట్రావు, దామిశెట్టి శ్రీనివాసులు నాయుడు, అళహరి కొండయ్య, ఇంటూరు శ్రీహరి తదితరులు ఆయన వెంట ఉన్నారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.